
# చాణక్య

శ్రీశార్వరి



# చాణక్య

శ్రీ శార్వరి

ప్రచురణ

**మాస్టర్ యోగాశ్రమం**

# CHANAKYA

*by "Sri Sarvari"*



| | | |
|---|---|---|
| Gen. Editor | : | Dr. Vaasili Vasanta Kumar |
| First Edition | : | May, 2012 |
| Second Edition | : | March, 2014 |
| Price | : | Rs. 100/- |

**MASTER YOGAASHRAM**
Plot 89, Krishna Enclave, M.D. Farm Road,
Tirumalagiri, SECUNDERABAD - 500 015.
Phone : (040) 2779 0094

Title Design by
**ANU JAY VOOTLA**

**YOGAALAYA**
Plot No. 90, Krishna Enclave, Tirumalagiri,
SECUNDERABAD - 500 015.
Phone : (040) 2779 6676, 93 93 93 39 46
www. yogaalaya.org www.yogalaya.in

# చాణక్య హృదయం



I , ..... do swear in the name of God that I will bear true faith and allegiance to the Constitution of India as by law established that I will uphold the sovereignty and integrity of India that I will faithfully and conscientiously discharge my duties and that I will do right to all manners of people in accordance with the Constitution and the law without fear and favour affection or all will ....

శ్రీశార్వరి

**ఈ వాక్యాలకు మన రాజ్యాంగం పెట్టిన పేరు ప్రమాణ స్వీకారం. దానిని 'Oath of Secrecy' అనీ అంటారు.**

ప్రధానమంత్రి నుండి సహాయమంత్రి వరకు పదవి స్వీకరించే ముందు ఇష్టంగా చేసే ప్రమాణం. ఆచరణలో ఎంత కష్టమో ఆ క్షణంలో ఆలోచించరు ఒక్కరూ. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా రాష్ట్రంలో అయితే గవర్నరు, హైకోర్టు జడ్జి ప్రమాణం చేయిస్తారు. పేరుపేరున, ఒక్కొక్కరి చేత వాళ్లు చెబుతూ ఉంటే మంత్రివర్యులు వింటూ, ఎదుట ఉన్న కాగితం చూస్తూ తడబడుతూ, సగం మంది తప్పులు చేస్తారు. వినికిడి దోషమో, దృష్టి దోషమో మనకు అర్థం కాదు. తప్పులు చెప్పి, నాలిక కరుచుకుని సారీ అనుకుంటూ "నేను ప్రమాణం సరిగా చేయలేదుగా నాకు పాపం అంటదు" అనుకుంటారు. కనిపించని దేవుడి మీద ప్రమాణం కదా, ఎన్ని తప్పులు చేసినా కనిపించవన్న ధీమా! కప్పి పుచ్చుకోగలమన్న అహం. పదవిపైన ఉన్న మోజు ప్రమాణంపైన ఉండదు. నిజాయితీ అనేమాట ఎప్పుడో మరచిపోయి ఉంటారు.

మన దేశంలో స్వతంత్రం వచ్చిన తర్వాత చట్ట సభలకు ఎన్నికైన ప్రతి ఒక్కరు ఈ ప్రమాణం చేసే అవకాశం కోసం నానా అవస్థ పడుతుంటారు. అందరికీ అవకాశం రాదు. మంత్రి పదవి లేకుండా ప్రజాసేవ చేయడం ఎట్లా?

ఈ పుస్తకానికి ఈ ప్రమాణానికి సంబంధం ఏమిటని అనుమానించకండి. ఆచార్య చాణక్య చంద్రగుప్తుడు సింహాసనం అధిష్టించినపుడు చేయించిన ప్రమాణం ఇదే. భాష మారింది కాని 'చాణక్య హృదయం' అదే. మన రాష్ట్రపతి ప్రసంగంలో, ప్రధాని ప్రసంగంలో 'చాణక్య' నీతిసూత్రం ఒకటి విధిగా వినిపిస్తుంది. మనవారికి రాజకీయ గురువు చాణక్య.

*క్రీ.పూ. 340లో ఒక బ్రాహ్మణ యువకుడు తన తండ్రిని శిరచ్ఛేదం చేయించినందుకు రాజుపై ప్రతీకారం తీర్చుకుంటానని శపథం చేస్తాడు. అతను చాణక్య. అతనిది చాణక్య శపథం. అతని పగ ప్రతీకారమే అతని జీవితకథ.*

ఆనాడు భారతదేశాన్ని జయించి ఆక్రమించాలని వస్తున్న అలెగ్జాండరు యవనయోధుడు, దైవాంశసంభవుడు అనిపేరుబడ్డ అలెగ్జాండరు ఎత్తులకు పైఎత్తులువేసి, అతనిని తరిమికొట్టి, భారతదేశంలోని చిన్న రాజ్యాలను ఏకంచేసి చంద్రగుప్తుని చక్రవర్తిని చేసిన రాజనీతిజ్ఞుడు చాణక్యుడు.

2300 ఏళ్ల నాటి రాజకీయ అనిశ్చితి ఈనాడు తిరిగి ఏర్పడడం ఈ దేశ ప్రజల దౌర్భాగ్యం. అసహనం, స్వార్థం, అవినీతి, ద్వేషం, అసూయ పెరిగిపెరిగి, నేటి రాజకీయాలకు మరొక చాణక్య అవసరం ఏర్పడ్డది. నిజంగానే మరొక చాణక్య అవతరిస్తాడా? మనకున్న నాయకమ్మన్యులలో చాణక్యులు లేరా?

★ ★ ★

చాన్నాళ్ల క్రిందట దూరదర్శన్‌లో ఒక చాణక్య సీరియల్‌గా వచ్చింది. డా. చంద్రప్రకాశ్ ద్వివేది చాలాకష్టపడి పరిశోధన జరిపి 47 వారాల పాటు లాగించాడు. బాగా చిత్రీకరించారాయన. చాణక్య జీవితంలో చంద్రగుప్తుడు ఒక 'అవసరం' మాత్రమే. ఒక పార్శ్వం కాదు. అంచేత మరికొంత పరిశోధన అవసరమైంది. చాణక్యకు స్వార్థప్రయోజనం లేదు. భారతదేశం ఏకం అయితే ఆయనకు ఒరిగింది లేదు. అలెగ్జాండరు రాకపోతే, ఈయనకు ఒరిగిందీ లేదు. చాణక్య బ్రహ్మచారి. ప్రేమ తెలియని బ్రహ్మచారి కాదు. కేవలం కపటి కాదు. 'సువాసిని'ని ప్రేమించాడు. ఆమె చాణక్యను ప్రేమించింది. నోరువిప్పి చెప్పలేదు. ఇతనూ చెప్పడు. సువాసిని తన ప్రేమను గొప్పగా త్యాగం చేసింది. చివరకు తనను అర్థాంగిగా స్వీకరించని చాణక్యను శపించింది. అందమైన శాపం అది. చాణక్యను క్షమించడంలో 'సువాసిని' మహోన్నతమైన భారత మహిళగా నిలిచిపోయింది. ప్రేమకు 'త్యాగం' బలి అయింది. త్యాగానికి ప్రేమ బలి అయింది.

మనిషిలో బలహీనత మూడు విషయాలలో బయటపడుతుంది. డబ్బు, అధికారం, సెక్సు. ఈ మూడింటి వల్లనే ఎంతగొప్ప వ్యక్తి అయినా పతనం చెందుతాడు. ఈ 'చాణక్య' ఆ అంశాలకు ప్రతీకగా నిలుస్తుంది. నాటికి, నేటికీ చాణక్య హృదయం ఎవరికీ అర్థం కానిది.

## చతురోక్తులు

దేవుని పేర లక్షలు, కోట్లు దండుకుంటారు దేవుని వారసులు. ఆ నిధులు ఎలా ఖర్చయిందని ఎవరూ అడగరు. దేవుని సొమ్ము, వారసులు కైంకర్యం చేస్తారు. భక్తి ముసుగు వేసుకుని, గుళ్లో పూజారి హారతి పళ్లెంలో కానుకలు ఎవరు లెక్కలు చూస్తారు. స్వామియే శరణం.

ప్రజల సేవకే తాము జన్మించినట్లు నమ్మబలికే రాజకీయ నాయకులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రజలను దోచుకుంటారు. ఒకప్పుడు రాజులు దోచుకుంటే ఇప్పుడు పాలకులు దోచుకుంటున్నారు. ప్రజాసేవ.

నాయకులు చేసే పనులు జనాలకి తెలుస్తుండాలి. లేకపోతే వాళ్లు తప్పు చేసినట్లు ప్రజలకు తెలియదు.

ప్రభుత్వం అంటే చట్టం, న్యాయం, ధర్మం. కానీ ఆ ముక్కాలి పీటపైన నిలబడడం చాలా కష్టం.

నాయకులైన వారు ఎప్పుడు ఏదో సమస్య సృష్టించుకుంటారు. లేకపోతే వారు ప్రజలకు దూరం అవుతారు. తమ అసమర్థత, వైఫల్యాలు ప్రజలకు తెలియకుండా ఉండడానికి సమస్యలు సృష్టించడం అవసరం.

ఒక రాజకీయ నాయకుని ప్రసంగం విని ఆయన అన్నీ నిజాలే చెప్పాడని ప్రజలు మోసపోకూడదు. అసత్యాలు చెప్పడం రాజకీయ నాయకుల హక్కు. మంత్రులు చాలా విషయాలలో అజ్ఞానులు. వాళ్లకు ఏమీ తెలియకపోయినా అన్నీ తెలిసినట్లే మాట్లాడుతుంటారు.

మంత్రుల చేత నిజాలు చెప్పించడం ప్రజల హక్కు.

తమను ఇబ్బంది పెట్టే విషయాలు చట్టసభల్లో చర్చకు రానీయరు అధికార పక్షం. అధికార పక్షాన్ని ఇబ్బంది పెట్టే విషయాలు ప్రస్తావించడం ప్రతిపక్షాలకు సరదా.

## గమనించ దగ్గ అంశాలు

రాజకీయంగా పైకి ఎదిగిన కొద్దీ, దేవుడిమీద నమ్మకం, అదృష్టం మీద నమ్మకం పెరుగుతుంది. అదృష్టాన్ని నమ్మని రాజకీయ నాయకులు ఉండరు.

ముగ్గురి మధ్య రహస్యం దాగదు. రహస్యం ముగ్గురిలో ఇద్దరిని చంపేస్తుంది. ఆకలితో ఉన్నవాడికి కడుపు నిండడం ముఖ్యం. రాజకీయ సిద్ధాంతాలు నీతి సూత్రాలు కాదు. తన ఆకలిని పట్టించుకోని దేవుడిని మనిషి పట్టించుకోడు.

చట్టాల్ని ప్రజలు గౌరవించాలంటే చట్టంలో లొసుగులుండకూడదు.

రాజకీయ ఛండాలం మామూలు మనుషులు భరించలేరు. ఆ దుర్గంధం భరించగలది రాజకీయ నాయకులే. మామూలు మనుషులకు రాజకీయాలు అర్థం కావు. నాయకులు జనాలకు అర్థం కానివ్వరు.

సరైన సమయంలో వాడే మాట తుపాకీ గుండు లాంటిది. మనిషికి కావలసింది, కీర్తి, ప్రతిష్టలు కాదు వ్యక్తిత్వం. వ్యక్తిత్వమే మనిషికి విలువైన సంపద. ధనం, కీర్తి, పరువు – ఇతరులు మనల్ని కొలిచే సాధనాలు.

భగవంతుడు మన తప్పులు క్షమిస్తాడు. ఆయనగారి పని మనిషి తప్పులు క్షమించడం. కాకపోతే దేవుడితో మనకేం పని.

ఒక మోజు కలిగింది. ఆ మోజు తీరేవరకు మనిషికి తృప్తి ఉండదు. రాజకీయం అన్నది మందులకు లొంగని పెద్దరోగం లాంటిది.

స్వేచ్ఛాసమాజం అంటే ఎదుటవాడిపైన బురదచల్లే స్వేచ్ఛ ఉండడం.

వెనకటికి 'జార్జి బెర్నార్డ్‌షా' అనే ఆయన బ్రిటిష్ పార్లమెంటును చూచి అన్నాడు : దేశంలోని ఫూల్స్ అంతా ఇక్కడ సమావేశమైనట్టున్నారు.

"యుద్ధం అంటే ప్రాణాలు బలిపెట్టడం కాదు
మన శత్రువుల్ని, కానివాళ్లను బలిపెట్టడం." – చాణక్య

"కొందరు బ్రతికుండగా పదుగురికి సంతోషం కలిగిస్తారు.
ఇంకొందరు చచ్చిపోయి దేశానికి మేలు కలిగిస్తారు." – చాణక్య

"రాజకీయాల్లో శాశ్వత మిత్రులుండరు, శాశ్వత శత్రుత్వం ఉండకూడదు."
– చాణక్య

అందరికీ స్వర్గం కావాలనే ఉంటుంది.


కాని ఎవరూ స్వర్గం కోసం చావడానికి సిద్ధంగా ఉండరు.

**ఈ భాషితాలకు అద్దం పట్టిన కథా కథనం చాణక్య.**

## చాణక్య లో ...


| | | |
|---|---|---|
| 1. | మగధ | 11 |
| 2. | తక్షశిల | 19 |
| 3. | పాటలీపుత్ర | 33 |
| 4. | సేనాపతి | 43 |
| 5. | కుతంత్రం | 57 |
| 6. | గాంధారం | 62 |
| 7. | రణ తంత్రం | 74 |
| 8. | చాణక్య పథకం | 83 |
| 9. | అగ్ని పుష్పం | 92 |
| 10. | ప్రణయ శిఖరం | 112 |
| 11. | తడిమంటలు | 122 |
| 12. | మిత్రభేదం | 130 |
| 13. | ధననంద నిర్వేదం | 139 |
| 14. | బుద్ధం శరణం | 144 |
| 15. | నీతి నీడలు | 153 |
| 16. | పిలకముడి | 165 |
| 17. | సువాసిని శాపం | 170 |

## 2300 ఏళ్లనాటి భారతదేశం



# చాణక్య



**2300** సంవత్సరాల క్రితం భారత రాజకీయాలలో సువర్ణాధ్యాయం.

భారతదేశంలోని చిన్న, పెద్ద రాజ్యాలను ఏకం చేయడానికి జరిగిన తొలి ప్రయత్నం.

చాణక్య రాజనీతి శాస్త్రంలో తొలి పుటలు, మలి మలుపులు.

★ ★ ★

మగధను పాలించిన రాజవంశాలలో చివరిది నంద వంశం. నంద వంశంలో చివరివాడు, నందవంశ వినాశకారుడు ధననందుడు. నవనందులు చరిత్ర హీనులుగా, విలాస పురుషులుగా ప్రసిద్ధులు. ధననందుడు పరమ నికృష్టుడు. నందులలో కనిష్టుడు, రసికుడు, సకల దుర్గుణ శిఖామణి, మంత్రుల చేతి కీలుబొమ్మ. అతివల చేతి ఆటబొమ్మ. మగువల కౌగిళ్ల మరబొమ్మ. ధననందునికి ప్రజాపాలనలో ఆసక్తి నాస్తి. కామకళలో అనురక్తి జాస్తి. ప్రధానమంత్రి శక్తారునికి పెత్తనం అప్పగించి తాను రసికరాజన్యు డని పించుకున్నాడు.

రాజ్యాన్ని ఉద్ధరించడానికి, ప్రజలను పాలించడానికే తాను జన్మించినట్లు శక్తారుడు ప్రధాన పదవి చేజిక్కించుకున్నాడు.

ధననందుడు సింహాసనంపైన కూర్చునేది తక్కువ.

మదిరాపానం లేకుండా చేతనాస్థితిలో ఉండేది తక్కువ.


అతనిని అంతఃపురంలోని విలాసమందిరానికే కట్టడిచేసి మంత్రివర్యులు పెత్తనం చలాయిస్తున్నారు. వారు ఆడిందే ఆట, పాడిందే పాట.

విస్సన్న చెప్పిందే వేదం.

ధననందునికి ప్రజల గోడు పట్టించుకునే వ్యవధి ఉండేది కాదు. ప్రజలు ఏమైతేనేం! రాజు పదికాలాలపాటు బ్రతికి ఉంటే చాలు. మంత్రుల మంత్రాంగం సాగిపోతుంది. మంత్రులకు స్వంతబాగు తప్ప, ప్రజలబాగు పట్టని పరిస్థితి. అప్పుడే రాజకీయం స్వార్థంతో రాజీపడింది. కుతంత్రాలు అందలం ఎక్కి కూర్చున్నాయి. కుత్సితాలు చాణక్యంలో కీలకపాత్ర పోషించ సాగాయి. కుటిలత్వం రాజకీయ నీతిగా మారింది. అవినీతికి రాజకీయం తలుపులు తెరిచి స్వాగతం పలికింది.

అందినకొద్దీ దోచుకోవడం మొదలైంది అప్పుడే.

రాజుల్ని నడిపించేది మంత్రివర్యులు. రాజుల కన్నా మంత్రులే బలవంతులు. కుతంత్రాలకే గౌరవం. శక్తారుడు ధననందుని కొలువులో కీలక వ్యక్తి. రౌతు మెత్తనైతే గుర్రం మూడుకాళ్ల మీద నడుస్తుంది. ధన నందునికి మధిర, మగువ, అయోగ్యత – మూడు కాళ్లు.



# 1. మగధ

**మ**గధ రాజమందిరం. ఇరవై అడుగుల ఎత్తు గల ఎనభై పాలరాతి స్తంభాలపై నిర్మించబడింది. అత్యంత సుందర శిల్ప చాతుర్యం, రోమన్ భవన శిల్పుల పనితనం ప్రతి రాయిపైన ప్రతిబింబిస్తోంది. అలవోకగా వేయి మంది సుఖాసీనులయ్యే అవకాశం ఉన్న భవనం.

ఆ కాలంలో ప్రపంచంలో అతిపెద్ద దేశం మగధ. సామ్రాజ్యం అన్న పేరు సార్థకమైంది. భారతదేశంలో మగధను మించిన సంపన్న దేశం లేదు. రాజ మందిరం ఇంద్ర భవనాన్ని తలపింపచేస్తుంది. మగధ ప్రభువుది దేవేంద్రుని వైభవం. రంభ మేనకలను తలపించే సుందరీమణులు అక్కడ ఉన్నారు.

నందవంశ రాజులు రసికులు, శృంగారప్రియులు, మదిరాలోలులు. బ్రాహ్మణ సచివులచేతి కీలుబొమ్మలైనా వారు బౌద్ధాన్ని ఆదరించారు. ప్రజలకు బౌద్ధంపైన ఉన్న ఆదరణ చూచి కాస్తంత బౌద్ధాభిమానులు అనిపించుకున్నా, బ్రాహ్మణవర్గం మాత్రం బౌద్ధ ధర్మాన్ని అణచాలని ప్రయత్నం చేస్తున్న కాలం. మత సహిష్ణుత బొత్తిగా కనిపించదు. రాజ ప్రాసాదానికి కూతవేటు దూరంలో దూరఖీదేవి ఆలయం ఉంది. దాని సమీపంలోనే ఒక బౌద్ధ ఆరామం,

చరక వైద్యశాల నెలకొన్నాయి. అంతఃపుర భోగవిలాసాలకు, దేవాలయం, వైద్యాలయం, బౌద్ధారామం ఆధ్యాత్మికతకు ఆనవాళ్లు.

ఒక రోజున పొరపాటున ధననంద కొలువు తీరాడు. అతనికి రాజకీయాల పట్ల అనాసక్తి, రమణుల పట్ల ఆసక్తి. రాత్రి తాగిన మత్తు ఇంకా వదలలేదు. సింహాసనంపైన కునికిపాట్లు పడుతున్నాడు. రెప్పలు మత్తుగా వాలిపోతున్నాయి. చారిణులు వింజామరలు విసురుతున్నారు. సొగసుకత్తెలు నందరాజుకు శృంగారోపచారాలు చేస్తూ రంజింప చేస్తున్నారు. ఆస్థానంలో మొదటి ఆసనం ప్రధానమంత్రి గారిది. మిగిలిన మంత్రులు, సామంతులు, రాజోద్యోగులు వరుసగా ఆశీనులైనారు.

ప్రధానమంత్రి శత్కారుడు లేచి నిలబడి రాజుగారికి నమస్కరించి తర్వాత సభాసదులకు నమస్కరించి, గొంతు సరిచేసుకున్నాడు. ఏదో చెప్పాలని విశ్వప్రయత్నం. ప్రజల సమస్యలను రాజుకు నివేదించడం ప్రధానమంత్రి కర్తవ్యం. వాటిని పరిష్కరించడం, పరిష్కారాలు సూచించడం రాజు విధి.

మంత్రిగారు తిమ్మిని బొమ్మని చేస్తాడని ధననందునికి తెలుసు. ప్రధానమంత్రి చేతిలో రాజుగారు కీలుబొమ్మ అని ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు తెలిసిన విషయమే. ఎన్ని జరిగినా చూచీ చూడనట్లు వ్యవహరిస్తాడు రాజు. ఆ రోజున ధననందుడు శ్రద్ధగా వినడం ఒక విపర్యయం. రాజుగారి అయోగ్యత, చేతకానితనం ఆసరాగా శత్కారుడు తన బంధువులకు, మిత్రులకు పదవులు కట్టబెట్టి, పరోక్షంగా తానే రాజుగా వ్యవహరిస్తున్నాడు. ఆ రహస్యం ధననందకు తెలుసు. శత్కారునికీ తెలుసు.

'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ'.

ధననందునికి దేశంలో ప్రజలుంటారని తెలియదు. వారి బాధలు పట్టించుకోడు. సభలో ప్రజాప్రతినిధులున్నదీ లేనిదీ, గమనించడు. తనురాజు గదా! తన పీఠం గట్టిగా ఉంటే చాలు. సింహాసనం చుట్టు సుందరాంగులుండాలి. అది ఆయనగారి 'కలాపోసన'. వారి చిరునవ్వులు, శృంగారచేష్టలు, పులకింతలు రాచ కార్యాలకు అవరోధం కావు. అయినా రాజుగారు స్వంతంగా ఆలోచించే అవకాశం ఇవ్వడు శక్తారుడు. పరదాల నుండి సంగీతం

వినిపిస్తుండాలి, కాలి గజ్జెల సవ్వడులు వినిపిస్తుండాలి. అందాలు విరపూస్తుండాలి. సరస శృంగార చక్రవర్తి ధననందుడు.

ఒకరూ ఇద్దరూ కాదు. ఆయన విలాసమందిరంలో, శయన మందిరంలో వేయి మంది యవ్వనవిలాసవతు లున్నారు. సుందరాంగన లున్నారు. ఆయన గారికి ఎంతకోపం వచ్చినా ఒక్క సుందరి స్పర్శతో కోపం దిగి పోతుంది.

"చెప్పండి మహామాత్యా" అని శక్తారుని అనుమతించాడు.

శక్తారుడు నొసలు చిట్లించాడు. రాజుగారు స్థిమితంగా ఉంటే ఇబ్బందే. కొన్ని సంవత్సరాలుగా తనలో ఉన్న అసంతృప్తి పైకి పొంగింది. మానుపట్టిన గాయం కెలికినట్లయింది.

**మహాప్రభూ!**

*మన్నించాలి. ఇది తమ రాజ్యం. ఈ ప్రజలు తమ బిడ్డలు. మన రాజ్యంలో ఆడవారికి రక్షణ కరువైంది ప్రభూ! ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అంతఃపురంలోనే ఆడవారికి రక్షణ లేదు. నగరం వెలుపల గంగా తీరంలో రోజూ మానభంగాలు, హత్యలు జరుగుతున్నాయి. ప్రభూ! మీతో స్వయంగా చెప్పుకునే అవకాశం సామాన్య ప్రజలకు ఉండదు. "ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా ప్రభూ!" అనకూడదు కాని ప్రజలు ప్రభువునే ఆదర్శంగా తీసుకుంటారు ప్రభూ.*

ధన నందుడికి తన లోపం తెలిసింది. మంత్రి తనని అనలేక ప్రజలు సాకుగా నీతులు చెబుతున్నాడు. తన రాజ్యంలో అరాచకాలా?

కళ్లు కోపంతో ఎరుపెక్కాయి. శరీరం ఆపాదమస్తకం కంపించింది.

"నోర్ముయ్ మహామాత్యా!

నేనిచ్చే మడిమాన్యాలు అనుభవిస్తూ కులుకుతున్న మీరు నాకు నీతులు చెప్పడానికి సాహసిస్తారా? నేను చక్రవర్తినని మరిచారా? దేశం మొత్తంలో మనమే మహావీరులం తెలుసా? అవాకులు, చవాకులు వాగితే నీ నాలుక చీరేస్తాను రాజద్రోహీ!

ధననందుని ఆంతరంగిక మంత్రి రాక్షసుడు. అతని అసలుపేరు విస్మరించి "రక్షణమంత్రి" అంటారు. అతని చర్యలు చూచినవారు రాక్షసమంత్రి అంటారు. మొత్తం మీద అతనిపేరు రాక్షసుడుగా ప్రసిద్ధం అయింది. రాజుగారి అవసరాలన్నీ చూచేది అతనే. అతను అనేక విధాల ప్రధానమంత్రి కన్న ధననందునికి ప్రీతిపాత్రుడు.

ప్రధానమంత్రి శక్తారుని బంధించమని, కారాగారానికి పంపమని రాక్షసుని ఆదేశించాడు ధననందుడు.

ధననందుని కారాగారం నరకం కన్న భయంకరం. దాని అధికారి 'గిరిక'. అతను నరరూప యముడు. యమభటులకు తెలియని శిక్షలు అతనికి తెలుసు.

రాక్షసుడు భటులను ఆదేశించి ప్రధానమంత్రిని బంధించి చెరసాలకు తరలించాడు. రాజుగారి ఆజ్ఞ శిరసావహించక తప్పదు గదా! నిజానికి రాక్షసుడు శక్తారుని బంధువే. అతని వల్లనే తనకు రాజుగారి కొలువు దొరికింది. శక్తారుడు కొరివితో తలగోక్కున్నాడు అనుకున్నాడు. రాజులతో వ్యవహారం 'కత్తిమీదసాము'. పిచ్చి బ్రాహ్మడు. అతి తెలివి ప్రదర్శించి గొంతు మీదికి తెచ్చుకున్నాడు పాపం!

★ ★ ★

కోట సింహద్వారం వెలుపల జనం సందడి.

ఆజానుబాహువైన ఒక వృద్ధ పండితుడు ఎత్తయిన ప్రదేశంలో నిలబడి ప్రసంగిస్తున్నాడు. క్షణాలలో వేలమంది గుమిగూడారు.

"మాగధీయులారా!

ఇంకా ఎంతకాలం భరించాలి ఈ దమననీతిని, అవినీతిని. ఈ నిరంకుశ, నికృష్ట పాలనకు అంతం ఎప్పుడు? ధననందుడు మదించి కొట్టుకుంటున్నాడు. కళ్లు మూసుకుని పాలిస్తున్నాడు. అతగాడికి వంతపలికే మంత్రులు తోడైనారు. అందరికీ అన్నీ తెలుసు. కాని ఎవరూ ఏమీ చేయరు.

శక్తారుని బంధించారు. శక్తారుడు ఒక్కడే నీతిమంతుడు. అతను లేని రాజ్యంలో బ్రతకలేము. ఆలోచించండి ప్రజాలారా! పన్నులు భరించలేక ప్రజలు బాధపడుతున్నారు. అన్యాయం రాజ్యమేలుతోంది. దేశం వదలి

మరొకదేశం వెళ్లవలసిన దుస్థితి దాపురించింది. ఈ నందరాజుకు కత్తిపట్టి యుద్ధం చేయడం చాతకాదు. పైట కొంగులు పట్టుకోవడం మాత్రం తెలుసు.”

ఉపన్యసించిన వ్యక్తి సామాన్యుడు కాదు. రాజ్యంలోనే మహా పండితుడు. విద్వాంసుడు. నీతి కోవిదుడు. చణకుడు. ప్రధానమంత్రికి బంధువు, ఆప్తమిత్రుడు. రాజవంశస్తులు తమ బిడ్డల్ని చణకుని వద్దకే పంపుతారు. దేశదేశాల నుండి రాజకీయ వారసులు వచ్చి చణక పండితుని వద్ద రాజనీతి పాఠాలు నేర్చుకుంటారు.

★ ★ ★

రాజమందిరంలో శక్తారుని బంధించిన రాజసైనికులు, అనేక చీకటి దారుల వెంట అతనిని నడిపించారు. కళ్లకు గంతలు కట్టి తీసుకువెళ్లారు. రాక్షసమంత్రి బంధువు శక్తారుడు. ఆ విషయం తెలిసిన రాజప్రతినిధి కారాగార అధికారికి రాక్షసమంత్రి మాటగా హెచ్చరించాడు. ప్రధానమంత్రి శక్తారుని మర్యాదగా చూడండి. ఆయనకు ఎలాంటి అసౌకర్యం కలిగించవద్దని రాక్షసుని మాటగా హెచ్చరించాడు. వర్తమానం గిరికకు అందింది.

కోటగుమ్మం వద్ద ప్రజలు తిరుగుబాటుకు అగ్ని రాజుకుందని రాక్షసుడు పసిగట్టాడు. దేశానికి ఏదో ఉపద్రవం జరగబోతున్న సూచన అది. ప్రజా విరోధం మంచి శకునం కాదు. పైగా ప్రధానమంత్రి లేని రాజ్యం.

చణకుని పట్టి బంధించి, గంగానదీ తీరంలో శిరచ్ఛేదం చేయమని ఆజ్ఞాపించాడు ధననందుడు.

రాజాజ్ఞ శిరసావహించక తప్పదు.

★ ★ ★

‘విష్ణుగుప్తా ... మీ నాయనగారు మరణించారు.’ రాజద్రోహ నేరం క్రింద ఆయనను ‘శిరచ్ఛేదం’ చేశారయ్యా. నీకోసం రాజభటులు వెదుకుతున్నారు. నిన్ను బ్రతకనివ్వరు. ఎక్కడికైనా పారిపో. ప్రాణాలు రక్షించుకో.’

కాత్యాయన విష్ణుగుప్తునికి సలహా చెప్పాడు. కాత్యాయన చణకుని అభిమాని. రాజసభలో ఉండగానే వార్త విని పరుగున వచ్చి విష్ణుగుప్తుని చెవిని వేశాడు వార్త.

"నేను పారిపోతే అమ్మ గతి? అమ్మను ఎవరు చూస్తారు? అమ్మ వృద్ధురాలు" అడిగాడు విష్ణుగుప్తుడు బేలగా.

"అమ్మ సంగతి నాకు వదిలిపెట్టు విష్ణూ. ఆమె బాధ్యత నాది. నా బొందిలో ప్రాణం ఉండగా మీ అమ్మకు ఏ లోటు రానివ్వను."

"మరి సువాసిని?"

సువాసిని ప్రధాన మంత్రి శక్తారుని కూతురు. ఆ పిల్ల అంటే చిన్న తనం నుండి విష్ణుగుప్తునికి ఇష్టం. శక్తారుడు విష్ణుగుప్తుని అభిమానించేవాడు. ఆమె పెద్ద అందగత్తె కాకపోయినా విష్ణుకు ఆమె అంటే ఇష్టం.

"సువాసిని విషయం నాకు వదిలెయ్ విష్ణూ" కాత్యాయన హామీ యిచ్చాడు.

"నన్ను విష్ణు అని పిలవకు బాబాయ్. ఇహ నుంచి నన్ను చాణక్య అని వ్యవహరించండి. నాన్నగారి ఆత్మకు శాంతి చేకూరాలి."

'నన్ను దీవించండి బాబాయ్'. చాణక్య తలవంచి నమస్కరించాడు.

★ ★ ★

**అమావాస్య రాత్రి. కారుచీకటి.**

**రెండు రోజులుగా ఎదురు చూస్తున్న క్షణాలు.**

**చాణక్య ఎవరి కంటా పడకుండా నగరం దాటాలి.**

అది కాత్యాయన వేసిన పథకం. నల్లబొగ్గు పొడిచేసి, నూనెలో కలిపి చాణక్య వంటినిండా పూసుకున్నాడు. చీకటిలో నల్ల దయ్యంలా నడిచాడు. ఎవరూ గుర్తించరు. చూచినా దయ్యమని పారిపోతారు.

అర్థరాత్రివేళ. నగరం నిద్రపోతున్న వేళ నగరం దాటారు.

కాత్యాయన చెప్పిన గుర్తుల ప్రకారం నదీ తీరంలో ఊడలుదిగిన మర్రి చెట్టు. అక్కడికి చేరుకున్నాడు. అది దయ్యాల మర్రి. పగలు ఎవరూ ఆ దరిదాపులకు రారు. ఆ మర్రిపైన దయ్యాలుంటాయని ప్రజల భయం. దానికి పెద్ద చరిత్ర ఉంది. పండుగలకు, పబ్బాలకు అక్కడ భారీ ఉత్సవాలు జరుగుతాయి. ఏదో రాతి బొమ్మపెట్టి అమ్మ వారని, దేవతని జంతుబలు

లిస్తారు. మొక్కులు తీర్చుకుంటారు. ఆ రోజుల్లో తప్పితే ఆ మర్రి ప్రాంతం నిర్జనం, భయానకం.

ధననందుని సైనికులు చణక పండితుని తల నరికి ఆ చెట్టుకు వేలాడదీసి వెళ్లారు. చాణక్య చీకటిలో మర్రి వద్దకు చేరాడు. క్రింద అమ్మ వారి బొమ్మ వద్ద నూనె దీపం వెలుగుతూ ఉంది. ఆ దీపం ఆర్పి చెట్టుపైకి పాకాడు. కుళ్లిన వాసన వస్తున్న వేపు వెళ్లాడు. కొమ్మకి తండ్రి తల వేలాడుతూ ఉంది. తల జుట్టుతోనే చెట్టు కొమ్మకు కట్టేసి ఉంది.

తండ్రి తలను చూడగానే చాణక్య గుండె జారింది. దుఃఖం పొంగుకొచ్చింది. గాలికి తల అటు ఇటు ఊగుతోంది. కళ్ళస్థానంలో గుంతలు పడ్డాయి. చెక్కిళ్లు పురుగులు తొలిచేశాయి. పెదాలు బిగుసుకుని ఉన్నాయి. ఆ భయంకర వాతావరణంలో చాణక్య ధైర్యం కూడదీసుకున్నాడు. శవం కన్న మొండిఘటం చాణక్యుడు. కొమ్మపైకి పాకి జుత్తు ముడి విప్పి తలను ఒకచేత బట్టి కన్నీటితో అభిషేకించాడు. అదే అశ్రుతర్పణం. అది విచారిస్తూ కూర్చునే వీలు లేని సమయం. కర్తవ్యం ముందుకు నడిపించింది.

“నేను దుఃఖించడం కాదు. ఇందుకు కారకులైన వారి అంతు చూడాలి” శపథం చేశాడు. కనిపించే కారణం ఒకటి. కనిపించని కారణాలు వంద? హత్య వెనుక ఒక పెద్ద వ్యవస్థా వైఫల్యం ఉంది. జాతీయ అనైక్యత ఉంది. రాజకీయ దాష్టికం ఉంది. స్వార్థం ఉంది. ద్వేషం ఉంది. ఎన్నెన్నో కారణాలు. కనిపించని నిర్వేదం ఉంది.

గబగబ చెట్టు దిగబ్రాకి, ఉత్తరీయంలో తండ్రి తలను భద్రంగా మూటగట్టి నీళ్లలోకి దూకాడు. చీకటి నదిలో, చీకట్లో ఆవలి ఒడ్డుకు చేరుకున్నాడు.

కాత్యాయన రాజసేవకులకు లంచం యిచ్చి, చణకుని మొండి శరీరాన్ని రహస్యంగా దుర్గాలయానికి చేర్చాడు. సంప్రదాయం ప్రకారం, చనిపోయిన రోజు సూర్యాస్తమయం లోపు శవదహనం చేయాలి, లేదా ఖననం చేయాలి. చణకునికి అంతిమ సంస్కారం అలా జరగలేదు. మూడు రోజుల వరకు చణకుని మృత దేహానికి ఖండిత శిరస్సు వచ్చి కలవలేదు. శిరస్సు లేని


మొండి శరీరాన్ని దహనం చెయ్యరు. కపాల భేదనం జరిగితేనే మృతుడి ఆత్మకు మోక్షప్రాప్తి. అవసరానికి సిద్ధాంతం మార్చుకోవచ్చు. దుర్గాలయం వద్ద జరుగుతున్న అంతిమ సంస్కారం వార్త తెలిస్తే ధననందుడు ఊరుకుంటాడా! చిందులు వేయడూ? అదీ జరగనిచ్చేవాడు కాదు.

చాణక్య ఒడ్డుకు చేరే సరికి ఒకపొట్టి పూజారి ఎదురు చూస్తున్నాడు. రక్తసిక్తమైన చణకుని మృత శరీరం గోనెసంచిలో మూటకట్టబడి ఉంది. పూజారి చేతిలో ఒక కాగడా ఉంది. చితి సిద్ధం చేసి ఉంచాడు పూజారి. చాణక్య రాగానే, చితిపైన ఉన్న చణకుని మొండానికి శిరస్సు చేర్చి అగ్ని సంస్కారం చేయించాడు. కాలుతున్న శవానికి చాణక్య ముమ్మారు ప్రదక్షిణ నమస్కారం చేశాడు. వెదురు కర్రతో తలపై మోదాడు. కపాలభేదన అయింది. చణకుని ఆత్మ స్వర్గం చేరినట్లు.

మరొకమారు చాణక్య నదిలో స్నానం చేసి, పూజారి యిచ్చిన పొడి బట్టలు కట్టుకుని సంచి భుజాన వేసుకుని బయలుదేరాడు. సంచిలో యాభై బంగారు నాణాలు, ఒక ఉత్తరం ఉన్నాయి. తక్షశిల దిక్కుగా పయనం.

తక్షశిల విద్యాలయాధికారికి అది పరిచయ లేఖ. మగధ నుండి తక్షశిలకు తొమ్మిది వందల మైళ్లు. సంవత్సరం పట్టింది చాణక్యకు.

తక్షశిల పేరెన్నిక గన్న విద్యాలయం. దానికి 300 సంవత్సరాల ఘనచరిత్ర ఉంది. ఇరవై విభాగాలలో విద్యాబోధన జరుగుతుంది.



# 2. తక్షశిల

**నేడు 'తక్షశిల'గా వ్యవహారంలో ఉన్న మహా విద్యాలయం పేరు ఆనాడు 'తక్షిల విశ్వవిద్యాలయం'. విద్యావిషయికంగానే కాక నాటి ఉత్తరాపథంలో అది రాజకీయ కేంద్రం. యవనదేశాలకు అది ప్రవేశద్వారం.**

మగధ (నేటి బీహారు) నుండి గాంధారం (పంజాబు) వరకు, ఉత్తరాన కాశ్మీరం నుండి దక్షిణావర్తనానికి మార్గమధ్యంలో ఉంది. గాంధారాన్ని కాందహార్ అంటారు. పౌరాణిక భాషలో అది గంధర్వలోకం. ఎత్తయిన పర్వతశ్రేణులు, సుందర వనాలు, రమణీయ ప్రకృతి గాంధారానికి సహజ సంపదలు, వనరులు, అందాలు, శుభసుందరశోభితం గాంధారరాజ్యం.

శీతాకాలంలో నీటిని గడ్డ కట్టించే చలిగాలులు.

హిమాలయాల నుండి హిందూకుష్ పర్వత సానువుల వరకు వీచే గాలులు ప్రాణాంతకంగా ఉన్నవేళ. చిరిగిన బట్టలతో, పీక్కుపోయిన ముఖంతో చాణక్యుడు తక్షిల విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నాడు. పదిహేను సంవత్సరాల వయసువాడు. బాల్యం వీడి యవ్వనంలో ప్రవేశిస్తున్న తరుణం. అప్పుడే తెల్లవారుతోంది. చలి తెరలు, మంచు తెరలు ఇంకా విచ్చుకోలేదు. ఉదయ కిరణాలు వాతావరణాన్ని కాస్త కాస్త వేడెక్కిస్తున్నాయి. లోపల నుండి వేదపఠనం వినిపిస్తోంది.

‘బాబూ ఎవరు నువ్వు? ఎవరికోసం వచ్చావు?’ అడిగాడు ద్వార రక్షకుడు.

చాణక్యకు అక్కడి లాంఛనాలు తెలియవు. పద్ధతులు తెలియవు.

ఆ విద్యాలయం వందల ఎకరాలు వ్యాపించి ఉంది. బయటకు చెట్లు చేమలు తప్ప మనుషులు కనిపించడం లేదు. భవనాలూ కనిపించడం లేదు.

“ఆచార్య పుండరీకాక్షుని చూడాలి. వారు విద్యాలయం ప్రధానాచార్య కదా.”

ఆయన నివాసం గుర్తులు చెప్పి అటు వెళ్లమని దారి చూపించాడు రక్షకుడు.

పుండరీకాక్షుని నివాసం ఒక తోటలో పెద్ద పర్ణశాల. చుట్టు ఫలవృక్షాలు, పూలచెట్లు విరపూశాయి. ప్రశాంతంగా ఉంది.

ఆయన ఆరుబయట కూర్చుని ధ్యానం చేసుకుంటున్నారు.

చాణక్య వెళ్లి అంతదూరాన నిలబడి నిరీక్షించసాగాడు. ధ్యాన భంగం చేయడం మంచిది కాదు. బయట చలిగాలులు. పుండరీకాక్షుడు పై పంచె కూడా లేకుండా, చలిలో స్థిమితంగా కూర్చుని ఉన్నారు. ఎంతటి దీక్ష! ఎంత దిదృక్ష! ధ్యానం పూర్తిచేసి కళ్లు తెరవగానే ఎదుట చలికి వణికిపోతున్న వటుడు.

“ఎవరు బాబూ నువ్వు?” అడిగాడు సున్నితంగా.

ఆయనకు వినయంగా పాదనమస్కారం చేసి తన గురించి చెప్పుకున్నాడు.

‘నేను మగధ నుండి వస్తున్నాను ఆచార్యా. ఆచార్య చణకుడు నా తండ్రి. ఈ లేఖ మీకిమ్మని కాత్యాయన యిచ్చారు. మీరు వారికి పరిచయమే నట!’

కాత్యాయన పేరు వినగానే పుండరీకాక్షుని ఒళ్లు జలదరించింది. కళ్లలోకి కాంతి వచ్చింది. ఎప్పటి కాత్యాయన? తన బాల్యమిత్రుడు. వెంటనే తన భుజం మీద శాలువా తీసి చాణక్యునికి కప్పి, దగ్గరకు తీసుకుని మూర్ధాభిషేకం చేసి ‘లోపలకు పోదాం పద బయట చలిగా ఉంది’ అన్నాడు.

లోపలకు వెళ్లగానే వేడిపాలు యిప్పించి, అతను పాలు తాగుతుండగా ఉత్తరం విప్పి చదవసాగాడు.

మిత్రమా! ఈ కుర్రవాడు మనవాడు. చురుకైనవాడు. ప్రాథమిక విద్యలు పూర్తి చేశాడు. తండ్రి మహాపండితుడు. ఆచార్య చణకుని పేరు నీవు వినే ఉంటావు. ఇతని చదువు సంధ్యల బాధ్యత ఇకపైన నాది. మీ విద్యాలయంలో చేర్పించు.

నీ 'కాత్యాయన'.

ఉత్తరం చదువుతుంటే చిన్ననాటి సంగతులు జ్ఞాపకం వచ్చాయి. కాత్యాయన కళ్లలో మెదిలాడు. ఇద్దరూ సహపాఠులు. నిజానికి పుండరీకాక్షుడు నిరుపేద, అనాథ. కాత్యాయన పితృపాదులే తనని చదివించారు. తన కొడుకుతో సమానంగా చూచుకున్నాడు. ఇన్ని సంవత్సరాల తర్వాత ఆ రుణం తీర్చుకునే అవకాశం లభించింది.

'చాణక్యా! నువ్వు ప్రయాణం చేసి అలసిపోయావు. వేడినీళ్లు స్నానానికి ఏర్పాటు చేయిస్తాను. వెళ్లి స్నానం చేసి, భోజనం చేసి విశ్రాంతి తీసుకో. ఈ లోపల నేను విద్యాపీఠం వరకు వెళ్లి ప్రవేశ పరీక్షాధికారులతో మాట్లాడి వస్తాను. ఆయన సరేనంటే కబురు పంపుతాను. ఆయన చిన్న ప్రవేశపరీక్ష పెట్టవచ్చు. సిద్ధంగా ఉండు."

**ప్రవేశపరీక్షాధికారి మందిరం.**

చాణక్య, పరీక్షాధికారి ఎదురెదురుగా కూర్చున్నారు.

పరీక్షాధికారి నిశితంగా చాణక్యను నఖశిఖ పర్యంతం గమనించి ప్రశ్నించాడు.

**పరీక్ష అధికారి :** అబ్బాయ్, నీకు రాజనీతి పట్ల ఆసక్తి ఉందని తెలిసింది.

'మంచి ప్రభుత్వం అంటే ఏది? దాని లక్షణం ఏమిటి?'

వెంటనే చాణక్య తడబడకుండా సమాధానం చెప్పాడు. ఆ సమాధానంలో అతని ఆత్మవిశ్వాసం తెలిసింది అధికారికి.

**చాణక్య :** పాలితుల సుఖ సంతోషాలలోనే పాలకుల ఆనందం ఉంటుంది.

ప్రజల యోగక్షేమాలు తన యోగక్షేమాలుగా భావించేవాడు రాజు. అటువంటి రాజు 'ప్రభువు' అనడానికి అర్హుడు. ప్రభువులకు స్వప్రయోజనం కన్న ప్రజాహితం ఎక్కువ ఉండవలె.

**ప.అధికారి :** బాబూ, రాజుగారి విధులు ఏవి?

**చాణక్య :** పాలకుల విధులు – రక్షణ, పాలన, యోగక్షేమం.

**అధికారి :** కొంచెం వివరించగలవా?

**చాణక్య :** ఆచార్యా "దేశరక్షణ ప్రథమ కర్తవ్యం.

ప్రజా సుపరిపాలన ప్రధాన కర్తవ్యం.

ప్రజల యోగక్షేమాలు ముఖ్య కర్తవ్యం."

**అధికారి :** బాబూ! రాజకీయ వైషమ్యాలు వైరుధ్యాలు ఎట్లా రాజులు పరిష్కరించుకోవాలి?

**చాణక్య :** నాలుగు విధాల పరిష్కరించవచ్చు ఆచార్యా.

సామ, దాన, భేద, దండోపాయాలన్నారు గదా!

**అధికారి :** వాటిని విశ్లేషించగలవా బాబూ?

**చాణక్య :** 'సామ' – అంటే మంచిగా, మర్యాదగా, చర్చల ద్వారా పరిష్కరించుకోవడం.

'దాన' అంటే ఆర్థిక, హార్దిక సహాయం చేసి స్నేహహస్తం అందించడం.

'దండన' తప్పు చేసిన వారిని తగినరీతి శిక్షించడం,

బలపరాక్రమాలు గల రాజులనైతే యుద్ధం చేసి లొంగదీయడం.

'భేద' అంటే వైయక్తిక మార్గం. యుక్తి యుక్తంగా వ్యవహరించి పరిష్కారం పొందడం.

**అధికారి :** రాజ్యం అంటే, దేశం అంటే, ప్రజ లంటే?

**చాణక్య :** ప్రజలు లేకపోతే రాజ్యం లేదు. దేశమంటూ లేకపోతే రాజుండడు. రాజ్యం అంటే ప్రజ. ప్రజలు లేని రాజ్యం, దేశం వట్టిపోయిన ఆవులాంటిది. జనం లేని రాజ్యం ప్రయోజనం లేదు.

**అధికారి :** మంచి ప్రభుత్వ లక్షణాలు ఏవి?

**చాణక్య :** ప్రభుత్వంలో ఏడు అంశాలు ప్రధానం : రాజు, మంత్రి వర్గం, రాజ్యం, జనాభా, రక్షణ, ధనాగారం, మంచిమిత్రులు.

**అధికారి :** రాజు ఉండగా మంత్రి మండలి ఎందుకు?

పరిపాలించేది రాజు కదా.

**చాణక్య :** ఒక చక్రంతో రథం నడవదు. రాజు విజ్ఞుడైన వారిని మంత్రులుగా నియమించుకోవాలి. మంత్రులు రాజుకు సలహాలిచ్చేందుకే. మంత్రుల సలహాలు రాజు పాటించాలి – ప్రజాహితం కోసం.

**అధికారి :** సంపదకు మూలం ఏది?

**చాణక్య :** సంపదకు మూలం పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ. ఆర్థిక మాంద్యం వల్ల అనేక అరిష్టాలు కలుగుతాయి. ఆర్థిక పుష్టిలేని రాజ్యంలో అభివృద్ధి ఉండదు. సంపద పెరగదు. చివరకు దివాలా తీస్తుంది. సంపదను ధనంతోనే సంపాదించాలి. ఏనుగును ఏనుగుతోనే పట్టాలి?

**అధికారి :** దేశంలో పన్నులు ఏ విధంగా ఉండాలి?

**చాణక్య :** పండిన పండ్లనే కోయాలన్నది సూత్రం. రావలసిన బాకీలను వసూలు చేయాలి తప్ప అడ్డగోలుగా పన్నులు విధించకూడదు. పచ్చి పిందెలు రాల్చితే ఏం ప్రయోజనం. లాభాలున్న చోటనే పన్నులు విధించాలి.

**అధికారి :** రాజు తన అధికారుల్ని ఎంతవరకు నమ్మవచ్చు.

**చాణక్య :** నీళ్లలో ఈదే చేప ఎన్ని నీళ్లు తాగవచ్చు అంటే ఎలా? పన్నులు వసూలు చేసే రాజు ఎంత నొక్కేయవచ్చు అంటే ఎలా? నిజాయితీకి నిబంధనలుండవు.

**అధికారి :** శిక్షలు అవసరమా?

**చాణక్య :** నేరాలున్నచోట శిక్షలు తప్పవు. నేరాన్నిబట్టి శిక్ష ఉండాలి. శిక్షా స్మృతిలో తనవారని, పైవారన్న తేడా ఉండకూడదు.

**అధికారి :** రాజు తన శత్రువుల్ని, మిత్రుల్ని ఎట్లా తెలుసుకోగలుగుతాడు?

**చాణక్య :** ఇరుగు పొరుగు రాజులతో మైత్రి ఉంటుంది. దూరాన ఉన్న వారు శత్రువులుగా మారే అవకాశం ఉంటుంది.

పరీక్షాధికారి చాణక్యుని వైపు ప్రశంసాపూర్వకంగా చూచాడు.

పుండరీకాక్షుని వైపు చూచి నవ్వుతూ చెప్పాడు –

"ప్రతిభ విషయంలో ఆవంత సందేహం లేదు మహాశయా! అన్ని యోగ్యతలూ ఉన్నాయి. కానీ అతనికయ్యే ఖర్చులు ఎవరు భరించాలి?"

"కాత్యాయన నా బాల్యమిత్రుడు. అతను పంపినవాడు ఈ పిల్లవాడు. ఈ పిల్లవాని బాధ్యతలు నావి" అన్నాడు పుండరీకాక్షుడు గర్వంగా.

చాణక్య పుండరీకాక్షుని పాదాలకు నమస్కరించి తన వద్ద ఉన్న పది నాణాలు గురు దక్షిణగా సమర్పించాడు.

"దయచేసి ఈ చిన్న దక్షిణ స్వీకరించండి."

పుండరీకాక్షుడు తీసుకోలేదు. "ఉంచు చాణక్యా! నన్ను మిత్రుని రుణం తీర్చుకోనివ్వు."

"నేను గురు రుణం తీర్చుకోవాలి గదా మహాత్మా" అన్నాడు చాణక్యుడు.

"నీవు యావద్భారతాన్ని ఏకం చేసి నీ రుణం తీర్చుకోవయ్యా."

"నీ మేధస్సు అగ్నిలా ప్రసారం కానివ్వు. అల్పులు మిడతల్లా నీ జ్ఞానాగ్నిలో కాలిపోవాలి."

పరీక్షాధికారి అన్నాడు : "చాణక్యా, నా అంతర్వాణి చెబుతోంది. భారతమాత నిన్ను ఆశీర్వదిస్తోంది. నీవు చేయవలసిన పనులు చాలా ఉన్నాయి."

★ ★ ★

**చాణక్య చూడడానికి విచిత్రంగా, వికారంగా కనిపిస్తాడు.**

అసలు అందగాడు కాదు. శకునిలా అగుపిస్తాడు. గుగ్గిపళ్లు, పెద్దకళ్లు వంకర నడక. బాగా నలుపు.

(అతని వల్లనే నల్ల బ్రాహ్మణ్ని నమ్మకూడదనే సామెత ఏర్పడింది).

తక్షశిల మొత్తంలో ఇట్టే గుర్తించదగిన వ్యక్తి చాణక్య ఒక్కడే. అక్కడ చదివే వారంతా రాజకుటుంబీకులు, సంపన్నులు, కులీనులు, దేహదారుఢ్యం

గల క్షత్రియ కుమారులు. ఏదో ఒక నాటికి రాజులు కాదగ్గ అర్హతలున్నవారు. అక్కడ బ్రాహ్మణ వర్గం తక్కువ. అందరిలో చివరన నిలబడ గలిగిన వాడు చాణక్య. అతనిలో రాజఠీవి లేదు, దర్పం లేదు. కట్టుకోను మంచి పట్టుబట్టలు లేని అనాధ. తెలివి తేటలున్నా ఆర్థిక దుస్థితిని బట్టి అతనికి విద్యా ప్రాంగణంలో చెప్పుకోదగ్గ మిత్రులు లభించలేదు. సంపన్నుల బిడ్డలు పేదవారితో జతకట్టరు. కులం ఒక అంతరమైతే, ధనబలం మరొక అంతరం.

★ ★ ★

ఒకనాడు చాణక్య వసతి గృహం నుండి విద్యాలయానికి వెళుతుండగా కాలిలో ముల్లు గుచ్చుకుంది. వంగి ముల్లు తీసి అవతల వేయడమే కాక మొత్తం ముళ్ల పొదల్ని పీకి కాల్చి బూడిద చేశాడు. అదీ చాణక్య కసి. అది చూచిన సహ విద్యార్థి ఒకరు చాణక్యను ఎగతాలి చేశాడు.

"శత్రుమూకల్ని చీరినట్లు ముళ్ల పొదలపై ప్రతాపం చూపాడు చాణక్య?"

ఆ మాట చాణక్య గుండెలో గుచ్చుకుంది. తన కర్తవ్యం తెలిసింది.

"గుచ్చుకున్న తర్వాత ముళ్లు పీకడం కాదు చాణక్యా! ఒక్కొక్క ముల్లు తీసేస్తూ పోతే పొద పొదగా ఉంటుంది. నీకు ఒక్క ముల్లు గుచ్చుకోదుగా. రక్తం కళ్ల చూడకుండా బాధ ఉపశమనం కావాలి."

ఆ మాటలు చాణక్యకు నచ్చాయి. రక్తపాతం జరగకూడదు. శత్రునాశం కావాలి. అది క్షత్రియనీతి. అది రాజనీతి కావాలి. దానికి యుక్తి కావాలి. బలప్రదర్శన కాదు. బుద్ధిని ఉపయోగించాలి.

మర్నాడు ఉదయం చాణక్య తన తొలి సూత్రాన్ని అమలులో పెట్టాడు. తను చిన్నతనంలో తండ్రిగారి వద్ద నేర్చిన ఆయుర్వేదం అక్కరకు వచ్చింది. ఏవేవో ఆకుల్ని తెచ్చి, భస్మం చేసి నీళ్లలో కలిపాడు. ఆ నీటిని ముళ్లపొదలపైన చల్లాడు. మర్నాటికి ఆ ముళ్లన్నీ రాలిపోయాయి. చెట్లకు నష్టం కలగలేదు.

మరొక విద్యార్థి అన్నాడు : "మనం శత్రువును ఓడించలేనపుడు అతనితో మైత్రి చేసుకోవడమూ విజయమే అవుతుంది. అప్పుడు శత్రువును జయించడమే కాదు. మనలోని శత్రు భావనను సైతం జయించినట్లు."

సమిధలను యజ్ఞాలలో పవిత్రంగా ఉపయోగిస్తారు. చాణక్య అపవిత్ర కార్యాలకు ఉపయోగిస్తున్నాడు.

ఏది పవిత్రం? ఏది అపవిత్రం?

చాణక్య మిత్రుల వ్యాఖ్యలు విని ఊరుకున్నాడు తప్ప ఎవరికీ సమాధానం ఇవ్వలేదు. అది అతని నైజగుణం. పనిచేసి చూపించాలి తప్ప చెప్పి చేయకూడదు. గోప్యతలోనే ఉంది విజయ రహస్యం.

మర్నాటి ఉదయానికి పచ్చని ముళ్ల పొదలు చచ్చిపోయాయి.

"ఏయ్ చాణక్యా! ఆ నీళ్లలో ఏం కలిపావయ్యా మహానుభావా? పచ్చని చెట్లు చప్పగా చచ్చుబడిపోయాయి. చచ్చి ఊరుకున్నాయి. విషం కలిపావా బాబూ?"

ఒక ముల్లును తొలగించడం కష్టం. మొత్తం ముళ్లపొదను తొలగించడం సులభం. పాలలో విషం కలిపిన సంగతి ఎవరికీ తెలియదు. బెల్లం ఉన్నచోటుకే చీమలు చేరతాయి. అది జీవిత సత్యం.

ఆ సూత్రాలే చాణక్యకు రాజనీతి సూత్రాలైనాయి.

"శత్రుశేషం, ఋణశేషం ఉండకూడదు. చేసిన అప్పు చివరిపైస వరకు చెల్లించి తీరాలి. శత్రువుల్ని చివరి సైనికుని వరకు వదలకూడదు."

అదీ చాణక్యసూత్రం.

నెమ్మదిగా చాణక్యకు అభిమానులు తయారైనారు. అతని సిద్ధాంతాల వెనక ఉన్న మేధను గౌరవించసాగారు.

★ ★ ★

**తక్షశిల పరిసరాల్లో 'దండాయన' ఆశ్రమం ఉంది.**

అప్పుడప్పుడు చాణక్య ఆ ఆశ్రమానికి వెళ్లడం అలవాటు చేసుకున్నాడు. తక్షశిల విద్యార్థులు తరచు ఆశ్రమానికి వెళుతుంటారు. చాణక్యకు యోగం పట్ల ఆసక్తి హెచ్చు. దండాయన తలక్రిందులుగా శీర్షాసనంలో ఉంటాడు. అదే ఆయన యోగముద్ర. చాణక్య ఆయన తల దగ్గర కూర్చుని వంగి వంగి చర్చిస్తుంటాడు.

ఒకసారి చాణక్య దండాయన రుషిని ప్రశ్నించాడు.

"అవును మహర్షీ!

మనం అందరం ఆర్యబ్రాహ్మణులం కదా. అందరిదీ హైందవమతమే. అందరిదీ బ్రాహ్మణ సంప్రదాయం. అందరి ప్రామాణిక గ్రంథాలు ఒక్కటే గదా! పూజలు, ప్రార్థనలు, మంత్రాలు, దేవతా గణం ఒక్కటే అయినప్పుడు మగధ, గాంధార, కాశీ, కురు, కోసల, మల్లప్రియ, పాంచాల పేర్లతో ఇన్ని రాజ్యాలు ఎందుకు ఏర్పడ్డాయి? మొత్తానికి భారతదేశం ఒక్కటైతే సరిపోతుంది గదా? అందరం భారతీయులం అంటే ఏం దోషం? దేశం అంతటికీ ఒక చక్రవర్తి చాలును గదా?"

రాజకీయ వ్యవస్థ గురించి చాణక్య దండాయన మహర్షితో ఎక్కువ చర్చించేవాడు.

ఆరు సంవత్సరాల కాలంలో చాణక్య తక్షశిల విద్యాపీఠంలో నేర్పే అన్ని విభాగాల్లో ప్రథమస్థానం పొందాడు. ఇంక నేర్చుకోవలసింది లేదు.

అతనికి ఉపాచార్య పదవి లభించింది. తనకిష్టమైన అర్థశాస్త్రం బోధించసాగాడు. పుండరీకాక్షుడు తన కోసం వెచ్చించిన ధన ఋణం తీర్చాడు. ఋణం ఏ మాత్రం ఉంచుకోకూడదని చాణక్య సిద్ధాంతం.

"చాణక్యా! ఎన్ని రుణాలు నీవు తీర్చినా తీర్చలేని ఋణం ఒకటి ఉంది. నీవు అఖండ భారతాన్ని ఏకం చేయాలి. అదీ నీ రాజకీయ ప్రజ్ఞకు తుది పరీక్ష. అందులో విజయం సాధిస్తే నా ఋణం తీర్చుకున్నట్లు" అన్నాడు పుండరీకుడు ఆప్యాయంగా చాణక్య తల నిమురుతూ.

పుండరీకాక్షుడే చాణక్యను దండాయన యోగికి పరిచయం చేసింది. ఆయనకు యోగదృష్టి ఉంది భవిష్యత్తును దివ్యదృష్టితో దర్శించగలడు. అప్పుడప్పుడు ఆశ్రమానికి వెళ్లి యోగిని దర్శించడం చాణక్యకు ఇష్టంగానే ఉంది. దండాయనకు చాణక్య అంటే అభిమానం : 'కుర్రవాడు యోగ్యుడు' అంటాడు. ఇద్దరి సంభాషణ సున్నితంగా సాగేది.

'చిన్నచిన్న ప్రమిదలు ఎన్ని వెలిగించినా అఖండజ్యోతి అవదు చాణక్యా! అన్ని జ్యోతులు కలిసి ఒక్కటైతే అది అఖండ జ్యోతి.'

అందరినీ శత్రువులుగా కాక ఒక్కటై నిలిస్తే తప్ప వీరంతా ఏకం కారు.

దండాయన జుత్తు తెల్లబడింది. వృద్ధుడు. ఆయనకు భయం లేదు.

"సూర్యుడు తూర్పున ఉదయించినా అస్తమించేది పడమటనే. గ్రీకు చంద్రుడు పడమర నుండి తూర్పుకు పయనించి అస్తమిస్తాడు?"

"చాణక్యా! నీ అసలు శత్రువు ధననందుడు కాదు. మెసడోనియా నుండి వస్తున్న దైవపుత్రుడు, అలెగ్జాండరు. అతను దేవానాం ప్రియుడట. అతగాడు నీకు అసలు సిసలైన ఉజ్జీ. నీకు పరమశత్రువు."

"ఏం చేయమంటారు గురూజీ! ఆజ్ఞాపించండి. నాకు ధననందునిపై ఉన్నది శత్రుత్వం కాదు. అది పగ, ప్రతీకారం. అది తప్పదు. అదలా ఉంచండి. అది నా వ్యక్తిగత సమస్య. భారతీయుడిగా నా కర్తవ్యం ఏమిటో సెలవివ్వండి."

"చాణక్యా! పండి రాలడానికి సిద్ధంగా ఉన్న పండును కోయడానికి చెట్టెక్కనవసరం లేదు. కత్తి, కర్ర అవసరం లేదు. పండినపండు రాలి పడడం సహజం. నీ లక్ష్యం గొప్పది కావాలి. పెద్ద పెద్ద విషయాలపై మనస్సు పెట్టు. అల్ప విషయాలను పట్టించుకోకు. ఉత్తముల లక్ష్యం ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలి. ఏనుగును కుంభ స్థలంపైన కొట్టాలి తప్ప కాళ్లు పట్టుకుని బ్రతిమిలాడ కూడదు.

పిల్లి మెడలో గంట కట్టు. తర్వాత చీకట్లో నైనా దోవ తెలుస్తుంది.

★ ★ ★

**చాణక్యుని బోధనా పద్ధతి విద్యార్థులకు నచ్చింది.**

ఉపాచార్యుడైనా ప్రధానాచార్యునికిచ్చినంత గౌరవం ఇవ్వ సాగారు. చాణక్య చెప్పే అంశం ఏదైనా వినడానికి వందలమంది విద్యార్థులు పోటీ పడసాగారు. తను ఏదో చెప్పడం కాక, విద్యార్థుల్ని ప్రశ్నలు అడగమని తను సమాధానాలు చెప్పేవాడు. లౌక్యం, పారదర్శకత అతని నిజాయితీ, విజ్ఞానం, వినోదం అన్నీ గుదిగుచ్చి చతురోక్తులు చలోక్తులు చేర్చి, విద్యార్థుల్ని రంజింప చేసేవాడు. విద్యాబోధన లోనూ కొత్త పద్ధతులు తయారు చేశాడు.

విద్యార్థులతో సంభాషణ ఈ తీరుగా ఉండేది.

**ఒక విద్యార్థి :** గురూజీ, మీరు ఆచార్యుల కన్నా ప్రతిభావంతులు కదా. రాజనీతి బాగా తెలిసినవారు. మీరే ఒక రాజు కావచ్చు గదా!

**చాణక్య :** రాజు కావడానికి నాకేం అభ్యంతరం లేదు గానీ, ఎవరూ నాకు సమస్య కాకూడదు, నేను ఎవరికీ సమస్యగా ఉండకూడదు.

విద్యార్థి : గురుదేవా! ప్రభుత్వం నడపడంలో రహస్యాలు అవసరమా?

చాణక్య : నీవు రాజువైతే, నీవు ఏం చేస్తున్నదీ నీ ప్రజలకు తెలియకూడదు. నీవు తప్పు చేస్తే నీ ప్రజలకు ఎట్లా తెలుస్తుంది. కనుక రాజ్య పాలనలో రహస్యం అవసరం.

విద్యార్థి : ఆచార్యా! మనిషి తప్పు చేసినపుడు దాచి పెడతాడు. తప్పించుకో చూస్తాడు ఎందువల్ల? తప్పు ఒప్పుకోవచ్చు గదా.

చాణక్య : ప్రజలు చట్టాలను గౌరవించాలంటే చట్టాలలో లోపాలుండకూడదు. లోపరహితమైన చట్టాలు చేయడం, అమలు చేయడం. రాజు విధి? మంత్రి వర్యుల బాధ్యత. రాజే తప్పు చేస్తే, మంత్రి గారే గడ్డి తింటే? చట్టం ఏ ఒక్కరికో, ఏ ఒక వర్గానికో చుట్టం కాకూడదు. చట్టానికి విశ్వసనీయత ఉండాలి.

విద్యార్థి : రాజు అంటే ప్రజాసేవకుడు అంటారు? ఎలా?

చాణక్య : చిన్న సవరణ. అదే వివరణ. పెత్తనం చలాయించేవాడు మెత్తగా, అణగిమణగి ఉండాలి. కోపం, నిరాశ పనికిరాదు. అలా ఉంటేనే రాజుకు గౌరవం. అది సేవా ధర్మం.

విద్యార్థి : విపత్కర, అత్యవసర పరిస్థితుల్లో రాజు బాధ్యతలు మంత్రి తీసుకోవడం అవసరమా? ధర్మమా!

చాణక్య : పాలకులే విపత్కర పరిస్థితులు సృష్టిస్తారు. కల్లోలానికి కారకులు పాలకులే. రాజులు, మంత్రులు ఎప్పుడు సమస్యలతో ఊపిరాడకుండా ఉంటే కల్లోలాలకు అవకాశం ఉండదు. సోమరిగా ఉండేవారే సమస్యలు సృష్టిస్తారు.

విద్యార్థి : రాజు ఎప్పుడు సత్యమే చెప్పాలంటారు. అయ్యేపనా? అవసరానికి అబద్ధం చెబితే నష్టం లేదు గదా?

చాణక్య : రాజుకు సత్యంతో పనిలేదు. అబద్ధాలను నిజాలుగా చెప్పే ప్రతిభ ఉంటే చాలు. తియ్యని మాటలు రుచించినంతగా నిజాలు రుచించవు. తియ్యని మాటలతో నిజాన్ని కప్పి పుచ్చే వారిని పట్టుకోవడం కష్టం.

విద్యార్థి : గురూజీ! ప్రజలకు స్వేచ్ఛ ఎంతవరకు అవసరం?

చాణక్య : చూడు ఆకలితో ఉన్న వాడికి నాలుగు ముద్దలు అన్నం ఇచ్చినంత తృప్తి ఎంత స్వేచ్ఛ యిచ్చినా కలగదు.

విద్యార్థి : ఆచార్యా! మీ వంటి ప్రతిభాశాలి రాజు కావడం ప్రజల అదృష్టం.

చాణక్య : అదే నా దురదృష్టం కావచ్చు గదా! రాజకీయ పరిజ్ఞానం ఉన్నంత మాత్రాన రాజు కాలేడు. కుత్సిత బుద్ధి ఉన్న ప్రతివాడు మంత్రి కాలేడు. నీవు రాజువు కాగలవేమో ప్రయత్నించు.

విద్యార్థి : నేనే రాజునైతే మిమ్మల్ని మహామంత్రిని చేస్తాను గురూజీ.

చాణక్య : అప్పుడు చూద్దాంలే. నేను బ్రతికుంటే, నీ కల సాకారమైతే.

విద్యార్థి : ఆచార్యా! రాజకీయ వైషమ్యాలకు యుద్ధాలే పరిష్కారమా?

చాణక్య : కావచ్చు, కాకపోవచ్చు. సందర్భాన్ని బట్టి, అవసరాన్ని బట్టి.

విద్యార్థి : రక్తపాతం లేని యుద్ధాలుంటాయా ఆచార్యా.

చాణక్య : ఉంటాయి. తెలివిగా ప్రవర్తిస్తే సరి.

విద్యార్థి : పన్నులు ఎలా వినియోగం అయ్యేది ప్రజలకు తెలియడం అవసరం. పన్నులు చెల్లించేది ప్రజలే కదా.

చాణక్య : అది సమాచార హక్కు కాదు. ప్రజలకు ఆ హక్కు ఉండదు. దేవాలయానికి వెళ్లి దేవుడికి నైవేద్యం పెట్టావు. దక్షిణలిస్తావు. అవి సక్రమంగా వినియోగించావా అని పూజారిని ప్రశ్నిస్తావా? ఇదీ అంతే!

విద్యార్థి : నియమానుసారం పరిపాలిస్తే మంచి ప్రభువు అనిపించుకోవచ్చు.

చాణక్య : నియమాలు తయారు చేసినవారే తప్పుతారు, తప్పుడు పనులు చేస్తారు. నియమాలు, వినియమాలు కాదు ముఖ్యం. మనస్సాక్షి.

విద్యార్థి : ధనం కన్న నీతి నియమాలు ప్రధానం అంటారు. అవునా?

చాణక్య : ధనం కాదు, నీతి నియమాలు అని ఎవరైనా అంటే అతను అవినీతి పరుడనే అర్థం. డబ్బు మనిషికి చాలా అవసరం. అర్థశాస్త్రం అంటే 'ధనం' గురించే కాదు, నైతికత కూడా. రాజకీయ ప్రజ్ఞ, ఉపజ్ఞ అర్థశాస్త్రంలో కలిసే ఉంటాయి.

విద్యార్థి : ఆచార్యా! రాజులు మంత్రులతో చర్చిస్తే చాలా? ప్రజల భాగస్వామ్యం లేకపోతే ప్రజాసమస్యలు ఎట్లా తెలుస్తాయి?

చాణక్య : ఎవరి పనులు వారు సక్రమంగా చేస్తే చాలు. అదే యంత్రాంగం. అదే మంత్రాంగం.

విద్యార్థి : ధర్మరక్షణార్థం యుద్ధం చేయవలసి వస్తే.

చాణక్య : చేయకతప్పదు. అది విదేశాల విషయంలో కావచ్చు. దురాక్రమణ యుద్ధానికి అసలు కారణం. ఎవరి రాజ్యంలో వాళ్లు తృప్తిగా ఉంటే కలహాలకు అవకాశం ఉండదు.

విద్యార్థి : ఆచార్యా! రాజ్యంలో జరిగే సంఘటనలు రాజుకు తెలియకపోతే అందుకు బాధ్యత మంత్రి వహించాలి కదా?

చాణక్య : మంత్రి చెప్పనంతమాత్రాన తెలుసుకోనంత మూర్ఖుడు కాదు రాజు. రాజు తన వేగుల ద్వారా తెలుసుకుంటూ ఉండాలి. అన్నింటికీ మంత్రుల్ని బాధ్యుల్ని చేయనవసరం లేదు. 'మంత్రీ ఒక పౌరుడే.'

ముక్తియుక్తంగా, హాస్యం జోడించి సమాధానం చెప్పే చాణక్యుని మాటల్లో ఆవేదన ఉంది. వేడి ఉంది. వ్యవస్థపైన అసంతృప్తి ఉంది. గుండెల్లో విషాదం గూడు కట్టుకుని ఉంది.

★ ★ ★

పది సంవత్సరాలైంది. తల్లి మగధలో ఎట్లా ఉందో తెలియదు, సమాచారం అందదు. ఎంతగా బాధ్యత కాత్యాయన తీసుకున్నా అయినవాళ్లు దగ్గర లేరు గదా! తనకోసం దిగులు పడకుండా ఉంటుందా! భర్తా లేక కొడుకూ దగ్గర లేక ఎన్ని బాధలు పడుతోందో?

పది సంవత్సరాలైంది తను వచ్చి. ఇంతకాలం తనను ఆదుకున్న పుండరీకాక్షుడు గత సంవత్సరంలో కాలం చేశాడు. ఇక్కడ తనకు నా అన్నవాళ్లు లేరు. నిజానికి మగధలోనూ లేరు. మగధను వదలిన చివరి రాత్రి. అది తన పాలిటి కాళరాత్రి.

పుండరీకాక్షుడు అవసాన సమయంలో తన కిచ్చిన సందేశం :

"చాణక్యా, మగధ వెళ్లి మీ అమ్మగారిని తెచ్చుకో. అమ్మ కొడుకు దగ్గర ఉండడం ధర్మం. జననీ, జన్మభూమి అన్నారు పెద్దలు. కన్నతల్లిని, పుట్టిన ఊరిని అలక్ష్యం చేయకూడదు."

పుండరీకాక్షుడు పోతుపోతూ కొన్ని వస్తువులు మిగిల్చాడు. తాను ఉన్న ఇల్లు, తన పుస్తక భాండారం, విధేయుడైన సేవకుడు. చాణక్య మగధకు ప్రయాణం అవుతూ మూడు ఏర్పాట్లు చేశాడు. తన ప్రియమిత్రులు ముగ్గురిని ఆ ఇంట ఉండే ఏర్పాటుచేశాడు. సింహరన్, మెహర్, సారంగరావు. తను అక్కడ లేనంతకాలం ఆ ఇంటి బాధ్యతను, తమ వ్యక్తిగత విషయాలు వారు చూస్తారు.

సింహరన్ మల్లప్రియ ఏలిక కుమారుడు, రాజవంశీయుడు. మల్లప్రియ చిన్న రాజ్యాలలో ఒకటి. సింహరన్ తండ్రి ఒకప్పుడు మల్లప్రియ రాజు. అతని తమ్ముడే అన్నను చంపి రాజైనాడు. అసలు వారసుడు సింహరన్.

మెహర్ పర్షియా దేశస్థుడు. అలెగ్జాండరు పర్షియాపై దండెత్తినపుడు పారిపోయి వచ్చినవాడు.

సారంగరావు విశ్వవిద్యాలయ ఉత్తమ విద్యార్థి. ముగ్గురూ చాణక్యకు ప్రియమైనవారే.

వీరికి విద్యాలయంలో గాంధార యువరాజు ప్రత్యర్థి.

అతని పేరు అంభి. తలబిరుసుమనిషి.


చాణక్య పోతూపోతూ ఒక సలహాయిచ్చాడు. అంభికి దూరంగా ఉండమని. అతనిని ఒక కంట కనిపెడుతూ ఉండమని.

★ ★ ★

విద్యాలయాధికారుల అనుమతిలో బయలుదేరాడు చాణక్య.

మగధకు ప్రయాణం కష్టభూయిష్టం. ప్రయాణం మధ్యలో తల్లిదండ్రులు సువాసిని, చిన్ననాటి విషయాలు జ్ఞాపకం రాసాగాయి చాణక్యకు.

సువాసిని చాణక్యుని ప్రియురాలు. శక్తారుని కూతురు. సుకుమారంగా పెరిగిన పిల్ల. చాణక్య తక్షశిలకు వచ్చే నాటికే కుందనపు బొమ్మ. మన్మధుడు మనసు పడి చెక్కిన పాలరాతి శిల్పం లాగా ఉండేది. తను ఇష్టపడుతున్నట్లు ఎప్పుడూ చాణక్య ఆమెకు చెప్పలేదు. ప్రేమిస్తున్నానని చెప్పే ధైర్యం చాణక్యకు లేదు. అతని ప్రేమ తెలిసినా తెలియనట్లు ఉండిపోయింది సువాసిని. ఈ తలపోతలతో చాణక్య మగధ దారిపట్టాడు.



# 3. పాటలీపుత్ర

**ప**దేండ్ల కాలంలో పాటలీపుత్ర గుర్తించడానికి వీల్లేనంతగా మారిపోయింది. నగరం పరిమాణంలోనే కాదు జీవన ప్రమాణంలోనూ మార్పు వచ్చింది. మనుషులలోనూ మార్పు కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. మనుషుల్లో సోమరితనం, నిర్భీకత, అలసత్వం, విశృంఖలత్వం, వ్యభిచారం, జూదప్రియత ఎక్కువైంది. ప్రతి వీధిలో జూద గృహాలు, వ్యభిచార గృహాలు తలెత్తాయి. తగవులు, కొట్లాటలు ఎక్కువైనాయి. పెద్దలపట్ల గౌరవాదరాలు అదృశ్య మైనాయి. అన్యాయాన్ని అదుపుచేసే అధికారులు లేరు. సంగీత, నృత్య, గానాల జోరు ఎక్కువైంది. వెర్రిపోకడలు పోతున్న కామకళపై వాత్సాయన మహర్షి అప్పుడే 'కామసూత్ర' రచించాడు. పన్నెండు వందల శ్లోకాలలో, 77 రతిభంగిమల వర్ణనలతో ఒక అపూర్వ శృంగారప్రబంధం తయారైంది. నాటినుండి నేటి దాకా అదే ప్రామాణిక రతిశాస్త్రం.

చాణక్య పాటలీపుత్ర నగరం సింహద్వారం వద్దకు రాగానే ద్వారపాలకుడు అభ్యంతరం పెట్టాడు. ఎవరు నీవు? ఎందుకు వచ్చావు? ఏమిటి పని? పిచ్చి ప్రశ్నలు. వారికి నచ్చచెప్పి, తాను మగధవాసినేనని నమ్మించి నగరంలో ప్రవేశించాడు. ప్రవేశద్వారం వద్ద అది కొత్తగా వచ్చిన

నిబంధన. శత్రుదేశాల వారు రాకుండా ఆరోజుల్లో అలాంటి కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉండేవి. మగధకు శత్రువులు ఎక్కువ. శత్రువులు ఎక్కువైన చోటనే రక్షణ అవసరం ఎక్కువగా ఉంటుంది.

చాణక్య తనకు తెలిసిన రాజబాటల్లోకి వెళ్లాడు. శ్రమ అనిపించలేదు. కాత్యాయన ఇల్లు సులభంగానే పోల్చుకోగలిగాడు. ఆ వీధులు మారలేదు. ఇళ్లు అన్నీ పాతవే. బ్రాహ్మణ వీధుల్లో త్వరగా మార్పులు రావు. మడులు, దడులు, గుడులు, ఆచారాలు ఒక్కలాగే ఉంటాయి. పది సంవత్సరాల వ్యవధిలో కాత్యాయన పాతిక సంవత్సరాల ముసలితనం పొందాడు. బాగా ముసలితనం వచ్చేసింది. చూపు ఆనడం లేదు. అయినా చాణక్య నడకను గుర్తించాడు. ఎదురుగా వెళ్లి ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. పని కుర్రవాడు వచ్చి కాళ్లు కడుక్కోను నీళ్లిచ్చాడు. ఇంటికి వచ్చిన అతిథి అభ్యాగతులకు కాళ్లు కడుక్కొనే వీలు కలిగించడం కుటుంబ ధర్మం. ఆచారం.

వంటగదిలో భోజనాలకు కూర్చున్నారు. ఆచారం ప్రకారం అతిథికి అరటాకులో వడ్డన. సంప్రోక్షణ చేసి భోజనానికి ఉపక్రమించారు ఇద్దరూ. చాణక్య మొదటి మూడు ముద్దలు నమస్కారం చేసి విస్తరి అంచున ఉంచాడు. ఒకటి పితృదేవతలకు, రెండవది దేవతలకు. మూడవది జీవకారుణ్యం. పక్షులకు, పిట్టలకు, జంతువులకు వేసేది. అది ఆచారం.

భోజనాలు ముగిసిన తర్వాత నడవాలో నులకమంచం మీద నడుం వాల్చి విశేషాలు అడిగాడు కాత్యాయన.

"అమ్మను నాతో తీసుకు పోదామనుకుంటున్నాను బాబాయ్. అందుకే వచ్చాను."

కాత్యాయన మౌనం వహించాడు. రుద్ధ కంఠంతో చెప్పాడు.

"విష్ణు, చాణక్యా ఎట్లా చెప్పను! మీ నాన్నగారు పోయాక, నీవు తక్షిల వెళ్లాక మీ అమ్మగారి కోరికపైన తన పుట్టిల్లు ముసురుపురాకు పంపాను. అది మీ మాతామహుల గ్రామం గదా! తను పాటలీపుత్ర వదిలితేనే మంచిదనిపించింది. ఎవరో ఒకరు అయినవారు దగ్గర ఉంటారు గదా అని. నెలనెల డబ్బు పంపాను. ఆమె దిగుళ్లతో కునారిల్లిపోయింది. మెతుకు ముట్టడం

మానివేసింది. చివరకు పచ్చినీళ్లు సైతం తాగేది కాదు. ప్రాణత్యాగం చేసింది విష్ణూ. ఏడు సంవత్సరాలు పూర్తి కావస్తోంది. నీకు సహచారం అందించలేక పోయాను బాబూ, నన్ను క్షమించు. ఈ చావు కబురు నా నోటితో చెప్పవలసి రావడం నాకు చచ్చిన చావుగా ఉంది. నీకు రెండుసార్లు చావు కబుర్లు మోసిన దౌర్భాగ్యుడిని నేనే."

ఆనాడు ఆచార్య చణకుని శిరచ్ఛేదం వార్త చెప్పినపుడు విష్ణులో కనిపించని శూన్యత ఇప్పుడు స్పష్టంగా కనిపించింది.

వృద్ధుడైన కాత్యాయన వణికే చేతులతో చాణక్య భుజంపై చేయివేసి ఓదార్చాలని ప్రయత్నించాడు. అతని వల్ల కాలేదు. చాణక్య కళ్లలో కసి, పగ, ప్రతీకారం ఉప్పొంగి వచ్చాయి.

వెంటనే విషయం మార్చాడు కాత్యాయన. ఎంత ఆత్మీయవ్యక్తి మరణం అయినా కాలక్రమంలో మరుగునపడుతుంది.

"శక్తారుడు సజీవంగా ఉన్నాడా బాబాయ్" ప్రశ్నించాడు.

"తను ఇంకా కారాగారంలోనే జీవచ్ఛవం లాగా ఉన్నాడు. ధననంద అతని కుటుంబాన్ని సర్వనాశనం చేశాడు. నేను, రాక్షసమంత్రి కారాగార అధికారిని బ్రతిమలాడి అతను చావకుండా చూస్తున్నాం."

"నీకు తెలియదు విష్ణూ, ధననందుని కారాగారం నరకం కన్న భయంకరం. అది చూచి యమధర్మరాజు కూడా ధడుసుకుంటాడు. యమ కింకరులు అక్కడ మెలకువలు నేర్చుకోవచ్చు. పాపం శక్తారుడు నిత్యం చస్తూ బ్రతుకుతున్నాడు."

"శక్తారుని కుమార్తె సువాసిని చనిపోయిందా బాబాయ్?"

"నీకు సువాసిని అంటే ఇష్టమని నాకు తెలుసు. రాక్షసుడి జోక్యంతో ఆమె బ్రతికిపోయింది. అయితే ఏం లాభం? అతనికి ఉంపుడుగత్తెగా మారింది."

సువాసిని చేజారిపోయింది. అమ్మ చనిపోయింది. ప్రధానమంత్రి నరకంలాంటి కారాగారంలో ఉన్నాడు. ఇదేం మగధ?

“ఒక్కటే మేలు విష్ణూ. ధననందుడు బ్రాహ్మణవర్గం మీద కక్ష గట్టలేదు. వారిపట్ల ఉదారంగా ఉన్నాడు. కారణం రాక్షసమంత్రి. అతని వల్లనే రాజు మరీ భ్రష్టుడైనాడు. ప్రజల్లో బ్రాహ్మణద్వేషం పెరిగింది. బ్రాహ్మణుల్ని పచ్చి స్వార్థపరులుగా ప్రజలు చూస్తున్నారు. ధననందుని ఒప్పించి బ్రాహ్మణులకు అగ్రహారాలు, మడిమాన్యాలు ఇప్పించాడు రాక్షసుడు. ప్రజల్లో బ్రాహ్మణుల పట్ల ద్వేషమే ప్రజలు బౌద్ధాన్ని ఆదరించడానికి కారణం అయింది. మంచికి చెడుకు మనమే బాధ్యులం. మన పరివర్తనలే బాధ్యత.”

“అంటే ధననంద రాక్షసుని ద్వారా బ్రాహ్మణ వర్గాన్ని లోబరచుకున్నాడన్నమాట. భూమాత ఈ అకృత్యాలు చూడలేక ఏడుస్తోంది. ధర్మాన్ని రక్షించవలసిన పురోహితులే ద్రోహం చేస్తే ఎలా? బ్రాహ్మణులే ఛండాలంగా ప్రవర్తిస్తుంటే ఏది గతి!”

“పెద్దగా అనకయ్యా బాబూ గోడలకు చెవులుంటాయి. ఈ దేశంలో ఎవడు గూఢచారో తెలియదు. ప్రతి మనిషిపైన రెండవవాడు గూఢచారి. నీవు నమ్మవు గానీ మాది ముండబ్రతుకైపోయింది. ఉంపుడుగత్తెల ముందు తలవంచి బ్రతుకుతున్నాం. నీ తండ్రి ఆచార్య చణకునికి ఏం జరిగిందో జ్ఞాపకం ఉంది కదా! నిజం మాట్లాడినందుకు చణకునికి శిరచ్ఛేదం జరిగింది. నీకు చాతనైతే నారి సంధించు. బాణం ఎక్కుపెట్టు.”

“బాబాయ్! నాకు ప్రాణభిక్షపెట్టి మరొక జన్మ నిచ్చింది మీరు. మీరు నాకు పిత్రుతుల్యులు. మీరు లేకపోతే ఈ చాణక్యుడు ఉండే వాడు కాదు. మీకు జీవితాంతం ఋణపడి ఉంటాను. ఇక్కడి పరిస్థితులు నన్ను క్రుంగదీస్తున్నాయి బాబాయ్.”

“క్రుంగిపోకు. చక్కదిద్దడం నీ కర్తవ్యం. ఇది నీ మాతృభూమి. ఇది నీ కర్తవ్యం. ఏదైనా చెయ్యి. ధననందుణ్ణి గద్దె దించాలి. అదే మగధ ప్రజకు, నీ సోదర ప్రజకు నీ విచ్చే గొప్ప కానుక.”

మగధపై కక్ష సాధించాలంటే బలం కావాలి. ధనం కావాలి.

ధనంతోనే ‘ధననందుని’ గద్దె దించాలి.

★ ★ ★

**అది విజయోత్సవ సంరంభం.**

ప్రతి ఏడాది పాటలీపుత్రలో విజయోత్సవం జరుగుతుంది. ధననందుడు సాధించే విజయాలుండవు. అయినా విజయోత్సవాలు జరుపుకుంటాడు. దేశంలోని బ్రాహ్మణ విద్వాంసులను పిలిచి గౌరవించడం. పండిత పరిషత్తులో పోటీలు. విజేతలకు సత్కారాలు, సమ్మానాలు. దానికి ప్రేరకుడు, నిర్వాహకుడు రాక్షసమంత్రి.

విస్సన్న చెప్పిందే వేదం. రాక్షసమంత్రి చేసిందే సత్కారం.

వేయి మంది బ్రాహ్మణోత్తములకు రాజమందిరంలో బంగారు పళ్లాలలో విందు భోజనం. నగర ముఖ ద్వారంలో, కోట గుమ్మంలో స్వాగత తోరణాలు. మేలతాళాలతో ఆహ్వానం.

ధననందుడు అలంకారప్రాయంగా సింహాసనం అలంకరించాడు. అతని ముఖంలో అసహనం కనిపిస్తోంది. రాజపురోహితుడు, జ్యోతిషవేత్తలు రాజుగారి జాతకచక్రాన్ని క్రిందా మీద పరిశీలిస్తున్నారు. లెక్కలు వేస్తున్నారు. ఏదో రవంత దోషం కనిపించింది వారికి.

"మహారాజా!

తమరి జాతకం ప్రకారం ఈ రోజు అంత శుభంగా లేదు. సంపత్తార శుక్రుడు పాపి కుజుడితో కలిసి ఆరవ ఇంట ఉన్నాడు. పైగా శనిదృష్టి ఏడ్చింది. అసలే తమకు రాహు మహర్దశ జరుగుతోంది. కుజుడు అష్టమంలో ఉండడం అరిష్టసూచన. అది తమరి మారకస్థానం. ఏదో అశుభాన్ని సూచిస్తున్నాయి గ్రహాలు మహారాజా! లగ్నానికి సూర్యచంద్రుల వేధ మరొక పీకులాట. శని కారకత్వం వల్ల కలహాలు, యుద్ధాలు సూచన. పైగా చంద్రునికి దశమ దృష్టి ఏర్పడింది.

అయ్యా! మహారాజా! ఈరోజు తమరు నోటికి తాళం వేసుకోవడం మంచిది. నోరు తెరిస్తే తగవులు వస్తాయి. ఇది గ్రహచార ప్రభావం."

అసలే దిగులుగా ఉన్న ధననందుడు మరీ క్రుంగిపోసాగాడు.

"ఇక్కడ ఉన్న గ్రహాలు చాలనట్లు పై గ్రహాలబాధ" అనుకున్నాడు అంతరంలో.

"ఏం చేస్తాం మహారాజా. గ్రహచారాన్ని ఎవరు తప్పించగలరు?"

"మీరు గ్రహాల్ని మారుస్తారుగా?"

"గ్రహాల్ని మార్చినంత మాత్రాన రాతలు మారవు మహారాజా!"

★ ★ ★

**"అదీ విషయం విష్ణూ! ఏమైనా నీవు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి"** కాత్యాయన హెచ్చరించాడు.

విద్వత్సభలో పాల్గొని తన ప్రతిభ ప్రదర్శించాలని లోపల ఉన్నది కాని కాత్యాయన హెచ్చరికతో విరమించుకున్నాడు చాణక్య.

"అసలు అలాంటి చెత్త పోటీలకు తాను వెళ్లడం ఏమిటి?" అనుకున్నాడు. అయినా ధననందుని నిర్వాకం చూడాలని, అతనిని దగ్గరగా గమనించాలని ఆశ. ఈ మగధ పండితులు ఎంతటి వెధవాయిలో కళ్లారా చూడాలని తపన. ధననంద, రాక్షసుల నాటకం ప్రత్యక్షంగా చూచే అవకాశం వదులుకోకూడదు.

"అట్లాగే బాబాయ్! ఎవరికీ కనిపించనులే. అయినా నన్నెవరు గుర్తిస్తారు. ఇక్కడ పెరిగిన వాడిని కాను గదా. ప్రేక్షకుల్లో ఒకడుగా ఉండిపోతాను."

అని హామీ యిచ్చాడు. కాని గ్రహపాటు జరిగిపోయింది. సభలో కాత్యాయన ప్రక్కన ఒదిగి కూర్చున్నాడేమో రాక్షసుని కంట్లో పడనే పడ్డాడు. అతగాడు చాణక్యను గుర్తించాడు. అతని కళ్లు మెరిశాయి. లేచి రాజుగారి ప్రక్కన నిలబడి ప్రకటన చేశాడు.

"సదస్యులారా! సభాసదులారా!

ఈరోజు మన మగధకు నిజంగా పండుగ. మహాపండితుడు చణకుడు మీలో కొందరికి గుర్తు ఉండే ఉంటుంది. ఆయన కుమారులుంగారు చాణక్య తక్షశిలలో విద్యపూర్తి చేసుకుని మన మగధకు విచ్చేశాడు. చాణక్య తక్షశిలలో గొప్ప ఆచార్యుడు. ఈ విద్వత్సభ వారి ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. దయచేయండి ఆచార్య చాణక్యా! వేదికపైకి వేం చేయండి."

సభికులు హర్షధ్వానాలు చేశారు. ధననందుని తల వాలిపోయింది. చాణక్య నిలబడగానే కాత్యాయన హెచ్చరించాడు : "జాగ్రత్త విష్ణూ! బోనులో ప్రవేశిస్తున్నావు."

చాణక్య వేదిక మీదికి వెళ్లక తప్పలేదు.

"రాక్షసగురువు శుక్రాచార్యునికి, దేవగురువు బృహస్పతికి నమస్సులు. **సింహాసనం అధిష్టించిన మహారాజుకు నా ఆశీస్సులు. రాక్షసమంత్రికి అభినందనలు."** అని 'ఓం' అని ఉపక్రమించాడు. ప్రణవనాదంతో సభా మండపం దద్దరిల్లింది. అది శ్రీకృష్ణుడు కురుక్షేత్ర సంగ్రామం ముందు పూరించిన దేవదత్తను తలపించింది.

ధననందునికి చెమటలు పట్టసాగాయి. చాణక్యను చూడగానే ఆచార్య చణకుడు కళ్లలో మెదిలాడు. ఇది విప్లవ శంఖం కాదుగదా?

సభాముఖంగా చాణక్యను అవమానించాలన్న సంకల్పంతో రాక్షసమంత్రి నిలబడి ప్రశ్నించాడు.

"ఇది సందర్భం కాకపోయినా విషయం పాండిత్యానికి సంబంధించింది కాకపోయినా, మీ విద్వత్తును సభకు ప్రత్యక్షంగా పరిచయం చేద్దామని చెప్పండి ఆ ... చా ర్య. చా ... ణ ... క్యా ....

దేశప్రగతికి సమాజం బాధ్యత ఎంతవరకు?

రాజుకు, రాజ్యానికి, సమాజం ఏ మేరకు సహకరించాలి?"

"ఎవరి హద్దుల్లో వారు ప్రవర్తిస్తే చాలు అమాత్యా! మీ హద్దులు మీరు అతిక్రమించరనే భావిస్తాను. రాజుగారికి మంత్రి పరిపాలన విషయాల్లో సహకరించాలి తప్ప పడకగది పనుల్లో కాదు గదా?"

సభా సదులు ఘొల్లున నవ్వి, పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేశారు. రాక్షసమంత్రి ముఖం చిన్నబోయింది. ధననంద తలవాలిపోయింది.

"సభాసదులారా! మన్నించండి. మనకు వర్ణాశ్రమ ధర్మం ఒకటి ఉంది. అది మంచిదా, చెడ్డదా? అని విచికిత్స చేయడం లేదు. కాలానుగుణంగా ధర్మాలు మారుతుంటాయి. ధర్మం దారితప్పడానికి రాజులు, మంత్రివర్యులు కారణం. ప్రజలు కానేకాదు.

ఒక్కొక్క వర్ణంలో ఎన్ని వర్గులైనా ఉండవచ్చు. బ్రాహ్మణవర్గం ఉంది. అందరూ పుణ్య పురుషులా? కాదు. అందరూ నీతి మంతులా? కాదు. మంత్రుల్లోను మంచివారున్నారు. అవినీతి పరులున్నారు. అయినా బ్రాహ్మణులు

గొప్పవారని అందరూ అనుకుంటారు. బ్రాహ్మణ ఆచారం ఒకటిగా ఉంటుంది. వ్యసనపరులైన బ్రాహ్మణులూ మడికట్టుకుంటారు. సంధ్యావందనం చేస్తారు. అంతమాత్రాన పుణ్యపురుషులైపోరు. ఆచారాన్ని బట్టి ధర్మం ఉండదు. వేదం చదివి పౌరోహిత్యం చేసేవారంతా బ్రాహ్మణులు కాదు. మంచివాళ్లంతా బ్రాహ్మణులే. జ్ఞానం కలవారంతా బ్రాహ్మణులే. ధర్మ కర్మ నిష్ఠాపరు లందరూ బ్రాహ్మణులే."

సభలో కలకలం రేగింది. హర్షధ్వానాలు వెల్లువెత్తాయి.

"అలాగే క్షత్రియవర్గం. క్షత్రియులంతా కత్తులు కటారులు పట్టి యుద్ధాలు చేయనవసరం లేదు. క్షత్రియుడే రాజు కావాలని, పరిపాలించాలని లేదు. క్షాత్రం తెలిసిన వాడు క్షత్రియుడు. న్యాయం చెప్పేవాడు రాజు. పరిపాలనా దక్షత కలవారు క్షత్రియులు. తాగుబోతులు, అవినీతిపరులు రాజ్యపాలనకు అనర్హులు.

వైశ్యులంటే ఆర్థికశాస్త్రం తెలిసినవాడు. ధనం సంపాదించే వారంతా వైశ్యవర్గం క్రిందికి వస్తారు. వారే సమాజానికి, రాజ్యానికి వెన్నెముక. పోతే శూద్రవర్గం. సమాజంలో అతి ముఖ్యమైనది శూద్రకులు. అంటే కష్టం చేసి పనిచేసేవారు. కార్మికులు, కర్షకులు, నానా వృత్తులవారు. వారే సమాజానికి సర్వాంగాలు. శూద్రుల్ని తక్కువగా చూడడం బ్రాహ్మణుల అలవాటు. వారిని అస్పృశ్యులుగా చేసింది బ్రాహ్మణవర్గమే. తమ ఆధిక్యత కోసం ఇంతకాలం అలా చేస్తూ వచ్చారు. సమాజాన్ని బ్రతికించేది ఈ నాల్గవ వర్గమే. రాజాంతఃపురంలో పరిచారకులు, ఉపచారికలు అందరూ శూద్రులే. అంతఃపురంలోని భోగినీలంతా శూద్రులే గదా. ఒక్క బ్రాహ్మణ స్త్రీ భోగినిగా ఉందా చెప్పండి."

చాణక్యుని మాటలు ముళ్లలా గుచ్చుకున్నాయి రాక్షసమంత్రికి. ధననందుడు లేచి అంతఃపురం లోకి వెళ్లాలని ప్రయత్నించాడు. అంతలో రాక్షసుడు మరొకప్రశ్న సంధించడంతో ఆగిపోయాడు.

రాక్షసుడు : ఆచార్య చాణక్యా ... రాజుగా ఉండేవ్యక్తికి ఎలాంటి అర్హతలు ఉండవలె?

చాణక్య : అమాత్యా! రాజు ఆదర్శప్రాయుడై ఉండవలె. ధైర్యవంతుడు, ధర్మమూర్తి అయి ఉండవలె. కుశాగ్రబుద్ధి కావలె. తన బుర్రతో ఆలోచించ

గలవాడై ఉండాలి. మంత్రుల తలతో తాను ఆలోచించకూడదు. స్వయంగా నిర్ణయాలు తీసుకోగలగాలి. ప్రతిదానికి మంత్రుల ముఖాల్లోకి చూచే దౌర్భాగ్యుడు రాజు కాలేడు. శిక్షాస్మృతి తెలిసినవాడు, దూరదృష్టి కలవాడే మంచి రాజు కాగలడు. యుద్ధ సమయంలోను, ప్రశాంతి సమయంలోను రాజు ప్రజలను విస్మరించకూడదు. ఎప్పుడు యుద్ధం చేయాలి? ఎప్పుడు సంధి చేసుకోవాలన్నది రాజు ఇష్టం. స్వార్థం, అహంకారం, కోపం, మోహం లేనివాడే రాజు. ప్రజలకు ఆదర్శంగా తను జీవించాలి."

ధననందుని దుర్గుణాలన్నీ పరోక్షంగా ప్రస్తావించాడు చాణక్య. కావాలనే అలా చెప్పాడు. ధననందునికి కోపం వచ్చింది. రౌద్రం ప్రదర్శించి 'నోరు ముయ్' అని అరిచాడు.

"నీ నీతులు మాకు అవసరం లేదు."

సభ యావత్తు కలవరపడ్డది. ఎరక్కపోయి సభకు వచ్చామని భయపడి పోయారు. రాక్షసమంత్రికి నోటమాట రాలేదు. ఆసనం మీద బిగుసుకు పోయాడు. ఇంద్రియాలు పనిచేయలేదు. చాణక్య అలా ప్రసంగిస్తాడని ఊహించలేదు. తనను పొగుడుతాడని ఆశపడ్డాడు. ఏకు మేకై కూర్చుంది. తాడే పామై కరవడానికి సిద్ధమైంది. తన గ్రహస్థితి నిజంగానే బాగలేదు.

నందుడి గాండ్రింపులకు చాణక్య బెదరలేదు.

"అవును నందా! నా సలహా నీకు అనవసరం. ఎవరి సలహా నీకు అవసరం లేదు. పిల్లి అరిస్తే పులి బెదరదు. నందరాజా! అనవసరంగా ఆగ్రహం వచ్చిందంటే మీ తప్పులేవో మీకు తెలిసొచ్చాయన్నమాట. బుద్ధి ఉన్నవాళ్లకు నామాటలు నచ్చుతాయి. అందరికీ నచ్చవు."

పాపం కాత్యాయన భయంతో వణికిపోతున్నాడు ఇది ఎట్లా పోయి తన తలకు చుట్టుకుంటుందోనని. చాణక్య వెనక ముందు చూడకుండా విమర్శించాడు.

చాణక్యను ఎవరు తెమ్మన్నారని రాక్షసుడు తనపైన నిందవేస్తాడు తప్పదు. సింహం నోట్లో తలదూర్చినట్లయింది.

ధననందుడు కాస్త ఉపశమించి రాక్షస మంత్రివైపు చూచి –

"ఏమయ్యా! ఈ మూర్ఖుడు ఆచార్యుడా? తక్షిలలో చదివాడా? ఇదేనా చదువు? ఇతను చెప్పే పాఠాలు ఇవేనా? వీడు మన సభలో ఉండదగ్గవాడు కాదు. వెంటనే పంపేయండి."

హమ్మయ్య!

"అట్లాగే ప్రభూ! ఇతను మనవాడే. కాస్త కుర్రవాడు. ఉడుకురక్తం. అంతే కాని మంచివాడు. ఇక్కడి పద్ధతులు తెలియవు పాపం!"

"అట్లా చెప్పు. ఇతను చణకుని కొడుకా! అదా పొగరు. ఆ పొగరు వల్లనే గదా చణకుని ప్రాణం పోయింది. వీడినీ ఆతండ్రి దగ్గరకు పంపిస్తే సరి. వీడిని బంధించి, కారాగారానికి పంపండి. గిరిక ఒక్కరోజులో వీడి మదం తగ్గిస్తాడు. వాడి పిలకపట్టి ఈడ్చుకుపోండి."

ధననందుని భటులు అంతపనికి పూనుకున్నారు.

చాణక్యుడు పిలక ముడి విప్పి నిలబడ్డాడు సింహంలాగా.


"నీ పిలకచూచి ఇక్కడ ఎవరూ భయపడరు. ఇది తక్షశిల కాదు మగధ. నీవున్నది పాటలీపుత్రలో".

చాణక్య సింహగర్జన చేశాడు.

**"నిన్ను నాశనం చేసేవరకు, యావద్భారతాన్ని ఏకం చేసేవరకు ఈ పిలక ముడివేయను. ఇదే నా శపథం."**

*"పవిత్రులైన నా తల్లిదండ్రుల మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. నిన్ను పదవీభ్రష్టుని చేసేవరకు ఈ చాణక్యుడు నిద్రపోడు, గుర్తుంచుకో. ఈ 'శిక'ను ముడవడు. ఇది చాణక్యప్రతిజ్ఞ."*

ఆ ప్రతిజ్ఞ చేస్తుండగానే రాజభటులు అతన్ని బంధించి చెరసాలవైపు బిరబిర ఈడ్చుకు వెళ్లారు.



# 4. సేనాపతి

**ధననందుని కారాగారం ఒక యమకూపం : దుర్గంధ భూయిష్టం.** ధననందునికున్నంత అపకీర్తి ఆ కారాగారానికీ ఉంది. కొత్తగా కారాగారంలో ప్రవేశించేవారికి దుర్గంధం స్వాగతం చెబుతుంది. కారాగారానికి చీకటి దారి, దారిపొడవునా రక్తచారికలు, ప్రక్కగదుల్లోని హాహాకారాలు, పెడబొబ్బలు. ఏడుపులు, కేకలు, బయటప్రపంచంలో జీవించేవారికి అది యమపురి. అక్కడివారు యమకింకరులు. ఇక్కడి పరిస్థితి చూస్తే యమధర్మరాజు సైతం దడుసుకుంటాడు. యమభటులు ఇక్కడకు వచ్చి శిక్షణ పొందాలి. నూనె కాగడాల వెలుగులో ఎంతదూరం నడిపించారో అనూహ్యం. సన్నని ఇరుకుగోడలు, విచ్చు కత్తుల్లా చెక్కిన రాళ్ళు. ఇరువైపులా గోడను తాకితే రక్తం కారుతుంది.

చీకటిలో నడుస్తున్న చాణక్య కాలిపైన ఏదో పాకినట్లయింది. తేలో, పామో తెలియలేదు. రెండవ కాలితో దాన్ని తొక్కిపట్టి చంపాడు. అది విష పురుగు. నేరస్తుల్ని పాములతో, తేళ్లతో కరిపిస్తారన్నమాట. కొంతసేపటికి కళ్లు చీకటికి అలవాటుపడ్డాయి. ఎలుకలు, పందికొక్కులు ఎండిన మాంసం కోసం పోరాడుతున్నాయి.

ఎంతమంది బ్రాహ్మణుల కాళ్లు కడిగి తలమీద చల్లుకున్నా, ఈ పాపం శమించదు. తల తడుస్తుంది తప్ప రవంత పుణ్యం రాదు. ధననందుడికి ఈ కంపు పోదు. జన్మజన్మలకు వెంటాడుతుంది. నందుడి సత్కారాల వల్ల స్వర్గం అందనంత దూరం పారిపోతుంది. ఒక గదిలో చాణక్యను వదలిపోయారు రాజభటులు. ఇంకా ఉంటే ఆ దుర్వాసనకు వాళ్ల ప్రాణాలు పోయేవి.

గట్టినేలపైన కూర్చున్నాడు చాణక్య. ఒక్క గదికీ కిటికీలు లేవు. చీకటి గుయ్యారాలు. కళ్లు మూసుకుని ధ్యానం చేశాడు. తన ప్రతిజ్ఞకు ఫలితం ఇదా! నందుడు దిగడం కాదు, తన ప్రాణం నిలవడం ఎలా? దండాయన మహర్షి బోధించాడు ప్రాణాపాయ స్థితిలో ప్రాణాయామం, ధ్యానం చేయమని. ప్రాణాయామం వల్ల ప్రాణం నిలబడుతుందా? జాతకం మారుతుందా? గ్రహబలాల్ని మార్చేశక్తి ప్రాణాయామానికి ఉంటుందా?

ద్వారం వద్ద ఎవరో కదిలినట్లు అనిపించింది. యమభటులా? ధననంద భటులా? కొత్తయముడికంటే పాతయముడే మంచివాడనిపిస్తాడు. ఎవరివో ముగ్గురి నీడలు, చేతిలో కాగడా. అందులో ఒక మరుగుజ్జు వాడు, పొట్టివాడు, తనను రమ్మని సౌంజ్ఞ చేస్తున్నాడు. చప్పుడు చేయకుండా తనవెంట రమ్మని సైగ చేశాడు. చాణక్య బయల్దేరాడు. కారాగారం గోడల నడుమ బిరబిర నడిపించారు. చాణక్య నడుముకు ఒక తాడు బిగించారు. ఎంతదూరం నడిపించారో? ఎందుకో తెలియదు. అదీ శిక్షలో భాగమా! అలా అనిపించలేదు. వీరు కారాగారభటుల్లా లేరు. చేతుల్లో కత్తులు, సుత్తులు లేవు. వచ్చిన వాళ్లు మాయమైనారు. తనను పైకి లాగుతున్నారు ఎవరో నడుముకు కట్టిన తాడు గట్టిగా పట్టుకున్నారు. బావిలోంచి పైకి లాగినట్లు లాగారు. ఏదైనా ప్రాణాలకు తెగించాడు. చావుకు భయపడేది లేదు. బాధలకు తలవొగ్గేది లేదు. అది తెగువ, మొండితనం. పైకి లాగినప్పుడు శరీరం ప్రక్క గోడలకు తగిలి దోక్కుపోయింది. తలకు బొప్పికట్టింది. అసలే బోడి గుండు. ఆపైన రాళ్ల దెబ్బ. మంట ఎక్కువైంది. పైకి చేరేసరికి స్పృహ తప్పిపడిపోయాడు.

స్పృహ వచ్చేసరికి గంగానది తీరంలో ఉన్నాడు. చల్లని గాలి వీస్తోంది. ప్రాణానికి హాయి అనిపించింది. తనను కారాగారం బావి నుండి పైకి లాగింది

ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఒక మరుగుజ్జుల తండా. వారి నాయకుడు ముందుకు వచ్చాడు.

“భయపడకండి ఆచార్యా! ఇది కాత్యాయన గారి ఏర్పాటు. మిమ్మల్ని కారాగారం నుండి తప్పించమని చెప్పారు. ఈ సొరంగం చాలా ఇరుకు. మీ కోసమే దీనిని ఏర్పాటు చేశాం. కాస్త వెడల్పు చేయగలిగాం. లేకపోతే ఇందులో మనిషి దూరడం అసంభవం.”

చాణక్య చెప్పింది విని “మీకూ, కాత్యాయనకు నా కృతజ్ఞతలు. ఇంతకీ మీరు ఎవరు? నన్నెందుకు రక్షించారు? తెలుసుకోవచ్చా?”

“ఆచార్యా! మా మరుగుజ్జు మనుషులకు మగధలో చాలా వ్యాపకాలున్నాయి. మా ప్రధాన కర్తవ్యం కోశాగార రక్షణ. మేమే కోశాగారాన్ని రక్షించేది. రహస్య ప్రదేశాలలో ఉండే ధనాగారాలు మాకు మాత్రమే తెలుసు.. రహస్యదారుల్లో, అడవుల్లో, కొండల్లో వెళ్లాలి. దొంగలకు, బందిపోట్లకు వాటి ఆచూకీ తెలియదు. ఒక్క రాజుగారికి, మహామంత్రికి తప్ప ఎవరికీ తెలియదు. వాటికి మేమే రక్షణ. రాజభటుల్ని గానీ, సైనికుల్ని గానీ ఈ పనికి నియమించరు. మాలాంటి పొట్టి బుడంకాయలే అందుకు పనికొస్తారు.”

“అయితే మీరు రాజభటులన్నమాట. నాతో మీకేం పని? నన్నెందుకు ఇక్కడకు తెచ్చారు? ఇదీ శిక్షలో ఒక భాగం కాదుగదా!”

“లేదు ఆచార్యా! మహామంత్రి శక్తారుని నమ్మినబంటులం. మేము మా రహస్య సేనను తయారు చేసింది, మాకు జీతభత్యాలు రహస్యంగా అందేటట్లు ఏర్పాటు చేసింది శక్తారుడే. ఈ రహస్య ధనాగారాల సృష్టి కర్త ఆయనే. రాజుకూ పూర్తిగా తెలియదు వీటి సమాచారం. ఆయన ఇక్కడ పది సంవత్సరాలు బందీగా ఉన్నారు. చాలా శ్రమపడి ఇంతకు ముందే ఆయనను పంపివేశాం. కాత్యాయన, మౌర్యసేనాపతి మమ్మల్ని ఈ పనికి ఆయత్తం చేశారు.”

“సేనాపతి మౌర్యా?” ఆశ్చర్యంగా ప్రశ్నించాడు చాణక్య.

“అవును ఆచార్యా! ఒకప్పుడు మగధ సేనాపతి. ఆయన ధననందకు బద్ధవిరోధి అని మీకు తెలుసు. మహామంత్రి శక్తారుని బంధించిన తర్వాత మరీ శత్రువైనాడు.”

"సేనాపతిని నేను కలుసుకోవచ్చునా?"

"తప్పకుండా. వారి దగ్గరికే తీసుకుపోతాం."

"ఎక్కడున్నారు?"

"ప్రస్తుతం ఇక్కడ లేరు ఆచార్యా. వారు పిప్లికారణ్యంలో తలదాచు కుంటున్నారు. సేనాపతి అక్కడే ఉన్నారు. అమాత్యులవారూ అక్కడే ఉన్నారు. పిప్లికారణ్యాన్ని మించిన భద్రత మగధలో మరొకటి ఉండదు. సేనాపతి అక్కడే రహస్యంగా జీవిస్తున్నారు. పదండి మనం బయలుదేరదాం. ఇప్పటికే రాక్షసుడు, రాజు మీ కోసం చారుల్ని పంపి ఉంటారు. మీ కోసం ఒక జవనాశ్వం సిద్ధంగా ఉంది ఆచార్యా."

"కాత్యాయన ఎక్కడున్నారు? నేను ముందుగా వారిని కలిసి ధన్యవాదాలు చెప్పాలి. వారు చెప్పిన మాట వినక వారికి ఆగ్రహం తెప్పించాను. క్షమించమని అడగాలి."

"అవన్నీ తర్వాత ఆచార్యా! మీరు నగరంలో ప్రవేశించకూడదు. ప్రమాదం. వారికి మీ గురించి తెలుసు. దిగులు పడకండి. న్యాయం కోసం, ధర్మం కోసం ప్రాణాలిచ్చే మహానుభావుడు కాత్యాయన, ధననందుని రాజ్యభ్రష్టుని చేయాలన్నది ఆయన సంకల్పం."

"ధననందుడే కాదు. అతని తాబేదారులు, తొత్తులు నాశనం కావాలి. అది ఆయన ఆశయం. ధననందుని ఎదుర్కోగల సాహసం మీ ఒక్కరికే ఉందని మా విశ్వాసం."

చీకటి పడ్డ తర్వాత గుర్రాలు బయలుదేరాయి.

★ ★ ★

**తెల్లవారేలోగానే పిప్లికారణ్యం చేరారు.**

ఒక ప్రవాహం ఒడ్డున కొన్ని గుడిసెలు, పర్ణశాలలు, మిద్దెలు ఉన్నాయి. అది చిన్న పంచవటి. మరుగుజ్జు బృందం చాణక్యను ఒక పెద్ద ఇంటివద్దకు తీసుకువెళ్లారు. సేనాపతి అప్పటికే నిద్రలేచి ఎవరితోనో దీర్ఘంగా చర్చిస్తున్నాడు. చాణక్య కంటపడగానే సేనాపతి సంతోషించాడు.

"దయ చేయండి ఆచార్యా! మీరాక కోసమే ఎదురు చూస్తున్నాను." వినయంగా చాణక్య ముందు తలవంచాడు.

"ఆచార్యా! మీ వంటి వారు మగధకు అవసరం. మన మాతృభూమిని ఈ ఆపదల నుండి రక్షించవలసిన బాధ్యత మీది. దానికి మా సహకారం ఎప్పుడూ ఉంటుంది."

"సేనాపతీ! దానికింకా వ్యవధి ఉంది. ప్రయత్నం జరుగుతోంది కదా! ఎంతోమంత్రాంగం జరపవలసి ఉంది. చరిత్రను తిరగరాయడం అంత సులభం కాదుగా."

"మీ ఆజ్ఞ ఆచార్యా! నిరీక్షించక తప్పదు. సమయం రావాలి గదా! రాత్రి ప్రయాణంలో అలిసిపోయారు. పైగా మీ శరీరంనిండా గాయాలు. రండి చికిత్స చేద్దాం. స్నానంచేసి, తర్వాత మాట్లాడుకోవచ్చు."

'అనుకున్న దానికంటే ఎక్కువ ఆదరణ లభించింది' అనుకున్నాడు.

మౌర్యసేనాపతి వృశాలుడు. అంటే బహిష్కృత క్షత్రియుడన్నమాట. మౌర్యుని తండ్రి హైందవ మతాన్ని కాదని బౌద్ధమత స్వీకారం చేశాడు. దాంతో అతనిని హిందూమతం బహిష్కరించింది. సేనాపతి తిరిగి హిందూమతం స్వీకరించాడు. అయినా అతనిని మతభ్రష్టుడుగా చేసి వృశాలుడన్నారు.

స్నానం, సంధ్య, అనుష్ఠానం పూర్తిచేసి, ఇచ్చిన బట్టలు కట్టుకుని సిద్ధమైనాడు చాణక్య. పర్ణశాల వెలుపల ఒక మట్టి దిబ్బపై కూర్చుని జొన్న రొట్టెలు తిని, వేడిపాలు సేవించాడు. సూర్యుడు కాస్త పైకొస్తున్నాడు. తోటలో నెమళ్లు నృత్యం చేస్తున్నాయి. వాతావరణం ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉంది. 'ముర' అంటే నెమలి అని అర్థం. ముర కారణంగానే ఆ వంశానికి మౌర్య వంశం అని పేరొచ్చిందని ప్రతీతి. మౌర్యులు 'ముర' వారసులు.

ఆరుబయట పిల్లలు ఆడుకుంటున్నారు. ఒక పిల్లవాడి తలకు పట్టు పాగా చుట్టి నెమలి ఈకలు తలపాగాలో గుచ్చి కిరీటం అన్నారు. ఎత్తయిన రాయిపైన కూర్చోపెట్టారు రాజుగా. ఆ బాలరాజు ఎదురుగా మిగతా పిల్లలు కొలువుతీరి నిలబడ్డారు. చిత్రంగా ఉంది బాలక్రీడ.

ఒక కుర్రవాడు ముందుకు వచ్చి రాజు ఎదురుగా నిలబడి –

“సావధాన్ బహుపరాక్. చంద్రగుప్త మహారాజు గారు కొలువుతీరి ఉన్నారు. రండి ప్రజలారా! మీ బాధలు, సమస్యలు చెప్పుకోండి.”

మంత్రిపాత్ర ధరించిన మరొక కుర్రవాడు ప్రకటన చేశాడు.

పిల్లలు ఒకరి తర్వాత ఒకరు ఫిర్యాదులు చెప్పసాగారు.

“మారాజా. నేను చాలా కష్టాల్లో ఉన్నాను.”

చం.మ. : ఏమిటి నీ కష్టం?

పిల్లవాడు : మా పక్కింటి ఆసామి తన బావిని నాకమ్మాడు. అయినా నా బావిలో నీళ్లు అక్రమంగా వాడుకుంటున్నాడు రాజా! అతన్ని విచారించి నాకు న్యాయం చేయండి.

చం.మ. : ఎవడ్రా వీడికి బావిని అమ్మినవాడు?

మరొకడు : ఆ బుద్ధిమంతుణ్ని నేనే రాజా.

చం.మ. : అతడు చెప్పింది నిజమేనా?

అతను : సగమే నిజం మారాజా. సగం అబద్ధం. నేను అతనికి బావిని అమ్మిన మాట నిజం. కానీ నీళ్లను అమ్మలేదు రాజా.

చం.మ. : అవును కదూ! నీవు అమ్మింది బావి. అతను కొన్నది నీ బావిని. మరొకరి బావినీళ్లు అతను వాడుకోవడం తప్పేగదా. ఇదిగో అబ్బాయ్ నీ నీళ్లు పూర్తిగా తీసుకుని అతని బావి అతనికి ఇచ్చేయ్ మర్యాదగా. లేకపోతే ఆ బావిలో నిన్ను తోసేస్తాం.

ఆ నాటకం చూచి, ఆ తీర్పువిని చాణక్య ఏదో దీర్ఘంగా ఆలోచించాడు. లేచి వెళ్లి ఆ నాటకంలోని రాజు ముందు చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

చం.మ. : ఏం బ్రాహ్మణయ్యా! ఏమిటి నీ బాధ?

చాణక్య నవ్వుతూ తన సమస్య చెప్పుకున్నాడు.

చాణక్య : మహారాజా! నేనొక పేదవాడిని. బ్రాహ్మణుడ్ని. నా యజ్ఞ కార్యాలకు పాలు, నెయ్యి, సమిధలు కావాలి. ఒక ఆవును దానంగా ఇప్పించండి. మీ రుణం తీర్చుకుంటాను.

చం.మ. : ఆయనకు ఒక ఆవును ఇవ్వండి.

మరొక కుర్రవాడు ఒక రాయిని తెచ్చి చాణక్య చేతిలో పెట్టాడు. "ఇదిగో ఆవు తీసుకో."

చాణక్య : ఈ ఆవుకు ఖరీదు ఇచ్చుకోలేను మహారాజా!

చం.మ. : మీరిచ్చినా మేం పుచ్చుకోము. అది మా రాజధర్మం కాదు. నీవు యజ్ఞం చేస్తావుగా నీ పుణ్యం కాస్త మాకు పంచు. ప్రజలు సుభిక్షంగా ఉంటారు. ప్రజలు బాగుంటే పన్నులు కడతారు. అది చాలు మాకు.

ఆ కుర్రవాని ప్రతిభకు చాణక్య ఆశ్చర్యపోయాడు.

"ఎవరు బాబూ నువ్వు ఎవరి అబ్బాయివి" అడిగాడు.

"నా పేరు చంద్రగుప్త. మౌర్యసేనాపతి గారి అబ్బాయిని."

★ ★ ★

**మౌర్యసేనాపతి ఇంట్లోంచి బయటకు వచ్చి "మనం శక్తారుని కలుద్దామా ఆచార్యా" అని అడిగాడు.**

దివంగత పితృదేవుల ఆప్తమిత్రుని పరామర్శించడం తన ధర్మం.

చణకుడు తన ప్రాణంలో ప్రాణంగా ప్రేమించినవాడు శక్తారుడు. శక్తారుడు అతి బలహీనంగా కనిపించాడు. ముసలితనం. పైగా అనారోగ్యం. ఏండ్ల తరబడి అజ్ఞాత జీవితం, ఆర్థిక బాధలు, నిస్పృహాత మనిషిని క్రుంగదీస్తాయి. పట్టు పుట్టాలతో, మహామంత్రివర్యుల లాంఛనాలతో, రత్నాంగుళీకాలు, చెవులకు మకర కుండలాలతో నిండుగా ఉండాల్సిన జీవితం. మనిషి గుర్తు పట్టడానికి వీల్లేని రూపురేఖలు.

చాణక్య సాష్టాంగ నమస్కారం చేశాడు.

'శుభం భూయాత్' అని రెండు చేతులతో ఆశీర్వదించాడు శక్తారుడు ఆయన కళ్లలో నీరు. "విజయీభవ. ఇష్ట కామ్యార్థ సిద్ధిరస్తు."

"మా బిడ్డలలో మిగిలింది నీ వొక్కడివే విష్ణు. నా మగ బిడ్డలు గతించారు. ఆడబిడ్డ సువాసిని. నీవు అమితంగా ప్రేమంచిన పిల్ల. ఇప్పుడు చచ్చిన దానితో సమానం. మీ నాన్నగారు ఆ విషయం ప్రస్తావించకపోయినా,

నీ మనసు నాకు తెలుసు విష్ణూ. సువాసినిని తన కోడలు చేసుకోవాలను కునేవాడు. మన రెండు కుటుంబాలు వియ్యమందాలనే ఆయన అభిలాష.”

చాణక్య నోరు విప్పలేదు. వింటూ నిలబడ్డాడు.

“ఏమిటో విష్ణు! నా జాతకమే అలాంటిది. అన్నీ ఆటంకాలే. భార్య పోయింది. ఆప్తమిత్రుడు చణకుడు అలా అయినాడు. కొడుకులు గతించారు. కూతురు రాక్షసుడి చేతిలో నరకసుఖం అనుభవిస్తోంది. వాడు పరమ నీచుడు.” ఆవేదన వ్యక్తం చేశాడు శక్తారుడు.

చాణక్య ఆయన చేతులు తన చేతుల్లోకి తీసుకుని ఊరడించాడు.

“పీడకలలు కరిగిపోతాయి అమాత్యా. నేను మాట ఇస్తున్నాను. మీరు ఈ దైన్యం నుండి బయటపడతారు. చీకట్లు తొలగిపోతాయి అమాత్యా! మీరు నాకు ఒక సహాయం చేయాలి.”

“నా దగ్గర ఏముంది సహాయం చేయడానికి?”

“చంద్రగుప్తుడు!”

“నేను చేయదగిన సహాయం తప్పక చేస్తాను విష్ణూ.”

“ద్వారపాలకులు.”

చాణక్యకు కావలసింది చంద్రగుప్తుడు, ప్రస్తుతం ధనాగార పాలకులు.

★ ★ ★

దేశానికి బలం సైన్యం. అది శరీరంలో గర్భకోశం లాంటిది. దేశానికి గుండె కాయ ధనాగారం. ధనాగారం నిండుగా ఉంటే సైన్యం ఆరోగ్యంగా పుష్టిగా ఉంటుంది. మగధ రాజులకు ఈ రహస్యం తెలుసు కనుకనే రహస్య స్థావరాలలో సంపదల్ని నిక్షిప్తం చేశారు. బంగారం, వెండి, రత్నరాసులు నేలమాలిగల్లో మూలుగుతున్నాయి. అదే మగధ అహంకారం.

ధనాగారాలు అనేక రకాలు. నిత్యం వాడకానికి ఉపయోగించే ధనాగారం చేతికి అందుబాటులో ఉంటుంది. అది అంతఃపురానికి ఉత్తరదిశగా ఉంటుంది. నేలమాలిగలు లోతుగా, రహస్యంగా ఉంటాయి. అభేద్యమైన లోహపు గోడలుంటాయి.

మొదటి ధనాగారం రాజ మందిరానికి ఉత్తర దేవాలయానికి మధ్యగా ఉంది. రాత్రింబవళ్లు సైనికులు విచ్చుకత్తులతో పహారా కాస్తారు. విలుకాండ్రు విషపు బాణాలతో సిద్ధంగా ఉంటారు.

పెద్ద ధనాగారాలు ఎక్కడ ఉన్నదీ అందరికీ తెలియదు. రాజుకు, మహామంత్రికి మాత్రం వాటి ఆచూకీ తెలుస్తుంది. భూమి లోపల కందకాల ద్వారా ప్రయాణించాలి. ఆ అభ్యంతర మార్గాలు ఎక్కడో కొండల్లోకి దారి తీస్తాయి. కొండగుహల్లో, అక్కడ భూ గృహాల్లో ధనరాసులు నిక్షిప్తం చేస్తారు. రహస్యమార్గాల ద్వారా ఆ నిధులున్న చోటుకు చేరాలి.

శక్తారునికి ఆ నిధుల రహస్యాలు తెలుసునని చాణక్యకు తెలుసు. ధననందుని అన్ని నిధి నిక్షేపాలకు మార్గాలు ఎరిగున్నవాడు శక్తారుడొక్కడే. కాత్యాయన దగ్గరున్న మరుగుజ్జులకీ ఈ రహస్యాలు తెలుసు.

★ ★ ★

**పిప్లికారణ్యం ఉత్తరభాగం భయంకరంగా ఉంటుంది. కొండలు, కారడవి, ఎటునుండి వెళ్లినా ఏడు ప్రహారాలు దాటితేగాని నిక్షిప్త నిధిని చేరలేరు.**

పగలే చీకట్లు వ్యాపించిన కారడవి. తర్వాత ఎత్తయిన కలపచెట్లు, సాంద్రమైన వెదురుగడల పొదలు. ఇంకాస్త ముందుకుపోతే అభయారణ్యం. రాజులు వేటాడే అడవులు, ఆ తర్వాత మదపుటేనుగులు విచ్చలవిడిగా సంచరించే ప్రాంతం. కొన్నిమైళ్ల వరకు రాళ్లు, రప్పలు, పాములు, తేళ్లు నిండిన చిట్టడవి. ఆ ప్రదేశాల రహస్యాలు శక్తారునికి తెలుసు. నాలుగు మైళ్ల దూరంలో గుర్రాల్ని వదలి కాలి నడకన వెళ్లవలసి ఉంటుంది. ఆ తర్వాత గుర్రాలే గాదు, గాడిదలూ పనికిరావు. సన్నటి కాలిబాట లుంటాయి.

చాణక్య, సేనాపతి, కాత్యాయన, జీవసిద్ధి, మరుగుజ్జు దళం బయలు దేరారు. శక్తారుడు పటం రాసియిచ్చాడు మార్గం గుర్తులతో.

నిక్షేపాల అన్వేషణ ప్రాణాంతక వ్యవహారం. అడుగు తడబడినా అనర్థమే. ధననందుని సంపద గుట్టు తెలిసింది. శక్తారుని సూచనల ప్రకారం వెళ్లగా చివరకు పెద్దపెద్ద బండలు అడ్డం తగిలాయి. గమ్యం దగ్గరకు వచ్చాం అనుకున్నాడు చాణక్య. అంతలో చాణక్య ఎడమ చెవి ప్రక్కనుండి ఒక బాణం

రివ్వున దూసుకుపోయింది. ఎవరో పొదలమాటునుండి బాణం వేశారు. చాణక్య కత్తి దూసి చూడగా అది జీవసిద్ధి. తన మీదికి ఉరకబోతున్న ఒక పులి మీదికి బాణం విసిరాడు.

బండరాళ్ల మధ్య నుండి నాగ సర్పాలు బుస్సున బయటకొచ్చాయి. చాణక్య తనతో తెచ్చిన భస్మాన్ని ఆ ప్రాంతమంతా చల్లించాడు. క్షణాల్లో పాములన్నీ పారిపోయాయి. అక్కడ నేలమాలిగ సొరంగంపైన ఒక రాతి బండ కనిపించింది. ఆ బండను తొలగించగా లోపలకు మార్గం కనిపించింది. ఒక మరుగుజ్జు చేతిలో కాగడాతో లోపల దూరాడు. రెండు మాలిగలు దాటిన తర్వాత రత్నరాశులు, బంగారం కనిపించాయి.

చాణక్య, జీవసిద్ధి, సేనాపతి మొహాలు ఆనందంతో మెరిశాయి.

"అన్నీ మోసుకుపోలేం. విలువైన రత్నాలు, బంగారం మాత్రం తీసుకుపోదాం" అన్నాడు చాణక్య.

జీవసిద్ధి, మౌర్యసేనాపతి అడిగారు "ఆచార్యా! మీరు బ్రహ్మచారులు. బ్రహ్మచారులంటే సన్యాసులతో సమానం. మీకీ ధన ఆశ ఎందుకు? మీకీ వ్యామోహాలు అవసరమా?"

చాణక్య వివరించాడు : సేనాపతీ, ఇది ధనాకాంక్ష కాదు. ప్రతి మనిషి ధర్మం, అర్థం, కామ, మోక్షాలు పాటించాలి. అవి పురుషార్థాలు. ముందుగా 'ధర్మం' చెప్పారు. 'నేను' కామానికి, అర్థానికి తొలిప్రాధాన్యం యిస్తాను. అంతే తేడా. మనం జీవించడానికి మూలం 'కామ్యం'. ఉత్తకామం కాదు 'కామ్యం'. 'ఇష్టకామ్యం' అంటే విధినిర్వహణ అని. నా విధి నిర్వహణకు ఈ ధనరాశులు అవసరం. మీ అందరి సహాయ సహకారాలు అవసరం. అవన్నీ 'కామ్యార్థాలే' సేనాపతీ.

ఊహ తెలిసిన ప్రతివాడు ప్రేమలో పడతాడు. మనిషి బ్రతకడానికి మూలసూత్రం ప్రేమ. ప్రేమతోడిదే 'కామం' కూడా. తర్వాత ధనం. మూడవ స్థానం ధర్మానిది. నాల్గవది మోక్షం.

సంసార పక్షంగా జీవించే మీ వంటి వారికి భార్యాబిడ్డలపై 'ప్రేమ' సహజం. అవసరం. ప్రేమకు ధనం చేదోడుకావాలి. మనిషి బ్రతకడానికి

సంపద అవసరం. ప్రజలకు రక్షణ రాజకీయం కనుక నాకు ఆర్థిక, రాజకీయ శాస్త్రాలంటే ఇష్టం. ఏదీ వదులుకోలేను."

★ ★ ★

మోయగలిగినంత బంగారం, రత్నాలతో చాణక్యబృందం తిరిగి పిప్లికావనం చేరుకున్నారు. గుర్రాలు, మరుగుజ్జులు మోయగలిగినంత. సాయంత్రం చీకటిపడిన తర్వాత ఆరుబయట 'నెగళ్ళు' రగిలించి చుట్టూ కూర్చుని కబుర్లు ప్రారంభించారు. చాణక్య మొదట నోరు విప్పాడు.

"సేనాపతీ! నీ కర్తవ్యం నీవు చక్కగా నిర్వర్తించావు. నీ జన్మ ధన్యమైంది. మగధ పురావైభవానికి నీ వంతు కృషి చేస్తున్నావు. ధన్యుడివి. కానీ మగధను పాలించవలసిన వాడు చంద్రగుప్తుడు. అతనిలో చక్రవర్తి కాదగిన లక్షణా లున్నాయి. చంద్రగుప్తుని నాతో తక్షశిలకు తీసుకుపోతాను. రాజనీతి శాస్త్రంలో నిష్ణాతుడిని చేస్తాను. ఈలోగా నీవు ఈ సంపదతో సైనిక బలాన్ని సిద్ధం చేయి."

సేనాపతి ఉలిక్కిపడ్డాడు.

"ఆచార్యా!

చంద్రగుప్త నా ఏకైక సంతానం. నా వంశాంకురం. వాడిని వదిలి నేను ఉండలేను. మీరే ఇక్కడ మాతో ఉండవచ్చు కదా! ఆ నేర్పే రాజకీయ పాఠాలు ఇక్కడే నేర్పండి."

"రాజకీయం అంత సులభం కాదు సేనాపతీ! – మీకు తెలియదా! ఇప్పటికే గాంధారం సరిహద్దులపై అలెగ్జాండరు దండయాత్ర మొదలైంది. గాంధారం అలెగ్జాండరు చేతికి చిక్కితే మిగతా భారతదేశం అతని చేతిలోకి పోయినట్లే. తలుపులు బార్ల తెరిచి దొంగను రావద్దంటే ఎలా? మనం సేకరించిన ధనం నా కోసం, మీ కోసం కాదు. సైన్యం కోసం, దేశం కోసం. మన ముందర రెండు మహత్కార్యాలున్నాయి సేనాపతీ.

ఒకటి : అలెగ్జాండరును నిరోధించడం.

రెండవది : భారతదేశాన్ని ఏకం చేయడం.

సేనాపతి : అయితే, నేను, నా భార్య చంద్రగుప్తునితో తక్షశిలకు వస్తాం.

అక్కడ మీతో పాటు ఉంటాం ఆచార్యా.

చాణక్య : అది అంత మంచి నిర్ణయం కాదేమో సేనాపతీ. తల్లిదండ్రులు దగ్గర లేనపుడే బిడ్డలు స్వతంత్రంగా ఎదుగుతారు. ప్రతిభ రాణిస్తుంది.

ధననంద మీ మొదటి ప్రత్యర్థి. మరచిపోకండి. అతగాడు వేయి కళ్లతో మిమ్మల్ని వెంటాడుతుంటాడు. చదువుకునే చంద్రగుప్తుని ఎవరూ పట్టించుకోరు. వేయిమందిలో తను ఒక విద్యార్థి. పైగా అతను తక్షిల పౌరుడు కాదు. తన పుట్టు పుర్వోత్తరాలు ఎవరూ పట్టించుకోరు. రహస్యంగా ఉండడమే మంచిది కదా.

మీరు, శక్తారుడు, కాత్యాయన ఇక్కడ ఉండడం నాకు అవసరం. మీరు ధననందునికి పక్కలో బల్లెంగా ఉండండి చాలు. అడుగడుగునా అలజడులు, ఆరాచకాలు సృష్టిస్తుండండి. చంద్రగుప్తుడు వచ్చే నాటికి సిద్ధం చేయవలసిన పనులు చాలా ఉన్నాయి."

వీరి సంభాషణ లోపల నుండి 'మురి' విన్నది.

సేనాపతి భార్యను పిలిచి వివరంగా చెప్పాడు.

"ఆచార్యుల అభిప్రాయానికి నీవేమంటావు?

ఆమె క్షత్రియ వనిత. ఆమె కళ్లలో క్షాత్ర తేజం ఉంది.

"మనం గౌతమ బుద్ధుని చితాభస్మం పొందిన అదృష్టవంతులం. గౌతమ బుద్ధుడు దేశం కోసం, ధర్మం కోసం, జ్ఞానం కోసం. రాజ్యాన్ని భార్యని కుమారుడిని వదిలిన మహాత్యాగి. మనదీ క్షత్రియ ధర్మమే కదా, దేశరక్షణ, ప్రజాక్షేమం మన కర్తవ్యాలు. మన బిడ్డను దేశం కోసం త్యాగం చేయడంలో తప్పు లేదు. అది దేశానికి మనం ఇచ్చే బహుమతి."

**జ్ఞానహీనుడైన బ్రాహ్మణుడు, ధైర్యం లేని క్షత్రియుడు సమాజానికి అనర్థం.**

# సేనాపతి పూర్వగాథ

ఒకప్పుడు మగధను పాలించినవాడు శిశునాగుడు.

శిశునాగుని కుమారుడు మహానందుడు.

పిప్లికారణ్యం సేనాపతులలో మౌర్య ఒకరు. మౌర్య కూతురు ముర. మహానందుడు మురను ప్రేమించాడు. వారికి పుట్టినవాడు సేనాపతి. నిజానికి మహానందుని వారసుడు అతను. అయితే మహానందునికి ఇతర భార్యల వల్ల కలిగిన కొడుకులున్నారు. వారు నందులు. మహానందుని ఒక మిత్రుడు మహాపద్మ. అతని తండ్రి క్షత్రియుడు, తల్లి శూద్ర.


మహాపద్మ మంగలి చాలా జిత్తులమారి. అతగాడిని రాణి సునంద వలచింది. ఆమెతో కలిసి మహాపద్ముడు రాజును తొలగించాడు. అప్పుడు మిగిలిన ఏకైక సంతానం మౌర్య. అతను పసివాడవడం వల్ల ప్రాణాలతో వదిలిపెట్టారు.


మహాపద్మ మేధావి. మౌర్య ధైర్య సాహసాలు గుర్తించి అతనిని సేనాపతిని చేశాడు. మహాపద్మ మంచివాడు. అతని పాలనలో ప్రజలు సుఖించారు. అతడు ఇరుగుపొరుగు దేశాలను జయించి మగధలో కలిపాడు. యమునానది నుండి బ్రహ్మపుత్ర వరకు మగధ వ్యాపించింది. అయినా అతనిని శూద్ర క్షత్రియుడన్నారు. అతని ఆస్థానంలో వరరుచి, వ్యాధుడు, వర్ష వంటి మహాపండితులుండేవారు.

అతని కొడుకు ధననందుడు. అసూయ కొద్దీ సేనాపతిని దేశం నుండి బహిష్కరించాడు.

చాణక్య సేనాపతి ఆగ్రహ జ్వాలలను ఎగదోశాడు.

ఇద్దరు ఏకమై ధననందుని భరతం పట్టాలనుకున్నారు.





# 5. కుతంత్రం

తల మీద నల్లని ముసుగు, లోపల నీలిరంగు తలపాగా ధరించి. రాత్రివేళ రాజవీధిలో పోతున్న వ్యక్తి ఎవరైనా అయి ఉండవచ్చు. వేలాది మంది పౌరులు తిరుగాడే రాజవీధి.

తక్షశిల రాచబాటలో నడుస్తోన్న ఠీవి, అతను ధరించిన స్వర్ణ కంకణాలు, కొనదేలిన మీసాలు చూస్తే మాత్రం అతను సామాన్య పౌరుడు కాదనిపిస్తాడు. అప్పటికి రాత్రి రెండు ఝాములు గడిచింది. అతని నడక వేగం హెచ్చింది. అతను దర్పాన్ని ప్రదర్శించడం లేదు. ఏదో రహస్య కార్యం మీద వెడుతున్నట్లు ఉంది. అడుగుల సవ్వడి లేదు. వెళ్లేది చీకటి పని మీద, చీకటింటికి.

అది గణికవాడ. ఆ ఇల్లు జలక్రీడగా ప్రసిద్ధం.

జలక్రీడా ప్రాంగణం అద్భుతంగా ఉంటుంది. వెచ్చని నీటిలో క్రీడలకు నగర ప్రముఖులు పగటిపూట వేం చేస్తుంటారు. రాత్రిపూట అది శృంగార మందిరం. రసికులు మాత్రమే ఆ వీధిలో కాలు పెడతారు. ఆ ఇంటి ఆకర్షణ మేనక. బంగారు బొమ్మ. తక్షశిలలో పేరెన్నికగన్న గణిక. నెరజాణ. నర్తకి. విలాసవతి, కలభాషిణి.

ముసుగువీరుడు చీకట్లో జల క్రీడాభవనం వద్ద నిలిచి నెమ్మదిగా

తలుపు పైన మూడుసార్లు చిటిక వేశాడు. టిక్ – టిక్ – టిక్. అది కొండగుర్తు. వచ్చిన పనికి రహస్య సంకేతం. తలుపు వారగా తెరుచుకుంది. ఒక యువతి వయ్యారంగా తొంగిచూచి, అతని చేయిపట్టి బిరబిర గదిలోకి తీసుకుపోయింది. ఆ వచ్చినవాడు రసిక పుంగవుడు కాదని అర్థమైంది. అతను ఏదో గూఢకార్యం పైన వచ్చాడని. అతను నెమ్మదిగా అన్నాడు 'వార్త తెచ్చాను.'

"సరే చెప్పు ... వేరుగా అడగాలా?"

"ఇంకా రెండు రోజులు గడువుంది. ఓపిక పట్టక తప్పదు. గాంధార సైన్యం పశువుల కాపరుల వేషాలలో కైకయ సరిహద్దుల్ని ముట్టడిస్తారు. వాళ్ల ఆవుల్ని, ధాన్యాన్ని దోచుకుపోతారు."

"అందుకు నేను చేసేపనేముంది?" మేనక అడిగింది.

"ఉంది."

"ఏం చేయాలో తొందరగా చెప్పు."

"కేకయసేన గాంధారాన్ని ముట్టడించిన రోజున, నీవు సర్వసేనాపతిని ఇక్కడి నుండి కదలకుండా చేయాలి."

"నా వల్ల కాదు బాబూ! పెద్దవాళ్లు వస్తారు. సరదా తీరగానే పోతారు. తెల్లవార్లు ఇక్కడే ఉంచడం అయ్యేపని కాదు."

"తప్పదు మేనకా! ఆచార్యుల వారి ఆజ్ఞ. ఆరోజున అతను రాజుకు అందుబాటులో ఉండకూడదు. సైన్యాన్ని నియంత్రించకూడదు. ఏం చేస్తావో నీ ఇష్టం. నీవద్ద మాదక ద్రవ్యాలున్నాయని చెప్పారు ఆచార్య. అవునా?"

"అదో పన్నాగం. ఉన్నాయిలే కానీ ఈ మెరుపుదాడులూ, తంత్రాలు కుతంత్రాలు ఎందుకు స్వామీ. రాజులు, మంత్రులు సంప్రదింపులతో సమస్యలు పరిష్కరించుకోవచ్చు గదా. చీటికి మాటికీ ఈదాడు లెందుకు?"

"పనికొస్తావు మేనకా! నీకూ రాజకీయం వంట పట్టింది."

★ ★ ★

గాంధార ప్రభువు వృద్ధుడు. ఆయనకు యుద్ధాలు చేసే శక్తి లేదు. ఇరుగుపొరుగు రాజ్యాలతో సర్దుకుపోతున్నాడు. ఇటు పౌరస్‌తోనూ అటు కేకయతోనూ మైత్రికోరుతున్నాడు. కాని యువరాజు అంభికి తలబిరుసు. అతను భ్రష్ఠుపట్టిస్తున్నాడు. ఆ పరిస్థితుల్లో మెరుపుదాడి ఒక్కటే మార్గం.

"అంభి యువనేత. తక్షశిలలో చదువుకున్నాడు గదా, ఆచార్య చాణక్యకు తెలిసే ఉంటుంది. అతనితో ఆచార్యకు వైరం ఎందుకుంటుంది?" అడిగింది మేనక.

"చదువా! పాడా? అంభి ప్రవర్తన నచ్చక విద్యాలయాధికారుల పంపి వేశారుట. రాజమందిరంలోనే శిక్షణ యిప్పిస్తున్నారు. తనను పంపడానికి ఆచార్య చాణక్య కారణమని అంభికి అనుమానం. అదే అతని కోపం. అంభి తన తండ్రిని హతం చేయాలని యోచిస్తున్నాడు. అందుకు అలెగ్జాండరు సహాయం అర్థించాడనీ తెలుస్తోంది."

"ఉష్. పెద్దగా అరవకయ్యా గోడలు వింటాయి. ఇది విలాసమందిరం. ఎందరో వస్తుంటారు, పోతుంటారు. రహస్యం దాగదు. ఇది మా వరకు దేవాలయం అంతటి పవిత్రం."

"క్షమించండి మేనకగారూ! పురాణాలు నాకూ తెలుసు. మీరు అప్సరస మేనక అంత అందగత్తె అనీ తెలుసు. మేనక ఇంద్రుడు పంపగా వచ్చి విశ్వామిత్రుని తపోభంగం చేసిందట."

"తప్పు నాయనా! మేనకను తప్పు పట్టకు. ఆశ్రమ పరిసరాలలో మేనక జలక్రీడలాడుతుంటే, తపస్సు చేసుకునేవాడు కళ్లు విప్పి ఆమె సౌందర్యానికి పరవశించి వెంటపడ్డాడు విశ్వామిత్రుడు. ఆమె తప్పేం లేదు."

"అవునవును. నీ జలక్రీడలో సర్వసేనాపతిని ముంచి తెల్లవారే వరకు తేలనివ్వకు."

నవ్వి ముసుగువీరుడు బయటకు వెళ్లిపోయాడు.

★ ★ ★

**చాణక్య తన వెంట తెచ్చిన శిష్యుడిని తన ఆప్త శిష్యవర్గంలోని సింహరన్, మెహర్, సారంగరావులకు పరిచయం చేశాడు.**

"ఇతను చంద్రగుప్త. మౌర్య సేనాపతి కుమారుడు. మన విద్యాలయంలో చేరడానికి వచ్చాడు. తనకు రాజనీతి, అర్థికశాస్త్రం, భాష, గణితం ఇష్టం. సింహరన్ అతనికి నీవు అండగా ఉండాలి."

"అట్లాగే ఆచార్యా!"

సింహరన్ చంద్రగుప్త భుజం మీద చేయిచేసి ఆప్యాయంగా హత్తుకున్నాడు : "ఇక నుండి మనం మిత్రులం, నేను ఆచార్య వద్ద నేర్చుకున్న పాఠాలు అవే. నీకు నా సాయం ఎప్పుడూ ఉంటుంది చంద్రా.

మా నాయనగారు మల్లప్రియ పాలకుడు. మాకు మెసపొటేమియా ప్రమాదం ఉంది. నాకు నీ సహాయం కావాలి.

చంద్రగుప్తునికి ఇంటిపైన బెంగలేకుండా ఓ మంచి మిత్రుడు దొరికాడు.

సింహరన్ ఇతర మిత్రులను పరిచయం చేశాడు.

ఇతను మెహర్. పర్షియా దేశం వాడు. అంభి అని ఒకడు ఉండేవాడులే గాంధార రాకుమారుడు. మహాతలబిరుసు. అతనికి మెహర్‌కు పడేది కాదు.

ఇతను సారంగరావు. ఇతని ముందు రహస్యాలు చెప్పకూడదు. జాగ్రత్తగా ఉండాలి. ఏనుగుకున్నంత జ్ఞాపకశక్తి ఇతనిది.

★ ★ ★

మగధ నుండి గాంధర దేశానికి ప్రయాణం ఏ మాత్రం సులభం కాదు. అరణ్యాలు, కొండలు దాటుకుంటూ పోవాలి. కనీసం ఆరుమాసాలు పట్టింది. ఈసారి ప్రయాణంలో మంచి గుర్రాలు దొరికాయి, లేకపోతే సంవత్సరం పట్టేది.

"అంతధనం సేనాపతికి స్వాధీనం చేశాను కదా! అతను స్వార్థంతో నన్ను వ్యతిరేకిస్తే" అని ఆలోచించాడు చాణక్య.


"ఉహు అంతకు తెగించడులే! కొడుకు చంద్రగుప్త నా ఆధీనంలో ఉన్నాడు గదా" అని ఊరట చెందాడు.

తన కర్తవ్యం నానా దేశ రాజకుమారుల్ని తనకు అనుకూలంగా చేసుకోవటం. వీరంతా ఇప్పుడు తన విద్యార్థులు, రేపటి రాజులు.

వీరందరి సహాయంతో ఏమైనా చేయవచ్చు.



'చాణక్య చంద్రగుప్త' సినిమాలో చాణక్య పాత్రని పోషించిన శ్రీ అక్కినేని నాగేశ్వరరావు,
అలెగ్జాండరు పాత్రను శ్రీ శివాజిగణేశన్, చంద్రగుప్తునిగా శ్రీ ఎన్.టి.రామరావు నటించారు



# ౬. గాంధారం

**నాడు ఉత్తరాపథంలో అతి కీలకమైన దేశం గాంధారం.**

**రాజు ముసలివాడు. కొడుకు అంబి పొగరుమోతు, మూర్ఖుడు, ఆవేశపరుడు. బొత్తిగా సహనం లేనివాడు.**

"అంభి ఏనాటికైనా అలెగ్జాండరును ఆశ్రయిస్తాడని నా అనుమానం. అంభితో చేయి కలిపి అలెగ్జాండరు గాంధారంపై పట్టు సంపాదిస్తాడు. ఇప్పుడు మనం గాంధారం జోలికి పోకపోవడం మంచిది. దానివల్ల ముడి మరీ బిగుస్తుంది. గాంధారాన్ని అలెగ్జాండరు చేతికి అందించినట్లవుతుంది.

చాణక్య వివరంగా ఇంద్రదత్తుకు వివరించి చెప్పాడు. ఇంద్రదత్తు కేకయ రాజ్య ప్రధానమంత్రి.

సింధునది తీరంలో అది ఒక రహస్య ప్రదేశం. ఇసుక తిన్నెలపైన కూర్చుని దీర్ఘాలోచన చేస్తున్నారు చాణక్య, ఇంద్రదత్తు. దగ్గరగా గుర్రాలు నిలిచిఉన్నాయి. చాణక్య తన మంత్రితో మంతనాలాడుతున్నాడని అంభికి అనుమానం కలగకుండా అది ఏర్పాటు.

నిజమే! చాణక్య చెప్పే మాటల్లో నిజం ఉంది. ఇప్పుడు ఏం చేసినా తొందరపాటు చర్య అవుతుంది. శత్రువు సమీపించినపుడు కోటకు మరమ్మత్తులు చేస్తూ కూర్చుంటే ఎలా? ముందే జాగ్రత్తపడడం మంచిది

గదా. పౌరస్ పాతకాలం వాడు. నీతులు, నియమాలు అంటాడు. అంభికి తగిన గుణపాఠం చెప్పాలని ఇంద్రదత్తుకు తహతహగా ఉంది.

"విష్ణుగుప్తా! నీ మాట కాదనను. కాని అంభి సరిహద్దులలో కలహాలు రగిల్చిపెడుతున్నాడే ఎట్లా?"

ఇంద్రదత్తుకు చాణక్యవద్ద చనువు ఎక్కువ. పేరుతో పిలువగల ఆత్మీయత ఇద్దరి మధ్య.

"పశువుల కాపరుల వేషాల్లో సైనికుల్ని పంపిస్తున్నాడు. పంటల్ని, ఆలమందల్ని దోచుకుపోతున్నాడు. కేకయ రాజ్యం కుతకుతలాడుతోంది. పౌరస్‌ను అప్రయోజకుడ్ని చేశారు. గాంధారంపై చర్య తీసుకోకపోతే ప్రజలు అతడిని చీదరించుకుంటారు. పిరికిపంద అంటారు." తన బాధ వ్యక్తం చేశాడు ఇంద్రదత్త.

"నిజమే ఇంద్రా! కాని వెంటనే చర్య అవసరం లేదనుకుంటాను. నిదానించి చూద్దాం. ఏం జరుగుతుందో జరగనీ. పౌరస్ గాంధారంపై ప్రతికూలత స్పష్టంగా చెప్పనిద్దాం. తక్షశిలతో సంబంధాలు వదులుకోలేడు. ఏదో హడావిడి చేస్తాడూ చేయనివ్వు" అన్నాడు చాణక్య. తటాకంపైన ఒక రాయివిసిరి.

"నిశ్చలంగా ఉన్న నీటిలో రాయివేస్తే అలలు ఏర్పడతాయి తప్ప అల్లకల్లోలం జరగదు. రాయి నీటిలో మునిగిపోతుంది. అలలు క్రమంగా సమసిపోతాయి."

ఇంద్రదత్తు నిరాశతో నిట్టూర్చాడు. చాణక్య ఏదో ఎత్తులు వేస్తాడని తెలుసు. అంభిని వాళ్ల చేతుల్లో పెట్టడం కన్న, యవనులకు గాంధారం దూరంగా ఉంచడం మేలు. లేకపోతే అలెగ్జాండరు సేన అక్కడ తిష్టవేసి కేకయరాజ్యాన్ని స్వాధీనం చేసుకోగలదు.

"నేను పౌరస్‌తో మాట్లాడతాను విష్ణూ, మారాజు గారి మనసు నాకు బాగా తెలుసు గదా!"

★ ★ ★

అలెగ్జాండరు తనది దేవుని పాలన అనేవాడు.

ప్రజలు అతన్ని దేవుడు అని నమ్మేవారు.

నిజానికి అలెగ్జాండరు దేవుడు కాదు. అతనిలో అసలు మంచి గుణాలు తక్కువ. చెడుగుణాలు ఎక్కువ. అతని ఆకారం విచిత్రం. భుజాలపైకి వాలిన గిరిజాల జుత్తు – కొటేరు ముక్కు. ముక్కుమీద కోపం. వెడల్పాటి నుదురు. పొడుచుకు వచ్చిన గడ్డం. పైగా పొట్టివాడు. పెద్ద సింహాసనానికి ఎప్పుడు చిన్నగా ఉండే శరీరం.

ఈ కొత్త దేవుడు సిరియా, ఈజిప్టు, మెసపొటేమియా, పర్షియా బాక్ట్రియాలపై దండెత్తి జయించాడంటే నమ్మడం కష్టం. కల్లోలం సృష్టించి తాను దేవుడనిపించుకున్నాడు. ప్రజారక్షకుడని బిరుదం సంపాదించుకున్నాడు.

అసలు అలెగ్జాండరు పుట్టుకలోనే ఒక విశేషం ఉంది. అతని తల్లి ఒలింపస్. తండ్రి ఫిలిప్ – మెసడోనియా చక్రవర్తి. ఒకసారి ఆమెకు కల వచ్చింది. కలలో ఆమె గర్భంలో ఒక పిడుగుపడ్డది. ఒలింపస్, ఫిలిప్ సంధానం వల్ల అలెగ్జాండర్ జన్మించాడు. అతను పుట్టినప్పటినుండి చిచ్చర పిడుగులా ప్రవర్తించాడు.

అన్నను చంపించాడు. మరో ఇద్దరు మెసపొటేమియా రాకుమారుల్ని హత్య చేయించాడు. సవతి తల్లిని, ఆమె కూతురుని లోకంలో లేకుండా చేశాడు. నలభై రెండు వేల మంది సైనికుల్ని కూడదీసుకున్నాడు. పర్షియాపై దండెత్తాడు. పర్షియా రాకుమార్తెను పెళ్ళాడి 'షాహెన్‌షా' అనిపించుకున్నాడు. ఉజ్బెక్ రాకుమారి దుక్సానాను పెళ్లాడిన తర్వాత భారత్‌పై దండెత్తి 'అంభిని' లోబరచు  కోవాలనుకున్నాడు.

★ ★ ★

**వేలాది మంది సైనికుల పద ఘట్టనలకు నేల దద్దరిల్లింది.**

నేల ఈనినట్లు సేనావాహిని – నలుదిశల – అలెగ్జాండరు సైన్యం. కేకయ చతురంగబలం తక్కువది కాదు. కేకయబలాన్ని చూచి, అలెగ్జాండరు సైన్యం దడుసుకుంది, వారికున్నది అశ్వికదళం ఒక్కటే. కేకయ సైన్యంలో పదాతి దళాలున్నాయి. రథాలున్నాయి. ఏనుగులున్నాయి. గుఱ్ఱాలున్నాయి. గజ, తురగ, రథ, కాల్బలాలున్నాయి. కేకయ పదాతి దళాన్ని మాత్రమే సిద్ధం చేశాడు. గాంధారాన్ని జయించడం పెద్దకష్టం కాదనుకున్నాడు.

**అక్కడ జలక్రీడా ప్రాంగణంలో మేనక కౌగిలిలో సర్వసేనాపతి బందీ అయ్యాడు. జలక్రీడలలో మేనక అతన్ని మైమరపించింది.** శయనమందిరంలో సుగంధ ద్రవ్యాలతో కైపెక్కించింది. నానావిధ శృంగార విన్యాసాలతో అతనికి ఊపిరి సలపనివ్వలేదు. చివరకు స్పృహతప్పి పడిపోయాడు. తెల్లవారే వరకు లేవకుండా, గదినిండా మత్తు ద్రవ్యాల ధూపం వేసింది. బయటకు రాకుండా గదిబయట గొళ్లెంబిగించి తాళం వేసింది నెరజాణ.

తక్షశిల కోటగుమ్మం వద్ద ప్రమాదఘంటలు మోగాయి. రహదారులు మూసి వేయడానికి వ్యవధి చాలలేదు. కేకయ అశ్వికదళం ప్రవాహంగా తక్షలలో ప్రవేశించారు. రక్షకభటులు అడ్డగించినా ప్రయోజనం కలగలేదు. గాంధార రాజు అంతఃపురం వద్ద రాకపోకలను నిర్బంధించారు. అంతఃపురం పై దాడిచేసి, స్త్రీ జనాన్ని బంధించారు.

★ ★ ★

**సర్వసేనాపతి అక్కడ జలక్రీడ భవనంలో సొమ్మసిల్లి పడిఉన్నాడు. అతనికి ఈ దాడి గురించి తెలియదు. ఒక్కరాత్రిలో తక్షిల కేకయ హస్తగత మైంది.**

అంతఃపురంలోని ముసలి రాజుకు చారుడు ఒక వార్త అందించాడు. పౌరస్ ప్రధానామాత్యుడు ఇంద్రదత్త దర్శనానికి వచ్చాడని వార్త.

ఇప్పుడు అనుమతి ఏమిటి? ఎప్పుడో తను బందీ అయినాడు కదా. కోట శత్రువశ మైంది.

“ఆయనను రాజమందిరానికి రమ్మనండి. మేం వస్తున్నాం.” అన్నాడు ఇద్దరు భటులు చేయూతనిస్తే గాని లేవలేని ముసలితనం.

“అంభీ! కేకయజోలికి పోవద్దని ఎన్నిసార్లు హెచ్చరించాను. విన్నావు కావు. దౌర్భాగ్యుడా! ఇప్పుడు నీ వల్ల నా పరువుపోయింది గదరా” ఆక్రోశించాడు.

చేసుకున్నవాడికి చేసుకున్నంత. గతజలసేతు బంధనం అంటే ఇదేనేమో.

★ ★ ★

**వృద్ధుడైన గాంధార రాజుకు ఇంద్రదత్తు సవినయంగా నమస్కరించాడు.**

"చక్రవర్తీ, గాంధారప్రభూ! తక్షశిలాధీశా, మహాయోధా ... "

రాజు మధ్యలోనే ఆపాడు : "ఇంక చాలు ఆపండి ఆ పొగడ్తలు. ఇంద్రదత్తా! వాస్తవానికి మీరు విజేతలు. నేను పరాజితుడ్ని. దయచేసి ఆ ఆసనం అలంకరించండి."

రాజు చూపించిన ఆసనంపై ఇంద్రదత్త కూర్చోలేదు. వినయంగా ఆయన పాదాలవద్ద నేల మీద కూర్చున్నాడు.

గాంధారరాజు సంభ్రమంగా ప్రశ్నించాడు :

"ఎందుకు బాబూ నాకింత మర్యాద? నేను మీ బందీని కదా."

"రాజా! కేకయ ఎప్పుడు మీకు రుణపడి ఉంటుంది. సర్వదా మిమ్మల్ని గౌరవిస్తుంది. మా ప్రభువు పౌరస్ ఎప్పుడు మీ గురించి గొప్పగా చెబుతుంటారు. మీ సమర్థత వారికి తెలుసు. మీ న్యాయపాలన మచ్చలేనిది. ఇప్పుడు మా దండయాత్ర అనివార్యమైంది. మీ పైన గౌరవం లేక కాదు. మీ సుపుత్రుడు అంభి రెచ్చగొడితే దాడి తప్పలేదు. అతను సరిహద్దుల్లో కల్లోలం సృష్టిస్తున్నాడు. అతని ఆగడాలు తగ్గడం లేదు ప్రభూ."

సున్నితంగా చెప్పదలచింది చెప్పాడు ఇంద్రదత్తు.

"ఇంద్రదత్తా! మాకు తెలుసు. అంభిని కట్టడి చేయడానికి శాయశక్తులా ప్రయత్నించాను. వాడు నామాట లెక్కచేయడం లేదు. వాడిని క్షమించమని పౌరస్‌కు నా మాటగా చెప్పు. నా కోసం వాడిని క్షమించలేరా?"

గాంధార రాజు వేడుకున్నాడా అనేది సంశయం. అతనిలో పుత్రప్రేమ తప్ప మరేంలేదు.

ఇంద్రదత్తు మాట్లాడడానికి కాస్త తటపటాయించాడు.

"రాజా! నన్ను మన్నించండి. నేను అనవరతం మీ విధేయుడిని. పౌరస్ ప్రభువు చెప్పమన్న విషయం చెప్పడం నా విధి. మీ అంభి అలెగ్జాండరుతో ఏవో రహస్య మంతనాలు జరిపి, ఏవో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. యవనసేనలు గాంధారం దాటి భారత భూభాగంలో ప్రవేశిస్తే మన రాజ్యాలన్నింటికీ ముప్పు."

"అది జరగని పని ఇంద్రదత్తా. రాజముద్రిక లేకుండా సంప్రదింపులు, ఒప్పందాలు ఎట్లా సాధ్యం? తనకా అధికారం లేదు."

"పిచ్చిమారాజా! మీ సుపుత్రుడు చేసేపనులు నమ్మేటట్లు చెప్పడం ఎలా?" అని, మరొకమాటకు అవకాశం ఇవ్వకుండా –

"అభయా లోపలికిరా" అని కేకవేశాడు.

మేనకతో అర్ధరాత్రి మంత్రాంగం జరిపిన ముసుగువీరుడు అభయ. వెంటనే లోపలకు ప్రవేశించి, ఇద్దరికీ నమస్కారం చేసి ఇంద్రదత్తు ఆజ్ఞకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు.

ఇంద్రదత్తు : అభయా! నీగూఢచారులు అంభిని అనుసరిస్తున్నారు కదూ!

అభయ : అవును స్వామీ!

ఇంద్రదత్తు : అంటే రాత్రింబవళ్లు వారిదృష్టి దాటిపోవడం లేదు కదూ.

అభయ : అవును. పోవడం లేదు.

ఇంద్రదత్తు : గత పక్షంరోజులు అంభి తక్షశిలలోనే ఉన్నాడా?

అభయ : లేదు మహాశయా. వేట నిమిత్తం విదియనాడు కాంభోజ వెళ్లాడు.

ఇంద్రదత్తు : కాంభోజలో ఉన్నాడా, వెంటనే తిరిగి వచ్చాడా?

అభయ : లేదు మహాశయా. కాంభోజలో మూడురోజులున్నాడు.

ఇంద్రదత్తు : ఆ మూడు దినాలలో ఎవరైనా కలవటానికి వచ్చారా?

అభయ : అలెగ్జాండరు సేనాపతి సెల్యూకస్ వచ్చాడు స్వామీ.

ఇంద్రదత్తు : వాళ్లు మాట్లాడుకున్నది విన్నావా?

అభయ : సెల్యూకస్ ఆంతరంగికుడు గుడారం బయటకు వచ్చి, లక్క, రాజముద్రిక తీసుకువెళ్లాడు.

ఇంద్రదత్తు : అంటే ఏదో రాచకార్యం నిర్వహించాడన్న మాట.

ముసలిరాజు కోపంతో వణికిపోయాడు.

'నీవు వెళ్లవచ్చు అభయా!' ఇంద్రదత్తు అభయను పంపి వేశాడు.

రాజు : ఎంత పిచ్చిపని చేశాడు ఇంద్రా. ఇప్పుడేం చేయాలి?

ఇంద్రదత్తు మాట్లాడలేదు. అది చాణక్య పథకం. ఈ దండయాత్ర వల్ల పౌరస్ సాధించింది లేదు. అంభిని కావాలని అలెగ్జాండరు చేతుల్లో పెట్టడం జరిగింది.

★ ★ ★

**నీడలో కదులుతున్న మనిషి, నల్లటి పైజమా, నల్లటి జుబ్బా ధరించాడు.**

నల్లని తలపాగా. కళ్లు మాత్రం మెరుస్తున్నాయి చీకటిలో. నడుముకు జనపనార తాడు బిగించి కట్టుకున్నాడు. మొలలో పిడికత్తి, రెండవ వైపు చాకు లాంటి వెదురు ముక్క. కాళ్లకు చెప్పులు లేవు కనుక నిశ్శబ్దం. గోడవారగా నెమ్మదిగా నడిచి ఒక కిటికీ క్రింద ఆగాడు. మొలకున్న తాడు తీసి రాతి స్తంభానికి బిగించాడు. కిటికీలోంచి అవతలకుదూకి విశాలమైన ప్రాసాదం దాటుకుంటూ ఒక పడకగదికి చేరాడు.

గుమ్మం వద్ద ఇద్దరు నిశాచరులు శూలాలతో కాపలా ఉన్నారు. పహరావాళ్ల కళ్లు కప్పి లోపల ప్రవేశించాడు. వెదురుబొంగు ముక్కతీసి పహారా వాళ్లకు వాసన చూపించాడు. వాళ్లు స్పృహ తప్పిపడిపోయారు. గది తలుపులు తెరిచాడు. లోపల చీకటి. దూరంగా ఒక చిన్నదీపం వెలుగుతోంది.

పట్టు పరుపుపైన నిద్రపోతున్న వ్యక్తిని చురకత్తితో ఒక్కవేటు వేశాడు. తండ్రి పరలోకాలకు వెళ్లాడు. అంభి తప్పించుకు పారిపోయాడు.

★ ★ ★

**"అంభి తండ్రిని హత్య చేస్తాడని నేను ఊహించిందే" అన్నాడు చాణక్య ఇంద్రదత్తుతో.**

బయట చంద్రగుప్త, సింహరన్ లంగోటీలు బిగించి మల్లయుద్ధ సాధన చేస్తున్నారు. ఇద్దరూ బురదలో దొర్లుతున్నారు. చెమటలు కక్కుతున్నారు. వాళ్ల శరీరాలు పట్టించిన నూనెకు ధగధగ లాడుతున్నాయి. హనుమాన్ పట్టు, జాంబవంతుని పట్టు, జరాసంధ పట్టు, భీమసేన పట్టు అని కుస్తీలో నాలుగు రకాల పట్లున్నాయి. వాటిలో వారిద్దరూ సమాన ప్రతిభావంతులు.

ఇంద్రదత్తు చాణక్యవైపు ఆశ్చర్యంగా చూచాడు. "ఏది జరిగినా తమరు ముందుగానే చెప్పానంటారు. అవి మీరు చేయిస్తున్నవా? లేక మీ పథకంలో భాగాలా?"

"ఏం చేయను? మరొక మార్గం కనిపించలేదు ఇంద్రా. పౌరన్ మనకు అవకాశం ఇవ్వలేదు. గాంధారం సరిహద్దులలో కేకయసైన్యం ఉపసంహ రించక తప్పలేదు. గాంధార రాజు మాట ఇచ్చాడు తన కొడుకును అదుపు చేస్తానని. ఏం చేశాడు? అంభి తండ్రిని చంపుకున్నాడు."

"ఈ అరాచకానికి కారణం మనమే గదా ఆచార్యా. ఇప్పుడు చూడండి! అంభి వెళ్లి అలెగ్జాండరు ముసుగులో చేరతాడు. అంభి దృష్టిలో అలెగ్జాండరు దేవుడు. అతనిది దేముని పాలన."

అక్కడ చంద్రగుప్త సింహరన్‌ని పీటీ చేశాడు. అతని గుండె మీద కూర్చుని ఠీవిగా చూస్తున్నాడు. అతనికి మహావీరుని లక్షణాలు ఏర్పడ్డాయి.

చాణక్య ఇంద్రగుప్తుని ఊరడించాడు! "దిగులు చెందకు ఇంద్రా! నేను నీ స్థానంలో ఉండి ఉంటే ఏమీ చేసేవాడిని కాను."

ఇద్దరూ నవ్వుకున్నారు. ఒకరి నవ్వులో ఒకరికి రెండేసి అర్థాలు కనిపించాయి.

"నీవు మాకు అర్థం కావు విష్ణూ. యవనులవల్ల దేశానికి ఏదో మహోపద్రవం అని ఉపన్యాసాలిస్తావు. ఏమీ చేయవు. ప్రమాదం వచ్చి గుమ్మంలో నిలిచి తలుపు తట్టే వరకు నిద్రపోతావా? నీ చాణక్యం మాకు అర్థం కాదు" నిష్ఠూరంగా అన్నాడు ఇంద్రదత్తు.

చాణక్య మెహర్‌ని పిలిచాడు. "మెహర్ ఇట్లారా! ఇంద్రదత్తుకు మన పథకం గురించి కాస్త చెప్పు. అతనికి మనపైన నమ్మకం పోతోంది. కేకయ మంత్రికి ఏమీ చేయవద్దని ఎందుకు చెప్పానో కాస్త వివరించు."

మెహర్ వివరణ యిచ్చాడు.

"గురుదేవుల ఆజ్ఞమేరకు పర్షియా నుండి వచ్చే వర్తకుల నుంచి పెర్సిపోలిస్ సమాచారం ఎప్పటికప్పుడు అందుతోంది. ఆ నగరాన్ని యవనులు ఆక్రమించగానే నేను వచ్చేశాను. ఆ తర్వాత కొన్ని నెలలకే అలెగ్జాండరు పెద్ద విందు యిచ్చాడు. అప్పుడు అగ్నిప్రమాదం జరిగింది. రాజభవనం తగలబడింది. విలువైన పుస్తకాలు, వస్తువులు కాలి బూడిదయ్యాయి. పర్షియా నుండి అలెగ్జాండరుకు అందే సహాయం ఆగిపోయింది. ఇప్పుడు అలెగ్జాండరు వద్ద డబ్బులేదు. నిస్సహాయుడు."

"అంటే అలెగ్జాండరు ఊపు తగ్గినట్లే. అతను డబ్బు లిచ్చి సైనికులతో యుద్ధం చేయిస్తాడు. వాళ్లలో ఎవరికీ దేశభక్తి లేదు. మరే ఇతర ప్రయోజనం లేదు. డబ్బు తీసుకుని యుద్ధం చేస్తారు అంతే. అంటే అలెగ్జాండరు కేకయపై దండెత్తడం ప్రస్తుతం జరగని పని."

"రాజుగారికి ఏం చెప్పమంటారు ఆచార్యా?" అడిగాడు ఇంద్రదత్తు.

"నిశ్చింతగా నిద్రపొమ్మను" చాణక్య సలహా.

★ ★ ★

"వాస్తవంగా పెర్సిపోలిస్ అగ్నికి ఆహుతి అయినా అలెగ్జాండరు కత్తికి పదును తగ్గలేదు. కేకయ మంత్రికి నాచేత అబద్ధాలు చెప్పించారు ఎందుకు ఆచార్యా?" అడిగాడు మెహర్ ఇంద్రదత్త వెళ్లిపోయిన తర్వాత. అతనికి చాణక్య పథకాలు అర్థం కావడం లేదు.

"మెహర్! కాస్త మెదడు ఉపయోగించాలయ్యా! సరేగాని నేనడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పు?"

"భారత్‌లో బలమైన రాజ్యం ఏదని నీ అభిప్రాయం?"

"నిస్సందేహంగా మగధ."

"మగధను పాలిస్తున్నది?"

"ధననంద."

"మగధను ధననంద చేతినుండి తప్పించాలంటే తర్వాతి బలమైన రాజ్య సహాయం మనకు అవసరం కదా! ఆ రాజ్యం ఏది?"

"ఇంకేది? కేకయ రాజ్యం."

"కేకయ ప్రభువు?"

"పౌరస్".

"ఏ ప్రయోజనం లేకపోతే పౌరస్ మనకెందుకు వత్తాసు పలుకుతాడు? ఏ పరిస్థితుల్లో అతను మనమీద ఆధారపడతాడు?"

"తనపైకి ఎవరైనా దండెత్తి వస్తే."

"అతని ప్రబల శత్రువు ఎవరు?"

"అంభి, గాంధార రాజు."

"అంభి ఒంటిగా పౌరస్‌పై దండెత్తగలడా?"

"అసంభవం. కేకయ 'అంభి'ని మింగేయగలడు."

"అలెగ్జాండర్ ఉన్నాడు అతని ప్రక్కన."

"నిజం."

"నిజంగానే నిజం అది."

"ఆచార్యా! మీరు ఒకసారి చెప్పారు. మెసడోనియా విషయంలో. ఆ విషయం మరొకరికి అంటకుండా జాగ్రత్తపడాలి."

"చూడు మెహర్! వైద్యచికిత్సలో 'విషం' తగు మోతాదులో వాడతారు. దానివల్ల రోగం తగ్గుతుంది. విషం వల్ల రోగనిర్మూలన అవుతుంది. విషం ఎక్కువగా వాడితే ప్రాణహాని. మెసడోనియాని అలా వాడుకోవాలి."

"అలెగ్జాండరు, అంభి కలిసి పౌరస్‌పై దండెత్తి వస్తే అలెగ్జాండరు భారత చక్రవర్తి అయ్యే ప్రమాదం ఉంది గదా."

"మెహర్, మరొకమారు జాగ్రత్తగా ఆలోచించు. భారత్‌ను జయించాలంటే అలెగ్జాండరు ఏయే దేశాలు జయించాలంటావు?"

"పర్షియా, సిరియా, ఈజిప్టు, అస్సీరియా, బాబిలోనియా?"

"అవునా! ఎంతమంది అలెగ్జాండర్లున్నారు."

"ఒక్కడు."

"ఒక్క అలెగ్జాండరు పది రాజ్యాలను జయించడం మాటలు కాదు. ఒక్కొక్కటి ఓడిస్తూ రావాలి. ఒకేసారి పదిచోట్ల ఉండడు."

"సింహాల్లాంటి సేనానులున్నారు అతనివద్ద. గెలిచిన చోట్ల తన ప్రతినిధుల్ని ఉంచుతారు."

"సరే బయలుదేరినప్పుడు అలెగ్జాండరు బలగం ఏపాటి?"

"మెసడోనియాలో బయలుదేరినప్పుడు అతని సైన్యం నలభై రెండు వేలు. ఇప్పుడు అతని బలం ఎంత ఉంటుంది?"

"బహుశా అంతే ఉంటుంది."

"అసంభవం. కొంత కొంతసేన పర్షియా, సిరియా, ఈజిప్టు, అస్సీరియా, బాబిలోనియా, బాక్ట్రీరియాల్లో ఖర్చయి ఉంటుంది. ఇప్పటికి మిగిలిన సైన్యం

చాలా తక్కువ. అంటే కొత్త దండయాత్రకు పెద్దగా సైన్యాన్ని తీసుకుపోయే అవకాశం లేదు.”

“స్థానిక సహాయం కోరవచ్చు గదా ఆచార్యా.”

“మనం వెనక ఉందాం. అలెగ్జాండరు, అంభి సేనల్ని పౌరస్‌ను ఓడించనిద్దాం.”

“ఆచార్యా! దేశంకోసం నా ప్రాణాలు ఇవ్వడానికి నేను సిద్ధం.”

“దేశం కోసం ప్రాణాలర్పించడం త్యాగం కాదు. తెలివిగల వారు బలిచేస్తారు. జ్ఞాపకం ఉంచుకో. అన్ని పథకాలు రచించి పారిపోయిన వాడు ఓడినట్లు కాదు. సైన్యాన్ని సమీకరించుకుని మళ్లీ వచ్చి తీరతాడు. అది రాజనీతి. రాజకీయాల్లో ఓటమి ఉండదు – పరాజయం తప్ప.”

పౌరస్, అంభి బలహీన పడడం ఖాయం. వారు బలహీనపడినప్పుడు అలెగ్జాండరు తాను రంగంలోఉండడు, తన ప్రతినిధిని పెడతాడు. బహుశా సెల్యుకస్‌ను నియమించవచ్చు. అదే సమయంలో మన చంద్రగుప్తుడు రంగంలోకి వస్తాడు. అప్పుడు భారత విజయం.

“పౌరస్ ఓడిపోకుండా మనం సాయం చేయలేమా ఆచార్యా?”

“అబ్బాయ్, యుద్ధాలు చేయకముందే గెలుపు ఓటములు తెలుస్తాయి. అయినా యుద్ధాలు జరుగుతుంటాయి. రక్తం ఏరులై పారుతుంది. కురుక్షేత్ర సంగ్రామానికి ముందే పాండవులు గెలుస్తారని కౌరవులు ఓడతారని అందరికీ తెలుసు, అయినా యుద్ధం ఆగలేదు. భగవంతుడు కూడా ఆపలేకపోయాడు. చూడు ఇప్పటికే పౌరస్ ఓటమి అంచుకు చేరాడు.”


“అంతదాకా మనం ఏం చేయాలి ఆచార్యా!” అడిగాడు మెహర్ చాణక్య కళ్లలోకి దిగులుగా చూస్తూ.

“మన బలగాల్ని సిద్ధం చేసుకుంటాం. నిదానమే ప్రదానం.”

“మరి ఇంద్రదత్తు విషయం?”

“ఒక అబద్ధం చెప్పించాను. తన భవిష్యత్తుకు బంగారు బాట వేసుకున్నాడు. ఈ రోజున అదే జరిగింది.”





# 7. రణ తంత్రం

గాంధార దేశపు సరిహద్దుల్లో యవన సేనల శిబిరాలు లేచాయి. అదొక నగరంలా ఉంది. నలభైవేల పైచిలుకు అశ్వికదళాలకు విడిది. పెద్దపెద్ద శిబిరాలు. వంటశాలలు. పానశాలలు. ఆటలు పాటలు అన్నీ ఎన్నెన్నో. ఒకనగరం నగరమే తరలి వచ్చినట్లుంది. అన్ని ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాడు అంభి.

అతనే అలెగ్జాండరుకు ఆతిథ్యమిస్తున్నవాడు. రమ్మని ఆహ్వానించినవాడు.

వచ్చేడివాడు అలెగ్జాండరు. గ్రీకువీరుడు. సాక్షత్తు దేవుడి అవతారం. పౌరస్‌ను తుదముట్టించడానికి అంభికి అండగా నిలిచిన దేవుడు. అలెగ్జాండరు రాకతో గాంధారంలో తన ప్రతిష్ట పెరుగుతుందని అంభి ఆశ. ఆశ పడడంలో తప్పు లేదు. ఎవరైనా ఏదైనా ఆశించవచ్చు. ఆశించింది పొందడానికి అర్హత ఉండాలి. తన తండ్రికి ఆసరాగా ఉన్న వారందరినీ తొలగించాడు అంభి. కొత్తవారికి ఉచితాసనాలు యిచ్చాడు.

భేరీ వాయిద్యాల మధ్య సేన కదలివస్తోంది. గుర్రపు డెక్కలచప్పుడులు చెవులను హోరెత్తిస్తున్నాయి. యవన సైనిక దళాలు చీమల బారుల్లా వచ్చి గుడారాలకు చేరుకుంటున్నాయి. ఆ వచ్చే సైనికుల్ని చూడాలంటేనే ప్రజలకు

వినోదంగా ఉంది. భయంగానూ ఉంది. రేపు వీళ్లే తమ ప్రాణాలు హరిస్తారు. వారంతా కైబర్ కనుమ దాటి వచ్చినవారు. అలెగ్జాండరు బృందం ఉత్తర మార్గం ద్వారా చుట్టు తిరిగి వచ్చింది. మధ్యమార్గంలో అలెగ్జాండరు పీరసర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. దాంతో హిరాకల్స్ బాధ తప్పింది.

గ్రీకువీరుడి ఆగమనంతో అంభిగణం నిశ్శబ్దం అయింది. మంగళ వాయిద్యాలు ఆగిపోయాయి. యవనసేనలు నెమ్మదిగా వస్తున్నాయి. సైన్యం కవాతు లయబద్ధంగా ఉంది.

అంభి పరివారంలోని మంత్రులు గుసగుసలాడుకో సాగారు.

“మనం మునిగాం మిత్రమా? పూర్తిగా మోసపోయాం. అనవసరంగా ఈ తలనొప్పి తెచ్చిపెట్టుకున్నాం” అదీ వారి గుసగుసల సారాంశం.

“మనం ఊహించినంత బలగం లేదు వీరికి.”

“పెద్దగా అనకయ్యా బాబూ! కొంపమునుగుతుంది. మన పదవులు పుటుక్కుమంటాయి.”

“కందకు లేని దురద కత్తిపీటకెందుకు?”

అలెగ్జాండరుకు స్వాగతం చెప్పడానికి చాలా ఎత్తుగా వేదిక అమర్చారు. ఇరుపక్షాల నేతలు ఆ వేదికపైన ఆలింగనం చేసుకుని, కరచాలనం చేసుకుంటారు. ఇరు సేనల్ని అభినందిస్తారు. ఆ దృశ్యాన్ని అందరూ చూడ గలగాలి. లక్షమంది వీక్షకులకు ఏర్పాటు చేశారు.

అంభి వేదికపైన నిలబడి నలువైపుల చూచి తృప్తి చెందాడు. తాగితాగి కళ్లు ఎర్రబడ్డాయి. కాళ్లు తూలుతున్నాయి. మొహం నిద్రలేక జేవురించింది. పట్టుధోవతి, తలపాగా, బంగారు, వజ్రాలహారం మెడలో మెరుస్తున్నాయి.

★ ★ ★

దూరంగా ధూళిమేఘాలు. అవి అలెగ్జాండరు సైన్య పాదఘట్టనల వల్ల ఎగసిన దుమ్ము, ధూళి.

మరికొంత నిదానించి చూచాడు. సైనికుల శిరస్త్రాణాలు ఇత్తడివి మెరుస్తూ కనిపించాయి. కంచుకాలు, కంచు కవచాలు, లోహ పాదరక్షలు ధరించి యమభటుల్లా నడుస్తున్నారు. రమారమీ మూడువేల వరకు ఉండవచ్చని అంచనా వేశాడు. ఒక్కో పటాలంలో రెండు వందల గుర్రాలు

తెగబలిసి రాజసంగా ఉన్నాయి. రౌతులు అంతకన్నా రాజసంగా ఉన్నారు. మొత్తం మీద అలెగ్జాండరు సేన కన్నుల పండువగా ఉంది. అంభికి చాలా ఆనందం వేసింది. ఆనందంలో కొలమారింది. వేసుకున్న తాంబూలంలో కారం ఎక్కువైందను కున్నాడు. మింగలేక, కక్కలేక అవస్థపడ్డాడు.

ఒక్కసారి మేళతాళాలు ఆగిపోయి నిశ్శబ్దం అలముకుంది. అలెగ్జాండరు బృందం దగ్గరకు వచ్చింది. తనకు కేటాయించిన శిబిరంలోకి పోకుండా అలెగ్జాండరు సరాసరి వేదిక వద్దకు వస్తున్నాడు. తను గబగబ వేదిక దిగి ఎదురేగి స్వాగతం చెప్పాడు. ఇరువురు అభివాదం చేసుకున్నారు.

"అంభీ! నీకు ఆడంబరం ఎక్కువ. మా కోసం ఇంత స్వాగతం అవసరం లేదయ్యా. నీ ప్రతాపం నీ ప్రత్యర్థిపైన చూపించాలి." నవ్వాడు అలెగ్జాండరు. ఇద్దరికి వెనుక ద్విభాషా కోవిదులున్నారు. వారు గబగబ అనువాదం చేసి చెప్పేస్తున్నారు. ఆలస్యంగా నవ్వాడు అంభి.

"స్వాగతం మగధీరా ... సుస్వాగతం!" అన్నాడు అంభి కైమోడ్చి.

"మిత్రమా! అంభీ. అలెగ్జాండరు నీకు మిత్రుడు. మరచిపోకు."

"మన మైత్రి చిరకాలంసాగాలని ఆశిస్తున్నాను" సంబరపడ్డాడు అంభి.

"మనలో ఎవరు మంచి మిత్రులో తెలియాలంటే మనం యుద్ధం చేయాలి."

అలెగ్జాండరు మేల మాడాడు. అంభి మొహం సిగ్గుతో వాలిపోయింది.

★ ★ ★

జీలంనది వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. వరద పొంగుకు నేల మొత్తం తడిసి ముద్దయింది. గుడారాలు, బిడాలాలు తడిసిపోయాయి. కొండల మీద కురిసిన వర్షపు నీరు ప్రవాహాలుగా విడిది చేసిన ప్రాంతాన్ని తడిపేస్తున్నాయి. నడవడమే కష్టమవుతోంది. ఎటు చూచినా జలమయం. ఇటు జన సమూహం. ముంపు నీటితో యవన సేనకు వంట చేసుకోవడం కష్టమైంది.

నదిని దాటడం ఎలా? అలెగ్జాండరు ప్రతిరోజు నది తీరం వెంట తిరుగుతూ నది ఎక్కడ దాట వచ్చునో చూస్తున్నాడు. ప్రవాహం భీభత్సంగా ఉంది. ప్రవాహం ఉధృతికి నదిలో కాలు పెడితే నిలవడం లేదు. గుర్రాలు

సైతం కొట్టుకుపోయే పరిస్థితి. నదికి ఈ వంక విన్యాసాలను అవతలి ఒడ్డున పౌరస్ కనిపెడుతూనే ఉన్నాడు. అటు తన సేనను విడిది చేయించాడు. ఇరు సేనల మధ్య జీలం నదీ ప్రవాహం. కేకయ సేన యాభై వేల వరకు ఉండవచ్చు. అయిదు వేల అశ్వికులు, మూడు వందల రథాలు, రెండు వందలు పైగా యుద్ధ ఏనుగులు. అలెగ్జాండరు సైనికబలం కంటే వారిదే ఎక్కువ. రణక్షేత్రం కురుక్షేత్రాన్ని తలపిస్తోంది.

"రణతంత్రం ఎలా జరగాలి?" అలెగ్జాండరు తన సేనాపతి సెల్యుకస్‌తో సంప్రదించాడు.

చెప్పండి ఏం చేయాలి? ఎలా చేయాలి?

సెల్యుకస్ అలెగ్జాండర్ ముందు నిలబడ్డాడు. అలెగ్జాండరును ముందుగా పొగడాలి – తమరు ఆకాశం అంత ఎత్తు, ఏనుగంత మనిషి అని. అప్పుడు గాని అతనికి తృప్తిగా ఉండదు. ఆ విషయం సెల్యుకస్‌కు బాగా తెలుసు.

"నిన్ను ఆకాశానికి ఎత్తి, కుదేయవచ్చు" అనుకున్నాడు లోలోపల.

"సెల్యుకస్! అటు చూడు. మన శిబిరాల్లో నా పోలికలున్నవారు ఉంటారు. వారిని ఏరి నాలాగా అలంకరించి ఈ నది ఒడ్డున తిరగనీ. అవతలివారు నేనే అనుకుంటారు. మనం నది ఎగువకు పోదాం. మనం అక్కడ నది దాటి అటు నుండి ముట్టడిద్దాం."

"అసలు నదిని దాటడం ఎలా స్వామీ!"

గురువును మించిన శిష్యుడు.

"సింధు నదిని దాటినప్పుడు మనం ఉపయోగించిన తెప్పలున్నాయి. వాటిని నది ఎగువకు చేర్పించండి. ప్రవాహం ఉధృతంగా లేనిచోట దాటదాం." అది అలెగ్జాండర్ ఆలోచన.

"నలభై వేలమంది తెప్పలపై నదిని దాటటం మాటలు కాదు. పైగా గుర్రాలు, బరువైన సామాగ్రి. ఇన్నింటిని తెప్పలు తట్టుకోలేవు ప్రభువా?"

సెల్యూకస్ పస్తాయించాడు. అప్పటికే గుడారాలు తడిసిపోయాయి, సరైన తిండి లేక, నిద్ర లేక అందరూ చిరాగ్గా ఉన్నారు.

సేనాపతిగదా! సైనికుల కష్టసుఖాలు తెలుసుకోవాలి!

పదపద మంటే అయ్యేపనా! యుద్ధం మాటలు చెప్పినంత సులభం కాదు. దిగితేగాని లోతు తెలియదు.

"అంత బలగాన్ని తరలించడం కష్టం వీరా!" అన్నాడు సెల్యూకస్.

"అందరూ వద్దు సెల్యూకస్. పదివేలమంది మన వెంట వస్తారు. మిగతా వారు ఇక్కడే ఉంటారు. మనం రహస్యంగా రాత్రికి రాత్రి నదిదాటి పౌరస్ పైన దాడి చేస్తాం."

"వాళ్లు పూర్తి సైన్యంతో మనల్ని ఎదుర్కొంటే కష్టమే కదా? మనం ఓడిపోవడం ఖాయం."

"అవును కదూ! అప్పటికి ఆలిప్ మిగిలిన సైన్యంతో ఇక్కడ నదిని దాటి ఈవైపు నుండి కుమ్మేస్తాడు. వాళ్ల సైన్యం రెండు వైపులకు పంపడం కుదరదు కదా! మనది ద్విముఖ వ్యూహం."

★ ★ ★

దండయాత్ర ప్రారంభమైంది. కేకయ సైన్యంలో గుసగుసలు మొదలైనాయి. వార్త నిమిషాల్లో దావానలంలా పాకింది. మొత్తానికి పౌరస్ చెవిని పడ్డది. పౌరస్ అంటే పురుషోత్తముడు. ఆజాన బాహుడు. ఆరున్నర అడుగుల ఎత్తరి. భారీ శరీరం. అతనికి అలెగ్జాండర్ పెట్టిన పేరు పురుషోత్తముడు. పౌరస్ ముఖంలో తేజస్సు, ఠీవి, దర్పం. అచ్చం పురుషోత్తముడనిపిస్తాడు. కోర మీసాలు. కండలు తిరిగిన దండి యోధుడు. వర్షాలు పిడుగులు లెక్క చేయని మహాబలుడు. అతనంటే అలెగ్జాండరుకు భయం, ఇష్టం కూడా. కాశ్మీరం, మల్లప్రియ, సింధు, రాజ్యాలను జయించి పర్వతీశ్వరుడైనాడు పురుషోత్తముడు.

"అదెట్లా సాధ్యం ఇంద్రా?"

పురుషోత్తముడు తన మంత్రి ఇంద్రదత్తను ప్రశ్నించాడు. మన గూఢ చారులు అలెగ్జాండరు జీలం అవతలి ఒడ్డునే ఉన్నట్లు సమాచారం అందించారు ప్రభూ. వాళ్ల శిబిరాలు మన కళ్లకు కనిపిస్తున్నాయి కూడా.

"అవును ప్రభూ! అభయ గూఢాచారులు తీర ప్రాంతంలో చాలా మైళ్ల వరకు సంచరించి రైతుల్ని విచారించారుట. అలెగ్జాండరు నదీ తీరం వెంట చాలా దూరం వరకు వెళ్లాడని చెప్పారు. నది ఎక్కడ లోతు తక్కువ అని

రైతుల్ని విచారించాడు. నదిని దాటడం అసంభవం అనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది ప్రభూ."

"ఇంద్రదత్తూ! నీవు నిజాయితీ పరుడవే. కానీ ఎక్కడో నమ్మకద్రోహం జరిగింది. మనకు తప్పుడు సంకేతాలు వచ్చాయి. మన విలుకాండ్రను తీరం వెంబడి సిద్ధపరచండి. అలెగ్జాండరుకు గుణపాఠం చెప్పాలి".

పౌరస్ సింహంలా గర్జించాడు. వర్షంలో తడుస్తూ మదపు టేనుగులా ఘీంకరించాడు.

ఇంద్రదత్తు సరేనని ఆజ్ఞలు జారీ చేయడానికి వెళ్లాడు. సైన్యాధిపతి కంగారుగా ఉన్నాడు. అప్పటికే రథాలు బయలుదేరాయి. కానీ చక్రాలు బురదలో కూరుకుపోతున్నాయి. కదలడం లేదు. విలుకాండ్రు సిద్ధంగా ఉన్నారు కాని, విల్లు నిలపడానికి గట్టినేల కనిపించడం లేదు.

కేకయకు గజదళం గొప్పది. పౌరస్ వెంటనే గజదళాల్ని రంగంలోకి దించాడు. ఏనుగులు యవన సైన్యాన్ని చేరేసరికి గొడ్డళ్లు, బల్లాలు వచ్చి పడ్డాయి. కందకాల లోంచి బల్లాలు విసురుతున్నారు. సైన్యం ఉక్కిరిబిక్కిరైంది. ఏనుగులు చెదిరిపోయాయి. స్వంతసైన్యంపైబడి తొక్కనారంభించాయి.

అంతలో అలెగ్జాండరు సైనికులు చుట్టుముట్టిన వార్త. అక్కడ ఫిలిప్ సేనలు జీలంనది దాటి ఒడ్డుకు చేరాయి.

పౌరస్ ఏనుగు అంబారీలో కూర్చుని రణక్షేత్రంలో మధ్యకు వచ్చాడు. అతని ఇద్దరు కొడుకులు హతులైనారు. ఇంక పౌరస్‌కు మిగిలింది లేదు. పౌరస్ తన మావటీని సరాసరి అలెగ్జాండరు వైపు ఏనుగును ఉరికించమని ఆజ్ఞాపించాడు. అందుకోసం ఎదురు చూస్తున్నట్లు అలెగ్జాండర్ తన బలగాల్ని పౌరస్ చుట్టు ముట్టి దిగ్బంధం చేయించాడు. ఊచకోత జరిగింది. రక్తం జీలం నదిలోకి ఏరులై పారింది. కేకయ సేనలో వేలాది మంది హతులైనారు.

పౌరస్ గాయాలతో రక్తం కోల్పోయి బలహీనపడ్డాడు. కుడిచేత్తో బల్లెం బలంగా విసిరాడు. అదే అదునుగా అలెగ్జాండర్ సైనికులు పౌరస్‌ను పట్టి బంధించారు. అయినా పురుషోత్తమునిలో రాజసం తగ్గలేదు. ఓడిపోయినా రాజు రాజే! అలెగ్జాండరు ప్రక్కన అంభి నిస్సిగ్గుగా నిలబడ్డాడు.

అలెగ్జాండర్ అడిగాడు : "పౌరస్! మీరు మాకు బందీ. మిమ్మల్ని ఎలా శిక్షించాలో చెప్పండి. మీరు కోరినట్లు శిక్షిస్తాం."

పౌరస్ : "అలెగ్జాండర్! నేను రాజును. నీవూ రాజువు. గెలుపు ఓటములు యుద్ధంలో సహజం. జీవితంలోనూ సహజమే.

"రాజును రాజుగానే శిక్షించు. అది నీతిగల రాజు లక్షణం."

పౌరస్ ఓటమిని అవమానంగా భావించలేదు. విజేత ముందు తను మరొక విజేతగా నిలబడ్డాడు. అతని ఠీవికి, దర్పానికి అలెగ్జాండర్ గర్వపడ్డాడు.

"అట్లాగే మిత్రమా! నిన్ను శిక్షించడం అంటే నన్ను నేను శిక్షించుకోవడమే. పౌరుషాన్ని, వీరత్వాన్ని అవమానపరచడం అవుతుంది. నిన్ను గౌరవించడం నన్ను గౌరవించుకున్నట్లు కాక, మీరే నన్ను గౌరవించినట్లు అవుతుంది."

అంభికి అర్థం కాలేదు. దిక్కులు చూడసాగాడు.

"ఏదైనా కోరుకో మిత్రమా".

"నా విజ్ఞాపనలోనే నా కోరిక ఉంది అలెగ్జాండర్."

అలెగ్జాండరు సాహసాన్ని గౌరవిస్తాడు. వీరోచితంగా ప్రవర్తిస్తాడు. నేరుగా పౌరస్ దగ్గరకు వచ్చి కరచాలనం చేస్తూ "పౌరస్, ఈరోజు నుండి నేను మీరు మిత్రులం. నీ రాజ్యాన్ని నీకు ఇచ్చి వేస్తున్నాను. నీ రాజ్యాన్ని నీవే ఏలుకో. కుర్రవాడు అంభిని మన్నించు చాలు."

పౌరస్ కళ్లలో కృతజ్ఞతగా నీళ్లు తిరిగాయి. తనలోని అహంకారం అణగిపోయింది. అధికారదాహం తీరింది. అలెగ్జాండరును ఆలింగనం చేసుకున్నాడు మైత్రీ భావనతో.

★ ★ ★

**చాణక్యుని పర్ణశాల :**

చాణక్య, చంద్రగుప్తులు స్థిమితంగా ఫలహారం సేవిస్తున్నారు. చాణక్య చేతలు, ఆలోచనలు చంద్రగుప్తునికి అర్థం కావడం లేదు.

ఇప్పుడు తీరికగా ప్రశ్నించాడు. "ఆచార్యా! మనం ఏం చేస్తున్నట్లు? ఏం సాధిస్తున్నట్లు? నాకేమీ అర్థం కావటం లేదు."

చాణక్య : ఇంకేం జరగాలి చంద్రా! అనుకున్నదే అయింది.

బయట సైనిక శిక్షణ జరుగుతోంది. బయటి శబ్దాలను పట్టించుకోకుండా సంభాషణ సాగించారు.

చాణక్య : అలెగ్జాండర్ పౌరస్‌ను ఓడించాడు. పౌరస్ ఇరవైమూడు వేల సైన్యాన్ని నష్టపోయాడు. నష్టజాతకుడు. ఇప్పుడు ఏమైంది? అంతటి పౌరస్ అలెగ్జాండరు చేతి కీలుబొమ్మ అయినాడు. ఆ పని మనం చేయగలిగేవాళ్లం. మన దృష్టిలో వాళ్లిద్దరూ పరాజితులే. ఇద్దరూ ఓడినట్లే. అంటే గెలుపు మన ఖాతాలో పడ్డదన్నమాట.

తిరకాసు అర్థం కాలేదు చంద్రగుప్తకు. ఇంకా కుర్రవాడు గదా! రాజకీయాల్లో పసివాడు.

చంద్రగుప్తుడు : అలెగ్జాండరు బలం పెరిగిందని నా అభిప్రాయం.

చాణక్య : తగ్గింది చంద్రగుప్తా! పౌరస్‌తో యుద్ధం మొదలయే సరికే అలెగ్జాండర్ సైన్యం అలసిపోయి ఓటమి అంచున ఉన్నారు. బలహీనపడ్డమాట వాస్తవం. జీలం విజయం అంత సులభంగా దక్కలేదు. వాళ్లూ చాలా నష్టపోయారు. పౌరస్ శృంగభంగమైనాడు. వాళ్లు గెలిచి ఓడారు. పౌరస్ ఓడిపోయి గెలిచాడు. అవునా, కాదా? మనకు అందించిన సమాచారం ప్రకారం అలెగ్జాండరు సేనలు యుద్ధం చేయడానికి సిద్ధంగాలేవు. అలెగ్జాండరును ఎవరూ నిరోధించలేదు. ఒక చిన్న యుద్ధంతోనే పౌరస్ అలెగ్జాండరును ఎందుకూ పనికిరాని వానిగా చేశాడు.

చాణక్య తృప్తిగా, గర్వంగా నవ్వాడు.

"మన పథకం బాగానే పారింది చంద్రా! మనం చేసింది మంచి పనే. ఈ యుద్ధం వల్ల మనకు పరోక్షంగా చాలా మేలు జరిగింది తెలుసా?

చంద్రగుప్తా! యుద్ధం జరుగుతున్నప్పుడు ఎవరిది న్యాయం అని యోచించరు. యుద్ధంలో ఎవరిది అన్యాయమో తెలుస్తుంది."

చంద్రగుప్త : ఇంతకీ ఇప్పుడు ఏం జరుగుతోంది ఆచార్యా? నాకేమీ అర్థం కావడం లేదు.

చాణక్య : అలెగ్జాండరు వెనుతిరిగి పోయాడు. విజయంతోనా, పరాజయంతోనా? అన్నది ముఖ్యం కాదు. తాను తిరిగి వెళ్లడం ముఖ్యం.

భారతదేశంలో లేడు. బహుశా సెల్యూకస్‌ను తన ప్రతినిధిని చేస్తాడు. ఇప్పుడు మనం ముఖ్యమైన పావులు కదిలించాలి.”

బయట సైనిక విద్యార్థుల కోలాహలం ఎక్కువైంది.

చంద్ర : సైన్యాధిపతి మనకు చాలా మేలు చేశాడు.

చాణక్య : అవునవును. మేనక కౌగిలి మేలు చేసింది. ఈ విజయానికి మేనక సగం కారణం.

చంద్ర : అంభి సేనాపతిని మన వాళ్లకు యుద్ధశిక్షణ యివ్వడానికి ఎట్లా ఒప్పించగలిగారు ఆచార్యా?

చాణక్య : అతనికి మనం తప్ప వేరే గతి లేదు. తక్షశిలను కేకయసేనలు ఆక్రమించినపుడు అతగాడు శృంగారంలో మునిగిపోయాడు. గాంధార రాజుకు తన అవసరం ఉంటుందని అనుకోలేదు. అది ఘోరాపరాధం కదా! అతనికి ఉరిశిక్ష వేసి ఉండవలసింది. అలాంటి వాడిని పిలిచి ఆశ్రయిం యిచ్చింది నేను. లేకపోతే చచ్చిపోయేవాడు.

చంద్ర : అవును. గత్యంతరం లేదు గదా.

చాణక్య : వ్యాపారి తన సరుకులు అమ్మడానికి రకరకాల ప్రలోభాలు పెడతాడు. సరుకు కొనేవాడికి బుద్ధి ఉండాలి. తన అవసరాలు చూచుకోవద్దా.


చంద్ర : నా కర్థం కాలేదు ఆచార్యా! మీరు ద్వంద్వార్థాలతో మాట్లాడతారు ఎప్పుడు రెండు రకాలుగా ఆలోచిస్తుంటారు.

చాణక్య నవ్వుకున్నాడు.

చాణక్య : అసలు మేనక ఎవరు? ఆమెకు జలక్రీడకు ఏమిటి సంబంధం? సేనాధిపతిని ఎట్లా వలలోవేసింది? ఇంద్రదత్తు గూఢచారికి, అభయకు, మేనకకు ఏం సంబంధం? కేకయకు అనుకూలంగా ఎట్లా మలచగలిగాడు.

జిత్తుల మారి చాణక్య ప్రశ్నల మీద ప్రశ్నల వర్షం కురిపించి ఉక్కిరి బిక్కిరి చేశాడు. చంద్రగుప్త అతని కుటిలనీతికి తల వాల్చాడు. గురువుగారి పాదాలకు నమస్కరించాడు.

చాణక్య మహామేధావి అని చంద్రగుప్తకు తెలియనిది కాదు. ఆయనకు రణతంత్రం, రాజనీతి సమంగా తెలుసు. పైకి కనిపించే దాని కన్న లోపల ఇంకా అంత ఉన్నాడు చాణక్య.



# 8. చాణక్య పథకం

**“శరణు శరణు! గురుదేవా! నన్ను మన్నించి రక్షించండి” అంభి ఆచార్య చాణక్య పాదాల మీద పడి అర్థించసాగాడు. కన్నీరు మున్నీరుగా విలపించ సాగాడు.**

“ఎవరు బాబూ నువ్వు? ఓహో గాంధార ప్రభువు అంభిగారా? ఏమిటి విశేషం ఏదో దారితప్పి వచ్చినట్టున్నారు?”

వంకరగా మాట్లాడడం చాణక్యకు వెన్నతో పెట్టిన విద్య.

ఆయనకు అన్నప్రాసన వ్యంగ్యప్రాసన ఒక్కసారే జరిగాయి.

“క్షమించండి గురూజీ! నేను పాపం చేశాను. మహా నేరం చేశాను. నన్ను దయతో క్షమించండి.”

చాణక్య : అదేమిటి అంభీ! నీవు పాపం చేయడం ఏమిటి? అయినా నువ్వు నాకు చేసిన అపకారం ఏముంది? పొరపడ్డావు అంభీ. నాకేదో శక్తి ఉందని నీవు భ్రమపడుతున్నావు.

చాణక్య వీలైనంత వ్యంగ్యంగా అన్నాడు. అంభికి తగలవలసినచోట తగిలాయి. తలవాల్చి సిగ్గుపడుతూ అన్నాడు అంభి :

"నేను అలెగ్జాండరుతో మైత్రి చేయవలసింది కాదు ఆచార్యా! తప్పు జరిగిపోయింది. నాకు కలిగిన ప్రయోజనం లేదు. నా ప్రజలే నన్ను అసహ్యించుకుంటున్నారు. ప్రజల ఆగ్రహానికి గురికావలసి వచ్చింది. పౌరస్ ఓటమి అలెగ్జాండరు విజయం కాదు. అలెగ్జాండరు పౌరస్‌ను పావుగా చేసుకున్నాడు. నా రాజ్యం నాకివ్వనే లేదు. పౌరస్ పెత్తనం చేస్తున్నాడు."

చాణక్య : అంభీ! నీశక్తికి మించింది గాంధారం అవునా? కాదా?

అంభి : అవును ఆచార్యా! అదే నా బాధ. అలెగ్జాండరు దృష్టిలో పౌరస్, నేనూ సమానులం. ఇద్దరం అతని చేతి కీలుబొమ్మలమైనాం. రక్తపాతం లేకుండా నేను సంపాదించిందీ లేదు. వేలమందిని త్యాగం చేసి పౌరస్ లబ్ధి పొందిందీ లేదు ఆచార్యా. అతనికి వీరుడని పేరు వచ్చింది నాకు భీరుడని పేరు మిగిలింది.

చాణక్య అదొక విధంగా కృత్రిమంగా నవ్వాడు.

చాణక్య : చాణక్య ఏం సహాయం చేయగలడు అంభికి?

అంభి : ఆచార్యా! నాకు మీ సహాయ సహకారాలు పూర్తిగా కావాలి. నాకు అండగా మీరు నిలబడాలి. నాకు తెలుసు. నా సేనాధిపతి మీ దగ్గర పని చేస్తున్నాడని. చంద్రగుప్తుని మగధకు రాజును చేయాలని మీ సంకల్పం. అదీ నాకు తెలుసు. నా అభ్యంతరం లేదు. నా గాంధార దేశం సుఖంగా ఉంటే చాలు. నాకు మీ అండదండలు కావాలి. అందుకే మీ సహాయం అర్థిస్తున్నా.

చాణక్య : సహాయం అంటే ఎటువంటి సహాయం అంభీ?

అంభి : తమరు మా రాజగురువు కావాలి. నాకు సలహాలిస్తుండాలి. నా అంతఃపురం ప్రక్కన మీకు తగిన భవనం నిర్మించిపెట్టాను ఆచార్యా. మీరు, మీ శిష్యులతో వేంచేయాలి. అక్కడ ఉండాలి. మీకు ఏ లోటు రాకుండా చూచుకునే బాధ్యత నాది. మా కోటకు దయ చేయండి. అవసరమైనపుడు మీ దర్శనం చేసుకునే భాగ్యం ప్రసాదించండి.

చాణక్య : అంభీ! నేను ఒంటరి బ్రాహ్మడినయ్యా! నాకు భవనాలు, భోగ భాగ్యాలు అవసరం లేదు. పైగా బ్రహ్మచారిని. సుఖాలు సౌకర్యాలు అవసరం లేనివాడిని. నాకెందుకు చెప్పు రాజగురువు పదవి.

తన దరిద్రానికి గుర్తుగా ఒక కాలు, చేయి చూపించాడు. కళ్లలో నీరు తిరిగింది. అంభి వంగి వంగి చాణక్యకు నమస్కరించాడు.

అంభి : ఆచార్యా నన్ను అరణ్యంలో పడేయండి. నాకీ రాజ్యం వద్దు. మీరు రానంటే నేను ఇక్కడే సత్యాగ్రహం చేస్తాను, ఆచార్యా.

చాణక్య : సరే లే! అంతగా ప్రాధేయపడుతున్నావు కనుక ఒప్పుకుంటాను. అయితే ఒక నిబంధన.

అంభి : చెప్పండి గురూజీ!

వెళ్లి భవనం చూడడానికి అంగీకరించాడు చాణక్య.

★ ★ ★

ఆచార్య చాణక్యకోసం అంభి నిర్మించిపెట్టిన ఆశ్రమం ఒక విచిత్ర భవనం. అందులో ఆశ్రమం లక్షణాలు లేవు సరి కదా రాజాంతఃపురం లాగా ఉంది. విద్యార్థులకు పెద్దపెద్ద గదులున్నాయి. వందల మంది విద్యార్థులకు వసతులున్నాయి. బయట పెద్ద తోట.

ఆ భవనం 'ఆరోగ్యం' పరిశీలించడానికి చాణక్యతోపాటు చంద్రగుప్త, సింహరన్, మెహర్, సారంగరావు బయలుదేరారు. చాణక్యతో పాటు నలుగురు శిష్యులు ఎప్పుడూ ఉండవలసిందే. చాణక్య ఒంటరిగా ఉండడు. ఆయనకు శిష్యప్రేమ ఎక్కువ. భవనం చూస్తూనే చంద్రగుప్త ముఖం చిట్లించాడు. ఆచార్యుల వారు పర్ణశాలల్లో తప్ప ఉండరు కదా! ఈ దౌర్భాగ్యం ఏమిటి? ఆయన నేల మీద కూర్చుని పాఠం చెబుతారు. ఈ పరుపులు, బాలీసులు ఎందుకు? గురువుగారిని ఏదో మోసం చేస్తున్నాడు అంభి అనుకున్నారు మిగిలిన ముగ్గురు. అలెగ్జాండరుకు అమ్ముడుపోయి తలవంచిన వీరుడు అంభి గదా! కుతంత్రాలకు, కుట్రలకు మొనగాడు.

నలుగురు ప్రతి గది క్షుణ్ణంగా పరిశీలించారు. చాణక్య కనిపించని మూడవ కంటితో లోగుట్టు మట్టులు వెదుకుతున్నాడు. వాళ్లు ఏం చేస్తున్నది భవనశిల్పికి అర్థం కాలేదు. తన వివరణ తను యిస్తున్నాడు. తన పనితనాన్ని, శిల్ప చాతుర్యాన్ని పొగుడుకుంటున్నాడు. చాణక్య నేలపైన పడుకుని 'అనంతపద్మ నాభుని' తమ్ముడిలా వినిపించని శబ్దాలు వినసాగాడు. కనిపించని దృశ్యాలు చూడడం, వినిపించని శబ్దాలు వినడం చాణక్యకు వరాలు.

"రేపటి రోజు బాగుంది. వచ్చి గృహప్రవేశం చేస్తాం."

అని మాట ఇచ్చాడు చాణక్య. అంభి సంబరపడిపోయాడు.

"మా గృహప్రవేశానికి మంత్రాలు, చింతకాయలు అవసరం లేదు. పురోహితులు, పూజారులు అవసరం లేదు. బంధుగణం, మిత్రగణం అవసరం లేదు. మేమే వస్తాం. ఆడంబరాలు వద్దు."

అంభి ఏర్పాటు చేసిన రథాలలో ఆశ్రమానికి చేరారు అయిదుగురు.

చంద్రగుప్తకు చిరాగ్గా ఉంది గురువుగారు చేసిన పనికి. అతనికి ఆ భవనం ఎందుకో నచ్చలేదు. మిగిలిన ముగ్గురిది గురువు గారికి ఎదురుచెప్పే స్వభావం కాదు.

"ఇదేం నిర్ణయం ఆచార్యా! మా ఇష్టం అడగనే లేదు. మేము రాము."

చాణక్య అతనిని నోరుమూసుకొమ్మని సౌంజ్ఞ చేశాడు. ఏదీ బహిరంగంగా చర్చించడం చాణక్యకు నచ్చదు. తన అభిప్రాయం కాదనే వారు ముఖాముఖి ఒంటరిగా వచ్చి చెప్పాలి. సింహరన్‌ను దగ్గరగా పిలిచి చెప్పాడు చాణక్య.

"నువ్వొక పని చేయాలయ్యా."

"చెప్పండి ఆచార్యా."

"ఈ రాత్రికి రాత్రి రహస్యంగా ఆ ఇంటిని దగ్ధం చేయాలి. రెండవ కంటికి తెలియకూడదు."

"ఎందుకు గురుదేవా?" ప్రశ్నించాడు సింహరన్.

చంద్రగుప్త గురువు గారి మాటలకు అడ్డొచ్చి "ఆచార్యా! కారణం లేకుండా మీరేదీ చెప్పరని తెలుసు. అయినా అడుగుతున్నాను కారణం చెప్పగలరా?"

"చంద్రా! అంభి ఒక విషపురుగు. నీకు తెలుసుగా. వాడి మొహం, తల నాగసర్పంలా ఉంటాయి గమనించావా. వాడు మనల్ని నాశనం చేయాలని కుట్రపన్నాడు. మనం ఈ రాజ్యంలో ఉండడం, బ్రతికుండడం అసలు వాడికి ఇబ్బందిగా ఉంది. అతగాడి సేనాధిపతి మన పక్కన వచ్చి చేరాడు. అదొక పీడ. అతను మనకు సహాయం చేస్తున్నాడు కదా!"

“మీరు రాజగురువుగా ఉండడానికి అంగీకరించారు కదా! ఇష్టం లేకపోతే వెళ్లకండి. కొంప తగలబెట్టడం ఎందుకు?” అన్నాడు చంద్రగుప్త.

“ఎందుకంటే రేపు ఎప్పుడో వాళ్లు చేయబోయే పనిని ముందుగా ఈ రోజు మనమే చేద్దామని” నవ్వుతూ చెప్పాడు చాణక్య.

“అర్థం కాలేదు గురుదేవా”.

“అది లాక్షాగృహం చంద్రా. పాండవుల్ని చంపడానికి దుర్యోధనుడు కట్టించిన లాక్షాగృహం లాంటిది. అంభి భారతం చదివినట్లున్నాడు. పాపం మన కోసం కష్టపడి లక్క ఇల్లు కట్టించి అలంకరించి పెట్టాడు ద్రాష్టుడు. నేలపైన పడుకుంటే ఎందుకో అనుకున్నారు మీరు. ఆ ఇంటి క్రింద నేలమాళిగ ఉంది. అక్కడ సైన్యం ఉంది. వాళ్ల చప్పుళ్లు వినిపించాయి. గోడల్లోంచి చీమలు బారులుగా వస్తున్నాయి. కొత్త ఇంట్లో చీమలు వచ్చే అవకాశం లేదు. క్రింద వంటశాలలున్నాయి. అక్కడినుండి చీమలు ఆహారం తెచ్చు కుంటున్నాయి. గోడలు తలుపులు నిగనిగలాడుతున్నాయి. అవి లక్కతో చేయించాడు. లక్కపూత పూయించాడు. మనం ఆ ఇంట్లో ఉండగా, ఏ అర్ధరాత్రి పూటో అగ్నిప్రమాదం జరిగేది. లేదా మాళిగల్లోని సైనికులు పైకొచ్చి మన గొంతులు కోసేవారు. వారికంత శ్రమ ఇవ్వడం ఎందుకు. మనమే ఆపని చేస్తే సరిపోతుంది.”

“సింహరన్! నీవు ఆపనిలో ఉండిపో.”

చంద్రగుప్తునికి నోట మాట రాలేదు. హాయ్ ఆచార్యా! అనుకున్నాడు. “ఆచార్యా ఆ తలుపులు, కిటికీలు అంత వివరంగా ఎప్పుడు చూచారు?”

చాణక్య నవ్వేడు.

చాణక్య నవ్వు నాలుగు విధాల కీడు, పది విధాల చేటు.

అది అందరికీ తెలిసిన రహస్యం.

★ ★ ★

చాణక్య దండాయన ఆశ్రమానికి వచ్చి చేరాడు. అతనికి రాజభవనాలు, అంతస్తులు సరిపడవు. నిరాడంబరంగా, ఆశ్రమ పద్ధతిలో యోగిలా జీవించడం ఇష్టం. తనను ఆశ్రమంలో ఉండనిమ్మని దండాయన యోగిని

అర్థించాడు. దండాయనకు చాణక్య వంటి మేధావి అవసరం. మంచివాడు కదా? కొద్ది రోజుల తర్వాత ఆచార్య చాణక్యను పరామర్శించడానికి అంభి వచ్చాడు.

"అంభి రాజా! ఎలా ఉన్నావయ్యా? మా కోసం నీవు తయారించిన భవనం రాత్రికి రాత్రి గృహప్రవేశానికి ముందే కాలిపోవడం అపశకునం అనిపించిందయ్యా. అందుకే ఇలా వచ్చేశాను. బ్రతికి ఉండాలి కదా?

"నా జాతకం అంతేనయ్యా! నీచ భంగ రాజయోగం అంటారు నీచులందరినీ తుదముట్టిస్తే తప్ప నాకు రాజయోగం ప్రాప్తించదు. నా వల్ల గాంధార రాజ్యానికి నష్టం, కష్టం రావడం భగవంతునికి ఇష్టం లేదు. ఇంకెవరినైనా నీకు రాజగురువును చేసుకోవయ్యా నీ ఆస్థానానికి నేను తగను."

అంభి మొహంలో ఆశించిన స్పందన లేదు. లోపల కుతకుతలాడుతూ పైకి గంభీరంగా ఉన్నాడు.

"గురుదేవా! అదంతా నా జాతకం! తమరు తక్షశిలలోనే ఉండాలని అర్థించడానికి వచ్చాను. కనీసం అప్పుడప్పుడు మిమ్మల్ని దర్శించుకునే అవకాశం కలిగించండి."

"అంటే చివరికి నాపని పడతావన్నమాట" లోపల అనుకున్నాడు చాణక్య. పైకి "అట్లాగే అంభీ! నేనూ నీ వాడినే. అవసరమైనపుడు ఇక్కడికి తప్పక వస్తూ ఉండు."

అంభి వెళ్లిపోగానే చంద్రగుప్త అడిగాడు.

"ఎందుకు ఆచార్యా! యవన సేనలు వెళ్లిపోయాయి గదా! ఇంక యుద్ధాలు చేయవలసిన అవసరం కనిపించదు."

చాణక్య క్షణం ఆలోచించి, "యుద్ధాల వ్యవహారాలు నాకు వదిలెయ్, చంద్రా! నీవు నీ ప్రేమ వ్యవహారాలు చూసుకోవయ్యా."

"ప్రేమా? నేనా? నాకు ప్రేమేమిటి గురుదేవా?"

★ ★ ★

**ఆమెది జగదేకసుందరి క్లియోపాత్రా సౌందర్యం. గ్రీసులో ఆమెను ప్రేమదేవతగా ఆరాధిస్తారు. క్లియోపాత్రా మళ్లీ పుట్టింది అనిపిస్తుంది.**

**ఆమె పేరు కార్నిలియా. ఒంటిపైన జారిపోయే సిల్కుగౌను. నడుముచుట్టూ ఒంటి ముత్యాలహారం. చెవులకు బంగారు కమ్మలు, రత్నాలు పొదిగినవి – ఆమె కళ్లు నెమలికళ్లు.**

ఆమె మహావీరుడు సెల్యూకస్ కూతురు. అందానికి ప్రతిరూపం – ఇరవై సంవత్సరాల వయసులో నిగనిగ లాడుతోంది.

అలెగ్జాండరు తిరిగి వెళ్లడానికి సిద్ధమై, తాను జయించిన రాజ్యాలకు సెల్యూకస్‌ను తనప్రతినిధిగా నియమించాడు. రాజ ప్రతినిధి అంటే తొంభయి శాతం రాజు అనే. అన్ని అధికారాలు ఉంటాయి.

సెల్యూకస్ చిన్నతనంలో అతని తల్లి చెప్పేదిట.

నీ తండ్రి సూర్య దేవుడు అపోలో. తన ప్రేమకు గుర్తుగా ఒక ఉంగరం యిచ్చాడు. కొడుకు పెరిగి పెద్దవాడైన తర్వాత ఆ ఉంగరం తన గుర్తుగా బహూకరించమన్నాడు.

సెల్యూకస్ తొడపైన ఆ ఉంగరం లాంటి పుట్టుమచ్చ ఉంది. అలెగ్జాండరుతో కలిసి యుద్ధానికి బయలుదేరిననాడు ఆమె అన్నదిట. "వెళ్లి యుద్ధం చెయ్. విజయం సాధించు" అని. తన ప్రియుడి ఉంగరాన్ని కొడుకు వేలికి అలంకరించింది.

అలెగ్జాండరు విజయాలలో సెల్యూకస్ పాత్ర ఎక్కువ. అలెగ్జాండరు పర్షియాను జయించినప్పుడు పర్షియా రాజవంశానికి చెందిన ఒక యువతిని పెళ్లాడాడు. సెల్యూకస్ పర్షియా రాజకుమారిని పెళ్లి చేసుకున్నాడు. ఆ ప్రేమ ఫలితమే కార్నిలియా.

తక్షశిలలో అంభికి అతిథి కార్నిలియా. ఆమె రెండు దేశాలకు చెందిన రాజకన్య. ఆమెకు గ్రీసు కన్న గాంధారం అంటే ఇష్టం. ఆమె తక్షశిలలోనే ఉండిపోయింది. ఆమె ఆలనా పాలనా అంభి చూస్తాడు. ఆమె తరచుగా దండాయన ఆశ్రమానికి వస్తుంది. ఆమెకు భారతీయత ఇష్టం. యోగం ఇష్టం. దండాయన యోగివద్ద యోగాభ్యాసం చేస్తుంది. ఆమె యౌవనవతి కావడం, సెల్యూకస్ కుమార్తె కావడం వల్ల సైనికుల రక్షణ పట్టించుకునేది కాదు. ఆమె స్వేచ్ఛాప్రణయిని.

★ ★ ★

దండాయన ఆశ్రమంలో కార్నియాకు చాణక్యతో పరిచయం. ఆయన ఆహార్యం, నిరాడంబరత ఆమెను ఆకర్షించాయి. ఒకరోజున అడిగింది :

"ఆచార్యా! మీ దేశంలో పరిత్యాగులకు గౌరవం ఎక్కువ. ఎందువల్ల? మీలా పెళ్లి పెటాకులు లేకుండా జీవించడం గొప్పా? దండాయన మహర్షి, ఇట్లా అరణ్యంలో ఎందుకుండాలి? ఆయనకు దిగులు విచారం ఉండవు. ఎందువల్ల? మనిషికి రాగద్వేషాలు, ప్రేమలు సహజం కదా. మా దేశం వారికి సంపదలు, సుఖాలు ముఖ్యం. ఎందువల్ల ఈ తేడా! అందరూ మనుషులే గదా?"

చాణక్య పెద్దగా నవ్వాడు. ఆమె అమాయకురాలు కాదు. అది అమాయకత్వంతో అడిగిన ప్రశ్న కాదు. చాలా లోతైన అవగాహన. అది జిజ్ఞాస. అది సామాజిక తాత్విక చింతన.

నవ్వినపుడు ఆచార్యులవారి గొగ్గిపళ్ల వరస చూస్తే ఎవరికైనా భయం వేస్తుంది. నవ్వినవ్వి ఆమె కళ్లలోకి చూచి అన్నాడు.

"అమ్మాయి! శ్రీరాముడి కథ నీకు తెలుసు కదా! రాముడు రాజ్యాన్ని వదలి అరణ్యవాసం వెళ్లాడు. గౌతమ బుద్ధుడు రాజ్యాన్ని వదలి తపస్సుకు వెళ్లాడు. ఈ దేశంలో సంసార సుఖాల కన్న, రాజ్యభోగాల కన్న జ్ఞానానికి విలువ ఎక్కువ తల్లీ. జ్ఞాని పాదాలముందు ప్రపంచం మోకరిల్లుతుంది. అమ్మాయీ! వైరాగ్యం అంటే అన్నీ వదులు కోవడం కాదమ్మా! వైరాగ్యం వల్ల మానసిక శక్తి పెరుగుతుంది. జ్ఞానం పెరుగుతుంది. సత్న్యాసం ఏర్పడుతుంది.

అంతలో చంద్రగుప్త దండాయన కుటీరం వైపు వెళుతూ ఇటు చూచాడు. కార్నిలియా, ఆచార్యల సంభాషణ విన్నాడు.

'అబ్బ ఎవరీ యువతి? అప్సరసలా ఉంది. గురుదేవులు తనతో ప్రేమ ప్రస్తావన చేసినప్పటినుండి తన ఆలోచన యువతులపైకి పోతోంది. ప్రేమించమని సంకేతించారు ఎందుచేత? ఈ యువతినే దృష్టిలో ఉంచుకుని ఆ ప్రస్తావన చేశారా! ఇంతకంటే సౌందర్యవతి ఉండడం అసంభవం.'

లోపలకు తొంగిచూచాడు చంద్ర.

"రా. చంద్రగుప్తా! నీకోసమే చూస్తున్నాను. ఈ అమ్మాయి కార్నిలియా. సెల్యూకస్ కూతురు. ఇక్కడే ఉంటుంది. దండాయన వద్ద యోగం, ధ్యానం నేర్చుకుంటుంది. ఆమెకు ధ్యానం కుదరడం లేదట. అదేమిటో కాస్త చూడవయ్యా"

చంద్రగుప్త కార్నిలియా దగ్గరగా వెళ్లి నిర్మోహమాటంగా అన్నాడు.

'గురువుగారు అధికారాన్ని వదులుకోమని చెప్పరు

కానీ త్యాగంలో వివేకం ఉందంటారు.'

మాటల వశీకరణ మంత్రం చాణక్య నేర్పిందే.

★ ★ ★

చంద్రగుప్తుని రాజకుమారునిలా అలంకరించాడు సింహరన్. రాజ్యం లేని యువరాజు చంద్రగుప్తుడు. కార్నిలియా చంద్రగుప్తుని అందం, ఠీవి చూచి ముసిముసిగా నవ్వుకుంది. చాణక్య నవ్వుకున్నాడు. ప్రేమరథం కదిలింది.

చాణక్య మదిలో తన ప్రేయసి సువాసిని మెదిలింది. ప్రేమకైనా కాలం కలిసి రావాలి!

## కపోతసందేశం


దండాయన ఆశ్రమం ప్రక్కన పెద్ద మంచె ఏర్పాటైంది. వెదురుగడల వేదిక. చాణక్య శిష్య సమేతంగా వేదికపైకి వచ్చి సిద్ధార్థకుని ప్రశ్నించాడు.

"సిద్ధార్థకా! పావురాలు సిద్ధమేనా?"

సిద్ధార్థకుడు పావురాలకు శిక్షణ యిస్తాడు. ఒక తెల్లపావురం ఎగురుతూ వచ్చి సిద్ధార్థక భుజంపైన వాలింది. అది వెయ్యిన్నొక్క వంద యోజనాలు ప్రయాణం చేసి వచ్చింది.

వార్తా ప్రచారానికి పూర్వం పావురాలే సాధనాలు. ఆకాశంలో పైకి ఎగిరిన కొద్దీ పావురాలు వేగం పుంజుకుంటాయి. శ్రమ లేకుండా పోతాయి. చాణక్య యిచ్చిన పత్రాన్ని సిద్ధార్థకుడు పావురం కాలికి కట్టి, గమ్యం గుర్తులు చెప్పాడు. అది గాలిలో పాటలీపుత్ర వేపు ఎగిరిపోయింది.

ఆ లేఖా సందేశం కోసం అక్కడ జీవసిద్ధి ఎదురు చూస్తున్నాడు.



# 9. అగ్ని పుష్పం

**అతని ఒడిలో వాలి, తమకంగా వక్షాన్ని నిమురుతూ మెడచుట్టూ చేతులు వేసి పెదాలు అందిస్తోంది సువాసిని. ఆమె వయసు పాతికలోపు.** పరువాల నిండు జవ్వని. తమితీరని ప్రేమదాహం. కవ్వించే కళ్లు. కాంక్షలూరించే ఒళ్లు, గుబులు పుట్టించే వంపు సొంపులు, నయగారాలు. ఆమె కాముకత్వానికి ప్రతిరూపంగా ఉంది. ఒకనాడు ఆమె చాణక్య ప్రియురాలు. ఇప్పుడు ధననందుని ప్రధాన సచివుడు రాక్షసుడి ఆత్మీయురాలు.

మగధను మండించగల ఏకైక అగ్నికణం సువాసిని. అది చాణక్య వదలిన అగ్నిపుష్పం అని ఎవరికీ తెలియదు, చాణక్య అంతరాత్మకు తప్ప. చిన్నతనంలో చాణక్య అజ్ఞాతంగా ఆమెను ఆరాధించాడు. అతని ప్రేమ అవ్యక్తం. చాణక్య ప్రేమ పూజ కోసం వికసించిన పుష్పం రాక్షసుని చేతికి చిక్కింది. సువాసిని శృంగారాన్ని, జాణతనాన్ని తన ఆశయసిద్ధికి ఉపయోగించుకోవాలని చాణక్య అనుకోలేదు. కానీ జరిగిందది. జరిగిందని తెలిసిన తర్వాత ఉపేక్షించడం, చూచీ చూడనట్లు ఉండడం చాణక్యం. అది రాజనీతిలో చివరినీతి కావచ్చు. కాని రాజకీయక్రీడలో మాత్రం తొలి విజయం. రాజకీయ ప్రయోజనాలకు ఆడదాని అందం బలి కావడం చరిత్రలో కొత్తకాదు. ఆడదాని అందం కారణంగా మహా సంగ్రామాలే జరిగాయి.

మహామహారాజ్యాలే పతనమైనాయి. రోమ్ మహాసామ్రాజ్య పతనానికి స్త్రీ సౌందర్యమే కారణం. మహాభారత యుద్ధానికి ద్రౌపది కారణం. రాజకీయంలో వ్యక్తిగతమైన ప్రేమ స్వార్థం అవుతుంది.

సువాసిని లావణ్యం చాణక్యకు ఒక మెత్తని ఆయుధం అయింది. పురుషుని భౌతిక అవసరాలకు స్త్రీ బలికావలసిందే! రాజ్యాంగ అవసరాలకు స్త్రీ సౌందర్యం, సౌశీల్యం ఎర కావలసిందే. ధననందుడు, రాక్షసుడు ఇద్దరూ స్త్రీ లోలురే. ఇద్దరూ వ్యసనపరులే. సువాసిని విషయంలో ఇద్దరూ ప్రియులే. సువాసిని శరీర సౌష్ఠవం, రంగు, హంగు, వయ్యారం ఎటువంటి వారినైనా మత్తెక్కిస్తాయి. ఉవ్విళ్లూరిస్తాయి. రక్తం ఉరకలు వేస్తుంది. తప్పులు చేయిస్తుంది. సువాసిని జాణతనం అందానికి మరింత దాసోహం అనిపించింది. ఎంతటి ధీరుడైనా అందానికి బందీ కావలసిందే. భీరువు కావలసిందే.

వాస్తవానికి సువాసిని అంతగొప్ప అందగత్తె కాదు. అప్సరస కాదు. సాదా సౌందర్యం ఆమెది. యవ్వన సౌందర్యం.

హోదా ఆమెకు అదనపు ఆకర్షణ. ఆమె అలంకరణ తీరులో ఉంది వశీకరణ. అందాన్ని మించిన ఆకర్షణ ఆమె వాలు చూపు. ఆమెను మొదటిసారి చూడగానే రాక్షసామాత్యునికి మతి తప్పింది. వెంటపడ్డాడు. తనదాన్ని చేసుకున్నాడు. గత్యంతరం లేక అతనికి ప్రియురాలైంది. ఇష్టపడి కాదు. ఇష్టపడినవాడు చెంతలేక, అందుబాటులో లేక.

రాక్షసుని కౌగిలిలో ఒదిగిపోతూ ప్రియ వచనాలు పలికింది 'రక్షో రక్షతి రక్షితాః' ప్రియా మీ రక్షణలో నాకు రక్షణ ఉండదా? మీ రాజుగారు నన్ను మరీ వేధిస్తున్నాడు, ఎవరితో చెప్పుకోను? నన్ను మహారాణిని చేస్తానంటున్నాడు. మహామంత్రి కూతురు మహారాణి అయితే దేశప్రజలు సంతోషిస్తారుట. అవునా? దేశం కోసం నన్ను ప్రేమిస్తాడా! నా కోసం నన్ను ప్రేమిస్తాడా ... మీరేమంటారు? మీ ప్రియురాలు మహారాణి కావడం మీ కిష్టమేనా? మహారాణినైనా మీ ప్రేమను కాదనను. అది వేరే విషయం. కాని శాశ్వతంగా మీ దాన్నిగా ఉండలేను గదా.

సువాసిని ఎత్తు అర్థం కాక చివాలున కౌగిలి వదలి దూరంగా తోశాడు. కోపంగా అన్నాడు, "నీ ఇష్టం సువాసినీ".

ఆమె రాక్షసుని చెవిలో రహస్యంగా చెప్పింది. ఏమని?

"ఈ స్వర్గం మరెక్కడా ఉండదు. ఈ సుఖం అక్కడ ఉండదు గాక ఉండదు. నాకు మీ తోడిదే ప్రపంచం. మీ తోడితే స్వర్గం."

రాక్షసుడు కాస్త శాంతించాడు : "అతను తాగుబోతు. వ్యభిచారి. అవునవును."

ధననందుని మధుపానలోలుడ్ని చేసింది రాక్షసుడని ఆమెకు తెలుసు.

అతను కోరిన అంగనలను అంతఃపురానికి చేర్చేది రాక్షసుడని తెలుసు.

నీతి కబుర్లు, నీటి మూటలు.

రాక్షసునికీ తెలుసు ధననందుని చూపు పడితే వదలడని. అతని చూపునుండి తప్పించుకోవడం అసంభవం. ఎలాగైనా తన శయన మందిరానికి తెప్పించుకుంటాడు. అందుకు ఇంతకాలంగా సహకరిస్తున్నది తనే. లేకపోతే తనకు ఆంతరంగిక మంత్రి పదవి లభించి ఉండేది కాదు. తను చేస్తున్న మంత్రాంగం ఏముంది?

"ఎంతచెడ్డా అతను మహరాజుకదా సువాసినీ."

"చచ్చినా ఒప్పుకోను. కాదంటే నా తల తీయిస్తాడు. అంతేగదా. నాకు నా శీలం ముఖ్యం గాని సింహాసనం కాదు."

"రాక్షసుడు లోపల అనుకున్నాడు ... నా బాధ నీ గురించి కాదు తల్లీ. అతగాడు ముందుగా నాతల తీయిస్తాడు. లేకపోతే నరకానికి పంపిస్తాడు నిన్ను నన్నూ కలిపి".

★ ★ ★

"హాయ్ హాయ్ ... ధన నాథా" అంటూ హొయలొలికించింది సువాసిని. ధననందుని కౌగిలిలో ఉన్నంతసేపు 'ధననాథా' అని మురిపిస్తుంది. మత్తెక్కిస్తుంది. ఊపిరాడనివ్వదు. ఆలోచించనివ్వదు.

రెండు చేతులతో ధననందుని బంధించి ముద్దిచ్చింది.

"ఏమిటి ధననాథా! మీ ప్రధాని ఆ రాక్షసమంత్రి నా ప్రాణం తీస్తున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలట నేను. అసలు తను పుట్టిందే నా కోసమట."

"బండవెధవ. వాడు నీకు మొగుడేమిటి సువాసినీ. నీవేమో సుకుమార కుసుమానివి. వాడేమో బండవెధవ. వాడేమో ఏనుగు – నీవేమో సంపెంగవు. ఎక్కడ సాపత్యం. అతగాడు నిన్నేం సుఖపెడతాడు. వాడు నా మంత్రి. అంటే నా సేవకుడు. నేను రాజుని, మగధ చక్రవర్తిని."

"అట్లా జరగడానికి వీల్లేదు ప్రియా."

ఆమె మునివేళ్లతో అతని చుబుకం రాసింది. అతని గుండెపై నిమిరింది. తలవంచి అతని పెదాలకు తన పెదాలు అందించింది.

"ధననాధా, నువ్వంటేనే నాకిష్టం. మాటలలో చెప్పలేనంత ఇష్టం. నేను మేనకను. నీవు విశ్వామిత్రుడవు. ఉహు. సువాసినీ శ్రియుడవు. మన బంధం, మన అనుబంధం శాశ్వతం కావాలి. చారిత్రకం కావాలి. ముందు తరాల వారికి మన ప్రేమ ఆదర్శం కావాలి" అన్నది.

"శయనేషు రంభా' అన్నారు కానీ నీవు సర్వకాల సర్వావస్థలలోనూ నా రంభవే సువాసినీ."

ఆమె తృప్తిగా, మత్తుగా కళ్లు మూసుకుంది.

"అతని విషయం మరచిపోండి రాజా! పొరపాటున అతని ప్రస్తావన చేశాను మన్నించండి? మీ మధుర క్షణాలను వృధా చేశాను" అన్నది.

★ ★ ★

విష్ణుగుప్తుడు రాయని నాటకంలో తన పాత్ర ఇది. తను విష్ణుని మరచిపోలేదు. బాల్యప్రేమ గదా! విష్ణుగుప్త తనని నిజంగా ప్రేమిస్తున్నాడా? ప్రేమిస్తే ఈ నాటకం ఆడడం ఎందుకు? ఈ త్రికోణ ప్రేమకు అర్థం ఏమిటి? ఆంతర్యం ఏది? ముగింపు ఎలా ఉండబోతోంది?

నిజం తెలిస్తే, రాక్షసుడు బ్రతికి ఉండగలడా?

ఈ ధననందుడు గుండె పగిలి చస్తాడు.

తర్వాత విష్ణు తనను ప్రేమిస్తాడా?

"ఏమిటా దీర్ఘాలోచన సువాసినీ" అంటూ ధననందుడు మరొకమారు ఆమెను కౌగిలిలో బంధించాడు. అది నవరాత్రి కాదు అది అతనికి చివరి రాత్రి.

★ ★ ★

నడిరేయి ... రాజభవనం ప్రశాంతంగా ఉంది.

ఆలోచనా మందిరంలో ధననందుడు, ఆంతరంగిక మంత్రి రాక్షసామాత్య తీవ్ర సమాలోచనలో ఉన్నారు. చుట్టూ నేతి దీపాలు వెలుగుతున్నాయి.

ధననందుడు గంభీరంగా అన్నాడు.

"రాక్షసా! నా ప్రతినిధిగా నీవు వెళ్లి అలెగ్జాండరును కలవాలయ్యా! అతను పర్షియా వదిలి వెళ్లే లోపునే వెళ్లి కలవాలి సుమా! నేను తనతో స్నేహం అభిలషిస్తున్నానని నమ్మించాలి. ఒకసారి మగధకు రమ్మని ఆహ్వానించు."

"మహారాజా! గాంధార ప్రయాణం అంత సులభం కాదు. వెళ్లితే ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారా? నేను తిరిగి వచ్చేవరకు ఇక్కడ పరిపాలనా వ్యవహారాలు చూచేదెవరు?" అడిగాడు రాక్షసమంత్రి.

"అదీ నిజమే మిత్రమా! మరొకరిని నమ్మి బాధ్యతలు అప్పగించలేము గదా. అలెగ్జాండరు, అంభి, పౌరస్‌ల స్నేహం మనకు ఇబ్బందిగా మారింది. వాళ్లు ఏకమై మనపైకి దండెత్తి వస్తే" బాధపడ్డాడు ధననంద.

"మహారాజా! నా ప్రయాణానికి సైనిక సహాయం అవసరం. రాచకార్యం మీద ఒంటరిగా పోలేను గదా. ఇరుగుపొరుగు రాజ్యాలు మనకు వ్యతిరేకం. ఎంత రాయబారినైనా సైన్య సహాయం అవసరం. పైగా ఆయనకు విలువైన బహుమతులు బంగారం, వజ్రవైఢూర్యాలు తీసుకుపోవాలి గదా."

"అవును ఆ ఏర్పాట్లు చేయిద్దాం. నీవు ప్రయాణానికి సిద్ధంగా ఉండు. నీవైతే విజయం సాధించగలవని నా నమ్మకం. నీ వాళ్ల గురించి బెంగపడకు. నీవు తిరిగి వచ్చేవరకు వారి రక్షణ, బాధ్యత పోషణ భారం నాది."

"అవును చూసుకుంటావ్. ఎందుకు చూసుకోవూ?" అనుకున్నాడు మంత్రి.

★ ★ ★

**విశాల ప్రాంగణంలో అది ఒక శిథిలాలయం. అది నగరానికి దూరం కావడం వల్ల నగరవాసులెవరూ ఆ దేవాలయం దర్శించరు. శిథిలాలయం కావడం వల్ల మూల విగ్రహం కనిపించదు. పూజలు, అర్చనలు లేవు.**

అక్కడ సువాసిని ఎవరికోసమో ఎదురు చూస్తోంది. అతను జీవసిద్ధి. కాత్యాయనకు కుడిభుజం వంటివాడు. నమ్మకస్తుడు. చాణక్యను పులిబారి నుండి రక్షించినవాడు. కాత్యాయన ఇప్పుడు పాటలీపుత్రలో చాణక్యకు నమ్మకమైన వ్యక్తి. ఆలయం రాతి స్తంభాలు, గోడలు కూలిపోయాయి. గుట్టలు కుప్పలుగా కనిపిస్తున్నాయి.

నాడు పున్నమి. వెన్నెలలో శిథిలాలు మంచుకొండల్లా అగుపిస్తున్నాయి. జీవసిద్ధి చేతిలో నూనె కాగడా వెలుగుతోంది. నిజానికి కాగడా అవసరం జీవసిద్ధికి లేదు. సువాసినికి లేదు. ఇద్దరికీ అది పరిచయమైన ప్రాంతమే. ఆ దేవాలయం ఒక మునిశాపం వల్ల పాడుబడ్డదని చెబుతారు.

“ఏమిటో తెచ్చినట్లున్నావ్?” అడిగాడు జీవసిద్ధి.

సువాసిని రెండు లేఖలు అందించింది.

ఒకదానిలో ధననంద రాజముద్రిక, ఉంగరం ఉన్నాయి. రెండవ లేఖతో రాక్షసమంత్రికి ఆయన తండ్రిగారు బహుమతిగా యిచ్చిన ఉంగరం.

సువాసిని చాలా దిగులుగా, బాధగా అన్నది. “విష్ణు కష్టాలలో ఉన్నాడు. తన రాజకీయ లబ్ధికోసం నన్ను ఎర వేస్తున్నాడు. దారుణంగా.”

“సువాసినీ! మనం చేసే ప్రతి పనికీ ప్రయోజనం ఉందమ్మా.

ఆచార్య చాణక్య నీవీ ఉత్తరం చదివిన తర్వాత కాల్చి బూడిద చేయమన్నాడు.”

“ఏమిటా మహత్తర సందేశం మహాశయా? అంతగోప్యమా? చెప్పండి. విష్ణుగుప్త సందేశం వినాలని ఆత్రుతగా ఉంది.”

జీవసిద్ధి లేఖ చదవసాగాడు.

“ప్రియ సువాసినీ,

మనం ప్రేమికులం అన్న సంగతి అందరికీ తెలుసు. కొత్తగా నిన్ను ప్రేమిస్తున్నాను అని దండోరా వేయనవసరం లేదనుకుంటా. అంతా విధి విచిత్రం. ఎప్పటికప్పుడు నీవు చేతికందినట్లే ఉంటావు. అందవు. నేను ప్రేమించిన వ్యక్తివి నీవొక్కర్తివే సుమా. నేను జన్మజన్మలకు నీ వాడినే. నా ప్రస్తుత కర్తవ్యం వేరు. రాజకీయ చదరంగంలో, భారతాన్ని ఏకం చేయవలసిన

తరుణంలో నా జీవితంలో ఒక స్త్రీకి ప్రవేశం లేదు. అంతవరకు బ్రహ్మచర్యం పాటిస్తానని శపథం చేశాను. అఖండ భారతం సాధించే వరకు విశ్రమించేది లేదు. నా కల సాకారం కావాలి సువాసినీ. నేను పుట్టింది సుఖపడడానికి కాదు. దేశప్రజల్ని సుఖపెట్టడానికి. నా లక్ష్యం సిద్ధించే నాటికి నేను ముసలి వాడిని అవుతానేమో! ఆడతోడు అవసరం లేకపోతే బ్రహ్మచర్యమే కదా! నీ సహాయానికి సర్వదా కృతజ్ఞుణ్ని. నీకు పై జన్మకు రుణపడి ఉంటాను. నాలాగా నిన్ను బ్రహ్మచర్యం పాటించమని కోరను. నాకు స్వార్థం లేదు. నీ త్యాగం చాలా గొప్పది సువాసినీ. నీకు సదా నా ఆశీస్సులు. భగవంతుడు నిన్ను సదా రక్షించాలని కోరుకుంటాను.”

ఆ మాటలు వింటుంటే ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి. గుండె ప్రేమతో ఉప్పొంగింది. మరొకసారి చదవమని అర్థించింది. జీవసిద్ధి ఆ లేఖను మంటలో వేసి భస్మం చేశాడు. మళ్లీ చదవలేదు.

‘వస్తా సువాసినీ’ బయలుదేరి చీకటిలో కలిసిపోయాడు.

సువాసిని ఏడవలేక నవ్వింది. నవ్వి “విష్ణూ నీకు నా జోతలు” అనుకుంది.

“ఓం త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనం
ఉర్వారుక మివ బంధనాత్ మత్యో ర్ముక్షీయ మామృతాత్” జపించింది.

★ ★ ★

**ధననందుని ఏకాంతమందిరం.**

**ఎదురుగా ఒక చారుడు వణికిపోతూ, భయంగా నిలబడిఉన్నాడు.**

తను ఈ పని చేయవలసింది కాదు. ధననందుడు ఆ లేఖ పూర్తిగా చదివేవరకు వణుకుతూనే ఉన్నాడు చారుడు.

రాక్షసామాత్యుని శిబిరం నుండి కేకయరాజుకు రాసిన లేఖ తీసుకు పోతుండగా పట్టుబడ్డాడు. ధననందుని ముందు నిలవగానే ప్రాణం పోయినంత పనైంది.

లేఖచదివిన ధననంద మొహం జేవురించింది. కోపంలో ఎర్రబడ్డది.

ఉత్తరంలో ఏముంది!

"వీర, ధీర, పౌరస్ మహాశయా!

మగధ అమాత్యుడు రాక్షసుని అభివాదాలు. నేను తమరి దర్శనం కోసం వస్తున్నాను. ఇది నా స్వంతపని, రాచకార్యం కాదు. మీ ధైర్యసాహసాలు, వీరోచిత చర్యలు జగద్విదితాలు. మీరు అనుమతిస్తే మనం కొన్ని విషయాలు రహస్యంగా మాట్లాడుకోవలసి ఉంది. అవి ఉభయతారకం. దానివల్ల మీ రాజ్య విస్తరణ జరుగుతుంది. విలువ పెరుగుతుంది. ఇది చాలా గోప్యమైన, బలమైన అంశం. మన ఇద్దరి మధ్య ఉండవలసింది. మూడవ వ్యక్తికి తెలియకూడదు. మీ అనుమతి కోసం ఎదురుచూస్తూ – రాక్షసామాత్య."

"ఇది మంత్రి లేఖ అని ఎట్లా నమ్మడం" గట్టిగా ప్రశ్నించాడు ధననంద.

అది నకిలీ అని చెబుతాడని ఆశించాడు. చారుడు అంతా నిజమే తప్ప అబద్ధం చెప్పలేని అమాయకుడు.

"అనుమానించవలసిన అవకాశం లేదు మహారాజా".

రెండడుగులు ముందుకు వచ్చి, గుర్తుగా రాక్షసమంత్రి ఉంగరం చూపించాడు.

"ఇది ఆ ఉత్తరంలో ఉంది మహారాజా. కేకయరాజుకు నమ్మకం కలగాలి కదా."

"హారి ద్రోహీ. దుర్మార్గుడా" అని పళ్లు పటపట కొరికాడు ధననంద.

"ఆ ద్రోహిని వెంటనే బంధించి, నా ముందుకు తీసుకురండి. అవసరమైన సైనికుల్ని పంపండి."

★ ★ ★

"సువాసినీ ... నా హృదయ రాణీ."

రాక్షసుని మగధలో లేకుండా చేశాం. కొన్ని నెలల వరకు అతను తిరిగి రాడు. ప్రేమ సామ్రాజ్యంలో మనిద్దరమే. రా . సువాసినీ నీ తీయని కౌగిలికోసం ఆరాటంగా ఉంది. వచ్చేయ్ దేవీ! – ధననంద"

ఆ లేఖ రాక్షసమంత్రి చేతికి చిక్కింది. రాక్షసుడు గూఢచారి వైపు చూచాడు. అది ధననందుని రాజముద్రిక. "ఆ వెధవ నేను చనిపోతే సువాసినిని తన సొంతం చేసుకోవాలని పన్నాగం" అనుకున్నాడు.

"అయింది చాలు. చేసిందే ఎక్కువ. నా జీవితం అంతా ధననందుని సంతోషం కోసం వెచ్చించాను. వాడొక జంతువు. విశ్వాస ఘాతకుడు. వాడిని వదిలిస్తే చాణక్య ఒక లెక్క కాదు" రాక్షసమంత్రి స్వగతం.

★ ★ ★

**"అట్లా తినకూడదు రా. ముందు చివరలు కొరికి తినాలి. తర్వాత నెమ్మదిగా మధ్య భాగం. కొనలు తినే లోగా రొట్టె చల్లబడుతుంది."**

చాణక్య దండయాన ఆశ్రమంలో కూర్చుని ఆ దృశ్యాన్ని చూస్తున్నాడు. ఇంటి పరిచారిక పాతికేళ్ల యువతి తన కొడుకును మందలిస్తోంది. వాడు జొన్నరొట్టె తింటున్నాడు కష్టపడి.

ఆ మాటల్లో చాణక్యకు ఏదో అంతరార్థం స్ఫురించింది.

దండయాన మహర్షి ఆశ్రమం అతి సుందరంగా ఉంది. దట్టమైన చెట్ల మధ్య అక్కడక్కడ పర్ణశాలలు. అల్లంతదూరంలో కొండలపైనుండి వచ్చే చిన్న జలప్రవాహం. సున్నితంగా వీచేగాలి తరంగాలు. అక్కడి వాతావరణంలో సహజ ప్రశాంతత, పవిత్రత ఉంది. ప్రకృతి మధ్య ధ్యాన సమాధిలో ఉన్నట్లు అనిపిస్తాయి ఆశ్రమ పర్ణశాలలు. యజ్ఞశాలలో నిత్యాగ్ని సెగలు అగ్నియోగ రహస్యం చెబుతున్నట్లుంది.

చాణక్య ప్రక్కన చంద్రగుప్తుడు.

ఎంత చూచినా తనివి తీరడం లేదు. చంద్రగుప్త తలఎత్తి చూచాడు. చాణక్య తనలో తను నవ్వుకుంటున్నాడు.

"ఏమిటి ఆచార్యా విశేషం?" చంద్రగుప్తుని ఆసక్తి.

చాణక్య నవ్వడం అంటే ఎవరి కొంపకో ఎసరు పెట్టినట్లే!

చాణక్య : ఏమిటి చంద్రా! మన పథకాలు అన్నీ బెడిసికొడుతున్నాయి.

నా కన్న చదువు సంధ్యలు లేని ఆ అమ్మాయి తెలివిగలది అనిపిస్తోంది. ఆమె మాటల్లో ఎంత రణతంత్రం ఉంది!

చంద్రగుప్తకు అర్థం కాలేదు. ఆ పిల్ల మాటలకు, రణతంత్రానికి ఏమిటి సంబంధం? అయినా వివరణ అడగలేదు. అడిగినా చాణక్య సూటిగా చెప్పడు.

చాణక్య : “చూడు చంద్రా! నేటివరకు నా లక్ష్యం మగధ ఆక్రమణ. చంద్రగుప్తుని రాజ్యాధికారం. నిన్ను చక్రవర్తిని చేయడం నా ఏకైక లక్ష్యం. అది పొరపాటు. మగధ చుట్టూ చిన్నా చితకా దేశాలు చాలా ఉన్నాయి. ముందు వాటిని జయించాలి. చివరకు ‘మగధ’ను దిగ్బంధం చేయాలి. మగధకు అసలైన పోటీ గాంధారం, కేకయి. ఆ రెంటిని చల్లపరిస్తే చాలు. ‘విభజించి పాలించు’ సూత్రం పాటించాలి.

★ ★ ★

“మగధలో సువాసిని ధననందుని, రాక్షసమంత్రిని ‘చెడుగుడు’ ఆడిస్తోంది. నా అభిప్రాయం కొద్దిరోజుల్లో రాక్షసుడు ఇక్కడకు వస్తాడని తన ఆత్మీయ అనుచరుడి చేత సందేశం పంపాడు. ఈ రాక్షస మంత్రి ఒకనాటికి మన మిత్ర బృందంలో చేరతాడేమో. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు శాశ్వత శత్రువులు ఉండరు చంద్రబాబూ!”

చాణక్య నవ్వాడు. చాణక్య నవ్వితే నాలుగు ప్రళయాల పెట్టు.

చంద్ర : అది కాదు ఆచార్యా! ఉత్తరాపథంలో ఇప్పటికీ బలమైన రాజ్యం మగధ. రెండు లక్షల సేన. ఎనభైవేల ఆశ్వికదళం. ఎనిమిది వేల రథాలు. ఆరువేల యుద్ధపుటేనుగులు ఉన్నాయి మగధకి. కనుక మగధను జయించడం కలలోని మాట. అలెగ్జాండరు వంటి వాడే గంగను దాటడానికి భయపడ్డాడు.

చాణక్య : సరైన నాయకత్వం ఉంటే పదిమంది సైనికులు వందమంది శత్రువుల్ని మట్టుపెట్టవచ్చు చంద్రా! యుద్ధం అంటే కత్తులు, కటార్లు కాదు. కొట్టుకోడాలు, చావడాలు కాదు, తంత్రం. యుద్ధం అంటే రణతంత్రం. సంఖ్యాబలం అసలు బలం కాదు. మనోబలం వ్యూహబలం కావాలి. ఏ సమస్య నేరుగా పరిష్కారం కాదు. అది చిన్నపిల్లల ఆట.”

వారి సంవాదన బయట సైనికుల సంరంభంతో ఆగిపోయింది.

“సింహరన్ ఎవరో వస్తున్నారు చూడు” చాణక్య సింహరన్‌ను ఆదేశించాడు.

“అలెగ్జాండర్ గురూజీ! దండాయన మహర్షి దర్శనం కోసం వస్తున్నాడు” అన్నాడు.

అలెగ్జాండరు తనకు ప్రియమైన బొకపాలిస్ గుర్రంపైన ఠీవిగా వస్తాడు. అది అలెగ్జాండర్ తండ్రి ఫిలిప్ యిచ్చిన బహుమానం.

అది పొగరుబోతు గుర్రం. దానిని మచ్చిక చేసుకుని ఎక్కడం ఎవరి వల్ల కాలేదు. అలెగ్జాండరు ఒక్కడే దానిని లొంగదీసుకుని స్వారీ చేశాడు. ఫిలిప్ ఆ గుర్రాన్ని అలెగ్జాండరుకు బహుమతిగా యిచ్చాడు. ఆ గుర్రం ఎక్కితే అలెగ్జాండరుకు అన్నీ విజయాలే. అలెగ్జాండరుతో పాటు ఆ గుర్రం అన్ని దేశాలు తిరిగింది.

అలెగ్జాండరు విజయంలో సగం దానికే దక్కాలి.

★ ★ ★

**ఆశ్రమం అల్లంత దూరంలో గుర్రాలు దిగి, శిరస్త్రాణాలు తీసి చేతుల్లో పట్టుకుని కాలినడకన బయలుదేరారు గ్రీకువీరులు. అలెగ్జాండరును చూడగానే చాణక్య శరీరం పులకరించింది. మహావీరుడు గదా! ఆ ఠీవి, దర్పం.**

అలెగ్జాండరు మామూలు దుస్తులు ధరించాడు. కత్తులు కటార్లు లేవు. సైప్రస్ రాజు బహూకరించిన కరవాలం మాత్రం లాంఛనంగా ధరించాడు. అతనికి శశిగుప్త దుబాసి.

అలెగ్జాండరు దండాయన యోగికి నమస్కరించి ప్రశ్నించాడు.

“మహర్షీ! మీరు యోగులు. నేలను పాదాలతో తొక్కడం పాపం గదా!”

దండాయన : మహాయోధా! ఎంతటి వారికైనా కాలు మోపగలిగినంత వరకే తనది. అనుభవించగలిగిందే సంపద. నీవు ఎంత వీరుడివైనా మాలాంటి మనిషివే! ఎన్ని రాజ్యాలు జయించినా, చివరకు నీకు కావలసింది ఆరడుగుల నేల!

అలెగ్జాండర్ మొహం పాలిపోయింది. ఆయన పైకి సైనికులు కత్తులు దూశారు. అలెగ్జాండరు వారిని వారించాడు.

దండాయన దిగంబర మహర్షి. ఒంటి మీద నూలుపోగు ఉండదు.

“మహర్షీ! మీరు నాతో రండి. నాకు సలహాదారుగా, గురువుగా ఉండండి. మిమ్మల్ని బంగారంతో పూజిస్తాను. మీకు ఏ లోపం రానీయను.”

దండాయన : ఇప్పుడు నాకు ఏమీ లోపం లేదు. నీవు నన్ను పూజించడం ఎందుకు?

అలెగ్జాండరుకు తెలుసు. మహర్షుల మనస్సు. గ్రీసులోనూ యోగులున్నారు, రుషులున్నారు.

అలెగ్జాండరు తల్లి ఒలంపియా. తండ్రి ఫిలిప్. గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ అలెగ్జాండరుకు గురువు. అలెగ్జాండర్‌ను తీర్చిదిద్దినవాడు నియోనిడస్. వీరందరికీ ఋణపడి ఉన్నాడు అలెగ్జాండరు.

దండాయన : అలెగ్జాండర్! నాకు ఎవరి సహాయం అవసరం లేదు. నాకున్నది చాలు. ఆశ పడడం, ఆశించడం మా దృశులకు చాతకాని పనులు. నీవు యిస్తానన్నవి ఏవీ నాకు వద్దు. ఎవరి దయ దాక్షిణ్యం నాకు అవసరం లేదు. అవి నీ దగ్గరే ఉంచుకో. నేను చనిపోతే, ఈ శరీరం పోతుంది. నాలోకం ఆపైన ఉంది. అక్కడికి వెళ్లిపోతాను. ఈ లోకంతో నాకు పనిలేదు.

అలెగ్జాండర్ ఓటమిని అంగీకరించి దిగంబర సన్యాసి ముందు నిలబడ్డాడు. "ఆర్యా! నాకు మీ ఆశీస్సులు కావాలి. నన్ను విజేతగా ఆశీర్వదించండి."

"రాగద్వేషాలను జయించిన వాడు నిజమైన విజేత. వాటిని జయించు."

అలెగ్జాండరు ఆశించిన ఆశీస్సులు అవి కాదని దండాయనకు తెలుసు. అలెగ్జాండరు కోరింది, ఆయనకు కావలసింది తను ఇవ్వలేదు.

దండాయన ఆశ్రమంలో ఉండగానే అలెగ్జాండరులో అంతర్మథనం ఆరంభమైంది. సైన్యంలో నైతిక బలం తగ్గింది. అలెగ్జాండరు సేనలు మెసడోనియా వదలి చాలా కాలమైంది. దారిలో పర్షియాను జయించాడు. పర్షియా అతనిని 'షాహెన్‌షా'గా అంగీకరించింది.

తర్వాత భారత్‌వైపు బయలుదేరాడు. గాంధార, కేకయరాజ్యాలు జయించాడు. ఇంక మగధ ఒక్కటే మిగిలింది. అలెగ్జాండరు సేన వస్తున్నదని తెలియగానే భారతదేశం తిరుగుబాటుకు సిద్ధమైంది.

★ ★ ★

'అహో! మిత్రమా! చాణక్యా! బహుకాల దర్శనం! ఎంతకాలమైంది నిన్ను చూచి'.

ప్రేమను నటిస్తూ రాక్షసుడు చాణక్యను ఆలింగనం చేసుకున్నాడు.

"రాక్షసా! మీరాక మాకు ఆనందం, కులాసా?"

అంతకు మించిన లౌక్యం ప్రదర్శించాడు చాణక్య. ఒకరిని మించిన వారొకరు! ఇద్దరికిద్దరు సుమంత్రులే! ఇద్దరికిద్దరు లౌక్యులే!

"ధననందుడు హద్దులు మీరి ప్రవర్తిస్తున్నాడు ఆచార్యా!"

రాక్షసమంత్రి ఫిర్యాదు.

"హద్దు మీరి ప్రవర్తిస్తున్నాడా! సరిహద్దులు దాటి పోతున్నాడా?"

'నువ్వేదో నీతిమంతుడివైనట్లు, నీ సంగతి ఎవరికి తెలియనిది' అనుకున్నాడు చాణక్య స్వగతంలో.

"అవును రాక్షసా, వింటున్నాను. ధననంద కొలువు నీ వంటివారి సేవలకు తగదు. అదే కదా నీ ఆక్రోశం."

రాక్షస మంత్రి మరొక మెట్టుపైకెక్కి అన్నాడు "జీవితంలో సుఖాలు ఇచ్చేవన్నీ అక్రమం అనిపిస్తాయి చాణక్యా. అవినీతి కూడా."

చాణక్య ఉపవిష్టమైన చాపపైన అంతదూరంలో కూర్చున్నాడు రాక్షసుడు.

"అవును రాక్షసా. రెండు చెడుల్లో ఏది తక్కువ చెడు అన్నది సమస్య. అవునా? నేను తక్కువ 'చెడు' అనీ నీ అభిప్రాయం" వంకరగా చూచాడు చాణక్య. మెత్తగా చురక అంటించాడు.

"కాలయాపన దేనికి గాని నేరుగా విషయానికి రావయ్యా మిత్రమా" అన్నాడు చాణక్య.

"ఎంతైనా నీది ఆచార్యస్థానం కదా!"

"అర్చకస్థానం కాదని పురోహితస్థానం కాదని గుర్తించావు సంతోషం?"

"ధననంద నీ ప్రాణాలకే ఎసరు పెట్టాడుట నిజమా."

"నీతో నాకు పోటీ ఏమిటి అమాత్యా. నీవు నీవే – నేను నేనే. నీవు అక్కడ – నేను ఇక్కడ. నీవు నాకు యోజనాలదూరం కదా. నీవు తెల్లటివాడివి. నేను నలుపు. నావి గొగ్గిపళ్లు. నీకు నాకు పోలికే లేదు. పోటీ అసలు లేదు.

పైగా నీవు ప్రధానమంత్రివి. సువాసినిని అడ్డం పెట్టుకుని నీవు వచ్చావని నాకు తెలుసు. ఆమె పట్ల నాకు మోజులేదు. నీవు నిశ్చితంగా ఉండవచ్చు. ఆమె నీ స్వంతం. ధననందుడు అడ్డురాకపోతే సువాసిని నీ స్వంతమే గదా."

"అది జరగని పని చాణక్యా. వాడు సింహాసనంపై బిగుసుకున్నాడు. వాడి దగ్గర సైనిక సంపద, ధన సంపద ఉంది. అలెగ్జాండరు వంటి వాడే ఆవైపు చూడడానికి జంకుతాడు."

"రాక్షసా ... యుద్ధాలు రణరంగంలోనే జరగవు తెలుసా? సైన్యం లేకుండా యుద్ధాలు చేయడం నాకిష్టం. అనవసర రక్తపాతం నాకిష్టం ఉండదు" చాణక్యది మెత్తగా ముగ్గులోకి దించే ప్రయత్నం.

"ఆచార్యా! అసలు యుద్ధాలే అవసరం లేని ఉపాయం ఉంటే చెప్పు."

"ఉన్నది మిత్రమా! చూడు మంత్రీ! ప్రతిపని ఫలితాన్ని బట్టి మంచి, చెడు అవుతుంది. సత్ఫలితం లేకపోతే అది మంచిది కాదు" అన్నాడు చాణక్య రాక్షసుని కళ్లలోకి చూస్తూ.

★ ★ ★

**అటుపోతే ...**

**పాటలీపుత్ర తూర్పువైపున ఒక శివాలయం ఉంది. శివాలయం వీధిలో ఒక నర్తనశాల ఉంది. అది చాలా ప్రసిద్ధం. రాజభవనం లాంటి కట్టడం.**

ఒకప్పటి 'రాజనర్తకి దాని యజమాని. ఆమె పేరు సభారంజని'. ఇప్పుడు బొండు మల్లెదండలా ఉంది కాని ఒకప్పుడు ఏడు మల్లెల పూబంతి. ఒకనాడు ధననందుని ప్రియభామిని, సభారంజని. ఒకానొక ధనవంతుడు ఇరవై వేల పణాలకు ఆమెను సొంతం చేసుకుని నర్తనశాల ఆమె పరం చేశాడు.

సభారంజని అనాథల్ని చేరదీసి నృత్యం నేర్పుతుంది. వారి మంచిచెడ్డలు చూస్తుంది. వారి పోషణభారం వహిస్తుంది. అది 'కళాపోసన'లో ఒక పార్శ్వం. ఈడు వచ్చే వరకు అమ్మాయిలు నృత్యం, సంగీతం, నటన సాధన చేస్తుంటారు.

నర్తనశాల రాజపోషకుడు చాణక్య అనే విషయం ఎవరికీ తెలియదు. పేరుకు నాట్యశిక్షణ కాని అక్కడ విషకన్యల తయారీ జరుగుతుంది. అక్కడ ఒక నిబంధన ఉంది. రోజు ప్రతిఒక్కరు పాలు తాగాలి. ఆ పాలలో ఏం కలుపుతారో గాని కాస్త చేదుగా, కాస్త వికారంగా, కారంగా ఉంటాయి. కాస్త

మత్తుగానూ ఉంటాయి. సభారంజనికి మాత్రం తెలుసు. అందంగా ఉన్న పిల్లల్ని, వయసొచ్చిన వాళ్లను మహాప్రేమగా చూస్తుంది. అది ఏమిటి? ఎందుకు? అని ప్రశ్నించని వారికి రాజభోగమే.

చిత్రంగా అక్కడ చేరే పిల్లలంతా మంగళవారం నాడు పుట్టినవారై ఉంటారు. విశాఖనక్షత్రంలో పుట్టినవారు, వృచ్చికలగ్న జాతకులు అయి ఉంటారు. వారి జాతకాలన్నీ రహస్యంగా ఉంటాయి. దాని పోషణా బాధ్యత సేనాపతిదని ఒక ప్రతీతి.

★ ★ ★

మనకు మల్లప్రియపై పట్టుదొరకాలి. అది చాణక్య నిర్ణయం. అందుకు తగినవాడు సింహరన్. మల్లప్రియ సింహాసనానికి అసలు వారసుడు సింహరన్. సింహరన్ తండ్రిని అతని సోదరుడే హత్యచేసి అధికారం చేపట్టాడు. అతను పౌరస్‌తో సఖ్యంగా ఉంటాడు. సింహరన్ మల్లప్రియ రాజు కాగలిగితే తమకు సైనిక స్థావరం ఏర్పడినట్లే.

చంద్రగుప్త ధైర్యం చేసి అడిగాడు : "మనకు తగినంత బలగం, బలం ఉన్నాయి. మల్లప్రియను ముట్టడించి స్వాధీనం చేసుకోవచ్చు గదా."

"అంత బుద్ధి తక్కువ పని మరొకటి ఉండదు చంద్రా! అది రాజకీయం కాదు. ఒకడు తప్పు చేస్తున్నప్పుడు ఆ తప్పును కెలకడం మంచిది కాదు."

"మల్ల రాజ్యం 'ఏ' తప్పుచేసింది ఆచార్యా?"

"ఇంతవరకు చేయలేదు. రేపు చేయదని లేదు. అది తప్పు చేయబోతోంది త్వరలో ... ఆ తప్పిదం వల్ల మల్లరాజ్యం మన చేతికి అందుతుంది."

చంద్రగుప్తకు ఏమీ అర్థం కాలేదు.

★ ★ ★

**నిపుణిక నివాసం భయంకరంగా ఉంది. కారణం అది శ్మశానం దగ్గర కావటమే. శ్మశానాన్ని ఆనుకుని ఉంది అతని ఇల్లు. దాని సమీపంలో పెద్ద దయ్యాల మర్రిచెట్టు. అది తాంత్రిక ప్రయోగాల కేంద్రం. మాంత్రికులు, తాంత్రికులు, శవాలతో, పుర్రెలతో, చచ్చిన జంతువులతో ప్రయోగాలు చేస్తున్నారు. పరిసరాలలో రక్తపు మరకలు, దుర్వాసన. కుళ్లు, నీచు కంపు అంతా భీభత్స వాతావరణం.**

నిపుణకుడు క్షుద్రవిద్యలలో నిపుణుడు. దయ్యంలా చీకట్లో తిరుగుతుంటాడు.

మెడలో పుర్రెలదండ, చేతిలో ఎముక. అతను నరబలులిస్తాడని ఒక ప్రచారం ఉంది. బలులిచ్చిన రక్తంతో క్షుద్ర దేవతల్ని ఆరాధిస్తాడు.

నిజానికి క్షుద్రవిద్యలంటే చాణక్యకు అసహ్యం. అర్ధరాత్రి వేళ నిపుణకుడు శవం మీద నృత్యం చేసినా, శవ పూజలు చేసినా చాణక్య చలించడు. పదా! నిపుణకుడు కల్లు తాగి తూలుతుంటాడు. అయితే చాణక్య నిపుణకుని ఇల్లు వెతుక్కుంటూ ఎందుకు వెళ్లినట్లు? అది అర్థంకాని పరమ రహస్యం. గౌరవంగా చాణక్యకు స్వాగతం పలికాడు నిపుణకుడు.

"మరీ అంత వినయం వద్దులే. నీతో పని బడి వచ్చాను. కూర్చో" అతి వినయం దూర్త లక్షణం! నిపుణకుడు దూర్తుడే కాదు, పరమ కిరాతకుడు.

చాణక్య మాటలకు నిపుణకుడు నవ్వుకున్నాడు. చీకట్లో ఆ నవ్వుకు అర్థం తెలియలేదు.

"తమరు మనసులో ఏదో పెట్టుకుని వచ్చారని తెలుసు స్వామీ! ఆ మాత్రం తెలియదా? ఏదైనా బలి ఇవ్వాలా."

"అవేమీ వద్దులే" చాణక్య తనతో వచ్చిన వ్యక్తిని పరిచయం చేశాడు.

"ఈయన సింహరన్ అని నా శిష్యుడు. మల్లప్రియ రాజ్యానికి అసలు సిసలైన వారసుడు. ఇతనికి నీ సహకారం కావాలి. నీ రుణం ఉంచుకోడు."

"స్వామీ! నేను ఏదో పొట్టకూటి కోసం పాకులాడేవాణ్ని. చిన్నా చితకా మంత్రాలు, తంత్రం నేర్చుకున్నాను. పెద్ద పనులకు నేను తగను. కాదంటే నేనొక క్షుద్ర ప్రయోగం చేస్తా. దాని ప్రభావంతో ఈయన రాజు కావచ్చు."

"నీ ప్రయోగాలు, యజ్ఞాలు కాదులే. నే చెప్పినట్లు చెయ్యి చాలు. నీబుద్ధి ఉపయోగించు."

నిపుణకుడు తృప్తిగా అంగీకరించాడు.

ఒక సంచి బంగారు నాణాలు చేతులు మారింది. ఆ సంచి బరువు చూస్తూ "మీ మనసులో ఏముందో చెప్పండి స్వామీ. చెప్పటం మీ వంతు చెయ్యడం నా వంతు" అన్నాడు.

"మరేం లేదు నిపుణకా. మల్లప్రియలో కొన్ని రహస్యాలున్నాయి."

"దానివల్ల ప్రయోజనం ఉంటుందా స్వామి! నన్ను బంధించరు కదా!"

"అక్కడే నీ తెలివితేటలు ఉపయోగించాలయ్యా. పథకం నేనిస్తాను. నీవు ఆ ప్రకారం చేస్తే చాలు."

తిమ్మిని బమ్మిని చేయి. పిచ్చిపిచ్చి జ్యోతిషాలు చెప్పు.

★ ★ ★

**మల్ల రాజ్యం ... రాజదర్బారు ప్రశాంతంగా ఉంది.**

**అందరి చూపులు తాంత్రికునిపైన నిలిచాయి. అతను విచిత్రంగా ఉన్నాడు. నల్లని దుస్తులు ధరించి, పుర్రెల దండ మెడలో వేసుకుని మాయలోడు లాగా ఉన్నాడు. చేతిలో ఒక కపాలం. మరొక చేతిలో మంత్రదండం. ఎదురుగా రక్తంతో నిండిన కుండ. హాహాకారాలు చేస్తూ జనాన్ని ఆకర్షిస్తూ భయభ్రాంతుల్ని చేస్తున్నాడు.**

"రాజా! తంత్ర, మంత్రవేత్త నిపుణకుడు నమస్కరిస్తున్నాడు."

సింహరన్ చెప్పిన రహస్యాలు జ్ఞాపకం చేసుకున్నాడు.

"మీ అంతఃపురంలో ఒక రహస్యమందిరం ఉంది కదా?"

"ఉంది. ఏం ఉంటే?"

"దాని తలుపులు ఎప్పుడు మూసే ఉంటాయి కదూ"

"మూసుకుని ఉంటే నీకెందుకు? తెరుచుకుని ఉంటే నీకెందుకయ్యా?"

"హమ్మమ్మ ... ఎంత మాట. అక్కడ ఒక బ్రహ్మపిశాచి ఉంది కదూ?"

"తెలియదు. మేం చూడలేదు. పిశాచాలతో, దయ్యాలతో మాకేంపని."

"పని ఉంది రాజా. ఆ పిశాచం నన్ను రమ్మంటేనే వచ్చాను. అది మామూలు దయ్యం కాదు. బ్రాహ్మణ పిశాచం రాజా."

"నీకెందుకయ్యా?"

"అక్కడొక బ్రహ్మహత్య జరిగింది. బ్రహ్మహత్య మహాపాతకం రాజా. అది ఏడు తరాల వరకు శపిస్తుంది. మీ వంశం క్షీణిస్తుంది."

"ఇప్పుడు ఏం చేయమంటావ్ చెప్పు."

"అక్కడ నేలలో పూడ్చిన అవశేషాల్ని బయటకు తీయించి ఇప్పటికైనా అంత్యక్రియలు జరిపిస్తే ఆ బ్రాహ్మణ దయ్యం పీడ విరగడవుతుంది."

సింహరన్‌కు ఆ కథ అంతా తెలుసు. తన పినతండ్రి భార్యకు రక్షణ భటులలో ఒకరితో అక్రమ సంబంధం ఉండేది. ఆ రంకు తెలిసి పినతండ్రి ఆ భటుణ్ని హత్య చేయించాడు. శవాన్ని లోపలి గదిలో గుంటతీసి పాతి పెట్టించాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆ పినతల్లి, ఆమె కొడుకూ చనిపోయారు. అది బ్రాహ్మణ పిశాచి శాపం అనుకున్నారు అప్పట్లో. శవం కథ అప్పటికి ముగిసింది.

తాంత్రికుని హుంకరింపులకు రాజుకు చెమటలు పట్టాయి.

"ఆ బ్రాహ్మడి శవం ఎక్కడుందో మాకెట్లా తెలుస్తుంది? రాజభవనాలు నూరు ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఎక్కడని తవ్వాలి. దైవజ్ఞులకు మాత్రమే ఆ స్థలం తెలుస్తుంది."

మాంత్రికుడు కళ్లు గట్టిగా మూసుకుని హాం హ్రీం, హ్రుం అంటూ పిచ్చి గంతులు వేశాడు కాసేపు. అందరికీ వినబడేట్లు అరిచాడు. విరోచన పుత్రుడైన బలిని ప్రార్థించాడు. నూరు మంత్రాలు సిద్ధి పొందిన శంబరస్వామిని అర్థించాడు. తనకు సాయం చేయమని, నిశుంభ, నరకకుంభ, తుంబుకచ్ఛలను ఆవాహన చేసి నమస్కరించాడు. ఓ చండాలి, కుంజి, తుంబి, కాటుక ... సారంగ ప్రసన్నం కండి" అని అర్థించాడు.

"అవశేషాలు ఎక్కడ ఉన్నదీ చూపిస్తాను పదండి" అని అరిచాడు. అతని వెంట రాజు కొంత పరివారం నడిచారు." తాంత్రికుడు పెద్దపెద్ద అంగలు వేస్తూ హాహాకారాలు చేస్తూ పరుగులు తీశాడు.

ఎక్కడ దాచిందీ ముందే సింహరన్ చెప్పాడు కనుక ఆ గదికే దారి తీశాడు. నేల మాలిగలో రెండవ అంతస్థులో ఒక గది గుమ్మం దగ్గర కళ్లు మూసుకుని వీర తాండవం చేసి, పళ్లు పటపటలాడించి దయ్యంతో దెబ్బలాడుతున్నట్లు నటించి "ఊ తెరవండి" అని అరిచాడు.

"అదిగో బ్రాహ్మణ దయ్యం. ఇదిగో దయ్యం" అంటూ కాస్సేపు దాని వెంట పరిగెత్తి నటించాడు.

"ఈ నిపుణక అంచనా తప్పదు. ఛండాలీ, ఆ శవాన్ని వదిలిపో!" అరిచాడు.

నేలలో త్రవ్వగా ఎముకలు కనిపించాయి.

రాజు అతనికి చేతులు జోడించి నిలబడ్డాడు.

నిపుణకుడు రాజును ఆశీర్వదించి ఇంత భస్మం ముఖాన రుద్దాడు. రాజు తన మెడలోని రత్నహారాన్ని తాంత్రికునికి బహూకరించాడు. నిపుణకుడు ఆ హారాన్ని గొయ్యిలో వేసి, శవఅవశేషాలతో పాటు పూడ్చమన్నాడు.

"ఈ రత్నాలు, హారాలు మాకెందుకు రాజా. మేం కోరితే ప్రపంచం లోని ధనరాశులన్ని వచ్చిపడతాయి" అని తనమెడలోని పుర్రెలహారం సరి చేసుకున్నాడు.

అదంతా చాణక్య యిచ్చిన శిక్షణ. అతగాడు మహాత్ముడని అక్కడ చేరినవారు గుసగుసలాడారు.

★ ★ ★

ఆ మర్నాడే రాజుకి పెద్ద జబ్బు చేసింది. చలిజ్వరం. మూర్ఛలరోగంతో సభకు రాలేకపోయాడు. నిపుణకుడు పెట్టిన విభూతి పని చేసింది. అది ఏమిటో నిపుణకునికి తెలియదు. చాణక్యకే తెలుసు దాని రహస్యం.

రాణి కంగారుపడి మాంత్రికుని అంతఃపురానికి రప్పించింది. ఆ రోగానికి విరుగుడు అర్థించింది.

నిపుణకుడు నిబ్బరంగా అన్నాడు : "దిగులుపడకండి రాణివారూ! ఒక చూర్ణం యిస్తాను. దానిని పాలల్లో కలిపి తాగించండి. తెల్లవారే సరికి తగ్గిపోతుంది."

చాణక్య తయారు చేసి ఇచ్చిన చిత్రిక వేళ్ల చూర్ణం అది. మిరియాల కషాయంతో కలిపి తాగించాడు. అది చాణక్యం.

నిజంగానే మర్నాడు ఉదయానికి రాజుగారి రోగం ఠక్కున తగ్గింది. నిపుణకుడు సాక్షాత్తు దేవుడి అవతారమైపోయాడు.

రెండు రోజుల్లో చాణక్య ప్రతిభ రెండు సార్లు బయటపడ్డది.

అపుడు మాంత్రికుడు అంతఃపురం ప్రవేశించి "రాజా మీరు మరొక ముఖ్యమైన విషయం వినండి."

మంత్రులు, రాజోద్యోగులు చెవులు రిక్కించి వినసాగారు.

"అంతఃపురం వెలుపల కుబేర దేవాలయం ఉంది. నిత్యం మీ రాజ పురోహితులు చేసే పూజల్లో ఏదో లోపం ఉంది. ఆ దోషం మీకు తగిలింది. మీ రాజ్యం ఆస్తమించి పోతుంది. అసలు మీ వంశమే అంతరించి పోయే ప్రమాదం ఉంది."

"ఆ లోపం సరిచేయడానికి ఏం చేయాలి?" రాజు అర్థించాడు.

"ఏమీ లేదు. పూజ చేసి, విగ్రహాన్ని తొలగించి, బయట ఎక్కడైనా జలాశయంలో నిమజ్జనం చేయించండి."

ఆ పని జరుగుతున్న సమయంలో చంద్రగుప్త, సింహరన్ దాడి చేశారు.

★ ★ ★

సింహరన్ మల్ల రాజ్య సింహాసనం అధిష్టించాడు సంతోషంగా.

"శిష్యా మాటమీద నిలబడు! మృదువుగా ప్రవర్తించు" చాణక్య హెచ్చరించాడు."

"పాత ఉద్యోగులందరికీ మళ్లీ ఉద్యోగాలు ఇవ్వు. నీ సింహాసనానికి ఎలాంటి ప్రమాదం రాదు. నీ పినతండ్రిని రాజ్యం నుండి బహిష్కరించు. అతను రాజ్యం వదలిపోతే నీకు ప్రమాదం ఉండదు."

మెహర్ అడిగాడు. "దేశబహిష్కరణ అవసరమా గురుదేవా!"


"అతను పోరస్ మిత్రుడు. కేకయ రాజ్యం చేరి సైన్యం సమీకరించి తిరిగి రావచ్చు. పోరస్ అతనికి సహాయం చేస్తాడని నాకనిపిస్తోంది. సింహరన్ రాజు కావడం అంటే మల్లరాజ్యం స్వతంత్రించడమే. కేకయకు సామంత రాజ్యంగా ఉండదు."

"ఉండకూడదనే నా అభిమతం మెహర్. అందువల్లనే పినతండ్రికి రాజ్య బహిష్కార శిక్ష. అతన్ని ప్రజలు ద్వేషించాలి. అంటే మల్లరాజ్య ప్రజలు సింహరన్‌ను ప్రేమించాలి అంటే అతని పినతండ్రి ఈ రాజ్యంలోనే ఉండకూడదు. అప్పుడు ఏ ప్రమాదం రాదు."

'తర్వాత?' మెహర్ ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నకు సమాధానం లేదు. ఉన్నా చాణక్య చెప్పడు.

అది చెప్పకూడని రహస్యం.



# 10. ప్రణయ శిఖరం

"సింహరన్ మల్ల రాజ్యాధిపతిగా ఉన్నంతకాలం దిగుల్లేదు. మనసేనలు నిశ్చింతగా ఇక్కడ ఉండవచ్చు" చాణక్య హామీ.

చంద్రగుప్త కొంచెం ముభావంగా ఉన్నాడు "అవునేమో! నా తండ్రిగారు గత సంవత్సరం పిప్లికారణ్యంలో పరమపదించిన తర్వాత ఇప్పటివరకు మన సైన్యాన్ని అంభి పూర్వసైనాధ్యక్షుని సంరక్షణలో ఉంచాం గదా."

ఆ మాటలోని విషాదం చాణక్య గ్రహించాడు. ఎన్ని సంవత్సరాలు గడిచినా ఏమీ జరగడం లేదన్న బాధ.

తండ్రి చనిపోయిన బాధ ఎవరికైనా ఉంటుంది. తనకు లేదా ఆబాధ. తాను తండ్రిని పోగొట్టుకున్నవాడే గదా. విషాదం ఎవరికీ వినోదం కాదు. ఆనందదాయకం కాదు.

చాణక్య : చంద్రగుప్తా మనం పౌరస్ మైత్రిని కాదనకూడదు. పౌరస్ మనకు శత్రువు కాదు. ధననందపై యుద్ధానికి మనకు పౌరస్ సహాయం అవసరమవుతుంది.

చంద్రగుప్త : కాని, పౌరస్ మనం అంటే గుర్రుగా ఉన్నాడని మరచిపోకండి.

మనం మల్ల రాజ్యాన్ని చేజిక్కించుకున్నాం. మల్ల రాజ్యం అతని సామంత దేశాలలో ఒకటి. ఇప్పుడు మనతో రాయబారానికి అతను అంగీకరిస్తాడని అనుకోను ఆచార్యా.

చాణక్య : పౌరస్ చాలా అహంభావి చంద్రా! మరచిపోకు. అతని కోపానికి కారణం ఉంది. కాదనను. రాజైనవాడు వ్యక్తిగత కోపతాపాలకు స్పందించడు. బహుళప్రయోజనం చూస్తాడు. మనిషికి అహంకారం, అహంభావం శాపాలు. పైగా అతను గర్విష్ఠి.

చంద్రగుప్త : అయినా పౌరస్‌తో చేతులు కలపాలంటారు!

చాణక్య : చంద్రా చూడు. ఒక మగాడు ఆడదాన్ని 'నీవు చాలా అందంగా ఉన్నావు' అంటే ఆమె పొంగిపోతుంది. అతని అబద్ధాలన్నీ మరచిపోతుంది. రాజులు కూడా రంగసానుల వంటి వారేనయ్యా. ఇప్పుడు పౌరస్ కూడ అదే కోవలోకి వస్తాడు. అతని బలహీనతలు అతనికున్నాయి గదా.

చంద్రగుప్త : అతను మీ బుట్టలో పడకపోతే ...

చాణక్య ఏం సమాధానం చెబుతాడో నని ఎదురు చూచాడు.

చాణక్య : అతని అధికార దాహాన్ని పావుగా ఉపయోగిస్తాం. అతనికి కీర్తి కండూతి ఎక్కువ. కీర్తి గుల కలవాణ్ని పడవేయడం సులభం. భారత్‌లో నీ అంతటి వాడు లేడంటే పడిపోతాడు.

చంద్ర : "ఆ పని మనం చేయలేం ఆచార్యా! అతనిని మభ్యపెట్టడం అంత సులభం అనుకోను."

"సులభమే చంద్రా. చూడు. మగధ సింహాసనాన్ని ఎరగా చూపిస్తాను. అతనికి మగధను కట్టబెడతాను."

తలవంచి సిగ్గుగా అన్నాడు చాణక్య ఆమాట.

చంద్రగుప్త ఆచార్య పాదాల మీద పడి

"మీ ఇష్టం గురూజీ! మీరు ఎలా చెబితే అలాగే. మీరు ఆజ్ఞాపించండి. అయితే పౌరస్ క్రింద నేను మాత్రం పనిచేయలేను."

చంద్రగుప్త దైన్యానికి చాణక్య పకపక నవ్వాడు.

"సింహాసనం ఆశ చూపిస్తానన్నాను గానీ, ఇస్తానన లేదు చంద్రబాబూ! నా మాటలు జాగ్రత్తగా అన్వయించుకోవాలి. మగధ విషయంలో మనకు కావలసింది అతని సహాయం. కాదు కూడదంటే అతనికి కొన్ని పరగణాలు ఇస్తాం అంతేగాని ..."

చంద్ర : మాట తప్పితే?

చాణక్య : నువ్వొక దగుల్బాజీవి అనుకుంటాడు. అనుకోనీ, ఏం పోతుంది? నిన్ను స్నేహితుడిగా చూడడు. పోనీయి. అతనితో ముందుగా ఒప్పందం కుదుర్చుకుందాం. అప్పుడు మాట తప్పడం ఉండదు. కొన్ని రోజులు గాలిలో మేడలు కట్టుకోనిద్దాం. మగధ సింహాసనం పైన నిద్రలో కూర్చోనివ్వు. మనం అనుకున్నది మనం సాధించడం ముఖ్యం గాని పౌరస్ ఏమి అనుకుంటాడన్నది అప్రస్తుతం.

చంద్రగుప్త : నమ్మించి మోసం చేసినట్లు కాదా ఆచార్యా?

చాణక్య : క్షమించడం కంటే మరిచిపోవడం సులభం. నేను మన ఇంద్రదత్తుతో మాట్లాడతాలే. అతనే కదా పౌరస్ సేనాధిపతి. చాణక్యతో ఒప్పందం మంచిదని చెప్పిస్తాను.

చంద్ర : చాణక్యతో ఒప్పందం చంద్రగుప్తతో ఒప్పందం కాదా?

చాణక్య : చాణక్య వేరు, చంద్రగుప్త వేరు కాదు. ఇద్దరూ ఒక్కటే. ఒకటే బాట ఒక్కటే మాట. తర్వాత నువ్వు, నేను దెబ్బలాడు కుందాంలే తీరిగ్గా. ఇప్పుడు ఎవరిదారి వారిది సరేనా?

చంద్రగుప్త : మీతో కలహమా? అసంభవం ఆచార్యా. నా బొందిలో ప్రాణం ఉండగా మీరు నేను వేరు కాము. నా ప్రాణం అయినా ఇస్తాను గానీ మిమ్మల్ని కాదని నేను ఒక్కపనీ చేయను. చేయలేను గురువర్యా.

చాణక్య : ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః చంద్రగుప్తా. నేను చెప్పేది అధికారం గురించి భ్రమల గురించి. నువ్వేమో 'విడిపోవడం' నిజం అనుకుంటున్నావు. అదీ భ్రమే చంద్రా. తను మగధ చక్రవర్తి కావడం భ్రమ. తన మగధ సింహాసనం ఒక భ్రమ.

చంద్ర : అప్పటి దాకా నేనేం చేయాలి ఆచార్యా?

"తగవులు పెట్టు, కలహాలు సృష్టించు. తిరగబడు. అవీ రాజకీయాలు."

"తిరుగుబాటా? ఎవరిపైన తిరగబడాలి గురుదేవా?"

"మెసడోనియా పరగణాలలో అలెగ్జాండరు ప్రతినిధులు పాలిస్తున్న ప్రాంతాలలో కలకలం సృష్టించు."

"ఏ ప్రాంతాలు?"

"అన్నీ. ఉత్తరాపథంలో ముఖ్యరాజ్యాలు. మగధ, కేకయ, గాంధారం వీటికి చెందని చిల్లర రాజ్యాలున్నాయి. అలెగ్జాండర్ ప్రతినిధులుగా ఫిలిప్స్, సెల్యూకస్ వాటిని పాలిస్తున్నారు. అటు నుండి నరుక్కు రావాలి. సెల్యూకస్ ఫిలిప్ చనిపోతే ఆ ప్రాంతాలు మన చేతికి రావాలి."

"అదే నేనూ ఊహించాను. మీరూ అదే చెప్పారు."

"గురుడు వ్యూహాలతో దడపుట్టిస్తున్నాడు" అనుకున్నాడు చంద్రగుప్త. మనశ్శాంతి ఉండడం లేదు.

"అట్లా కాదయ్యా చంద్రబాబూ. మనం ఫిలిప్పోస్‌ను చంపబోవడం లేదు. అతని శత్రువులు ఎవరో గుర్తించి వారిని ఉసికొల్పుతాం. అంటే మనం చేయదలచిన పని వాళ్లు చేస్తారన్నమాట."

"అతనికి అంత పెద్ద శత్రువులు ఎవరు గురుదేవా?"

ఆ ప్రశ్న అనవసరమని చంద్రగుప్తకు తెలుసు.

"అతని ప్రియ మిత్రుడే!"

"ఎవరూ అంభి?"

"కాదు."

"పౌరస్."

"కాదు."

"ఇంకెవరు ఆచార్యా."

"శశిగుప్త."

"ఎవరు? శశిగుప్తుడా?" చంద్ర ఆశ్చర్యపోయాడు.

"మగధ తూర్పు ప్రాంతం అంతా అతని క్రింద ఉంది. పశ్చిమం కేకయరాజు. పడమర గాంధారం. గాంధార రాజ్యం మధ్యన వాయవ్య దిశలో సింధు నది. అవునా?" చాణక్య వివరించాడు.

"అది ఆశ్వికుల ప్రాంతం గురూజీ. కాబూల్ నది ప్రాంతం గదా."

"అవును చంద్రా! వాళ్లు మహా బాలాఢ్యులు. తిండి, నిద్రలేకుండా పోరాడతారు. మంచి అశ్వ శిక్షకులు కూడా. వారి నాయకుడు శశిగుప్త నీకు జ్ఞాపకం ఉందా? అలెగ్జాండర్‌తో కలిసి వచ్చాడు. అతడు దుబాసీ. మహర్షి మాటలు అనువదించి అలెగ్జాండరుకు చెప్పాడే అతడు."

"శశిగుప్త సహాయం అర్థించ మంటారు?" చంద్రగుప్త ప్రశ్నించాడు.

"కాదు చంద్రా! అశ్వికులు డబ్బు మనుషులు. డబ్బుకు అమ్ముడుపోతారు. వేలకొద్ది గుర్రాలను అమ్ముతుంటారు. వారికి రాజకీయ పరిజ్ఞానం లేదు. వారిలో విశ్వాసం ఉండదు. ఒకసారి పర్షియా పక్షాన యుద్ధం చేశారు. మరొకసారి అలెగ్జాండరు పక్షాన పర్షియాపై యుద్ధం చేశారు. నిలకడలేని వారికి గుర్రాలకు శిక్షణ యివ్వడం, యుద్ధాలు చేయడం మాత్రం తెలిసిన పనులు."

"ఇప్పుడు వారు ఎవరి పక్షం?"

"ప్రస్తుతం యవనుల పక్షం. కొద్ది కాలం క్రితం వరకు పర్షియా పక్షం. రేపు ఎవరి పక్షాన అయినా పోరాడతారు."

"శశిగుప్త ఎదురు తిరగడం ఏమిటి? నాకు తెలిసినంత వరకు జీలం యుద్ధంలో పౌరస్‌కు వ్యతిరేకంగా అలెగ్జాండర్ పక్షాన యుద్ధం చేశాడు. పౌరస్‌ను అలెగ్జాండర్ సమక్షంలోకి అంభిని తీసుకు రాలేనపుడు ఆపని చేసింది శశిగుప్త. దాంతో అలెగ్జాండర్ అభిమానం సంపాదించాడు."

"ఎవరికోసం, ఎవరి ప్రోద్బలంతో శశిగుప్త అలెగ్జాండరు పక్షం వహించాడు?" చాణక్య ప్రశ్న.

చంద్రగుప్త అయోమయంగా చూచాడు. నోటమాట రాలేదు. చాణక్య నవ్వి అన్నాడు : "అశ్వికులు యోధులేగాని బుర్రలేని వాళ్లు. ఒక ఆడదాని చెప్పుచేతల్లో ఉన్నారు. వాళ్ల నాయకురాలు 'కళాపిని' అని ఒకరాణి. చాలా

అందగత్తె. వగలమారి వయ్యారి. ఆమెకు ప్రమాదం జరిగినా, అవమానం జరిగినా ఈ అశ్వికులు ప్రాణాలిస్తారు. ప్రాణత్యాగం చేస్తారు. ఆమె కోసం ప్రాణాలు తీస్తారు."

"ఆ రాణిని లేపేయమంటారా?"

అలాటి పనులు చేయించడంలో చాణక్య సిద్ధహస్తుడు.

"ఉహుఁ ఆమెను ఫిలిప్పాస్ దగ్గరకు చేర్చాలి. ఆ పనిగాని జరిగితే ఆశ్వికులు తమ రాణిని క్షమించరు. వాళ్ల రక్తం అవమానంతో ఉడికిపోతుంది. ఒక యవన వీరుడితో తమరాణిని వారు ఊహించుకోలేరు. జీర్ణించుకోలేరు. సహించరు."

"ఆ పని నేనెట్లా చేయగలను ఆచార్యా? అక్కడ నుండి లేపి ఇక్కడ పడుకోపెట్టడం. మంత్రం వేయాలా, మాయ చేయాలా."

"ఒక్క మాటలో చెప్పనా చంద్రబాబూ?"

"చెప్పండి. ఆచార్యా."

"కార్నిలియా!"

★ ★ ★

**సువిశాల సుందర వనాంతరం. అశోక, భవ్య, చంపక, నగర వృక్షాల పూలు నేలరాలి సహజ పూల పాన్పులు అమర్చాయి.**

ఒక కింశుకవృక్షం క్రింద పరచిన పట్టు దుప్పటిపైన చంద్రగుప్త, కార్నిలియా శృంగార పారవశ్యంలో ఉన్నారు. ఇద్దరు కౌగిలిలో ఒక్కటై కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆమెకు రక్షణగా వచ్చిన అంగ రక్షకులు చూపుమేర దూరంలో లేరు. తాము కలిసినపుడు అంగరక్షకులు ఎవరూ ఉండకూడదని ఆమె ఆజ్ఞ.

ఆమె రాజకుమారి చంద్రగుప్తుని కోసం వచ్చినపుడు, ఎవరూ కాపలా ఉండరు. ఏకాంతంలో వారిని వదలి వెళ్లిపోతారు.

"నువ్వు నా ప్రేమ దేవతవు. నా వలపు రాణివి."

మత్తుగా చంద్రగుప్త ఆమె చెవిలో రహస్యం చెప్పాడు. కార్నిలియా బంగారు కేశాలను ప్రేమతో ముద్దాడాడు.

కార్నిలియా సుతారంగా, విరహిణిలా నవ్వింది.

"అబద్ధం. నేను దగ్గరగా ఉన్నంతసేపే ఈ ప్రేమలు, మురిపాలు." కార్నిలియా గారాబంగా అన్నది.

"చంద్రా ప్రియా! నిన్నొదిలి క్షణం ఉండలేక పోతున్నాను. ఎందువల్ల? ప్రతిక్షణం నువ్వే గుర్తొస్తుంటావు" అంటూ మరింత గట్టిగా చంద్రగుప్తను గుండెలకు హత్తుకుంది.

"నాకు భయంగా ఉంది ప్రియా. మా నాన్నగారికి ఈ విషయం తెలిస్తే నన్ను బాబిలోనియాకు రమ్మంటారు. వెళ్లకతప్పదు. కానీ వెళ్లలేను. నీకు దూరమై బ్రతగ్గలనా?"

"మీ నాయన ఇక్కడ లేడు. వేలమైళ్ల దూరాన ఉన్నాడు. ఆ భయం లేదు. నీవు భారతదేశంలో ఒంటరిగా, బ్రహ్మచారిణిగా ఉండాలని అనుకోడు. ఈ వయసు అల్లరి ఆయనకు తెలియదా? తన కూతురు ఈడొచ్చిన ఆడపిల్లని అనుకోడా! ఆ పరిస్థితి వస్తే నేను మగధ రాజును అవుతాను. నిన్ను కట్నంగా పొంది తీరతాను. గెలిచిన వీరుడికి కూతురునిచ్చి చేయడం రాజులకు అలవాటే గదా. నా ప్రియమైన కార్నిలియాను అట్లా బహుమతిగా గెలుచుకుంటాను."

"అది జరగదు చంద్రా! నీవు గాని, ఆచార్య గానీ ఏం చేశారని? సింహరన్‌ను సింహాసనం మీద కూర్చోబెట్టారు అంతే గదా. నీ కోరిక తీరాలంటే చాలకాలం పడుతుంది. అప్పటికి నీవు, నేను ముసలి వాళ్లమైపోతాం. అప్పుడు పెళ్లెందుకు. ముసలి మొగుడు, ముసలి పెళ్లాం. బలేబలే."

"మనం ఇప్పుడే పెళ్లి చేసుకుందాం ప్రియా!" చంద్రగుప్త ఆవేశంగా అన్నాడు.

"ఇప్పుడా, ఇక్కడా? బలే వాడివయ్యా చంద్రా. పురోహితులు, బంధువులు ఎవరూ అవసరం లేకుండానే."

"మా వివాహ పద్ధతిలో ఎనిమిది రకాల పెళ్లిళ్లున్నాయి. అందులో గాంధర్వ వివాహం ఒకటి. స్త్రీ పురుషులు ఇద్దరూ పూలదండలు మార్చుకుని ఒక్కటవుతారు. అట్లా భార్యాభర్తలై పోతారన్నమాట. ఇతర వేడుకలు లాంఛనాలు ఏవీ ఉండవు."

"ఆ పెళ్లికి నేనొప్పుకోను. మా నాన్నకు తెలిస్తే చంపేస్తాడు."

"సరిసరి. నీవు మీ ఇంట్లోనే ఉండు. నేను మా ఇంట్లోనే ఉంటాను. ఇలా చెట్ల క్రింద కాపురం చేద్దాం సరేనా?"

కార్నిలియా కళ్లలో నిరాశ, విరహఛాయలు.

చంద్రగుప్త తన పట్టు ఉత్తరీయంలోని దారాలు పోగులు తీసి గబగబా పూలు ఏరుకొచ్చాడు. ఇద్దరు కలిసి రెండు దండలు కట్టారు.

దండలు మార్చుకుని కౌగిలించుకున్నారు.

కార్నిలియా ముఖం పైకెత్తి "ఈ జీవితం నీకే అంకితం" అన్నది

చంద్రగుప్త అంతే ఉద్వేగంగా ఉన్నాడు. "నాతి చరామి. భగవంతుని సాక్షిగా, పంచభూతాలు సాక్షిగా, నక్షత్రాల సాక్షిగా నీవే నా అర్ధాంగివి."

అవే పెళ్లి ప్రమాణాలు.

చంద్రగుప్త కార్నిలియాను దగ్గరగా తీసుకుని గుండెకు హత్తుకున్నాడు.

ఆచార్య చాణక్య కిచ్చిన మాట మరచిపోయాడు.

ఎంతకాలం ఆయన మాటలు విని బ్రహ్మచర్యం పాటించాలి.

చాణక్యకిచ్చిన మాటలు గాలికి వదిలిన క్షణాలవి.

కార్నిలియా ప్రేమలో పరవశించిన మధుర క్షణాలవి.

శింశుప వృక్షం నీడన భార్యాభర్తలైనారు.

"మన ఈ పెళ్లికి పెద్దల ఆమోదం లభిస్తుందా చంద్రా?"

కార్నిలియా భయంగా, అనుమానంగా అడిగింది.

"సెల్యూకస్ చంద్రగుప్తుల మధ్య రాజకీయ సయోధ్య కుదరకపోతే"

"అదా నా నీ అనుమానం" చంద్ర ప్రశ్నించాడు.

"మా నాయన మీతో ఎందుకు ఒప్పందం కుదుర్చుకోవాలి?" అడిగింది కార్నిలియా.

"భారత్‌లో తను రాష్ట్రాలపై అధికారం కోల్పోయే పరిస్థితి వస్తే ఏం చేస్తాడు? రాయబారానికి రాక."

"ఎందుకు పోతుంది అధికారం?"

"ఎందుకంటే అంభి పిరికితనం వల్ల, పౌరస్ అత్యాశ వల్ల, శశిగుప్త కోపం వల్ల. ఈ మూడు కారణాలవల్ల."

"అంభి పిరికితనమా! అదేమిటి చంద్రా?"

"అవును. అంభి అటు శశిగుప్త ఇటు పౌరస్‌ల మధ్య నలిగిపోతున్నాడు. వాళ్లు ఎప్పుడు యుద్ధానికి దిగుతారోనన్న భయం."

"పౌరస్ అత్యాశ అన్నావు. అదేమిటి?"

"అవును పౌరస్ అత్యాశాపరుడు. అతని ఆశకు అంతులేదు. అతని అత్యాశ అతని అంతం చూస్తుంది."

"శశిగుప్తకు ఎవరి మీద కోపం?"

"పాపం మోసపోయాడు కదా."

"ఎవరు మోసం చేశారు?"

"ఇంకెవరు? ఫిలిప్పోస్. మీ నాయన నియమించిన ప్రతినిధి."

"పో ఫిలిప్పోస్ మోసం చేయలేదు."

"రేపు చేయడని ఏమిటి? అతని స్వభావం అలాంటిది."

"ఎందుకు చేస్తాడు?"

"ఫిలిప్పోస్ కళాపిని ప్రేమలో పడితే, అశ్వకారులు ఊరుకోరు. కలాపిని వాళ్ల రాణి. శశిగుప్త వాళ్ల నాయకుడు. శశిగుప్త స్వయంగా ఫిలిప్పోస్ పైన దాడి చేస్తాడు."

"ప్రేమలో పడవేయడం ఎట్లా సాధ్యం? ఒకరు చెబితే ప్రేమ కలగదు చంద్రా? ఎవరు చెబితే నేను నిన్ను ప్రేమించాను?"

"ఏమో! ఇద్దరు కలిస్తే ప్రేమ కలగవచ్చు గదా. ఫిలిప్పోస్‌కు కళాపిని పై మోజు ఉన్నదని విన్నాను."


"అంటే ఈ ప్రేమ వ్యవహారంలో నేను తలదూర్చాలనా?"

"తల దూర్చవద్దు కానీ ఒక చేయి వేసి సహాయపడితే చాలు. నీవుగా వెళ్లి ఫిలిప్పోస్‌ని కలవవచ్చు. సెల్యూకస్ కూతురిగా నీకా హక్కు ఉంది. నీతో పాటు, నీకు తోడుగా కళాపిని తీసుకువెళ్లు. నీ స్నేహితురాలిగా పరిచయం చెయ్యి. ఆమె చాలా గొప్ప అందగత్తె."

"మనం ప్రమాణాలు చేసుకున్నాం చంద్రా."

"అవును కదూ. నా ఇతి చరామి. ఇది నీ పతి భక్తిని నిరూపించుకోడానికి మంచి అవకాశం అనుకో.

కాకపోతే నీకు నీవే అపకారం చేసుకున్న దానివవుతావు."



# 11. తడిమంటలు

**"వెళ్లిపో ... నీ ఇష్టం వచ్చిన చోటుకు వెళ్లు. నేను నీకు గురువును కాను. నువ్వు నా శిష్యుడివి కావు. ఇంతకాలం నా సమయాన్ని వృధా చేసుకున్నాను. పోవయ్యా, పో ... నీ దారి నీది ... నా దారి నాది."**

చాణక్య నవ్వుతూ చంద్రగుప్తపై రుసరుసలాడాడు.

"గురూజీ! మీ శిక్షణలో లోపం ఉందని నేను అనడం లేదు. నన్ను దయచేసి అర్థం చేసుకోండి. మీ ఆలోచన ఏకపక్షంగా సాగుతోంది. అదీ నా ఆవేదన. నన్ను అసలు మాట్లాడనివ్వరు."

చంద్రగుప్త వచ్చేనవ్వును ఆపుకుంటూ అన్నాడు.

"సరే. ఇంక నాలక్ష్యం ఒక్కటే. మీ పతనం ..."

"ఎంత ధైర్యంరా నీకు. నేను నీ గురువును. నీపైన కోపం చేసుకునే హక్కు నాకుంది. నిన్ను తిడతాను నా ఇష్టం. సింహరన్ నీకు తమ్ముడిలాంటి వాడు. మల్లరాజ్యం వారసుడు అతను. అతని రాజ్యం అతను ఏలుకుంటాడు మధ్య నీకెందుకు దుగ్ధ? కాదనడానికి, అవుననడానికి నీకేం హక్కుంది" గట్టిగా అరిచాడు చాణక్య.

తన పథకం పారుతోందని లోపల సంతోషంగా ఉంది చాణక్యకు.

"మీరేగా నన్ను రాజును చేస్తానని ఆశపెట్టింది. ఇప్పుడేమో పౌరస్‌ను సింహరన్‌తో కలపమంటారు. సిగ్గులేకపోతే సరి! మీరింతగా దిగజారి పోతారను కోలేదు గురూజీ. మీ తంత్రాలకు, కుతంత్రాలకు అంతూ అదుపూ ఉండవా? నన్ను కాదని ఆ పౌరస్‌ని తలకెత్తుకోండి. గద్దెపైన కూర్చోపెట్టండి. సిగ్గు లేకపోతే సరి!"

చంద్రగుప్త సింహంలాగా గర్జించాడు. గురువుతో మాటామాట పెరిగింది.

"ఏయ్, చంద్రబాబూ, ఇక్కడ నుండి తక్షణం బయటకు నడువ్. నీకిక్కడ స్థానం లేదు. నీ మనస్సులోంచి మగధకు చెరిపేసుకో పో. నీకా అర్హత లేదు. యోగ్యత లేదు. నీకు విశ్వాసం లేదు. వెళ్లిపో."

ఊగిపోయాడు కోపంతో చాణక్య. చంద్రగుప్తను వెళ్లిపొమ్మని బయటకు చేయి చూపించాడు.

అందరూ ఆశ్చర్యంతో చూస్తుండగా చంద్రగుప్త గది గుమ్మందాటి బయటకు వచ్చాడు. సరసం విరసంగా మారింది.

మరుక్షణంలో ఒకతను చాణక్య కుటీరం నుండి బయటకొచ్చాడు. అతను అభయ, వార్తాహరుడు. పౌరస్‌ను కలవడానికి బయలుదేరాడు. చాణక్య చంద్రగుప్తల మధ్య వైరం 'శుభవార్త' అందించడానికి.

అది కొందరికి శుభవార్త! అసలు గురుశిష్యుల మైత్రి ఎందుకు చెడినట్లు?

★ ★ ★

**"మహారాజా! ఆచార్య చాణక్య మీ సహాయం కోరి వచ్చారు. అనుగ్రహించండి".**

ఇంద్రదత్తు చాణక్య రాకను ప్రకటించాడు. చాణక్య తనకు చూపించిన ఆసనం మీద కూర్చున్నాడు ఎదురుగా పౌరస్. చాణక్య పక్కన ఇంద్రదత్తు ఆసీనుడైనాడు.

పౌరస్ : ఆచార్యా! మీ కుశాగ్ర బుద్ధిని గురించిన కథలు చాలా విన్నాం. మీ రాజకీయ పరిజ్ఞానం అపరిమితం. జరగబోయే సంఘటనలు

ముందుగా ఊహించడంలో మీకు మీరే సాటి. చంద్రగుప్తుని కోసం మీరు ఇంతకాలం దూరంగా ఉంటూ వచ్చారు.

అసలు విషయం రాబట్టడానికి పౌరస్ ఉపోద్ఘాతం మొదలెట్టాడు. ఆ విషయం చాణక్య గ్రహించి ప్రసన్నవదనంతో అన్నాడు.

"మహావీరా! మీకు తెలియని రాజకీయాలు ఏమున్నాయి. సర్వజ్ఞులు. మీరు కళ్లతో వింటారు. చెవులతో చూస్తారు. మీరు నలుదిక్కుల చూడగలరు. నాకు చంద్రగుప్తకు అభిప్రాయభేదం వచ్చినమాట నిజం. చంద్రగుప్తుడు లేకపోవడం వల్ల మీ సహాయంకోరి రాలేదు. అసలు నిజం చెప్పాలంటే మిమ్మల్ని కలుసుకోవడం కోసమే అతనితో తెగతెంపులు చేసుకున్నానేమో."

పౌరస్ స్థిరంగా కూర్చుని తల ఊపాడు. అభయ కల్పించుకుని అన్నాడు.

"మహారాజా! ఆచార్యులవారు మగధను తమరి చేతిలో పెట్టాలన్న యోచనలో ఉన్నట్లుంది."

పౌరస్ : ఆచార్యా! మిమ్మల్ని నమ్మడం ఎలా? మీ ఆలోచన ఒకసారి నాకొంప ముంచింది. నాకు గుర్తుంది. మల్లరాజ్యం విషయంలో ఏం జరిగింది? సింహరన్‌కు రాజ్యం అప్పగించారు.

చాణక్య : అది మాట తప్పడం కాదు, మోసం కాదు. సింహరన్‌కు మేము మాటిచ్చాం. అతను నిజమైన వారసుడు. ఆ విషయం మీకు తెలియదా! నా స్థానంలో మీరు ఉంటే అదే చేసేవారు. ఇక మీ ప్రశ్నకు సమాధానం చెబుతాను. బయట నిరీక్షిస్తున్న వారిని లోపలకు పిలవండి.

ఇంద్రదత్తు భటుని పంపాడు. ఆచార్యతో వచ్చిన వ్యక్తి లోపలకు వచ్చాడు. పట్టుబట్టలు, నవరత్నహారాలు ధరించి ఠీవిగా ఉన్నాడు అతను.

అతనే మల్లరాజ్య నూతన ప్రభువు సింహరన్. అతను సరాసరి పౌరస్ దగ్గరగా వెళ్లి అభివాదం చేశాడు.

"మహారాజా! మీతో నాకు ఏ మాత్రం వైరం లేదు. మల్లరాజ్యం అప్పుడు, ఇప్పుడు, రేపు కూడా మీ కనుసన్నల్లో ఉంటుంది. నా వైరం నా పినతండ్రి గురించి. తను నా తండ్రిని నిర్దాక్షిణ్యంగా చంపాడు. ఇప్పుడు అతని పైనా నాకు వైరం లేదు. నాకు మీ ఆశీస్సులు కావాలి."

పౌరస్ తన అయిష్టం మొహం పైకి కనపడకుండా జాగ్రత్తపడ్డాడు. ఆ విషయం చాణక్య గ్రహించాడు. పౌరస్ నెమలి వంటివాడైనా ఈకలు పీకే బుద్ధిశాలి. పెడసర స్వభావం. ఎవరినీ మన్నించే స్వభావం కాదు.

"రా యువరాజా! వచ్చి ఇట్లా కూర్చో."

తనప్రక్క ఆసనం చూపించాడు పౌరస్. సింహరన్ వెళ్లి వినయంగా కూర్చున్నాడు.

పౌరస్ : ఆచార్యా మీరు చెప్పండి. విషయం ఏమిటి?

"పురుషోత్తమా!

రెండు లక్షల కాల్బలం, ఎనభై వేల అశ్వికదళం, ఆరువేల గజబలంతో నేటికీ మగధ అజేయంగా ఉంది. మీరు, మీ మిత్రసేనలు సింహరన్ సేనా వాహినితో కలిసినా మగధను ఏమీ చేయలేరు. మహావీరుడైన పర్వతేశ్వరుడి కన్ను మగధపై ఉందని వింటున్నాం. మీ శక్తియుక్తులు అవసరం పురుషోత్తమా!"

చాణక్య ఒక పాచిక వేశాడు.

"నాకు మీలాగా ఎత్తులు, కుయుక్తులు చాతకావు ఆచార్యా".

సూటిగా అన్నాడు పౌరస్.

"అలెగ్జాండరు విషయంలో మీ శక్తి సామర్థ్యాలు నాకు తెలియదా! నా అభిమతం ఏమిటంటే మీరు మగధ చక్రవర్తి కావాలి."

"చంద్రగుప్తుని ఏం చేస్తారు ఆచార్యా?" పౌరస్ ప్రశ్న.

"గురువుల్ని గౌరవించలేని శిష్యుల వల్ల ఏమీ కాదు. నేను చంద్రగుప్తకు ఎన్నో నేర్పాను. ఇదీ అతను నాకిచ్చిన గురుదక్షిణ. పోనీయండి. అతని గురించి ఇప్పుడు మనకేల?"

"ఆచార్యా! మీ లక్ష్యాన్ని గౌరవిస్తాను. మీరంటే నాకు పూజ్యభావం ఉంది. అందితే మగధ సింహాసనం. అందకపోతే వీరస్వర్గం. నేను సిద్ధం."

"ప్రతివాడు స్వర్గం కావాలంటాడు. కానీ ఏ ఒక్కడూ చావడానికి సిద్ధం కాడు." చాణక్య సన్నగా చురక అంటించాడు.

**"కాలం కలిసిరాకపోతే ఎవడు తీసుకున్న గోతిలో వాడే పడతాడు. చావనీయండి." శశిగుప్త పెద్దగా అరిచాడు.**

★ ★ ★

పిర్‌సార్ కోటలో రాజభవనంలోని సభాస్థలి అది.

స్వాత్ లోయలో ఉన్నచిన్న రాజ్యం. అలెగ్జాండరుకు అది కీలకం. అలెగ్జాండరు దండయాత్రకు సహాయపడ్డది పీర్‌సర్.

చివరకు ఆ యవనమూక చేసిన నిర్వాకం ఏమిటి? తమ రాణి కళాపిని ఫిలిప్పోస్‌కు కట్టబెట్టారు. ఆ ఫిలిప్పోస్ అలెగ్జాండరు తొత్తు. వేగులు కొన్ని వారాల క్రితమే ఈ వార్త అందించారు. అది కళాపిని వ్యక్తిగతమని అలక్ష్యం చేశారు. ఇప్పుడు ఏం జరిగింది? అశ్వికుల రాణి ఫిలిప్పోస్ ఉంపుడుగత్తె అయి కూర్చుంది.

★ ★ ★

ఫిలిప్పోస్, చంద్రగుప్త మధుపాన కార్యక్రమంలో ఉన్నారు. వెండి బల్లకు అటు ఇటు కూర్చుని తాగుతూ ముచ్చట్లాడు కుంటున్నారు. శశిగుప్త మాటలు ఇద్దరినీ కలచివేశాయి.

"చంద్రగుప్తా, నీపేరు, నాపేరు సగం కలుస్తోంది. చంద్ర అంటే చంద్రుడు, శశి అంటే చంద్రుడు. మనం సహజ సోదరులం అన్నమాట."

నంగి మాటలతో శశిగుప్త బంధుత్వం కలిపాడు. చంద్రగుప్త ఒక గ్లాసుతో సరిపెట్టుకున్నాడు. అతనికి అలవాటు తక్కువ. అతిగా తాగితే కార్యభంగం అంటాడు చాణక్య. పనులు చెడిపోతాయట. చర్చల్లో తాగొచ్చు గానీ, కార్యనిర్వహణలో మందు, విందు పనికిరాదు.

★ ★ ★

పిర్‌సార్ కోట అతి ప్రాచీనం. చీకటిగా, ప్రశాంతంగా ఉంటుంది. చలికాలంలో అలెగ్జాండర్ పిర్‌సార్ కోటను ఆక్రమించాలనుకున్నాడు.

చిన్నతనంలో మెసడోనియాలోనే పిర్‌సార్ కోట గురించి విన్నాడు. పూర్వకాలంలో హెరాకిల్స్ పిర్‌సార్ వరకు వచ్చి ఆక్రమించలేక వెనుతిరిగి

వెళ్లిపోయాడుట. అప్పుడే అలెగ్జాండర్ నిర్ణయించుకున్నాడు – హిరాకిల్స్ చేయలేని పనిని తాను చేయాలని. పిర్‌సార్‌ను ఆక్రమిస్తే హిందూకుష్ నుండి బాల్కం వరకు ఎదురుండదు.

శశిగుప్త సహాయం లేకపోతే అలెగ్జాండర్ పిర్‌సార్‌ను జయించేవాడు కాదు. అతని సూచన పైనే అలెగ్జాండర్ పడమటి వైపు నుండి దాడి చేశాడు. మూడు రోజుల ముట్టడితో అలెగ్జాండరు విజయం పొందాడు. కోటపై జండా ఎగిరింది. ఆ తర్వాతనే పౌరస్‌పై యుద్ధం వీలైంది.

అలెగ్జాండరు విజయ యాత్రకు పిర్‌సార్ కేంద్రం.

ఇప్పుడు శశిగుప్త దిగులు పడుతున్నాడు. "నేను చేజేతులా పిర్‌సార్‌ను అలెగ్జాండరుకు అప్పగించాను. భారత్‌పై దండయాత్రకు నేనే కారణం. ఫలితం ఏమిటి? ఇప్పుడు అశ్వకారుల రాణిని వాడు లొంగదీసుకున్నాడు. వారి బలం అంతా వారి 'రాణి' కళాసిని."

**వివేకం గలవారు ఆలోచించి తర్వాత చెబుతారు.**

**మూర్ఖులు ఆలోచనలు ముందుగా బయటకు చెప్పేస్తారు.**

చంద్రగుప్త చాణక్య మాటలు శ్రద్ధగా వింటాడు.

శశిగుప్త మాటలు విని చంద్రగుప్త అన్నాడు.

"శశీ! నీవు నా స్నేహితుడివి కదా. నాదో ఆలోచన ఉంది. నీకు ఆసక్తి ఉంటే చెబుతాను."

ఆఫ్ఘను జాతి బహుక్రూరమైంది. మహాబలవంతులు. కాబూల్ నదీ తీరంలో కొండలపై ఉంటారు. ఆనాటి అశ్వకారులే తర్వాత ఆఫ్ఘనులుగా పిలవబడ్డారు. శశిగుప్తే వారి నాయకుడు. అతడు ఎప్పుడు ఎవరిపక్షాన ఉంటాడో ఊహించలేము.

శశిగుప్త మహామొరటుమనిషి. మహాబలశాలి. ఏడడుగుల ఎత్తరి. కండలు తిరిగిన దండియోధుడు. ఇంత లావు పొట్ట, నీలికళ్లు, మొరటు చర్మం, పొడవాటి జుత్తు, పెద్ద తలపాగా. వజ్రాలు పొదిగిన పిడికత్తి – అతని అవతారం, ఆహార్యం.

అతని కీర్తి అంతా పెద్దలు గడించి పెట్టింది. అతని పూర్వీకులు అశ్వమేథ యాగం చేశారట. యజ్ఞాశ్వాన్ని వదిలి, ఎవరైనా దానిని పట్టుకుంటే చావ గొట్టేవారు. అది తిరిగిన దేశాలన్నీ వారివే అయినాయి.

మొదట అలెగ్జాండరు శశిగుప్తను చూచి తనకు దీటైన జోడీ అనుకున్నాడు. అప్పుడే అలెగ్జాండరు తన తల్లికి ఉత్తరం రాశాడు.

**"అమ్మా, నేను సింహబలుల దేశంలో ఉన్నాను. ఇక్కడ ప్రతి అడుగు నేల ఉక్కుతో సమానం. నీవు ఒక అలెగ్జాండరునే కన్నావు. ఈ దేశంలో ప్రతి ఒక్కడు ఒక అలెగ్జాండరు."**

శశిగుప్తతో, అతని బలగంతో యుద్ధం చేసి గెలవలేమని గ్రహించిన అలెగ్జాండరు అతనితో స్నేహం చేశాడు.

చంద్రగుప్త సలహా చెప్పాడు.

"శశీ! పిలిప్పోస్ క్రింద వేలమంది నీ అశ్వికులున్నారు గదా. వారిని పిలిప్పోస్‌పై తిరగబడమని చెప్పు. తమ రాణిని అవమానించినవాడి కింద పనిచేయడం ఏమిటి?"

అది నిజానికి చాణక్యుని ఎత్తుగడ. చంద్రగుప్త ఆ ఆలోచనను తన సొంతం చేసుకున్నాడు. అవసరం అలాంటిది.

"క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఫిలిప్పోస్ ఊచకోత కోస్తాడు." శశిగుప్త బిక్కమొహం పెట్టాడు.

"అదే మనకు కావలసింది శశీ" నవ్వుతూ అన్నాడు చంద్రగుప్త.

★ ★ ★

ఫిలిప్పోస్ సైనిక శిబిరాలు. పెద్ద పెద్ద గుడారాలు వేశారు. సైనికుల తాహతు బట్టి ఏర్పాట్లు జరిగాయి. నాలుగువైపుల గట్టిగోడలు. ద్వారపాలకులు అడుగడుగున పహారా. రెండు వందల ఇరవై మందికి ఒక విడిది. చీమ సైతం లోపలకు రావడానికి వీలులేనంత బందోబస్తు. పిలిఫ్ఫోస్ శిబిరం వద్ద పెద్ద కాగడాలు వెలుగుతున్నాయి. ఇద్దరు భారీకాయులు గుమ్మానికి అటుఇటు నిలబడి ఉన్నారు. రాజుగారు, కళాసిని ప్రేమ మైకంలో ఒళ్లు మరిచిఉన్నాడు.

దూరంగా యవనుల శిబిరంలో కలకలం రేగింది. అందరూ శృంగార లీలలు గురించి ఆగుబ్బుగా చెప్పుకుంటున్నారు.

ఫిలిప్పోస్ శిబిరంలో అగ్నిప్రమాదం. ఎవరూ గమనించలేదు. నిమిషాల్లో మంటలు వ్యాపించాయి. సైనికులు హడావుడిగా వచ్చేసరికి దిగంబరంగా ఉన్న ఫిలిప్పోస్ బయటకు పరుగుతీశాడు. ఆ వెంటనే కళాసిని. అర్ధనగ్నంగా బయటకొచ్చింది. అశ్విక బృందం యవన నాయకులతో వచ్చి ఫిలిప్పోస్‌ని పట్టి బంధించారు. నగ్నంగా ఉన్న కలాసిని మీద దుప్పటి కప్పి గుర్రంపై ఎక్కించారు. ఆమెను అశ్వికులు వెనక ద్వారం నుండి తీసుకుపోయారు.

ఫిలిప్పోస్‌ను అశ్వికులు బండ బూతులు తిట్టారు. కొట్టారు.

"మా రాణిని లేపుకుపోతావా?" అని బాదేశారు.

ఫిలిప్పోస్‌ను తాళ్లతో బంధించారు. ఒక యవన అధికారి అశ్వికదళాన్ని ఛేదించుకుని లోపలకు వచ్చి పిలిప్పోస్‌ను గుండెలో బల్లెంతో పొడిచాడు.


శిబిరాలన్నీ కకావికలైనాయి. అన్ని శిబిరాలు అగ్నికి ఆహుతైనాయి.

చంద్రగుప్త తన పంచకల్యాణి మీద వచ్చాడు. ప్రక్కన శశిగుప్త మరొక గుర్రం మీద.

"మనం చేసింది మంచిపని అనిపించడం లేదు చంద్రగుప్తా."

రక్తపాతం అశ్వకారులకు నచ్చదు. ఇది మంచి ప్రతీకారం.

జన నష్టం జరగలేదు. ప్రతీకారం తీరింది. ఫిలిప్పోస్ అధ్యాయం ముగిసింది.



# 12. మిత్రభేదం

**బాబిలోన్‌లో 'నెబుచ(డ్రిజర్' రాజ భవనం.**

**ప్రపంచంలోనే అత్యంత సుందరమైన భవనంగా ప్రసిద్ధి.**

**రోమన్ చిత్ర, శిల్ప కళలకు అది కేంద్ర బిందువు.**

చెక్కతో, వెండితో, బంగారంతో స్థపతులు అద్భుతాలు సృష్టించారు.

గోడలకు, స్తంభాలకు రత్నాలు పొదిగారు. విశ్వవిజేత అలెగ్జాండరు నివాసం అది.

యూఫ్రైట్ నదికి నగరం సగం అటు, సగం ఇటుగా ఉంటుంది.

రాజమహల్ నుండి ఆవలి వైపుకు మధ్య నదీ ప్రవాహం. నది క్రిందుగా సొరంగ మార్గం ఏర్పరచారు. అది ప్రపంచ అద్భుతాలలో ఒక అద్భుతం. మరొక ఆకర్షణ వేలాడే తోటలు. బాబిలోన్‌లోని హాంగింగ్ గార్డెన్స్ ప్రపంచ వింత.

ఒకప్పుడు అమెటస్ రాణీ వారికి జబ్బు చేసింది. ఆమె వైద్యం నిమిత్తం రకరకాల ఆయుర్వేద గుణాలు కల చెట్లు తెచ్చి ఆ తోటలో పెంచారు. 'నెబుచ(డ్రిజర్' బాబిలోన్ దేవాలయాలన్నింటినీ నిర్మించాడు. యుఫ్రేస్ నదిపై వంతెన ఆయన నిర్వాకమే. నగరం శుత్రుదుర్భేద్యం.

జూన్ మాసం 11వ రోజు. నెబుచడ్రిజర్‌లో విశ్వవిజేత జబ్బుపడి మంచమెక్కాడు. అంత్యకాలం సమీపించింది. అప్పటికి అతని వయస్సు 33 సంవత్సరాలు. క్రితం రాత్రి విపరీతంగా మద్యం సేవించాడు. తన మిత్రుడు మెడియన్ యిచ్చిన విందులో తప్పతాగాడు. రాత్రి పొద్దుపోయిన తర్వాత చలి జ్వరం మొదలైంది. అలెగ్జాండరు రాజవైద్యుడు అమెలస్ ప్రక్కన కూర్చుని ఉపచరిస్తున్నాడు. అలెగ్జాండర్ ఐరోపా ప్రతినిధి ఆంటీ పీటర్ ఏదో మందు తాగించాడు. ఆ మందులో విషం కలిపాడన్నది ఎవరికీ తెలియదు. దాంతో అలెగ్జాండర్ జబ్బు తగ్గకపోగా విషమించింది.

అలెగ్జాండరు జబ్బువార్త సైనికుల్ని కలచి వేసింది. ఆందోళన ఎక్కువైంది. చివరిసారిగా సైనిక వందనానికి సిద్ధమైనాడు. పడక గదిలోకి సైన్యాధిపతి ఒక్కొక్కరినే అనుమతించాడు. అప్పటికే అతని మాట పడిపోయింది. సైనిక మిత్రులు వచ్చి వందనం చేస్తున్నారు. చేయి నీరసంగా ఊపగలిగాడు. ఆ మర్నాడు అలెగ్జాండరు తుదిశ్వాస విడిచాడు. విశ్వవిజేత మరణాన్ని జయించలేకపోయాడు.

★ ★ ★

**గ్రీకు వీరుడి మరణ వార్త దావానలంగా పాకింది.**

**ఫిలిప్పోస్ భారత్‌లో హతుడైనాడు. సైన్యం నిర్వీర్యమైంది.**

"ఇదే అదను దండయాత్రకు" చంద్రగుప్తకు ఆలోచన.

"ఇంక ఆలస్యం పనికి రాదు" శశిగుప్త వత్తాసు పలికాడు.

చంద్రగుప్త శశిగుప్తల సైన్యాలు శిబిరాల నుండి బిలబిలా బయట కొచ్చాయి. వేల సంఖ్యలో ఉన్న ఆశ్విక దళాలు పరుగులు తీశాయి. ఆకాశం ధూళి మేఘావృతమైంది. గుర్రాల పరుగులు గుండెల్లో దడపుట్టిస్తున్నాయి.

కొద్దిరోజులు వరుసగా 'యవన' ప్రతినిధులు పాలించే రాజ్యాలలో అల్లకల్లోలం సృష్టించారు. యవనసేనలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని స్వదేశానికి పారిపోవడంతో ఆయా దేశాలు చంద్రగుప్త వశమైనాయి. ఫిలిప్పోస్ దుర్మరణంతో యవన సేనలు బలహీనపడ్డాయి. సెల్యూకస్ సంధికి సిద్ధం కాక తప్పలేదు.

అలెగ్జాండర్ మరణంతో మెసడోనియా ప్రాభవం తగ్గింది. చంద్రగుప్త రక్తం ఉడికిపోయింది.

★ ★ ★

**మగధ నుండి పారిపోయిన రాక్షసామాత్యుడు తక్షశిల చేరుకున్నాడు. అక్కడ రాజాశ్రయం పొంది, రాజభోగాలు అనుభవించసాగాడు.**

అతని దర్బారులో బంగారు సింహాసనం, తలపై రత్నఖచిత కిరీటం, ఛత్రచామరాలు, బయటకు వెళ్లినప్పుడు బంగారు గొడుగు పట్టేవారు, కాని అతని పూర్వపు అలవాట్లు మారలేదు. ఒక నర్తకి ఎప్పుడు ప్రక్కనే ఉండాలి. ఇద్దరు ఉసిరి, మయూర చామరాలు వీస్తుండాలి. అతని సేనలో అందరూ యువతులే. అందరూ సుందరమ్మలే. అందరూ ముద్దుగుమ్మలే. అదీ రాక్షస వైభోగం. చుక్కల్లో చంద్రుని లాగా వెలిగిపోతున్నాడు రాక్షసమంత్రి.

అకస్మాత్తుగా చాణక్య రాజమందిరంలో ప్రవేశించాడు. రాక్షసుడు తడబడి సింహాసనం దిగాడు. తన సఖీజనాన్ని లోపలకు పంపివేశాడు.

"బాగున్నావా రాక్షసా?" చాణక్య ప్రశ్నించాడు అదోలా చూస్తూ.

మగధ సౌభాగ్యం అంతా ఆ మందిరంలోనే ప్రతిబింబిస్తోంది.

రాక్షసామాత్య ఒకప్పుడు మగధలో ధననందుని ఆత్మీయమంత్రి.

"రాక్షసా! ఇవన్నీ ధననందుడు ఆనాడు అలెగ్జాండరుకు పంపిన కానుకలే కదూ! ఫరవాలేదు. నీవైనా సద్వినియోగం చేస్తున్నావు. ధననందుని మిత్రుడివి గదా. నీకా అర్హత, అధికారం ఉన్నాయి" వ్యంగ్యంగా అన్నాడు చాణక్య.

రాక్షసుడు తడబడ్డాడు. ఈ సంపద రహస్యం చాణక్యకు తెలుసునని తనకు తెలుసు. చాణక్య వేయి కళ్లతో చూస్తుంటాడనీ తెలుసు.

"మనిషన్నాక బ్రతకాలి గదా ఆచార్యా! నేను ధననందుని సంపదలు సద్వినియోగం చేస్తున్నాను."

"అవునవును. అది మగధ ప్రజల కష్టార్జితం. ధననందుని సొంతం కాదు. అయినా నేను వచ్చింది నీ సంపదలు చూచి మూర్ఛపోవడానికి కాదులే. నీతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలి. ధననందుని పతనంలో నీ చేయూత ఎంత ఉంటుంది?"

"ఆచార్యా! నేను ఎప్పటికీ మీ వాడినే. ఆ దౌర్భాగ్యుడు నా ప్రాణ సమానమైన సువాసినిని నాకు కాకుండా చేశాడు. అదీ నా కోపం?"

తన అక్కసు బయటపెట్టి "వాడి అంతు చూస్తాను" అంటూ ఒరలోంచి కత్తి దూశాడు.

చాణక్య నవ్వి : "అతనిక్కడ లేడుగా కత్తి దించు. అయినా కత్తులతో యుద్ధాలతో అయ్యే పని కాదు రాక్షసా! ఎందుకు నీ శక్తిని వృధా చేసుకుంటావు. గోటితో పోయే దానికి గొడ్డలి దాకా ఎందుకయ్యా?"

"అంటే నా శక్తి సామర్థ్యాలు శంకిస్తున్నారా ఆచార్యా?"

"ఏ మాత్రం అనుమానించడం లేదు. నీ తెలివి తేటలు, ఆలోచనలు ఉపయోగించు. నీ చాకచక్యం ఉపయోగించు మిత్రమా."

"ఆచార్యా! మీరెంత చెబితే అంత. ఆజ్ఞాపించండి. ధననందునితో అయినా యుద్ధానికి సిద్ధం."

"వద్దులే. యుద్ధం రాకుండా విజయం సాధించాలి. అందుకొక వ్యక్తి సహకారం తీసుకో చాలు"

"ఎవరా వ్యక్తి ఆచార్యా."

"భద్రశాల."

★ ★ ★

**మగధలో సుప్రసిద్ధమైన రంగసానిపేట. అది శృంగార వాడ.**

**రసికుల విహార కేంద్రం. రసిజన రాణ్మహేంద్రం.**

అది దాటితే, ఆవల స్వర్గ ధామం. అది మగధ 'శ్మశానం.'

ఆ మధ్యన ఉన్నది పానశాల. దానిని ఆనుకుని ఉన్నది జూద మందిరం. చిన్న పెద్ద మగధ సంపన్నులు, రాజోద్యోగులు అక్కడికి చేరకుండా ఉండరు. అక్కడ మూడు ముక్కలాట. మధుపానం, జూదం, ఆపైన శృంగార కేళీ విలాసం. ఇంకేం కావాలి సరసులకు!

జూదగృహం నడిపేవ్యక్తి మర్యాదస్తుడు, పెద్దమనిషి. అక్కడ వసూలయ్యే డబ్బు ధననందుని ధనాగారానికి చేరుతుంది. జూదంలో సర్వం కోల్పోయిన ఒక పెద్ద మనిషి మధుశాలకు చేరాడు. అక్కడ ఒక గది అతనికి ప్రత్యేకం. దానిని ఇతరులకు ఇవ్వరు. ఆ గది మగధ సేనాధిపతి భద్రశాలది.

గదిలో ప్రవేశించిన భద్రశాల కోపంగా రుసరుస లాడుతున్నాడు. కాపలా ఉన్న గణికతో అన్నాడు “ఎవరతను? నా మందిరంలో కూర్చున్నది?”

“వద్దని వారించాను ప్రభూ! ఆయన మీకు చాలా కావలసినవాడట. మీ అతిథినని చెప్పాడు” గణిక తప్పించుకుంది.

భద్రశాల కోపంగా గదిలోకి వెళ్లాడు.

అక్కడ ఉన్నది జీవసిద్ధి. అతనే నవ్వుతూ పలకరించాడు.

“ఏం భద్ర! ఉంటే నాతో గదిలో ఉండు, లేకుంటే వేరే గది తీసుకో, లేదా తమరు వెళ్లవలసిన కారాగారం సిద్ధంగా ఉంటుంది. పోయి అక్కడ విశ్రాంతి తీసుకోవచ్చు.”

జీవసిద్ధి చాణక్యకు మగధ ప్రతినిధి. నిప్పుతో చెలగాటం.

“ఎవరు నువ్వు? నాగదిలోకి వచ్చి నన్నే బెదిరిస్తున్నావ్? నేనెవరో తెలుసా? పో బయటకు. నువ్వు నాకు తెలియదు.”

“కాస్త తగ్గు భద్రయ్యా! నీ మిత్రుడు రాక్షసామాత్యుడు పంపితే వచ్చాను. నీ సమస్య పరిష్కరించమని పంపాడయ్యా. ఆయన నీ గురించి బాధపడు తున్నాడు. నీవు కష్టాలలో ఉన్నావని, సాయం చేయమని పంపాడు.”

“రాక్షసమంత్రి మగధలో లేడని నాకు తెలుసు. ఆ సంగతి మగధలో ప్రతి ఒక్కరికీ తెలుసు. ఆయన తక్షశిలలో ఉన్నాడు. ఆయనగారు నిన్ను పంపాడంటే నమ్మడానికి నేను పసివాడిని కాదు” భద్రశాల ఎదురు తిరిగాడు.

“సందేశం పంపి ఉండవచ్చు గదా. మనిషి ఇక్కడ ఉండాలా?”

ఆరోజు ఉదయమే చాణక్యనుండి రాక్షసమంత్రి కపోత సందేశం వచ్చింది.

భద్రశాల మరొక ప్రశ్న వేశాడు. “రాక్షసుడు నాకెందుకు సహాయం చేస్తాడు? అతగాడి జిత్తులు నాకు తెలుసు. దొంగబుద్ధి. తనకు లాభం కలిగితే తప్ప ఏ పనీ చేయడు.”

“తను నీ స్నేహాన్ని, సహాయాన్ని కోరుతున్నాడు. ధననంద తన ఆస్థానంలో పాత మంత్రులందరినీ తిరిగి నియమిస్తున్నాడట” అన్నాడు జీవసిద్ధి.

భద్రశాల కలవరపడ సాగాడు "నిజమా!"

"ఇంతకీ తమరెవరు మహాశయా?" అనుమానంగా అడిగాడు భద్రశాల.

జీవసిద్ధి తనచేతిలోని వస్తువులు బల్లమీద పెట్టి –

"నీ ఆర్థికావసరాలకు నా సాయం."

"నేను జూదంలో ఓడిపోయానని, దివాలా తీశానని మీకెలా తెలుసు."

"ధర్మరాజు జూదంలో ఓడిపోడని ఏమిటి నమ్మకం?"

"జూదం అంటేనే గెలుపు ఓటముల సయ్యాట కదా?"

"ఒక పని చేస్తే నీ అప్పులన్నీ తీరతాయి. రుణ విముక్తుడివే గాక సంపన్నుడివీ కావచ్చు" జీవసిద్ధి వ్యంగ్యంగా అన్నాడు.

"ఏమిటా ఉపాయం?" భద్రశాలలో ఉత్సాహం.

అతని మొహంలో మొహంపెట్టి జీవసిద్ధి చెప్పాడు.

"మిత్రుడా! నాది కాంభోజి. నేనొక అశ్వ వ్యాపారిని. పాటలీ పుత్ర శివార్లలో కొన్నివేల గుర్రాలున్నాయి నావి. మంచి మంచి గుర్రాలు మా ప్రాంతం నుండే వస్తాయని మీకు తెలుసు."

"బావుంది ... అయితే?"

"ప్రస్తుతం నా దగ్గర ఉన్న గుర్రాలు కాస్త నాసిరకం. మీ మగధ రాజుకి అవి నచ్చవు."

"సరిసరి. నాకే వ్యాపారం వద్దు దయచెయ్యి."

"ఈ వ్యాపారం నీకు కలిసొస్తుంది మహానుభావా! మనిద్దరికీ లాభం. నీ బాకీలు తీరిపోతాయి. పైగా ఏడు తరాలకు సరిపడ మిగుల్చుకోవచ్చు. బలే మంచి చౌక బేరం!" ఆశపెట్టాడు జీవసిద్ధి.

"చెప్పుచెప్పు."

భద్రశాల ముగ్గులోకి వచ్చాడని జీవసిద్ధి గ్రహించాడు.

"మీ వద్ద అశ్వశాలలో వేలకొద్దీ అశ్వాలున్నాయి – మేలు రకానివి. వాటిని అమ్మేయండి."

భద్రశాలకు చిర్రెత్తుకొచ్చింది.

"ఏం మాట్లాడుతున్నావ్? అవి నా స్వంతమా, రాజుగారివి. అవి నేనెట్లా అమ్మగలను పిచ్చివాడా! ప్రతినెల అధికారులు తనిఖీ చేస్తారు. లెక్క తప్పితే బొక్క చింపేస్తారు. దయచేసి వెళ్ళు. నీ వ్యాపారం వద్దు, నీపాయమూ వద్దు పోయిరా."

"తొందర పడకండి మహాశయా! చెప్పేది వినండి. మీ తనఖీలు సంఖ్య వరకే గదా? కాలు వంకర, కన్ను వంకర ఎవరు చూడొచ్చారు?"

ఆ తిరకాసు భద్రశాల గ్రహించి నవ్వుకున్నాడు.

"అంటే తలలు మార్చేద్దా మంటావు అంతేనా?"

"నా గుర్రాలు కొన్ని వందలు పంపిస్తా. వాటి బదులు నువ్వు అన్ని గుర్రాల్ని పంపించు. తర్వాత కథ నేను నడిపిస్తా."

"లాభం ఎట్లా పంపిణీ."

"నాకు డెబ్బయ్ శాతం. తమరికి ముప్పయి శాతం. శ్రమనాది కదా."

గట్టిగా బేరం చేయమని చాణక్య ముందే చెప్పాడు.

"నా జాతి గుర్రాలు లేకపోతే నువ్వు చేసే దేమిటి స్వామీ. సగం సగం" భద్రశాల మనసులో మాట చెప్పాడు.

"అట్లా కాదులే అరవై – నలభై చేసుకుందాం."

"సరే అలాగే కానియ్" భద్రశాల అంగీకరించాడు.

★ ★ ★

**"పౌరస్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆ ఒప్పందాలు ముందే చేసుకోవాలి లేకపోతే తలనొప్పి."**

ఏకాంతంగా ఉన్నవేళ చాణక్య సింహరన్‌తో అన్నాడు. కేకయ రాజ మందిరంలో ఇద్దరూ రహస్య చర్చలు జరుపుతున్నారు.

"అతనితో వ్యవహారం చిరాకు. ఒక రోగానికి మందు వేస్తే మరొక రోగం బయట పడుతుంది. రాజకీయ చరకచక్రవర్తి కదా! అలెగ్జాండర్‌నే ముప్పుతిప్పలు పెట్టిన ఘనుడు."

సింహరన్ అన్నాడు, "మన వార్తాహరులు కొత్త వార్త లేవో తెచ్చారు. అలెగ్జాండర్, ఫిలిప్పోస్‌ల మరణంతో చంద్రగుప్త, శశిగుప్తలకు మేలు జరిగింది.

ఆఫ్ఘన్‌ను ఆక్రమించిన తర్వాత సింధుపైన పడ్డారు. శూద్రక, సైంధవ ఆశ్విక బలాలు వచ్చి చేరాయి. దాదాపు సింధు ప్రాంతం అంతా వారి స్వాధీనం అయిందట. పైగా ఆలోమ, సైంధవ వన, మహా ఊర్ధ్వ, బ్రహ్మస్థలి, పాటల సేనలు. మెసడోనియా పై ఎదురు తిరిగాయి. వారంతా చంద్రగుప్త నాయకత్వం అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నారట. మీ సూచన మేరకు ప్రస్తుతం చంద్రగుప్త సింహపురం రాజుగా పట్టాభిషిక్తుడైనాడు. ఇప్పుడు పదివేల సైన్యం తన చేతిలో ఉంది. అందరూ పోటు మగలే. ఇది శశిగుప్త సైన్యానికి అదనపు బలం. మనకు మల్లసైన్యం ఉండనే ఉంది. ఇహ పౌరస్ సహాయం మనకు అవసరం లేదనిపిస్తోంది ఆచార్యా."

"పౌరస్ సహాయం కావాలి తప్పదు. అతని వద్ద మూడు వందల ఏనుగులు, అయిదు వందల రథాలు, పదివేల అశ్విక యోధులు ఉన్నారు. యాభై వేల పదదళం ఉంది. అంతేకాక మెసడోనియా, శక, కిరాత, కాంభోజ, పారశీక, బాహ్లిక ఆశ్విక దళాలు మరో యాభై వేల వరకు ఉంటాయి. పౌరస్‌ను తేలికగా అంచనా వేయకు. మగధబలం తక్కువ కాదు. అలెగ్జాండరుకే మగధ మింగుడు పడలేదు. పౌరస్ లేకుండా విజయం పూర్తి కాదు."

చాణక్య వివరణ యిచ్చాడు.

"తీరా మగధను జయించిన తర్వాత పౌరస్ మగధ తనకే కావాలంటే"

సింహరన్ అడిగాడు. ఆ అనుమానం చాణక్యకూ ఉంది.

"ఏ ప్రయోజనం లేకపోతే ఎందుకు యుద్ధానికి దిగుతాడు."

చాణక్య : పౌరస్‌ను లొంగదీయడానికి ఒకే ఒక మార్గం ఉంది. మగధ సింహాసనానికి మరొక మగధీరుణ్ణి పోటీ పెట్టాలి.

"ఎవరా మగధీరుడు? ఆచార్యా?"

"గత అరవై ఏళ్లుగా కళింగ మగధకు సామంతరాజ్యంగా ఉంది. వారిని మహానందుడు అణచిపెట్టాడు. నాటి నుండి కప్పం కడుతున్నారు. ఇది కళింగరాజుకు మంచి అవకాశం."

"అంటే కళింగప్రభువుకు మగధను కట్ట బెడతారా ఆచార్యా?"

సింహరన్ నొసలు చిట్లించాడు.

"లేదు లేదు. నేను అంతపెద్ద అబద్ధం ఆడలేను. చిన్న అబద్ధంతో పని

అయ్యే వీలుంటే పెద్ద అబద్ధంతో ఏం పని?" అతనికి ఏం చెప్పాలంటే ధననందుడు అడ్డు లేకపోతే కళింగ స్వతంత్ర దేశం అవుతుందని చెబితేసరి. అరవై సంవత్సరాల దాస్యం తొలగిపోతుంది వారికి. ఈ చిన్న తాయిలం చాలు కళింగకు.

★ ★ ★

"ఒక సమస్య వచ్చి పడ్డది స్వామీ" నసుగుతూ అన్నాడు జీవసిద్ధి.

"ఇప్పుడు ఇంకా సమస్య ఏమిటి మహాశయా బేరం కుదిరిందిగా."

చిరాకుపడ్డాడు భద్రశాల. అప్పటికే రెండువేల గుర్రాల మార్పిడి జరిగింది. జీవసిద్ధి అందులో సగం వరకు తక్కువ జాతి గుర్రాలను పంపాలి. వాటిని మగధ అశ్వశాలలోని మేలుజాతి గుర్రాలతో కలపాలి. ఆ మర్నాడు జీవసిద్ధి మేజుగుర్రాలు పంపాలి. అర్ధరాత్రి తర్వాత ఈ మార్పు జరగాలి.

దాంతో భద్రశాల రుణ విముక్తుడవుతాడు. మధుశాలలో, జూదశాలలో యధావిధిగా తల ఎత్తుకు తిరగవచ్చు.

"లేదు స్వామీ, నేను సరఫరా చేసిన గుర్రాలలో సగం పైగ వాటి వీపులపైన చిన్న మచ్చలున్నాయి. చీకటిలో నేను గమనించలేదు. గుర్రాల వీపు పైన ఎప్పుడు జీనులుంటాయి గదా. అందువల్ల గుర్తించలేకపోయాను."

"ఏమిటా మచ్చలు. తుడిచేస్తే పోవా?" భద్రశాల వణికిపోయాడు.


"అయ్యా అవి రాజగుర్తులు. చంద్రగుప్త సంకేతాలు."

"ఎంత తేలికగా అనేశావయ్యా మహానుభావా? అవి చంద్రగుప్త గుర్రాలని తెలిస్తే, అవి మగధ బలగంలోకి ఎట్లా వచ్చాయని ఆరాతీస్తే ఏమవుతుందో తెలుసా?"

"ఏమవుతుంది స్వామీ? మహా అయితే తమర్ని ఉరి తీస్తారు. అంతేగదా." జీవసిద్ధి వికృతంగా నవ్వాడు.

"ఆరి దుర్మార్గుడా! నాతో పాటు నిన్నూ ఉరి తీస్తారు."

"అవునవును. మీ అంచనా సబబే. కానీ ఈ రహస్యం మీకూ నాకూ తప్ప ఎవరికి తెలుసు. కనుక తమరి ప్రాణానికి సత్వరం వచ్చే ప్రమాదం లేదు. కాదంటే అప్పుడు తమరు నా అవసరాన్ని గుర్తిస్తూ ఆదుకుంటే నేను ఎవరికీ చెప్పను అంతే."



# 13. ధననంద నిర్వేదం

**ధ**ననందునికి కడుపులో దేవినట్లయింది. రాక్షసుడు దేశం వదలి వెళ్లిపోయాడు. చాణక్య చంద్రగుప్తులు ఒకవేపు నుండి జయిస్తున్నారు. అందరిని కూడ దీస్తున్నారు. విప్లవ వార్తలు వినవస్తున్నాయి. తనపైన ఏదో పెద్దకుట్ర జరుగుతోంది. తనకెవరు దిక్కు?

ధననంద బంగారు సింహాసనం పైన కూర్చున్నా తృప్తిగా లేదు. క్రింద ముళ్లు గుచ్చుకుంటున్నాయి. గుండెలో దడ, కడుపులో అలజడి. దర్బారులో మంత్రులు, సామంతులు బారులు తీరి కూర్చున్నారు. అందరూ చెప్పిందానికి తలలూపుతారు తప్ప ఒక్కరూ సలహా చెప్పరు.

"పోయినవాళ్లే మంచివాళ్లు" అనుకున్నాడు. ఇప్పుడున్నవాళ్లకు తలకాయల్లో ఏమీ లేదు. నిజాయితీ లేని నాపలు. వీళ్లను వదిలించుకోవాలి.

శక్తారుడు మహామంత్రిగా ఉన్న కాలంలో ఎంత బావుండేది! ఆ రోజులు జ్ఞాపకం వస్తున్నాయి. తన ఆలోచనల్ని చక్కదిద్దుతుండేవాడు. అది తన కర్తవ్యంగా భావించేవాడు. తర్వాత రాక్షసుడూ ఫరవాలేదు. ఎంత దగుల్బాజీ అయినా అతనిలోనూ రవంత మంచితనం ఉంది. ఇప్పుడు అతను లేనిలోటు తెలుస్తోంది. అతని కాలంలో తాను సుఖపడ్డాడు. రోజూ ఒక సొగసుకత్తెను

తెచ్చేవాడు. సువాసిని రాకతో తనకు కష్టాలు మొదలయ్యాయి. సువాసిని అతని ప్రేయసి. తను ఆమెను కోరడం తప్పయిపోయింది. సువాసిని గొప్ప సౌందర్యవతి కాకపోయినా విలాసిని. సొగసుకత్తె. గొప్పగా సుఖాన్నిచ్చేది. ఒకసారిచూస్తే ఆమెను ఆశించని మగవాడు ఉండడు.

మగధకు రక్షణ ఉందా? ధననందునికి అనుమానం వచ్చింది.

కాత్యాయన మంత్రి లేచి తన అనుమానం బయటకు చెప్పేశాడు.

"మహారాజా! మనల్ని మనం కాపాడుకో గలమా అన్నది ప్రశ్న. మనం మగధను రక్షించగలమా అన్నదీ అనుమానమే."

ధననంద నిజాలు జీర్ణించుకోలేడు. తెలివిగల వాళ్లను అసలు భరించలేడు. అన్నీ తలమాసిన ఆలోచనలు చేస్తాడు.

"కాత్యాయనా! నేను ఇదే ప్రశ్న భద్రశాలను అడుగుతాను. అతనే కదా మన సర్వసేనాని."

భద్రశాల కంగారుగా కాత్యాయన వైపు చూచాడు. అతనికి ఈ మంత్రాంగాలు, సమాలోచనలు నచ్చవు. మంత్రులంతా తనవైపు గుచ్చిగుచ్చి చూస్తున్నట్లు బాధపడ్డాడు.

"మహారాజా! మన సైన్యం ఎప్పుడు సిద్ధంగానే ఉంటుంది. నా సలహా ఏమంటే మన సైన్యం పాటలీపుత్ర వదిలిపోకూడదు. ఒకవేళ శత్రువు దండెత్తి వస్తే పాటలీపుత్రలోకి వచ్చి హతం చేయాలి. అది సులభం కాదు."

ధననంద : "అయితే ఇంద్రప్రస్థ లాంటి నగరాలను మనం రక్షించు కోలేమా? సరిహద్దుల రక్షణ మాట?"

భద్రశాల గుటకలు మింగాడు. జీవసిద్ధి చెప్పినట్లు చేస్తే సరిపోయేది.

కాత్యాయన : భద్రశాల చెప్పే మాటలో కొంతసత్యం ఉంది మహారాజా!

భద్రశాలకు చెమటలు పట్టాయి. అతని మాటలు చాణక్యవని కాత్యాయనకు తెలుసు. కాత్యాయన తనపక్షాన మాట్లాడినందుకు భద్రశాల స్థిమితపడ్డాడు.

కాత్యాయన తన అభిమతం తెలియచేశాడు.

"మహారాజా! మన ధనాగారం ఉన్నది పాటలీపుత్రలో. కనుక ఇంద్రప్రస్థను రక్షించడంలో అర్థం లేదు. దేశసంపద ఎక్కడ ఉంటే అక్కడ రక్షణ, సైన్యం ఉండాలి. దండెత్తి వచ్చేవాడు ఎటునుండి వస్తాడో తెలియదు. పౌరస్ పడమర నుండి వస్తాడు. కళింగ దక్షిణం నుండి వస్తుంది. నేపాల్ ప్రభువు ఉత్తరం నుండి వస్తారు. ఎన్ని ఎన్ని దిక్కులకని సైన్యాన్ని పంపుతాం. శత్రువు అయోమయంలో పడతాడు. సరాసరి పాటలీపుత్రపైకి వస్తాడు. అంటే బోనులో తలపెడతాడు. ఎవరుగానీ పాటలీపుత్రలో అడుగుపెడితే ప్రాణాలతో తిరిగిపోరు."

ధననంద అభినందన పూర్వకంగా కాత్యాయన వైపు చూచాడు. అతను భద్రశాల వేపు గర్వంగా చూచాడు.

ధననంద : నేను అవివేకుల్ని భరిస్తాను కాని మేధావుల్ని భరించలేను. అవకాశవాదుల్ని ప్రోత్సహించింది ఎప్పుడూ లేదు. దయచేసి అందరూ వెళ్లి రండి. వచ్చే శత్రువుని సరాసరి పాటలీపుత్రకే రమ్మనండి సన్మానిద్దాం.

★ ★ ★

అంభికి తెలుసు పౌరస్ మగధపై కన్నేసి ఉన్నాడని.

"ఇదే సమయం కేకయపై దండయాత్ర చేయడానికి. దానిని మనం ఎట్లా ఆపగలం?" మెహర్ ప్రశ్నించాడు.

చాణక్య : అంభికి తీరిక లేకుండా చేస్తే సరి. తన సరిహద్దులు దాటి అంభిని వెళ్లకుండా చేద్దాం.

"చెప్పడం సులభం. చేయడం కష్టం. అతని ప్రజలు సుఖంగా ఉన్నారు."

"వాళ్లకి సుఖశాంతులు లేకుండా చేస్తే సరి. ఏమంటావ్ మెహర్?"

"గాంధారంలో బలమైన వర్గం ఏది?"

"బ్రాహ్మలు."

"వాళ్ల బలం?"

"దైవానుగ్రహం అని వేదాల్లో చెప్పారుట. ప్రజల పక్షాన బ్రాహ్మలు దేవుళ్లతో మాట్లాడతారట."

"ప్రజలంతా బ్రాహ్మల ఆధిపత్యం అంగీకరిస్తారా?"

"ఉహు! బౌద్ధులు బ్రాహ్మణుల ఆధిక్యత అంగీకరించరు. బ్రాహ్మణ క్రతువులు, ఆచారాలు బౌద్ధులకు నచ్చవు."

"అంభి బౌద్ధాన్ని అభిమానిస్తే సరి ..."

"ఏం జరుగుతుంది?"

"బ్రాహ్మణులు తిరగబడతారు."

"అంటే దేశంలో సుఖశాంతులు లేకుండా పోయినట్లే కదా."

మెహర్ తన ఓటమి అంగీకరించి నవ్వాడు.

"అంభిని బౌద్ధం వైపు త్రిప్పడం నా వల్ల అవుతుందా ఆచార్యా!"

"దానికి జవాబు తక్షశిల విద్యాలయం. ఇప్పటి వరకు తక్షశిల విద్యాలయంలో నా వంటి బ్రాహ్మణులే ఉన్నారు. విద్యాలయంలో ఒక కొంత భాగాన్ని బౌద్ధ విజ్ఞానానికి కేటాయిస్తే సరి. బ్రాహ్మణ మేధావులకు చెమటలు పడతాయి."

"అయినా అంభి బౌద్ధం కోసం ధనసహాయం చేస్తాడని అనుకోను." మెహర్ అనుమానంగా అన్నాడు.

"కానీ అంభికి ఖర్చు లేకుండా ఉపాయం ఆలోచిద్దాం."

"ఎవరు ధన సహాయం చేసినా, మత కలహాలు మంచిదంటారా ఆచార్యా?"

"చంద్రగుప్త అధికారంలోకి యావత్ భారతం వచ్చి తీరాలి. ఐక్యత కోసం మతపరమైన అసూయ తప్పు కాదేమో. చివరకు ఫలితం మంచిదైనపుడు చేసిన పని మంచిదే గదా."

"అది మన ఆత్మసాక్షికి భిన్నం కదా."

"మెహర్! స్వచ్ఛమైన మనస్సే చెడునూ ఆలోచిస్తుంది. రాజకీయాల్లో అంతరాత్మలు, ఆత్మసాక్షులు పనిచేయవు. వాటిని మరచిపో."

"ఆచార్యా! మీరు బ్రాహ్మణులు. మీ పథకం వల్ల మీ వర్గానికి నష్టం కలగదా?"

"నాకు తెలిసింది ఒకే వర్గం. అఖండ భారతం. అది నా లక్ష్యం."

"అయితే మీరు ఏ పక్షం?"

"మనమెప్పుడూ గెలిచే పక్షమే."

"అయితే చంద్ర, శశిగుప్తుల్ని అంభిపై యుద్ధానికి సిద్ధం చేయండి."


"చైనా వారు ఒక పద్ధతి అనుసరిస్తారుట. మనిషిని ముక్కలు ముక్కలు చేసి చంపుతారట. అదే అంభిగతి."

"ఎందుకు గురూజీ అంభి పైన అంతకోపం?"

"మనం అతని మిత్రులం అనే భ్రమలో అతన్ని ఉంచు చాలు."

"ఎందుకు ఆచార్యా?"

"ఎందుకంటే వెనక  నుండి వెన్నుపోటు పొడవడం తేలిక. నీవు అతని వెనకాల నడుస్తావ్? అర్థం కాలేదా."



# 14. బుద్ధం శరణం

**త**క్షశిల సమీపంలోని దట్టమైన అడవుల్లో ఒక బౌద్ధ సంఘం అది. అన్నీ పర్ణశాలలే. నిరాడంబరంగా, నిర్మలంగా, ఆకర్షణీయంగా ఉన్నాయి. నూరుమంది బౌద్ధ భిక్షులు, భిక్షుణులు ఆరుబయట ఎండలో వరసగా నడుస్తూ త్రిశరణాలు వల్లిస్తున్నారు. భిక్షులు ఒక వరుస, భిక్షుణులు మరొకవరుస. అంతరవశాన, ఉత్తరసంగ అనేవి ఆచ్ఛాదనలు. ఆపైన సంఘటి, కుశాలక అంగ వస్త్రాలు ధరించారు. కాళ్లకు పావుకోళ్లు కొందరు ధరించారు. మిగిలిన వారికి పాదరక్షలు లేవు. ప్రతిభిక్షువు చేతిలో ఒక భిక్షాపాత్ర, పళ్లు తోముకునే పుల్లలు, బట్టలు కుట్టుకునే సూది, చేతిలో కర్ర.

బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి

అని సామూహిక ప్రార్థన చేస్తున్నారు గాన ఫణితిలో. కులాధిక్యత బౌద్ధంలో కనిపించదు. అందుచేత నిమ్న, దళిత, బడుగు వర్గాలవారు, వెనకబడిన కులాల వారు బౌద్ధంలో చేరుతున్నారు. బ్రాహ్మణ ఆచారాలను వారు పాటించరు. పైగా వర్జిస్తారు. వారు సంస్కృతం నేర్చుకోరు. వేదాలు

ప్రమాణంగా భావించరు. కులం తక్కువ వారు బౌద్ధాన్ని ఆశ్రయిస్తున్నారు. గౌతమ బుద్ధుని తత్వం విశ్వసౌభ్రాతృత్వం, విశ్వప్రేమ, కరుణ.

బౌద్ధ సంఘసభ్యుల చర్యలను చెట్ల పై నుండి ఎవరో రహస్యంగా గమనిస్తున్నారు. తలపాగా చుట్టి మొహం గుర్తించకుండా మూతికి గుడ్డ కట్టుకుని, ఒక చేతిలో కత్తి, రెండవ చేతిలో గండ్రగొడ్డలి ధరించిన ఆ వ్యక్తికి చెవులకు పోగులు, దండ కడియాలు, కరకంకణాలు తప్ప ఏవీలేవు. నుదుట ఎర్రని తిలకం. అతను బ్రాహ్మణుడే కాని బందిపోటు దొంగల నాయకుడు. క్షత్రియ వేషం ధరించాడు. అతని ముఠాలో యాభై మంది అతని లాంటి వారే ఉన్నారు. అందరూ అక్కడక్కడ చెట్ల కొమ్మల చాటున దాగి బౌద్ధ సంఘం కార్యకలాపాలు నిశితంగా గమనిస్తున్నారు.

వారి నాయకునికి కోపంగా ఉంది.

"ఈ దుర్మార్గులు అస్పృశ్యులను బౌద్ధంలో చేర్చుకుంటున్నారు. బ్రాహ్మణ ధర్మాన్ని, ఆచార వ్యవహారాలను మంట కలుపుతున్నారు. నేల రాస్తున్నారు. పైగా ధర్మాలను సంస్కృతంలో కాక ప్రాకృతంలో, పాలీ భాషలో రాస్తున్నారు. సంస్కృతాన్ని అవమానించడం వారి లక్ష్యంగా కనిపిస్తోంది. ఎంత ధైర్యం వీళ్లకి? పవిత్రమైన హిందూ ధర్మాన్ని, బ్రాహ్మణ ఆచారాలను కాదంటారా దుర్మార్గులు? అన్నీ మ్లేచ్ఛ బుద్ధులు. ఆ అధర్మ విద్యకు తక్షశిల విశ్వవిద్యాలయం ఒకపీఠం! వీళ్లకు తగిన బుద్ధి చెప్పాలి. కుక్కల్ని తరిమినట్లు తరిమికొట్టాలి. పర్షియనులు, మెహర్ వీళ్లకి అండగా ఉన్నారుట. కులం తక్కువ వెధవలు."

ఆకాశంలో చీకట్లు ముసురుకున్నాయి. పక్షులు అరుస్తూ పర్ణశాలలపై వాలుతున్నాయి. ఏదో ఉపద్రవాల్ని సూచిస్తూ కాకులు అరుస్తున్నాయి.

★ ★ ★

**అంభి కోపంతో రుసరుసలాడుతున్నాడు.**

"ఎంత ధైర్యం వీళ్లకి. ప్రతివాడు చట్టాన్ని తన చేతిలోకి తీసుకోవడమే! ఇలా అయితే దేశంలో న్యాయదేవత ఏం కావాలి? ప్రజలు ఎలా సుఖంగా బ్రతకాలి? బ్రాహ్మణులు బందిపోట్లుగా, దొంగలుగా మారడం ఏమిటి? బౌద్ధ భిక్షువులను హత్య చేయాలని చూస్తున్నారుట. వాళ్లను హత్యచేసి వీళ్లు ఎలా తప్పించుకుంటారో చూస్తాను? చూపిస్తాను నా తడాఖా."

అంభి ఆజ్ఞ మేరకు అరాచకానికి బాధ్యులైన ధగ్గుల్ని ప్రదేష్ట ముందు హాజరు పరిచారు. అక్కడ కఠిన శిక్షలు పడవు. నామ మాత్రంగా అపరాధ రుసుం చెల్లించి పొమ్మంటారు. నూరు మంది అమాయక బౌద్ధభిక్షుల్ని చంపి నందుకు చిన్న జరిమానా విధించడమా? ఏం న్యాయం ఇది? వారి రక్తపిపాస తీరినట్లా? న్యాయం జరిగినట్లా?

"వాళ్లను బట్ట లూడదీసి, నగ్నంగా వరుసగా నిలబెట్టండి. సిగ్గుతో చావనీయండి. ఎర్రగా కాల్చిన కత్తులతో నాలుకలు అంటించండి. కుడిచేతుల్ని సలసల కాగే నూనెలో ముంచండి. ఎడమ కంటిలో మైనం కరిగించి పోయండి. ఎడమ కాలి బొటనవేళ్లను నరకండి. ముఖాలు చెక్కి వికారంగా చేసి వదలండి. గాడిదల మీద నగరంలో ఊరేగించండి. చనిపోయిన బౌద్ధ భిక్షుల వలె వీరినీ దిక్కులేని చావు చావనీయండి. బ్రతికి ఉండగానే నరకం చూపించండి."

అంభి కోపంతో ఆజ్ఞలు జారీచేశాడు.

అతనికి తెలియదు? తను అగ్నిపర్వతం మీద కూర్చున్న విషయం.

★ ★ ★

**"చంద్రగుప్త బ్రాహ్మణ పక్షపాతి అనడానికి ప్రయత్నించండి.**

**బ్రాహ్మణ వర్గాన్ని తను ఉద్ధరిస్తున్నట్లు నమ్మించాలి."**

చాణక్య సిద్ధార్థకుని కపోతం ద్వారా చంద్రగుప్తకు సందేశం అందించాడు.

సిద్ధార్థకుడు దిగులుగా అడిగాడు. "గురుదేవా! అమాయకులైన భిక్షుల్ని హత్యచేసిన వారిని శిక్షించడం అన్యాయం ఎట్లా అవుతుంది? అంభి రాజు చేసిన పని మంచిదే కదా?"

"సిద్ధార్థకా! తప్పు చేసిన ప్రతివాడు తను తప్పు చేయలేదనే అంటాడు. ఎవరిని శిక్షించాలి."

చాణక్య కన్నుగీటి అన్నాడు "ఇది అవకాశం. రాజకీయాల్లో అవకాశ వాదం ముఖ్యం సిద్ధార్థకా. చంద్రగుప్తుడు బ్రాహ్మణ పక్షపాతి అని చెప్పడానికి ఇది అవకాశం. ఆయన బ్రాహ్మణ జీవనప్రదాత.

"చంద్రగుప్త వేయి మంది ఋత్విక్కులతో యజ్ఞం నిర్వహించాలి. వేద పఠనం చేయించాలి. బ్రాహ్మలకు సంభావన లివ్వాలి. సత్కరించాలి. వెండి, బంగారం, నూతన వస్త్రాలు, ధన, ధాన్యాలు పంచిపెట్టాలి. గోదానం చేయాలి."

సిద్ధార్థకునికి అనుమానం కలిగింది.

"యజ్ఞాలు, యాగాలు చేయకుండా చంద్రగుప్త అంభిని గెలవలేడా?"

"ఆ పని శశిగుప్త చేస్తాడు" అన్నాడు చాణక్య.

"ఆచార్యా! శశిగుప్త గాంధారాన్ని జయిస్తే, తనూ చంద్రగుప్త అంతటి బలసంపన్నుడవుతాడు. చంద్రగుప్త ప్రస్తుతం సింహరన్ సాయంతో క్షుద్రక సైంధవ, అలోర, బ్రహ్మస్థలి, పాళీ, మహా ఊర్ధ్వలపై ఆధిపత్యం పొందాడు. శశిగుప్తకు అశ్వశ, సింధు ప్రాంతాలపై పట్టు ఉంది. ఆ రెండు కీలక ప్రాంతాలు, బలమైన రాజ్యాలు" వాదించాడు సిద్ధార్థక.

"తను గాంధారాన్ని వదలడు సిద్ధార్థకా. మనకు కావలసింది అదే. అతను ఆపనిలో ఉండగానే చంద్రగుప్త బ్రాహ్మణ వర్గాల్ని తనవేపు తిప్పుకోవాలి."

"ఎందుకు?"

"ఫలితం మనకు దక్కడానికి."

★ ★ ★

ఒక నాయీ బ్రాహ్మడు ఒక స్వర్ణకారుడికి గడ్డం చేస్తూ కబుర్లు చెబుతున్నాడు.

"ఇది విన్నావా సామీ! గాంధారంలో అంభి రాజు వేయిమంది ఆర్య బ్రాహ్మణుల్ని చంపించాడట. బ్రహ్మ హత్య మహాపాతకం కదా?"

"పాపం లేదు, పుణ్యం లేదు. ఆర్యులు, ఆర్యబ్రాహ్మలు, ఆర్య క్షత్రియులు, ఆర్య వైశ్యులు అవి పెద్ద వర్గాలు. మిగిలిన స్థానికులు ద్రవిడులు క్రమంగా శూద్రులు, అనార్యులు అయినారు. బ్రాహ్మణులు బ్రహ్మణేతరుల్ని హింసించ సాగారు. అది న్యాయమా? బ్రాహ్మలు చంపిస్తే పుణ్యం. బ్రాహ్మల్ని చంపితే

బ్రహ్మహత్యా పాపమా! ఇదేం న్యాయం? ఈ బ్రాహ్మలకి మాత్రం బౌద్ధ ద్వేషం ఎందుకట? బౌద్ధ భిక్షువుల్ని చంపడం అన్యాయం కదా?!

"అన్నట్లు ఇది తెలుసా. అశ్విక, సింధు నాయకుల సహాయంతో శశిగుప్త గాంధారంపై దండెత్తి బ్రాహ్మణుల్ని ఉద్ధరిస్తాడట."

ఆ మాటలు వింటున్న ఒక వ్యక్తి నవ్వాడు.

"ఎవరు బాబూ తమరు, నామాట అబద్ధమా?"

"అయ్యా నా పేరు తున్నవాయి. సింధుదేశం వాడిని. బట్టల వ్యాపారం నిమిత్తం వచ్చాను. మీరు చెప్పుకుంటున్న శశిగుప్త నాకు తెలుసు. అందుకే నవ్వాను. శశిగుప్త మీరు అనుకునేంత గొప్పవాడు కాదు. అతగాడు బ్రాహ్మల్ని ఉద్ధరించడం ఏమిటి? నా బొంద."

★ ★ ★

"తక్షశిల లోని మహా విద్యాలయంలో బౌద్ధ పీఠానికి అంభి లక్ష వరహాలు విరాళంగా యిచ్చాడు. స్థానికంగా ఉండే బ్రాహ్మణ పీఠానికి చిల్లి గవ్వ ఇవ్వలేదు. అతనికి బ్రాహ్మలంటే ఇష్టం లేదా?" ఒక చతుర్వేద పండితుడు. మరొక త్రివేదిని ప్రశ్నించాడు.

"ఆ శశిగుప్త గాంధారం జయించి బ్రాహ్మణుల్ని ఉద్ధరిస్తాడంటే నాకు నమ్మకం లేదు."

ఆ పండితుల సంభాషణ వింటున్న ఒక అపండితుడు నవ్వుకున్నాడు.

"ఎవరయ్యా, నీకు మా మాటలు నవ్వుగా ఉన్నాయా?"

"నాపేరు చారణుడు. సింధు ప్రాంతవాసిని. మీరు చెప్పే శశిగుప్తను బాగా తెలిసినవాడిని. ఆయన బ్రాహ్మల్ని ఏం ఉద్ధరిస్తాడో తెలియదు కాని అతని భార్య ఒక శూద్రస్త్రీ అని మాత్రం తెలుసు."

"అవునవును. ఆమె అనార్యట గదా! నేనూ విన్నాను. ఆయనగారు శూద్ర స్త్రీలతో కులుకుతూ ఉంటాడుట."

ఇద్దరు వేద పండితులు నవ్వుకున్నారు.

★ ★ ★

"అంభి మెసడోనియాకు అమ్ముడుపోయాడు. ఇప్పుడు బౌద్ధులకు

తలవంచుతున్నాడు. బ్రాహ్మలకు తలవంపులు తెస్తున్నాడు. అతగానికి సిగ్గు, ఎగ్గులు లేవు."

ఒక దైవజ్ఞశర్మ ఎవరికో చేతి రేకలు చూస్తూ వాగుతున్నాడు. అతగాడు తన అదృష్టం గురించి అడిగితే ఈ దైవజ్ఞుడు అంభి కథ చెబుతున్నాడు.

"నాకు తెలిసినంత వరకు బ్రాహ్మణ ఆధిక్యం తగ్గించడం కోసం అంభి బౌద్ధాన్ని ప్రోత్సహిస్తున్నాడనిపిస్తుంది. అంతే కాదు బాబూ. శశిగుప్త అంభితో తెగ తెంపులు చేసుకున్నాడని వినబడుతోంది."

ఆ ఇద్దరి సంభాషణ వింటున్న ఒక చెట్టు క్రింది పక్షి నవ్వాడు.

"ఏం స్వామీ నవ్వుతావు. మా మాటలు నవ్వుతాలుగా ఉన్నాయా? నిజం కాదా. అసలు నువ్వెవరు?"

"నేనొక గుర్రాల వ్యాపారిని. సింధుప్రాంతం వాడిని. మీరు నిజాలు తెలియకుండా మాట్లాడుతుంటే నవ్వొచ్చింది. అమ్మకానికి నా వద్ద మంచి జాతి గుర్రాలున్నాయి. కావాలా?"

"గుర్రాలు మాకెందుకు గాని శశిగుప్త నీకు తెలుసా?"

"ఆc ఆ తెలుసు" దారిలో రథాలకు అడ్డంగా ఉందని కుబేర దేవాలయం కూల్చివేసిన ఘనుడు కదా."

"కావాలనే దేవాలయాలు కూల్చివేస్తున్నాడంటారా?"

"లేదు. తద్వారా బ్రాహ్మణోద్ధరణ చేస్తున్నాడంటాను!"

★ ★ ★

"లోకులు పలు గాకులు. మాటలు ఈటెల్లా గుచ్చుకుంటాయి. ప్రచారాన్ని మించిన జాణతనం లేదు. జన వాక్యాన్ని తక్కువ అంచనా వేయకూడదు" అన్నాడు చాణక్య.

చదరంగం ఆడుతూ తన 'రాణి'ని రెండు గడులు దాటిస్తూ. చాణక్య ఎత్తు గట్టిగా ఉంది. రాణికి ప్రమాదం లేదని మెహర్ గుర్తించాడు. ఎత్తుకు పై ఎత్తు వేయడంలో చాణక్య జిత్తులమారి. ఆట మొత్తం మనసులోనే ఉంటుంది. అలవోకగా చాణక్య తన గుర్రాన్ని మూడు గడులు దూకించాడు

నవ్వుతూ. మెహర్ తన రాణిని రెండు గడులు ఇవతలికి తప్పించి సైనిక రక్షణలో ఉంచాడు.

అది చూస్తున్న ఒక ప్రేక్షకుడు విసుక్కున్నాడు.

చాణక్య నవ్వాడు. తర్వాత మెహర్ ఏ ఎత్తు వేసేది తెలుస్తోంది. చాణక్య రాణిని ప్రత్యర్థి బంటు ముందు నిలిపాడు. చాణక్య గుర్రాన్ని కాపలా ఉంచాడు. మెహర్ తన రాణిని కదిలించడానికి లేదు. ఓటమి అంచుకు చేరినట్లే.

చాణక్యతో ఎత్తులు వేయడం సాధ్యం కాదు. అవతలి వ్యక్తి తలలో దూరి అతని ఎత్తుల్ని చిత్తు చేస్తాడు.

"మెహర్! ఆటలో ముఖ్యమైన పావుల్ని వదులుకోకూడదు. ఒక్కోసారి గెలుపుకోసం కొన్ని ముఖ్యమైన పావుల్ని వదులుకోకతప్పదు. గెలుపు ముఖ్యం కాని, పావులు కాదు. నీ ప్రత్యర్థి ముందుకు రావాలంటే మార్గం చూపించాల్సింది నీవే. త్రోవలేంది ఎట్లా వస్తాడు?"

ఆటను గమనించాడు సారంగరావు. చాణక్య ప్రియశిష్యుడు. చాణక్య ఎత్తులు, విజయ రహస్యం గ్రహించాడు.

"ఇంక పోయే దేమీ లేదు మెహర్" చాణక్య వ్యాఖ్యానించాడు.

"మనం ఇక్కడ తీరికగా చదరంగం ఎత్తులు వేస్తూ కూర్చుంటే అక్కడ శశిగుప్త గాంధారం స్వాధీనం చేసుకుంటున్నాడు" మెహర్ చిరాకుపడ్డాడు.

"మెహర్! ఎంత అమాయకుడివయ్యా! గాంధారం పట్టుకుంటే ఏమైంది! మన బ్రాహ్మణ గెరిల్లా మూకలు సామాన్యులు కారు. వేయి ముక్కలు చేస్తారు. గెరిల్లా యుద్ధం అంటే తెలుసా? ఖర్చు తక్కువ, ఫలితం ఎక్కువ. సాయుధ పోరాటం కన్న గెరిల్లా పోరాటమే మంచిది.

"శశిగుప్త గాంధారం గెలిచే నాటికి అతని సేన బలహీనపడుతుంది. అశ్వికులు, సింధీలు ఎదురు తిరుగుతారు. గాంధారంలో మన బ్రాహ్మణ గెరిల్లాలు చండ ప్రచండులు. అది అదను. అశ్వికులు, సింధీలు మన పక్షాన నిలుస్తారు. మన చేతికి చిక్కేది మొదట శశిగుప్తుడే.

"అది చంద్రగుప్తకు తొలి విజయం."

★ ★ ★

**"నన్ను ఇరికించి నువ్వు వినోదం చూస్తున్నావు. నిష్టురంగా అన్నాడు" భద్రశాల.**

జీవసిద్ధి కౌగిలిలో ఉన్న గణికను వదలి భద్రశాల వైపు ప్రశ్నార్థకంగా చూచాడు. గణిక కిలకిలా నవ్వి జీవసిద్ధిని మరింత గట్టిగా వాటేసుకుంది అతను ఛీ కొట్టగా ఆమె లోపలకు పారిపోయింది.

భద్రశాల స్థిమితంగా కూర్చుని మదిర సేవిస్తున్నాడు. మందు మహాత్మ్యం. భద్రశాల స్థిమిత పడ్డ తర్వాత జీవసిద్ధి అడిగాడు.

"మంత్రి మండలి ఆమోదిస్తుందా? మన సైన్యం పాటలీపుత్ర చేరే వరకు అవరోధం ఉండనట్లేనా?"

భద్రశాల తలూపాడు. "ఉండకపోవచ్చు. కానీ పాటలీపుత్ర చేరిన తర్వాత రక్తపాతం తప్పదు. అందుకు సిద్ధంగా ఉండాలి."

"మనం పాటలీపుత్ర కోసమే పోరాడుతున్నామని ఎలా నమ్మించడం?" జీవసిద్ధి అనుమానం వ్యక్తం చేశాడు.

★ ★ ★

**"సావధాన్! ...**

వినండి. గాంధార, అశ్వక, సింధు, సింహపుర, మల్ల రాజ్య, క్షుద్రక, సైంధవ, అలోరా, బ్రహ్మస్థితి, పాతాళ, మహార్ణవ రారాజు అయిన చంద్రగుప్తుల వారు కొలువుకు వేం చేస్తున్నారు."

వందిమాగధులు ప్రకటించారు.

మగధ మాత్రమే ఇంక మిగిలి ఉంది. అది చంద్రగుప్తుని చిరకాల వాంఛ. చిన్ననాటి నుండి కన్న కల. చంద్రగుప్తుని తండ్రి సేనాపతి ఇప్పుడు లేడు కుమారుని పట్టాభిషేకం చూచి ఆనందించడానికి.

శశిగుప్తతో పోరాటంలో అంభి చనిపోయాడు. మెహర్ నాయకత్వంలో బ్రాహ్మణ గెరిల్లాల చేతుల్లో శశిగుప్త ప్రాణాలు వదిలాడు. ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు చాణక్య లౌక్యంతో ఇద్దరూ పోయారు. చంద్రగుప్త శ్రమ లేకుండా గాంధారం జయించాడు. ప్రజలు చాణక్యకు బ్రహ్మరథం పట్టారు. చంద్రగుప్తను రాజుగా అంగీకరించారు. ఇప్పుడు చంద్రగుప్త కళింగ

కన్న బలవంతుడు. పౌరస్ అంత బలసంపన్నుడు, ధననందుని కన్న కొంచెం తక్కువ.

చంద్రగుప్త సింహాసనం ఎక్కబోతూ క్షణం ఆగాడు.

సింహాసనం పైన రెండు పాదుకలు ఉన్నాయి. అవి ఎవరివి? అవి తండ్రి మౌర్య సేనాపతి పాదుకలు.

చంద్రగుప్త తండ్రిగారి పాదుకలకు నమస్కరించాడు. మనసులోనే ఆయన ఆశీస్సులు అర్థించాడు. తర్వాత తన తల్లి కూర్చున్న చోటుకు వెళ్లి ఆమె పాదాలు స్పృశించి ఆశీస్సులు పొందాడు. ఆమె కన్నీటి చుక్కలు అతని తలను ముద్దాడాయి. ఆమె ఆశీర్వదించింది.


"చిరాయుష్మాన్‌భవ".

ఆచార్య చాణక్య ఆసనం వద్దకు వచ్చి పాదాలకు నమస్కరించాడు.

"ధర్మపాలన చెయ్యి చంద్రా."

చంద్రగుప్త కళ్లు మూసుకుని "మీ ఆశయమే నా ఆశయం గురుదేవా" అన్నాడు.

"ఆచార్యా దేవోభవ! పితృదేవోభవ! మాతృదేవోభవ!"



# 15. నీతి నీడలు

**త**క్షశిల వెలుపల సుందరోద్యానవనం.

అది ఆచార్య చాణక్య ఆశ్రమం.

వనం మధ్య నిశ్చలంగా, నిర్మలంగా ఉన్న మునివాటిక.

అపర వ్యాసమహర్షిలా చాణక్య మహర్షి.

చంద్రగుప్త ఎంత బ్రతిమలాడినా నగరిలో ఉండడానికి, రాజసౌధంలో నివసించడానికి చాణక్య ససేమిరా అంగీకరించలేదు.

‘‘ఇంద్రభవనాలు, చంద్రభవనాలు నా తత్వానికి సరిపడవు చంద్రబాబూ’’ అని తప్పించుకున్నాడు. అయినా ఆచార్య చాణక్య స్థాయికి, అంతస్తుకు తగిన రీతిలో సమీపంలోని అరణ్యంలో ఆశ్రమం తయారైంది.

తన పర్ణశాలలో దర్భల చాపపైన కూర్చుని ఉన్నాడు. ఎదురుగా ఒక రాతబల్ల. బల్లపైన రెండు దీపసెమ్మలు. ఒకటి మాత్రం వెలుగుతోంది.

గ్రీకు రాజప్రతినిధి చాణక్య ఎదురుగా చాపపైన కూర్చున్నాడు. పొట్టివాడు గిరజాల జుత్తువాడు, నున్నటి గడ్డం, సిల్కుబట్టలు నడుముకు రాయబారి గుర్తు ఉంది. అదీ లాంఛనం. ఆయన పేరు మెగస్తనీసు. సెల్యూకస్

తన రాయబారిగా ఎంపిక చేసి చంద్రగుప్త ఆస్థానానికి పంపాడు. అతను రాయబారి, రాజకీయ ప్రతినిధి.

"చెప్పండి మహాశయా! మీ రాకకు కారణం రాజకీయమా? వ్యక్తిగతమా?" చాణక్య మెత్తగా ప్రశ్నించాడు.

మెగస్తనీసు నవ్వుకున్నాడు. చాణక్య సంగతి అతనికి బాగా తెలుసు. అతనితో వ్యవహారం కష్టమనీ తెలుసు. అయినా చంద్రగుప్త కోసం వచ్చినా, చాణక్య దర్శనం అనివార్యం. అది లాంఛనమే కావచ్చు. అవసరం. ఈ కుటిల బ్రాహ్మడి రాజకీయం వల్లనే చంద్రగుప్త రాజైనాడని మెగస్తనీసుకు తెలుసు.

"నేను తక్షశిలకు రాచకార్యంపైన వచ్చాను ఆచార్యా! నేను సెల్యూకస్ ప్రతినిధిని. చంద్రగుప్త చక్రవర్తి కొలువులో గ్రీకు ప్రతినిధిని. మీ దగ్గరకు వచ్చింది మాత్రం కేవలం మీ దర్శనం కోసమే. ఇది వ్యక్తిగతం. మీ రాజకీయ పరిజ్ఞానం అమోఘం, అద్భుతం అని విన్నాను ఆచార్యా. మీరు దైవాంశ సంభూతులని నా విశ్వాసం. మీ పరిచయం కోసమే వచ్చాను."

"అలా అయితే ఒక్క క్షణం ఆగండి."

చాణక్య తన ఎదురుగా ఉన్న దీపాన్ని ఆర్పి, రెండవది వెలిగించాడు.

మెగస్తనీసుకు అర్థం కాక వెర్రి చూపులు చూచాడు.

"ఆచార్యా! నాకు అర్థం కాలేదు. ఒక దీపం ఆర్పి, మరొకదీపం వెలిగించారు. దీపాల కాంతి ఒక్కటే గదా?"

"ఒక దీపం ఆరితే గదా మరొక దీపం అవసరం?"

"మహాత్మా! ఈ రెండు దీపాలలో ఒకటి నాది, రెండవది రాజుగారిది. నా స్వంత పనులకు ఈ దీపాల్ని వాడతాను. రాజ్యాంగ విషయాలకు రెండవ దాన్ని వాడతాను. నా స్వంత పనులకు ప్రభువుల చమురు ఖర్చు చేయడం భావ్యం కాదు. ఆపని నేను చేయను. నాకు స్వార్థం ఎక్కువ!"

మెగస్తనీసు తల తిరిగింది. "ఇది రాజనీతి" అనుకున్నాడు.

అతనికి చంద్రగుప్తుని విజయ రహస్యం అర్థమైంది. చాణక్యరీతి అర్థమైంది.

"మా చక్రవర్తి సెల్యూకస్ మీకు చెప్పమన్న విషయం ..."

"ఆగండాగండి. వ్యక్తిగతం అన్నారు. ఇంతలో రాజకీయాలు ప్రస్తావిస్తున్నారు."

"ఆచార్యా! ఒకేమాట. మనలో మనమాట చంద్రగుప్తతో తనకున్న సంబంధాలకు ఆటంకం ఉండదని సెలవిచ్చారు. అయితే పర్షిస్ ఇండస్ ప్రాంతాలలో తమ అధికారం యధావిధిగా కొనసాగుతుంది."

"మీరు రాజకీయాలు ముచ్చటించి నా చమురు ఖర్చు చేస్తున్నారు." నవ్వుతూ చురక అంటించాడు ఆచార్య.

"స్నేహితుల మధ్య రాజ్యాంగం ఎందుకు? సరదాగా ఏదైనా పెళ్లి, ప్రేమ ముచ్చట్లు చెప్పండి వింటాను" అన్నాడు చాణక్య.

"అసలు విషయాలు వదలి ప్రేమ, పెళ్లి అంటాడేమిటి ఈయన?" అనుకున్నాడు మెగస్తనీస్. ఏదో ఎత్తు వేస్తున్నాడు గురుడు?

చాణక్య నెమ్మదిగా చెప్పాడు : చంద్రగుప్త ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమె ఎవరో కాదు సెల్యూకస్ కూతురు. వారిది గాంధర్వ వివాహం. పెళ్లి అయిపోయిందిలే. కొన్ని నెలలైంది. కనుక మెగస్తనీసూ! మీరూ మేము దగ్గర బంధువులం అయ్యాం.

"రహస్యంగా పెళ్లా? సెల్యూకస్ ఆమోదం లేకుండానే?"

చాణక్య నవ్వాడు : "ఆ చంద్ర నా ఆమోదం మాత్రం తీసుకున్నాడేమిటి. గాంధర్వ వివాహం చేసుకున్నారు అంటే ఏం లేదు. మామూలుగా అయితే పెళ్లి అయ్యాక ఒకటవుతారు. గాంధర్వంలో ఒక్కటై తర్వాత పెళ్లి తతంగం చేస్తారు. రెండూ ఒక్కటే కదా!"

మెగస్తనీస్‌కు కోపం వచ్చింది. తమాయించుకున్నాడు. ఈ బ్రాహ్మణయ్య గారి ముందు తన కుప్పిగంతులు పనికిరావని నిర్ధారించుకున్నాడు.

"సెల్యూకస్ ఈ పెళ్లికి అంగీకరించలేదుగా."

"పెళ్లి జరిగింది భారతదేశంలో. పైగా వరుడు మా కుర్రవాడు. ఇక్కడ వివాహ చట్టాలు ఒప్పుకుంటాయి గాంధర్వ వివాహాన్ని. కాదంటే మీ దేశంలో విందు చేసుకోండి. ఎవరొద్దన్నారు!"

"కార్నిలియా తండ్రి అనుమతి అవసరం లేదనుకుందేమో. వ్యక్తురాలు కదా! తనకిష్టమైన వరుడు, చంద్రగుప్త మెచ్చిన అమ్మాయి. మధ్య నీకూ నాకూ ఏం పట్టింది?"

మెగస్తనీసు నోట మాట రాలేదు. అతను ఆశ్చర్యం నుండి తేరుకోక ముందే చాణక్య అందుకున్నాడు "చూడండి. రాయబారిగారూ! మీరు వచ్చింది వ్యక్తిగతంగా అన్నారు. పోనీయండి. అమ్మాయికి యిచ్చే కట్నకానుకలు గురించి మాట్లాడండి."

అసలే మంటగా ఉంది. పైగా కట్నాలు, కానుకలు? మెగస్తనీనుకు మింగుడు పడడం లేదు.

"అల్లుడికి కట్నంగా కాకపోయినా అమ్మాయికి లాంఛనాలు యిస్తారు కదా. సెల్యూకస్ లాంటి వీరుడు కూతురి పెళ్లికి కానుకలు ఇవ్వడా? తన హోదాకు తగినట్లు ఉంటాయి. అరకోషియా, బెడ్రేషియా, పరోటఖవాడి, ఆరియాలు కట్నంగా ఇస్తే బాగుంటుందని నా సలహా. నాలుగు మంచి సంఖ్య. భారత్‌లో నాలుగు సంఖ్యకు విలువ ఎక్కువ."

"చాలునా ఆచార్యా" మెగస్తనీసు కాస్త ఎగతాళిగా అన్నాడు.

"చాలా అంటే ఏం చెప్పను! అలెగ్జాండర్ సింహాసనం ఆశిస్తున్న అంటిగోనస్ డిమ్మిత్రియన్‌లను జయించవలసి ఉంది గదా. ఆ ఇద్దరి దృష్టి అలెగ్జాండర్ సింహాసనం పైన ఉన్నదని వింటున్నాం. కావాలంటే చంద్రగుప్త మదపు టేనుగుల్ని పంపుతాడు. అవి శత్రుసైన్యాన్ని నానా భీభత్సం చేస్తాయి. మీరు యుద్ధం చేయకుండానే విజయం సాధించవచ్చు. బావుంది కదూ!"

"మీరు పంపే ఏనుగులకు ప్రతిగా ఏమివ్వాలి? ఊరికే ఇవ్వరు కదా!"

"సెల్యూకస్ పాత మిత్రుడు పౌరస్‌కు ఒక మాట చెప్పండి. అంతగా మగధపై మోజుంటే వచ్చి ఒకరాత్రి ఉండి పోవచ్చని. ఒక్కరాత్రికే ఒప్పందం. తెల్లవారే సరికి వెళ్లిపోవాలి."

★ ★ ★

పౌరస్‌కు చాలా కోపంగా ఉంది. తనకు ఆలస్యంగా అందింది సమాచారం. గూఢచారి అభయ అందించాడు చంద్రగుప్త తక్షశిల రాజైనాడని.

చాణక్య స్వయంగా ప్రమాణం చేయించాడని. స్వయంగా ఆశీర్వదించాడట. అంటే గురుశిష్యుల మధ్య వైరం ఉత్తుత్తిదే నన్నమాట. ఇద్దరికిద్దరూ దొంగలే?

అంతా అయిపోయింది. ఇప్పుడు విచారించి ఏం లాభం?

సైన్యంతో బయలుదేరాడు మగధపై దండయాత్రకు. తనను ఎవరూ ఆపలేరని పౌరస్‌కు తెలుసు.

పౌరస్ యుద్ధానికి సిద్ధమై వస్తున్నాడని ధననందకు తెలిసింది. అయినా తనను ఢీకొట్ట గలవాడెవరు? అనుకున్నాడు ధననంద. అతని సైనికబలం అలాంటిది. పౌరస్ కోసం చాణక్య, చంద్రగుప్తల సహాయం అర్థించకూడదు. మగధ ఎప్పటికీ నాదే కావాలి.

మగధ సరిహద్దులలో కొన్ని యోజనాల మేర సైన్యం మొహరించింది. లక్షమందికి పైగా కాల్బలం, నలభై వేల అశ్వికులు, నాలుగు వేల రథాలు, మూడు వేల ఏనుగులు – నేల ఈనినట్లుంది సైనిక పారావారం. అవి యుద్ధ శిబిరాలు కావు. ఎన్ని నెలలు సాగాలో యుద్ధం. ఇళ్లు గట్టిగా నిర్మించారు. చిన్న నగరంలాగా ఉంది. అన్ని వసతులూ ఏర్పడ్డాయి. కత్తులు, కటార్లు, బల్లాలు, విల్లంబులు, శిరస్త్రాణాలు, లోహ కవచాలు.

అభయ ఎదురుగా నిలబడి దిక్కులు చూస్తున్నాడు. గంటసేపు నిరీక్షించాడు. కాలు మార్చి రెండవ కాలు మీద నిలబడుతూ.

చంద్రగుప్త కార్నిలియాలు పెళ్లి చేసుకున్నారు. సెల్యూకస్ అల్లుడికి కట్నంగా అరకొనియా, జెడోనియా, పరపమిసారి, అరియాలు సమర్పించాడు. రాయబారిగా వెళ్లిన మెగస్తనీసు చాణక్యకు హామీ యిచ్చాడు మగధ జోలికి పౌరస్ రాడని! మగధపై పౌరస్‌కు ఆశలేదని ఎవరు చెప్పారు? అభియ కల్పించాడా?

పౌరస్ అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు. "ఎవడా మెగస్తనీస్? నా తరఫున హామీ ఇవ్వడానికి వాడెవడు? నేను వాడి సేవకుణ్ణి కాను. మగధ నా కలల పంట. మగధ నాదే. మగధను ఆక్రమించి, పాలించే హక్కు నాకుంది. కేకయతో కలిసి మగధను స్వాధీనం చేసుకుంటాను. ఎవడు అడ్డం వస్తాడో చూస్తాను. దేవుడు దిగి వచ్చినా నన్ను ఆపలేడు."

అభయ భయపడ్డాడు. పౌరస్ మహా ఉద్రేకి.

"అంతే కాదు మహారాజా! ఇంకా చాలా కథ ఉంది. ఇంద్రదత్తకు మనతో అవసరం లేదట. అంతా వాళ్ల ఇష్టమేనట."

"మధ్యలో వాడి పెత్తనం ఏమిటి? మనం దండయాత్ర చేయాల్సిందే."

"మహామంత్రీ! మరొక దుర్వార్త. కళింగపై మగధ పెత్తనం ఇకపైన సహించరట. యాభై వేల సైన్యంతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు. వారు తూర్పు నుండి వస్తే మనం పడమర నుండి దాడి చేస్తాం. వారికీ మగధ బంగారు సింహాసనంపై దృష్టి పడ్డదేమో?"

"అరవై ఏళ్లుగా సామంతులుగా ఉన్న వారికి ఇప్పుడు స్వాతంత్ర్యమా?"

ఇంద్రదత్తు కిమ్మనలేదు.

"మనం పాటలీపుత్ర చేరడానికి అసలు అడ్డం?"

"ఎవరు అడ్డం?" భయంకరంగా అరిచాడు.

"ఇంకెవరు? ఆచార్య చాణక్య" నెమ్మదిగా గొణిగాడు ఇంద్రదత్తు.

★ ★ ★

పాటలీపుత్రలో అది పరిచారవాడ. ఒక పాడుబడిన ఇంటి లోపల హడావుడిగా ఉంది. ఏవో లేపనాలు, భస్మాలు తయారవుతున్నాయి. అది వైద్యశాల కాదు. వాటిని తయారు చేయిస్తున్నది జీవసిద్ధి. చాణక్య పావురాల ద్వారా అందించిన సమాచారం మేరకు మందులు తయారు చేయిస్తున్నాడు.

ప్రక్కగదిలో కొందరు మగవారు ఏవో ముసుగులు తయారు చేస్తున్నారు. ఫెవాస్మ భస్మం బండెడు తయారైంది. దాని విరుగుడు మైత్రీ భస్మం మరొక బండెడు తయారై సిద్ధంగా ఉంది. వాటి తయారీ బాధ్యత జీవసిద్ధిది. అవి ఎందుకో ఎవరికీ తెలియదు. ఒక్క చేతి మీద తయారు కాలేదు మూలాల పాళ్లు తెలియడానికి.

★ ★ ★

**"ఉండనా? ఊడనా? దేవకీనందనా" అన్నట్లు ఒక ఎద్దులబండి కిర్రు కిర్రు శబ్దం చేస్తూ ఇంద్రప్రస్థం నుండి పాటలీపుత్ర వైపు సాగిపోతున్నది.**

బండి చాలా పాతది. ఎద్దుల మెడలో మువ్వల సవ్వడి. బండిలో ప్రయాణిస్తున్న వారు ముగ్గురు. ముగ్గురిలో ఒకడు మహా ముసలివాడు. నల్లగా, భయంకరంగా ఉన్నాడు. దిబ్బ మొహం, గొగ్గిపళ్లు, ఎర్రటి కళ్లు.

అతను నగ్నమునిలా వేషం వేసుకున్నాడు. పొడవాటి జుత్తు. చిందరవందరగా పెరిగిన గడ్డం, ఒంటినిండా భస్మం పూసుకున్నాడు. చూడగానే అఘోరనాధ అనిపిస్తాడు.

అఘోర సంప్రదాయులంతా వీరశివ భక్తులు. వాళ్లకు మృత్యువంటే భయం ఉండదు. ప్రపంచం అంతా శివుని సృష్టి అంటారు. శివుని వలె ఒంటికి భస్మం పూసుకుని తిరుగుతారు. అంతా దైవికమే. దైవం కానిది ఏదీ లోకంలో లేదు.

అఘోర నాధులు శ్మశానవాసులు. వారు శ్మశానాలలోనే నివశిస్తారు. శవాలపై కూర్చుని తపస్సు చేస్తారు.

మిగిలిన ఇద్దరు ఆయన శిష్యులు కావచ్చు. ఒకడు ముందుకూర్చుని బండి నడుపుతున్నాడు. రెండవ వాడు గురువు ఎదురుగా కూర్చుని ఆయనకు సేవలు చేస్తున్నాడు. ఆ ఇద్దరికీ ఒంటిపైన బట్టలున్నాయి.

అఘోరీలు ఎవరితో కలవరు. తాము శివావతారులం అనుకుంటారు. వారు దిగంబరంగా ఎందుకుంటారంటే నగ్నత్వం సంపూర్ణ వైరాగ్యానికి చిహ్నం. ప్రపంచం మాయ. మాయా ప్రపంచం నుండి దూరంగా ఉండాలని శ్మశానాలను ఎన్నుకుంటారు. వారికి సిగ్గు, భయం లేనట్లే రాగ ద్వేషాలూ ఉండవు.

ఎడ్లబండి ఎక్కడ ఆగకుండా ప్రయాణం చేసింది. కోటద్వారం వద్ద సైనికులు సైతం వారిని చూచి ఠారెత్తి పరుగు లంకించుకున్నారు. పారిపోతున్న జనాల్ని చూచి వీరు ముగ్గురు నవ్వుకున్నారు.

★ ★ ★

పాటలీపుత్ర రాజభవనం ప్రక్కన ఆకాశం ఎత్తు పందిళ్లు వేశారు. ధననందుడు మహాయజ్ఞం నిర్వహిస్తున్నాడు.

105 యజ్ఞ హోమ గుండాలు భగభగ మండుతున్నాయి. వెయ్యి న్నొక్కమంది యాజ్ఞికులు యజ్ఞం నిర్వహిస్తున్నారు. మంత్రాలతో హోరెత్తి పోతున్నది వాతావరణం. సుమారు లక్షమంది పౌరులు కార్యక్రమం వీక్షిస్తున్నారు. వెన్న, నెయ్యి, పాలు హోమాగ్నికి ఆహుతి అవుతున్నాయి.

అది ధననందుని దృష్టిలో విశ్వ యజ్ఞం. శత్రు వినాశం దాని లక్ష్యం. యజ్ఞ కార్యక్రమం పూర్తయిన తర్వాత వెయ్యిన్నొక్క బ్రాహ్మలకు బంగారు

పళ్లాలలో విందు. ఆపైన సన్మానాలు, సంతర్పణలు బహుమతులు. నూరుగురు వేదపండితులు వేద పఠనం చేస్తున్నారు.

వేయిమంది బ్రాహ్మణోత్తముల్ని సంతృప్తి పరిస్తే ముక్కోటిదేవతల్ని సంతృప్తి పరిచినట్లే అని ధననందుని విశ్వాసం. ప్రస్తుతం తన శృంగార విలాసాలకు విశ్రాంతి నిచ్చి బ్రాహ్మణ సేవలో తరిస్తున్నాడు.

అందరూ భోజనశాలలోకి వెళ్లేసరికి అక్కడ మొదటి వరుసలో మూడు స్థానాల్లో ముగ్గురు కూర్చుని ఉన్నారు. వారి ఆకారాలు చూడగానే ఆగ్రహోదగ్ధుడైనాడు ధననందుడు. బ్రాహ్మణ భోక్తలైతే చిరాకు మొహాలు పెట్టారు.

"దారుణం. మహాపాతకం. అపవిత్రం" అరిచాడు యాజ్ఞికులు.

"ఏవరు మీరు?" ధననంద ఆక్రోశించాడు.

"మనుషులం. కనిపించటం లేదా?"

ఆ ముగ్గురు అఘోరీలని తెలుస్తూ ఉంది.

"వీళ్లను లోపలకు ఎవరు రానిచ్చారు?" భటులపై అరిచాడు.

"మేమే వచ్చాం. ఎవరూ ఆహ్వానించలేదు." అఘోరీల సమాధానం. "మహారాజా! లోపలకు అనుమతించకపోతే మమ్మల్ని శపిస్తామన్నారు." సేవకులు ఏడుస్తూ చెప్పారు.

"రాజా! మేం అఘోర పంతులం కావచ్చు. మా నియమాలు, నిష్టలు మాకున్నాయి. మీ వెయ్యిమంది బ్రాహ్మలశక్తి కన్న మా శక్తి ఎక్కువ. మమ్మల్ని అవమానిస్తే పరమ శివుని అవమానించినట్లే. తాండవం చేస్తాం జాగ్రత్త. నీ యజ్ఞం దక్షయజ్ఞం అవుతుంది. శివ భస్మంతో మీ నగరంలోని జలాశయాలు విషపూరితం అవుతాయి. నీళ్లు లేక జనం చస్తారు. అప్పుడు నీ ప్రజల్ని నీవూ రక్షించలేవు. ఈ బ్రాహ్మలూ రక్షించలేరు."

అని దిగంబర గురువు కేకలు వేశాడు. ముగ్గురు నిలబడి, తమ ఎదుట ఉన్న వడ్డించిన బంగారు పళ్లాలు విసిరి నేలకేసి కొట్టారు. కోపంగా విసవిస బయటకు వెళ్లిపోయారు. ద్వారపాలకులు ఎవరూ వారిని ఆపలేదు. ధననందుడు మూగవాడై భయంతో వణికిపోయాడు.

కోరల్లో విషం లేని పాము భయపెడుతుంది.

చాణక్య పథకం మేరకు జీవసిద్ధి జనాన్ని ప్రోగుచేసి అర్ధరాత్రి దాకా అమలు పరిచాడు. వందల, వేల మందిని రహస్యంగా ఉపయోగించాడు.

"త్వరగా వెళ్లండి! తెల్లవారే లోగా నగరంలోని అన్ని కూపాలు, తటాకాలు, చెరువులు, జలాశయాల్లో ఈ భస్మం కలపండి. ఎవరి కంట పడకూడదు. రాజోద్యోగులకు దొరక్కూడదు. తెల్లవారే సరికి నీళ్లు విషపూరితం కావాలి" పేనాభస్మం అది.

"మగధకోసం అమాయక జనాన్ని చంపడం అన్యాయం గురుదేవా!" చంద్రగుప్త రుద్ధ కంఠంతో వాపోయాడు.

చాణక్య! "మనుషులు ఎవరూ చావరయ్యా. ఉదయమే నీళ్లు తాగేది గేదెలు, ఆవులు, జంతువులు. అవి వాసన పట్టగలవు. ముట్టుకోవు చూడు. మనుషులెవరూ చావరు. జంతువులూ చావవు. అందుచేతనే అర్ధరాత్రి తర్వాత ఈ ప్రయోగం చేయిస్తున్నా."

అఘోర పంతుల శాపం గురించి అప్పటికే నగరంలో పాకింది. బహుశ అది శాప మహత్తు అనుకుంటారు. విషప్రయోగం అని ఎవరికీ తెలియదు.

"పంచాయతీ పెడితే మన శాపం ఉపసంహరించుకోవడం ఎట్లా?" సారంగరావు ప్రశ్నించాడు.

చాణక్య నవ్వి "అదెంతపని సారంగా! ఒక్కరాత్రిలో అంతా మామూలవుతుంది. కాకపోతే ధననందుడు ఒక త్యాగం చేయాల్సి ఉంది. శాపం ఉపసంహరణకు ఒక షరతు పెడతాను. తను దేశం వదలిపోవాలి. అరణ్యవాసం చేయాలి. ఆయన అడవికి చేరే లోగా అంతా సరిచేస్తాను. దాని విరుగుడు మృత్యుదాతచూర్ణం పుష్కలంగా తయారు చేయించి సిద్ధంగానే ఉంచాను."

"అయినా మనం నగరంపై అధికారం పొందడం ఎలా సాధ్యం?"

చంద్రగుప్త అనుమానం తీరలేదు. చాణక్య ఎత్తుగడలు చంద్రబాబుకు అర్థం కావు.

"ధననందుని సర్వసేనాపతి భద్రశాల మన జీవసిద్ధి ఎంతచెబితే అంత. ధననంద కోట దాటిపోగానే కోట తలుపులు మనకోసం బార్లా తెరిపిస్తాడు. లంచం యిస్తున్నంత కాలం భద్రశాల ఏ నీచపు పని అయినా చేస్తాడు. లంచం తిన మరిగిన వారు ఏ నీచానికైనా ఒడిగడతారు.

“అటు పౌరస్ సేనలు, ఇటు కళింగ సేనలు సరిహద్దుల్లో మొహరించాయి. వాళ్లు యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు.” చంద్రగుప్త చెప్పాడు.

“ఉండనీవయ్యా! వాళ్లు మనతో యుద్ధం చేయడానికి రాలేదు. వాళ్లని మనమే మిత్రులుగా స్వాగతిద్దాం.”

“అంటే గురూజీ! మనం అఘోర పంతులుగా నటించి, ఇంత కష్టపడ్డది నగరాన్ని శత్రువుల చేతికి అందించడానికా? పౌరస్‌ను పాటలీపుత్రకు ఆహ్వానించడం ఏమిటి ఆచార్యా. కొరివితో తల గోక్కున్నట్లు?”

చాణక్య గంభీరంగా నవ్వి “చంద్రా, నే చెప్పిన పాఠాలు మరచిపోతే ఎలా? స్నేహితుల్ని దగ్గరకు తీసుకోవాలి. శత్రువుల్ని మరీ గట్టిగా హత్తుకోవాలి. అదీ రాజకీయం అంటే.”

★ ★ ★

కొద్దిపాటి దాసదాసీ సేవక బృందంతో పరిమిత సేవా పరివారంతో ధననంద కుటుంబ సమేతంగా నగరం విడిచి అరణ్యం దారి పట్టడం భద్రశాల సంతోషంగా చూస్తున్నాడు. పరిజనం ఈ వనవాసం ఒక శిక్షగా భావిస్తోంది. అందరి మొహాలు వాలిపోయాయి. సంతోషం మచ్చుకైనా కనిపించడం లేదు. అరణ్యాలలో ఏం సుఖాలుంటాయి? ఏం భోగాలుంటాయి? ఆదాయం ఎలా? ఇప్పుడు భద్రశాల సంతోషానికి కారణం తను పాటలీపుత్రలోనే సంపన్నుడు. అప్పులు లేవు. అడిగేవారు లేరు. దండుకోడానికి అవకాశాలు పెరిగాయి. అవినీతీ నీకు జోహారు!

ధననంద పరివారంతో కలిసి సువాసినిని వెళ్లకుండా చూడమని ముందే చాణక్య జీవసిద్ధిని హెచ్చరించాడు. చాణక్యకు ఇంకా సువాసిని పైన మోజు తగ్గలేదు. ఇష్టం తగ్గలేదు.

సువాసిని చేయవలసిన మరొక ఘన కార్యం మిగిలి ఉంది.

ధననందుడు రథంపై వెళ్లడం చూచిన చాణక్య సారంగరావుతో అన్నాడు.

“అతన్ని చంపేయాలనిపిస్తోంది.”

ధననందుడు ఒక్క రోజులో పదేళ్ల ముసలి వాడైనాడు. మొహంలో కళా కాంతులు లేవు. అతనిలో గర్వం, అహంకారం కనిపించడం లేదు. కోరలుతీసిన త్రాచుపాము అయ్యాడు.

సారంగ అన్నాడు : మనం రాజ లాంఛనాలతో పోనిచ్చాం. జనం ఏమను కుంటారో.

చాణక్య : మన ప్రస్తుత కర్తవ్యం ధననంద కాదు భద్రశాల. తను ఇంకా సర్వసేనాపతి ననుకుంటున్నాడు. పైగా రాక్షసమంత్రికి అందుబాటులో ఉన్నాడు. మన కపోత సందేశాలు వాళ్లకి తెలుస్తున్నాయి.”

జీవసిద్ధి అడిగాడు : అతని రాజ లాంఛనం కరవాలం మనకు అప్పగించాడా?

“లేదు.”

“ఆపని చేయించండి. అది చేతిలో లేకపోతే అతను మామూలు సైనికుడుగా కూడా పనికిరాడు.”

ధననంద పరివారం పాటలీపుత్ర కోట దాటగానే, ప్రజలు ఉత్సాహంలో పండుగ చేసుకున్నారు.

పౌరస్‌కు, కళింగ రాజుకు వర్తమానాలు పంపాడు చాణక్య.

“పాటలీపుత్ర మీకు ఘన స్వాగతం పలుకుతోంది. దయ చేయండి.”

“వారి ఆమోదం లేకుండానే మీరు వారిని స్వాగతిస్తున్నారు గురుదేవా?” చంద్రగుప్త అలక వహించాడు.

చాణక్య నవ్వాడు : అంటే ఏమిటయ్యా, నీ నిర్ణయం మంచిది. నా ఆలోచన మంచిది కాదనా?

★ ★ ★

కేకయ, కళింగరాజులు మందీ మార్బలాలతో పాటలీపుత్రలో అడుగుపెట్టారు. రాజభవనం వద్ద నిలబడి చాణక్య వారికి స్వాగతం పలికాడు. మంగళ వాయిద్యాలతో స్వాగతించాడు.

కళింగరాజు పౌరస్ అంత పొడగరి కాదు. కాని పొగరున్నవాడే. బలవంతుడే. అతనిని చూడగానే చాణక్య మందహాసం చేస్తూ “స్వాగతం మహావీరా సుస్వాగతం. మీ సుపరిపాలనలో మగధ సుఖశాంతులతో వర్ధిల్లు గాక.”

పౌరస్ పెళ్లి కొడుకులాగా అలంకరించుకుని మూడు గుర్రాల రథంలో వచ్చి దిగాడు. చాణక్య అతనికి నమస్కరించి స్వాగతం చెప్పాడు. "స్వాగతం మహాశూరా! మగధ మీకు స్వాగతం చెబుతోంది."

పౌరస్ గర్వంగా నవ్వుకున్నాడు మీసం దువ్వుతూ.

ఇద్దరూ వారికి కేటాయించిన ఆసనాలు అలంకరించారు. చాణక్య వారిద్దరి వద్దకు విడివిడిగా వెళ్లాడు. "నేను చంద్రగుప్తకు చెప్పాను. మగధ విషయంలో తనను పోటీకి రావద్దని."

"రాజులేని రాజ్యం ఉండదు. చంద్రగుప్త అడ్డం తొలగిపోతే ఇంక అధికారం వారిద్దరిలో ఒకరికి దక్కడం తథ్యం. ఒక సింహాసనం ఇద్దరు రాజులు. రెండు సింహాలు పోరాడాలి. మీరూ మీరూ తేల్చుకోండి. మీలో మగధ ఎవరికి దక్కాలో?"

ఆ మాట ఇద్దరి అహంపైన పనిచేసింది.


పౌరస్ యుద్ధానికి సిద్ధమై కత్తిదూశాడు. కళింగుడిది ఎడమచేతి వాటం. ఆయన ఎడమ చేతిలో కత్తి తళుక్కుమన్నది. ఎడమచేతి వాటం అతనికి అనుకూలం అయింది. ప్రత్యర్థి ఊహించని రీతిలో దెబ్బకొట్టగలిగాడు. ఒక దశలో కళింగుడి కత్తి పౌరస్ మెడవరకు వెళ్లింది. పౌరస్ విసిరిన కత్తి దెబ్బ కళింగుడు తప్పించుకున్నాడు. అదే అదనుగా కళింగుడు ఎడమచేతి వాటంతో పౌరస్‌ను పొడిచాడు. పౌరస్ గాయపడ్డాడు. పౌరస్ ధాటికి కళింగుడు పారిపోయాడు.

ఒకరు పారిపోయారు. వేరొకరు క్షతగాత్రుడుగా మిగిలారు.

★ ★ ★

పాటలీపుత్ర శివాలయం వీధిలోని నర్తనశాలలో 'విశాఖ' అలంకారాలతో ముస్తాబయింది. విశాఖ నవయవ్వని. అనాఘ్రాత పుష్పం. పదహారు సంవత్సరాలుగా సభారంజని క్రింద తయారవుతోంది.

విశాఖను విషకన్యగా మార్చడానికి పదహారు సంవత్సరాలు పట్టింది.



# 16. పిలకముడి

**ధ**ననంద కుటుంబం సపరివారంగా అరణ్యవాసానికి వెడుతోంది. ఆ సుందర దృశ్యాన్ని కళ్ళారా చూస్తున్నాడు భీభత్సకుడు. భీభత్సకుడు దోపిడీ దొంగల, ధగ్గుల నాయకుడు. ఆ పరిసరాలలో భీభత్సకుని పేరు తెలియని వారుండరు. వేయి మందిని చంపిన ఘనకీర్తి అతనిది. బందిపోటు దొంగల నాయకుడుగా ప్రసిద్ధుడు. పరమ కిరాతకంగా ఉంటాడు. చింపిరి జుత్తు. మెలితిరిగిన కండలు, గుబురు మీసాలు. ధోవతి కట్టి, నల్లటిరగ్గు పైన కప్పుకుంటాడు. నల్లటి శరీరం. స్నానం చేయని కారణంగా మనిషి దగ్గర దుర్గంధం, జిడ్డు శరీరం. పొగాకు నమిలి నమిలి గారపట్టిన పళ్లు.

"అమ్మ నా కొడకా!" అనుకుని తుపుక్కున ఉమ్మేశాడు భీభత్సకుడు. నుదుట రక్తతిలకం. నిజంగానే నర రక్తంతో కుంకుమ కలిపి పెట్టుకుంటాడు. కొత్త రక్తం కళ్ల చూచిన రోజునే తిలకం దిద్దుకుంటాడు. చేతిలో ఒక గండ్రగొడ్డలి సిద్ధంగా ఉంటుంది. పరశురాముడిలా కనిపిస్తాడు. ఆ గొడ్డలి అప్పటికి వేయి తలలు నరికింది. సహస్ర శిరచ్ఛేద భీభత్సుడు కాళికాదేవి మగవేషం వేసుకున్నట్లు ఉంటాడు.

భీభత్సకునికి నది ఒడ్డున స్వంతదేవాలయం ఉంది. అది కాళికాలయం.

కాళీ మాతకు నరబలి యిచ్చిన రోజున పండుగ. భీభత్సకుని గుంపులో చాలా మంది ఉన్నారు అతనికి రక్షణగా. కొండమీద అతని అనుచరులు పాతిక వరకు ఉన్నారు. వాళ్లు నవ్వుకున్నారు. తమ నాయకుడు ఉత్తినే నవ్వడని వాళ్లకి తెలుసు. ఈసారి దోపిడితో అందరూ భాగ్యవంతులు అయిపోవచ్చు నని సంబరపడ్డారు.

ఈ దోపిడీ సరిగా జరిగితే అందరికీ పెద్ద బహుమతులు యిస్తారని సారంగరావు ముందే మాట ఇచ్చాడు. రాజు గారి బృందాన్ని దోచుకుంటే డబ్బేడబ్బు. రత్నరాసులు, బంగారు నగలు. భీభత్సుని చేతిలోని కొత్త కత్తి భద్రశాలది. ఆ కత్తితోనే ధననందుని పొడిచి చంపాలని సారంగరావు ఆదేశం. అంటే భద్రశాల స్వయంగా ధననందుని చంపాడన్న అపప్రధ పుట్టించవచ్చు.

★ ★ ★

"పులి సిద్ధంగా ఉందా?" చాణక్య అడిగాడు.

జీవసిద్ధి తల ఊపాడు. "సిద్ధంగానే ఉంది" అన్నట్లు.

జీవసిద్ధి చాణక్య నమ్మిన బంటు. అన్ని చెత్త పనులూ చేస్తుంటాడు.

"నీ మనుషులు ఈ విషయం రహస్యంగా ఉంచుతారు కదూ. చంద్రగుప్త అరణ్యం చేరే వరకు జాగ్రత్త. అతను అరణ్యం చేరిన తర్వాత పులికి వదలండి. ఈ భస్మం కలిపిన నీళ్లు పులికి తాగించండి."

రాజులకు వేటాడడం సరదా. వేట రాజసానికి తురాయి. మంచెపైన మాటువేసి, దగ్గరగా వచ్చిన క్రూరజంతువుల్ని చంపుతారు. మంచె దిగరు. మాటు వేసి అడవి దున్నల్ని అనుకున్నచోటికి మళ్లిస్తారు భటులు. రాజులు వాటిని మంచె దిగకుండానే వీరోచితంగా చంపివేస్తారు.

చంద్రగుప్త వేటకు జీవసిద్ధి అన్ని ఏర్పాట్లు చేశాడు. చంద్రగుప్తునికి వేటాడే ధైర్యం లేదని చాణక్యకు తెలుసు. పిరికివాడని కాదు గాని, ధైర్య వంతుడు మాత్రం కాదు. చంద్రగుప్త అరణ్యంలో అంతదూరాన కనిపించగానే జీవసిద్ధి తన అనుచరులకు సైగ చేశాడు. కార్యక్రమం వెంటనే మొదలైంది. పులి మత్తుగా, తూలుతూ బోను వదిలి బయట కొచ్చింది. పులులకు దూరదృష్టి ఎక్కువ. వాసన పట్టవు.

పులి రాగానే చంద్రగుప్త మంచె దిగి వచ్చాడు. దానితో కలబడ్డాడు. పులికి ఓపిక చచ్చింది. నాలుక చాచి చంద్రగుప్తుని చెక్కిళ్లు నాకి పారిపోయింది.

అద్భుతం! పరమాద్భుతం! ఆనందంతో గంతులు వేశారు జీవసిద్ధి మనుషులు. చంద్రగుప్త దైవాంశ సంభూతుడని ప్రచారం చేశారు.

చంద్రగుప్త త్రివిక్రముడైనాడు.

★ ★ ★

అక్కడ పౌరస్‌కు రాజమందిరంలో అతిథి మర్యాదలు బాగా జరిగాయి. ఆయన శయన మందిరంలో విశాఖ కౌగిలిలో తెల్లవారేసరికి కన్నుమూశాడు. స్వర్గసుఖాలు అనుభవిస్తూనే 'స్వర్గం' చేరుకున్నాడు పౌరస్.

అక్కడ అరణ్యంలో భద్రశాల కత్తికి ధననందుడు ప్రాణాలర్పించాడు. భీభత్సకుడు ధననందుని వేడిరక్తాన్ని బంగారు గిన్నెలోపట్టి కాళికాదేవి నైవేద్యానికి పరుగున తీసుకువెళ్లాడు.

అడవిలో మత్తు దిగిన పులి గాండ్రించింది.

★ ★ ★

**సమాలోచన మందిరంలో చాణక్య, చంద్రగుప్త, సారంగరావు, కాత్యాయన సమావేశమై చర్చిస్తున్నారు. "తర్వాత కర్తవ్యం ఏమిటి?"**

మగధ న్యాయాధిపతి వారి ఎదురుగా నిలబడి, ఆజ్ఞలకోసం ఎదురు చూస్తున్నారు.

"వెంటనే భద్రశాలను బంధించండి" చాణక్య ఆజ్ఞాపించాడు.

సారంగరావు జాలిపడ్డాడు : "ఆచార్యా! భద్రశాల మనకు చాలా సహాయం చేశాడు. కాస్త కనికరించకూడదా! అతను ధననందుని చంపడంలో సహాయపడ్డాడు కదా!"

చాణక్య : అది మనకు సహాయం చేయడం అవదు సారంగా. తనకు తానే సహాయం చేసుకున్నాడు.

చాణక్య కళ్లు చింతనిప్పుల్లా ఉన్నాయి.

"అతగాడు ఏ పాలకునికైనా అనవసర బరువు. ధననంద గానీ, చంద్రగుప్త గానీ, ఏ రాజు గానీ అలాంటి వాడిని క్షమించకూడదు. రాజుల

బాధ్యత కరుణ చూపడం, కనికరించడం కాదు. అన్యాయాన్ని దండించడం పాలకుల కర్తవ్యం. అధికారంలో ఉన్న వారికి తరతమ భేదాలుండకూడదు. తన, మన అని ఉండకూడదు.

కాత్యాయన కలగచేసుకున్నాడు : "భద్రశాల రాక్షసామాత్యుని మిత్రుడు. అతనికి ఆగ్రహం వస్తుందేమో."

చాణక్య : ఏ గ్రహం మనల్ని ఏమీ చేయలేదు. ఇప్పుడు రాక్షసుడు పరుగెత్తుకు వస్తాడని నా అనుమానం. ధననందుని అడ్డం తొలగిపోయిందిగా, వస్తే రానీ ... పోతే పోనీ ...

సారంగ : ఆయన తక్షశిలలో రాజుగా బ్రతుకుతున్నాడు. ఆయన మగధకు రాకపోవచ్చు.

చాణక్య : వస్తాడు. వచ్చి తీరాలి. నాకు వాడితో పని ఉంది. అతనిని చంద్రగుప్తుని ఆస్థానంలో ఉపప్రధానమంత్రిని చేస్తాను.

చంద్రగుప్తకు ఆశ్చర్యం కలిగింది.

"ఉపప్రధాని పదవా ఆచార్యా! తాను ధననందుని వద్ద ప్రధానిగా చేసినవాడు కదా!"

చాణక్య : అవును చంద్రబాబూ. నీ ప్రధాని కాత్యాయన. నిర్భయంగా చక్రవర్తికి మంచి చెడులు చెప్పగలవాడు ప్రధాని పదవికి అర్హుడు. అందరూ ప్రధానులు కాలేరు.

కాత్యాయన లోలోపల సంతోషించాడు. లేచి చంద్రగుప్తుని చేతులు పట్టుకుని నమస్కరించాడు. చాణక్య వైపు తిరిగి అన్నాడు.

"ఆచార్యా! రాక్షసుని తిరిగి మగధకు రమ్మని బలవంతం చేయకండి. అతనిని తక్షశిలలో ఉండనీయండి సుఖంగా."

చాణక్య : నాకు తెలుసు. అందుకే మెహర్‌ను తక్షశిలలో ఉంచాను. ఆ విషయాలన్నీ మెహర్ చూచుకుంటాడు.

"మెహర్‌కు ఏం చెప్పారు గురుదేవా?" చంద్రగుప్త ఆసక్తిగా అడిగాడు.

చాణక్య : "ఆ ఏం లేదు. తను వచ్చే వరకు సువాసిని నా వద్ద సుఖంగా

ఉంటుందని. అది చాలు వాడికి 'చక్కర విదిలిస్తే చీమలు పరిగెత్తుకు వస్తాయి'. సువాసిని పంచదార చిలుక.'

చంద్రగుప్త నిష్ఠూరంగా అన్నాడు.

"ఆచార్యా! నిర్మొహమాటంగా చెప్పాలంటే మీ పద్ధతి న్యాయంగా లేదు."

చాణక్య : అన్యాయం కాదుగా చంద్రబాబూ. మరీ అంత నిర్దాక్షిణ్యంగా, కఠినంగా ఉండకూడదు.

ఇప్పుడేగా వేటనుండి తిరిగి వచ్చావు. ఏపుగా ఎత్తుగా పెరిగిన చెట్లనే నరుకుతారు. వంగిపోయిన చెట్ల జోలికి ఎవరూ పోరు.

చంద్రగుప్త : అంటే కుచ్ఛితంగా సంపాదించిన సింహాసనం మీద కూర్చోవా లంటారు. ఈ రక్త సింహాసనం నాకొద్దు ఆచార్యా.

చాణక్య : చంద్రగుప్తా మరచిపోకు! నీ విప్పుడు రాజువి. సామాన్యుడివి కావు. శిఖరాగ్రం చేరిన వాడివి. అధికారం, సంపద నీకున్నాయి. వాటిని సద్వినియోగ పరచడం రాజుగా నీ కర్తవ్యం.

చంద్రగుప్త అసహనంగానే ఉన్నాడు. తృప్తి కలగలేదు.


చాణక్య ఊరడింపు సాగించాడు.

"చూడు చంద్రా! ఎండిపోయిన చెట్టుపైన పక్షులు గూళ్లు కట్టుకోవు. కాయలు కాయని చెట్టును ఎన్నుకోవు. వ్యభిచారం చేసే స్త్రీ అయినా పేదవాడిని ప్రేమించదు. శక్తి హీనులైన రాజును ప్రజలు ప్రేమించరు గౌరవించరు. నీ కర్తవ్యం నీవు నిర్వహించక తప్పదు బాబూ."

అంటూ తన శిఖపై చేయి వేశాడు.

ధననందుని ఆస్థానంలో విప్పిన ముడి.

ఇప్పుడు తిరిగి ముడివేశాడు.



# 17. సువాసిని శాపం

**సువాసిని గది నాలుగు వైపుల పరిశీలనగా చూచింది.**

ఒక్క కిటికీ లేదు. కాని సౌకర్యంగానే ఉందనిపించింది. పరిసరాలు బాగున్నాయి. గదిలో పరికరాలు సమృద్ధిగానే ఉన్నాయి. తలుపు తెరవడానికి ప్రయత్నించింది. బయట గడియవేసి ఉంది. అంటే తను బందీ అయిందా! తనను ఎవరు నిర్బంధిస్తారు? ఎలుగెత్తి పిలిచింది. ఎవరూ పలకలేదు. తన పిలుపు వినిపించిందా? అసలు బయట ఎవరూ ఉన్నట్లు లేరు. అనుమానం లేదు. తను బందీ. అది చెరసాల కాదు. బందిఖానా కాదు. అయినా తను బందీ. మంచం మీద చతికిలపడి నిట్టూర్చింది. మహారాణిని మించిన వైభోగాలు అనుభవించిన తను బందీ కావడమా! హతవిధీ!

ఏమిటీ పాడు జీవితం! పట్టుమని పాతికేళ్లు లేని తన జీవితం ముగింపుకు వచ్చిందా? రాక్షసమంత్రి చేతిలో నలిగిన యవ్వనం, ధననందుని కౌగిళ్లలో చిక్కిపోయిన వయసు. ఇద్దరు పిప్పి చేసిన బ్రతుకు తనది. ఇది చాణక్యకు పనికిరాని శరీరం. పూజకు పనికిరాని పువ్వు – తను.

తన చిత్రమైన జీవితం కళ్లలో కదిలింది. దైన్యంగా కనిపించింది. తను నిజంగా సుఖపడ్డదా! లేదు. సుఖం లేని జీవితం తనది. ఏనాడు ఆనందం

అనుభవించింది లేదు. తృప్తిగా నిద్రపోయిందీ లేదు. దినదిన గండంగా గడిపింది ఇన్నాళ్లు.

ఎవరో వస్తున్నారు? గుమ్మం అవతల చప్పుడు. గొళ్లెం తీశారు. తన బ్రతుకు గొళ్లెం ఎప్పుడో దుర్ముహూర్తాన తీశారు. ఇద్దరు భటులు లోపలికి వచ్చి తెరచిన గుమ్మానికి అటు ఇటు నిలబడ్డారు. చాణక్య లోపల ప్రవేశించాడు! చాణక్యేనా? అయి ఉండవచ్చు. అతనే. ఎంతకాలమైంది చూచి? గుర్తించలేక పోయింది ఇప్పుడు. అప్పుడు తనే ప్రేమించలేకపోయింది.

సువాసిని మంచం మీది నుండి చప్పున లేచి నిలబడ్డది. అది గౌరవమా! పరపురుషుడని విభ్రమమా! ప్రియమిత్రుడిని చూచిన కలవరమా? ఆమె చెక్కిళ్లు కన్నీటికి తడుస్తున్నాయి. ముంగురులు కళ్లపైకి వాలుతున్నాయి.

"సువాసినీ" చాణక్య పలకరింపు.

"విష్ణూ నీవేనా? గుర్తుపట్టలేకపోయాను సుమా?"

"అవును. నేను మారలేదు. నువ్వు చాలా మారిపోయావు. అయినా నిన్ను గుర్తించాను."

"అంటే ఇంకా ప్రేమిస్తున్నావని అనుకోవచ్చునా! నన్ను విడిపించడానికి వచ్చావు కదూ. నన్ను ప్రేమించింది, నన్ను రక్షించేది నువ్వే." అతని కాళ్ల మీద పడి వెక్కివెక్కి ఏడవసాగింది.

ఆడవారి మాటలకు, ఏడుపుకు అర్థం ఉండదు గాక ఉండదు.

"ఏడవకు సువాసినీ" ఆమె భుజాలు పట్టిలేపాడు.

"నిన్ను ఈ గదిలో ఇట్లా బంధించవలసి వచ్చినందుకు నన్ను మన్నించు. గుండెలో దాచుకోవలసిన నిన్ను ఇలా ఏడిపించాను. తప్పలేదు. నిన్ను స్వేచ్ఛగా వదిలితే ధననందునితో కలిసి వనవాసం చేసే దానివి."

"నాకు తెలుసు విష్ణూ! నీవు నన్ను మరచిపోలేదని, పోలేవని." అంటూ చాణక్యను కౌగిలించుకుంది ప్రేమతో. ఆమె గుండె కొట్టుకుంది. చాణక్య వేపు గోముగా చూచి కళ్లు దించుకుంది. స్పర్శతోనే అతని ప్రేమను అర్థించింది. చాణక్య విజయహాసం చేసి, "నేను ఓడిపోయాను" అంటూ ఆమె వైపు చూచాడు.

ఓం త్రయంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనం
ఉర్వారుక మివ బంధనాత్ మృత్యోర్ ముక్షీయమామృతాత్.

లోలోపల జపించాడు.

సువాసిని : నేను ఇట్లా బందీగా ఉండాలా? నన్ను స్వేచ్ఛగా బ్రతకనీయవా?

చాణక్యను గట్టిగా కౌగిలించుకుని చివరి ప్రయత్నం చేసింది సువాసిని.

చాణక్య : సువాసినీ! నీవు నన్ను ఎంతగా ప్రేమించినా, నేను నిన్ను ఎంతగా ప్రేమించినా ప్రస్తుతం నీ కోరిక తీరదు. నిన్ను బంధించక తప్పదు.

సువాసిని : ధననంద చచ్చాడు. ఇంకా నన్ను బందీని చేయవలసిన అవసరం ఏమిటి? నీకేమైంది విష్ణూ? ఎందుకు నీ గుండె బండలా మారింది? నీలో కనీస మానవత్వం లేదా? నీవు ప్రేమించిన ఆడకూతుర్ని బంధించడానికి మనసెలా ఒప్పింది.

అతని కౌగిలి నుండి తప్పించుకుని దూరంగా జరిగింది.

చాణక్య : సువాసినీ! నిన్ను ప్రాణంగా ప్రేమించిన మాట అబద్ధం కాదు. కాకపోతే నీకన్నా ఎక్కువగా దేశాన్ని ప్రేమించాను. అది నా కర్తవ్యం. మగాడికి కర్తవ్యాన్ని మించింది కాదు ప్రేమ. ఈ క్షణంలో నా కర్తవ్యం రాక్షసుడు. నీ కంటే అతనిని నేను ఎక్కువగా ప్రేమిస్తున్నాను.

ఆమె ఆక్రోశించింది :

"నీవు నన్ను ప్రేమించి, బందీని చేశావు. చదరంగంలో పావును చేసి ఆడుకున్నావు. నాకు బ్రతుకుకన్న మరణం మేలు. నీవు వెయ్యి సంవత్సరాలు నరకయాతన అనుభవిస్తావు. ఇది నా శాపం! ఇల్లాలి శాపం వృధా పోదు."

చాణక్య : ఇల్లాలివా? ఎవరికి? ఎప్పుడు ఇల్లాలివైనావు? నీవు సువాసినివి.

సువాసిని : రాజకీయాలు వేరు. ప్రేమలు వేరు. దేశభక్తి పేరుతో నీవెన్ని ఘోరాలు, అఘాయిత్యాలు చేశావో గుర్తు చేసుకో. అంతకంత అనుభవిస్తావు. నీవు చస్తే నిన్ను స్మరించేవారుండరు. వారసులుండరు. నీవల్ల ఎవరికీ ప్రయోజనం కలగదు. నీ రాజనీతి, నీ చాణక్యం గాలిలో కలుస్తుంది.

అరచి అరచి అలిసిపోయి మంచం మీద పడిపోయింది.

చాణక్య : సువాసినీ! నీ పిల్లిశాపాలు నన్నేమీ చేయలేవు. మంత్రగాళ్లు, తంత్రగాళ్లు నన్నేమీ చేయలేకపోయారు. చాతబడులు చేసేవారిని ఎరుగుదును. ఎవరూ నా వెంట్రుక కదిలించలేకపోయారు. నీవు నన్ను ప్రేమించావు. ప్రేమించిన వ్యక్తి శపిస్తే అసలు పనిచేయదు.

సువాసిని : అవును నిన్ను ప్రేమించడమే నేను చేసిన తప్పు. కానీ నీలోని చాణక్యను నేను ప్రేమించలేదు. నేను విష్ణుగుప్తుని ప్రేమించాను. చాణక్యుడు దుర్మార్గుడు, కుత్సితుడు, కుటిలుడు. నా విష్ణు ప్రేమపూజారి. ప్రేమించిన నేరానికి, నీ విజయానికి నిత్యం శివస్తోత్రం చేస్తుంటాను. వచ్చే జన్మలో నైనా మనం ...

చాణక్య : నిజం సువాసినీ, నేను నిజంగా ప్రేమించింది నిన్నే. అయినా నిన్ను బందీ చేయక తప్పలేదు.

సువాసిని : నన్ను బందీగా ఉంచితే నా శాపం నీకు తప్పక తగులుతుంది. నిన్నింకా ప్రేమిస్తున్నాను కనుక, నా శాపం ఉపసంహరించుకుంటున్నాను.

చాణక్య సువాసిని చేతులు తన చేతుల్లోకి తీసుకుని అన్నాడు.

"ధన్యోస్మి దేవీ ధన్యోస్మి. నా ప్రేమ కాదు, మన ప్రేమ జయించింది. సువాసినీ, నా రాజనీతి నాతో అంతం కాదు. ప్రపంచం ఉన్నంతకాలం, మనిషిలో స్వార్థం, కాంక్ష ఉన్నంత కాలం, అవినీతి ఉన్నంతకాలం చాణక్యుడు స్మరణీయుడు. రాజకీయాల్లో యుక్తులు, కుయుక్తులు సాగినంత కాలం 'చాణక్యం' ఏదో రూపంలో ఉంటుంది. ఇది అనంతం. ఇది అసంపూర్ణం."


చాణక్య విసవిస బయటకు నడిచాడు. ఆయన బయటకు రాగానే ద్వారపాలకులు తలుపులు మూసి బయట గొళ్లెంపెట్టారు.


★ ★ ★


***తర్వాత రాక్షసామాత్యుడు మగధలో చంద్రగుప్తుని ఆస్థానంలో ఉపప్రధాని అయినా సువాసిని అతనిని ఆశ్రయించలేదు. చాణక్యను మరచిపోలేదు. అవివాహితగా పూర్వసువాసినిగా ఉండిపోయింది.***


# యోగాలయ రీసెర్చ్ సెంటర్ ప్రచురణలు


## డా॥ వాసిలి వసంతకుమార్ రచనలు





















**YOGAALAYA RESEARCH CENTRE**
Plot 90, Krishna Enclave, Military Dairy Farm Road,
Trimulgherry, SECUNDERABAD - 500 015.
Ph : 040-2779 6676, Cell : 93 93 93 39 46 www.yogaalaya.org
E-mail : drvaasili@yahoo.co.in www.yogalaya.in

# మాస్టర్ యోగాశ్రమం ప్రచురణలు

## శ్రీశార్వరి యోగసాహిత్యం

**శ్రీ శార్వరి ఫిలాసఫీ**

| | | |
|---|---|---|
| 1. | ఆత్మయోగం | ` 100/– |
| 2. | యోగామ్యూజింగ్స్ | 100/– |
| 3. | మహాగురు | 100/– |
| 4. | రసరేఖలు | 100/– |
| 5. | అతీత మానసం | 100/– |
| 6. | మాస్టర్స్ యోగదర్శిని | 100/– |
| 7. | విశ్వదర్శనం | 100/– |
| 8. | గీతాజ్ఞానయజ్ఞం | 100/– |

**శ్రీ శార్వరి యోగజీవితం (3 భాగాలు)**



| | | |
|---|---|---|
| 9. | ఆత్మయోగి సత్యకథ (1) | 100/– |
| 10. | యోగాశ్రమ జీవితం (2) | 100/– |
| 11. | యోగా విజన్ (3) | 100/– |

**మహాత్ముల జీవితకథలు**

| | | |
|---|---|---|
| **12.** | **సిద్ధార్థ** | **100/–** |
| **13.** | **చాణక్య** | **100/–** |
| 14. | **శంబల** | **100/–** |
| 15. | ధర్మభిక్షువు **మిలారేపా!** | 100/– |
| 16. | భగవాన్ బుద్ధ | 100/– |
| 17. | మహాత్మా జీసస్ | 100/– |
| 18. | సద్గురు సాయిబాబా | 100/– |
| 19. | సద్గురు రమణ | 100/– |
| 20. | అరవింద దర్శనం | 100/– |
| 21. | కొత్తకోణంలో కృష్ణమూర్తి | 100/– |
| 22. | మాస్టర్ సి.వి.వి. | 100/– |
| 23. | అవతార్ మెహర్‌బాబా | 100/– |
| 24. | యు.జి. కృష్ణమూర్తి | 100/– |
| 25. | భగవాన్ రజనీష్ | 100/– |
| 26. | పరేంగిత ప్రజ్ఞ (దాదాజీ ఆత్మకథ) | 100/– |
| 27. | మాడం బ్లవట్స్కీ | 100/– |
| 28. | శ్రీకృష్ణావతారం | 60/– |


**యోగ సాహిత్యం**


| | | |
|---|---|---|
| 29. | **ఆంధ్ర మహాసావిత్రి (ఫుల్ బౌండ్) (డీలక్స్ ఎడిషన్)** | 300/– |






















| | | |
|---|---|---|
| 30. | మాస్టర్ ప్రేయర్స్ (తెలుగు) | ` 200/– |
| 31. | మాస్టర్ ప్రేయర్స్ : 'ఎం' కోర్సు | 100/– |
| 32. | ధ్యానం ఎలా చేయాలి? | 60/– |
| 33. | ధ్యానం – యోగం | 60/– |
| 34. | దివ్యజ్ఞానం (మహాచైతన్యం) | 60/– |
| 35. | కుండలిని | 60/– |
| 36. | శక్తిపాతం | 80/– |
| 37. | నిర్వికల్ప సమాధి | 60/– |
| 38. | పరావిద్య | 60/– |
| 39. | ఆత్మజ్ఞానం | 60/– |
| 40. | మృత్యువు తర్వాతి జీవితం | 80/– |
| 41. | భృక్తం – రహితం – తారకం | 60/– |
| 42. | మాస్టర్ 'యోగచరిత్ర' | 60/– |
| 43. | సత్యయోగప్రకాశిక | 60/– |
| 44. | యోగానుభవాలు | 60/– |
| 45. | అసతోమా సద్గమయా | 60/– |
| 46. | తమసోమా జ్యోతిర్గమయా | 60/– |
| 47. | మృత్యోర్మా అమృతంగమయా | 60/– |
| 48. | యోగాశ్రమ లేఖలు | 60/– |
| 48. | సత్య సంహిత | 60/– |
| 49. | శ్రీ కృష్ణావతారం | 60/– |
| 50. | **మంజరీ ద్విపద కథలు** | **100/-** |
| 51. | **హస్తసాముద్రికం** | **150/-** |

**ENGLISH BOOKS**

| | | |
|---|---|---|
| 52. | **Master Prayers** (New Edition) | 100/– |
| 53. | The Mystery of Kundalini | 60/– |
| 54. | The Life Beyond Death | 60/– |
| 55. | **IMMORTALS OF SHAMBHALA**<br>(Mahaveer Publishers - New Delhi) | |


ఖరీదు మొత్తం ముందుగా ఎం.ఓ. ద్వారా గాని
డి.డి. ద్వారా గాని పంపాలి. పుస్తకాలు V.P. లో పంపలేము.
చెక్కులు స్వీకరింపబడవు. రిజిష్టర్ పోస్ట్‌లో
పంపడానికి రూ. 20/– అదనం.

**MASTER YOGA ASHRAM**
Plot No. 89, Krishna Enclave, M.D. Farm Road,
Tirumalagiri, SECUNDERABAD - 500 015.
Ph : 040-2779 0094, Cell : 93 93 93 39 46 www.yogaalaya.org
E-mail : drvaasili@yahoo.co.in www.yogalaya.in












చాణక్య నవ్వితే నాలుగు ప్రళయాలు -

ఆచార్యా! మనిషి పతనానికి, దేశం అధోగతికి కారణాలు ?

అవినీతి, అనైతికత, అనైక్యత, వ్యభిచారం.

ఆచార్యా, ప్రభుత్వ ఉద్యోగి ఎప్పుడు లంచం తీసుకుంటాడు ?

చేప ఎప్పుడు నీళ్లు తాగుతుందో ఎవరు చెప్పగలరు!

ఆచార్యా, మంచి ప్రభుత్వం ఎట్లా ఉండాలి ?

స్వప్రయోజనాలు, స్వార్థపరత్వం లేని
మంత్రులున్న ప్రభుత్వం మంచిగా ఉంటుంది.

ఆచార్యా, ప్రభుత్వ కర్తవ్యం ఏది ?

దేశరక్షణ, సుపరిపాలన, ప్రజల యోగక్షేమాలు.

ఆచార్యా, న్యాయం, ధర్మం, చట్టం ?

చట్టానికి చుట్టాలుండకూడదు
చట్టం తనపని తను చేసుకో గలగాలి.

అప్పుడే ధర్మం గీత దాటదు, నీతి నిలబడుతుంది.
ఇది చాణక్యుని అర్థశాస్త్రం
అర్థశాస్త్రం అంటే
ఆర్థికంతో ముడిపడ్డ రాజకీయం.

